UNIVERSAL LIBRARY
OU_204971
UNIVERSAL LIBRARY

OUP—2272—19-11-79—10,000

OSMANIA UNIVERSITY LIBRARY

Call No. T81 Accession No. PG T 3919

Author J56N

Title

This book should be returned on or before the date last marked below.

మూ

కా

శ్రీ

జనవి వావిళ్ల రామస్వామి శాస్త్రులు అండ్ సన్సు వారిచే

లక్ష ప్రకటితము.

భాషా 1941

ముద్ర *All Rights Reserved.*

Printed by
V. VENKATESWARA SASTRULU
of V. RAMASWAMY SASTRULU & SONS
AT THE 'VAVILLA' PRESS,
Madras.—1941.

పీఠిక

" వేదవేద్యే పరే పుంసి జాతే దశరథాత్మజే,
వేదః ప్రాచేతసా దాసీ త్సాక్షా ద్రామాయణాత్మనా."

శ్రియఃపతియు నఖిలచరాచరంబులం బుట్టింపఁ బెంప గిట్టింపఁ గారణం బగు సర్వేశ్వరుండు నిఖిలలోకరక్షణార్థంబు రవికులాభరణం బగుదశరథునకుం బుత్రరత్నంబై రామరూపంబున నవతరించి సాధుబృందంబులం గాచె.

అట్టిపురుషోత్తమునిదివ్యచారిత్రంబు యథావస్థితంబుగ నాదికవి వాల్మీకిమహర్షి సకలవేదాంతరహస్యార్థప్రతిపాదకంబును, నైహికాముష్మికసుఖప్రదంబును నపర వేదం బనాఁ బరఁగు సప్తకాండపరిమితం బైనశ్రీరామాయణం బనుమహేతిహాసం బొనర్చి లోకంబునకు మహోపకారంబు సేసె.

అందుఁ దొలుతటియాఱుకాండములలో శ్రీరామునిపట్టాభిషేకంబుదాఁక జరిగినకథయు, సప్తమకాండమునఁ బట్టాభిషేకంబునకుం దరువాతిరామనిర్యాణపర్యంత మగుకథయు వర్ణింపఁబడి యున్నది. సప్తమకాండమునకే యుత్తరకాండమనియుం బేరు. దీనికథావైభవముంబట్టి మనభరతఖండంబునందకాక జర్మని మున్నగుద్వీపాంతరంబుల నుండుకవీంద్రు లనేకులు నానాభాషలలో నాటకములుగను, ప్రబంధములుగను వెండియుఁ బెక్కుతెఱంగులఁ దత్తదభిరుచి కనుగుణంబుగా వ్రాసికొని యున్నారు.

ఈ చరిత్రవోలె లోకవిదితం బగుచరిత్రంబు కొంతదనుక భారతం బొండు దక్క వేఱొం డెద్దియుఁ గానరాదు. పాతివ్రత్యము, శాంతి, దయ, సౌశీల్యము, మున్నగుసుగుణంబులచే విలసిల్లి సకలపతివ్రతాజనతాలంకారం బై యొప్పులోకమాత సీతం బోలుసతీరత్నంబును, పౌరుషము, పితృభక్తి, జనానురాగము, శాంతి, కారుణ్యము మున్నగులోకోత్తరంబు లగుకల్యాణగుణంబుల కాకరం బైన శ్రీరాముం బోలుపురుషోత్తముండును మఱియొక్కఁ డెచ్చట నేని లేఁ డనుట సర్వజనవిదితము.

ఇట్టిమహాపురుషచరిత్రం బనర్గళకవితావిభాసితు లగుభాస్కరతిక్కనాదులకుఁ దెలుంగుబాసఁ బ్రబంధంబుగా రచియించుభాగ్యంబు లభించుట యాంధ్రభాషాభిమాను లగునస్మదాదులపుణ్యంబ కాని వేఱు గాదు. ఈచరిత్రంబును మొట్టమొదట మంత్రిభాస్కరుం డనుమహాకవి యాంధ్రీకరించె. ఇదియ భాస్కర

రామాయణ మనుపేర నెల్లెడల మిగులం బ్రఖ్యాతి వహించి యున్నది. ఈ భాస్కరుఁడు తిక్కనామాత్యునకుం దాత యని నిర్వచనోత్తరరామాయణమునం బ్రథమాశ్వాసములోని.—

“గీ. సారకవితాభిరాముఁ గుం•టూరువిభుని, మంత్రిభాస్కరు మత్పితా•మహునిఁ దలఁచి
యైన మన్ననమెయి లోక•మాదరించు, వేఱ నాకృతిగుణములు • వేయు నేల.”

అనుపద్యమునం దనకావ్యము స్వగుణంబునఁ గాకున్నను దనతాత యగు భాస్కరుని దివ్యకవితాప్రాగల్భ్యంబున నైనను లోకాదరణంబు నొందు నని చెప్పికొని యుండుటం దెల్లం బగుచున్నది. మంత్రిభాస్కరుఁడు పూర్వరామాయణము రచింప దానిం బూర్తి సేయం గడంగి కాఁబోలు తిక్కన యుత్తరకాండమును నిర్వచనముగ నాంధ్రీకరించె. దీనినే యిప్పటికి నూటయిరువది యేండ్లకు మును కంకంటి పాపరాజు తద్దయు విస్తరించి రామనిర్యాణపర్యంతము గొప్పప్రబంధముగ విరచించెను. తిక్కనమాత్రము దనకావ్యము విషాదాంతముగ నుండఁ గూడ దని కాఁబోలు శ్రీరామనిర్యాణమును వచింపఁ డయ్యె. భారతమునఁ గృష్ణనిర్యాణముఁ జెప్పి యున్నను నప్పటికిఁ దనయభిప్రాయము మాఱియుండ వచ్చు నని యూహింప వచ్చును. ఇఁకఁ దిక్కనచరిత్ర యించుక వర్ణింప వలసియున్నది.

తిక్కన

నియోగిబ్రాహ్మణుఁడు, గౌతమగోత్రుఁడు, ఆపస్తంబసూత్రుఁడు, గొమ్మమాంబకు మంత్రిభాస్కరునకుఁ బౌత్రుఁడు, కొమ్మనకు నన్నమకుఁ బుత్రుఁడు, మహేశ్వరభక్తుఁడు, కేతన, మల్లన, సిద్ధన అనువార లితనిపెదతండ్రులు, ఈవిషయము విరాటపర్వములోని.—

సీ. మజ్జనకుండు స•న్మాన్యగౌతమగోత్ర, మహితుండు భాస్కర•మంత్రితనయుఁ
డన్నమాంబాపతి • యనఘులు కేతన, మల్లనసిద్ధనా•మాత్యవరుల
కూరిమితమ్ముండు • గుంటూరివిభుఁడు కొ•మ్మనదండనాథుఁడు • మధురకీర్తి
విస్తరస్ఫారుఁ డా•పస్తంబసూత్రప,విత్రశీలుఁడు సాంగ • వేదవేది
తే. యర్థిఁ గల వచ్చి వాత్సల్య • మతిశయిల్ల, నస్మదీయప్రణామంబు • లాదరించి
తుష్టి దీవించి కరుణార్ద్ర•దృష్టిఁ జూచి, యెలమి నిట్లని యానతి • యిచ్చె నాకు.”

అను పద్యమువలనను, నిర్వచనోత్తరరామాయణములోని—

“మ. అమలోదాత్తమనీష నే నుభయకా•వ్యప్రౌఢిఁ బాటించుశి
ల్పమునం బారగుఁడం గళావిదుఁడ నా•పస్తంబసూత్రుండ గౌ
తమగోత్రుండ మహేశ్వరాంఘ్రికమల•ధ్యానైకశీలుండ న
న్నమకుం గొమ్మనమంత్రికిం సుతుఁడఁ దిక్కాంకుండ సన్మాన్యుఁడన్.”

అనుపద్యమువలనను దెలియుచున్నది.

ఇఁక నీకవిజీవించియుండుకాలముం గుఱించి పలువురు పలుతెఱంగులం దలాతలి వాదంబు సేయు చున్నను నిరర్థకాంశవిచారము పిష్టపేషణమ కాఁ దలంచి హేతువాదంబునం దిగక సంగ్రహముగఁ దెలుపు చున్నాఁడ.

నిర్వచనోత్తరరామాయణమునకుం గృతిపతి యగుమనుమసిద్ధినృపాలుఁడు శాలివాహనశకము 1179-1182 (క్రీస్తుశ. 1258-1261) సంవత్సరములలో భూదానముఁ జేసినట్లు కృష్ణామండలములోనిశిలాశాసనములవలనం దెలియు చున్నందునను, ఈమనుమరాజు రాజ్యముఁ గోలుపోఁగా [1254 సంవత్సరములో అక్కన బయ్యన యనుచోళులం జయించినట్లు కృష్ణామండలములో ఇనిమళ్లగ్రామములోని శాసనము మున్నగు పెక్కుశాసనములచే క్రీ॥ 1200-1258 సంవత్సరముల నడుమ రాజ్యముచేయుచున్నట్లు తెలియుచున్న] గణపతిదేవుఁడు తిక్కనసోమయాజిప్రార్థనమువలన దండయాత్ర వెడలి వెలనాటిరాజులం జయించి నెల్లూరి కేగి మనుమసిద్ధిరాజుకు మరల రాజ్యంబు నొసంగినట్లు సోమదేవరాజీయమునం జెప్పంబడియున్నందునను, వారికి సమకాలికుఁ డగుతిక్కనసోమయాజియు శాలివాహనశకము 1127-1171 (క్రీ. 1200-1258) సంవత్సరములనడుమఁ దప్పక సశరీరుఁడై యుండెననుట నిర్వివాదాంశము.

ఈ తిక్కనతాత యగుమంత్రిభాస్కరుంగుఱించి పెక్కుకవులు స్తుతిపద్యంబులం జెప్పి యునికి నేతద్వంశజులు రాజకార్యనిర్వాహధూర్వహు లనియ కాక యితనివంశము పండితవంశ మనియుం గూడ తేటపడుచున్నది. ఈకవికిఁ బూర్వులు మహారాజాస్థానములం గొప్పయుద్యోగము లొనర్చి జగద్విఖ్యాతిఁ గన్న మహాభాగులు. వీరినివాసస్థలము కృష్ణామండలములోని వెలటూరను గ్రామము. ఉద్యోగధర్మమున మంత్రిభాస్కరునికాలములో గుంటూరున నుండుటం జేసి గుంటూరువా రని పేరు వచ్చినదే కాని వీరియింటిపేరు కొట్టరువు వారు. ఈవిషయమును గూర్చి అభినవదండి కేతన దశకుమారచరితలో.—

"గీ. మనుమసిద్ధిమహేశసమస్తరాజ్య, భారధౌరేయుఁ డభిరూపభావభవుఁడు
కొట్టరువుకొమ్మనామాత్యుకూర్మిసుతుఁడు, గీనజనతానిధానంబు తిక్కశౌరి."

అని వచించియున్నాఁడు. తిక్కనతండ్రి కొమ్మనామాత్యుఁడు గుంటూరికి దండనాథుఁడుగా నుండెను.

ఈ కొమ్మనామాత్యుఁడు నెల్లూరిలో ధర్మపత్నిం గైకొని బంధుత్వమున నెల్లూరికి రాకపోకలు జరుగు చుండ మనుమసిద్ధినృపాలపరిచితి గలిగె ననియు, దానంజేసి మనుమరాజీకవికుటుంబము నాదరించి నెల్లూరికిం బిలిచికొని వచ్చి

పూర్వము హరిహరనాథాలయ ముండినయిప్పటిరంగనాథ దేవాలయముదగ్గఱ నిల్లు గట్టించి తిక్కన నందుఁ గాపురం బుంపఁగా నా రాజాస్థానంబున నమాత్యుండును, విద్వత్కవీంద్రుండును నై దిగంతవిశ్రాంతకీర్తిం గైనేసి వైదికకర్మానుష్ఠానతత్పరుం డగుటమిఁ బినాకినీతీరంబున జన్నంబు సేసి తిక్కనసోమయాజి నాఁ బరఁగి హరిహరనాథున కంకితంబుగా విరాటపర్వంబుఁ దొడంగి మహాభారతంబు నాంధ్రీకరించె ననియుఁ దరువాత మనుమసిద్ధిమరణముతో నాతనివంశ మంతరింపఁ దిక్కన సోమయాజికుమారుఁ డగుకొమ్మన నెల్లూరికి రెండుక్రోసులదూరమున నున్న పాటూరికరణీకమును సంపాదించికొని యచ్చటనె నివసించె ననియు, నాకారణమున నీకవివంశమువారికిఁ బాటూరువా రనుపేరు వచ్చిన దనియు, నేతద్వంశ్యులు చెప్పుచున్నారు. ఈపాటూరువా రుపాటూరిలోఁ గొందఱు నిందుకూరిపేటలోఁ గొందఱు నున్నారు.

తిక్కనామాత్యుఁడు నిర్వచనోత్తర రామాయణమును, పంచమవేదమనాఁ బరఁగుభారతంబును (విరాటపర్వముమొదలు 15 పర్వములు) రచియించెను. మఱియు నీతఁ డవసానకాలమున ముద్దులమూటఁ గట్టుగృష్ణశతకమును రచియించె నఁట. నన్నయభట్టు భారతము నారణ్యపర్వముదనుక నాంధ్రీకరించి మృతిబొందఁగా నారణ్యపర్వముం దెలిఁగించుట నాతనికి మతిభ్రమణము గలిగి కీర్తిశేషుఁ డయ్యె నని తలఁచి దానికి శంకించి యరణ్యపర్వశేషముం బూర్తిసేయఁ దొరకొనక తక్కుంగల పదియేనుపర్వముల రచించెనని చెప్పుదురు

తిక్కన నిర్వచనోత్తరరామాయణ మొనర్చుతఱికి యజ్ఞము నేసి యుండ లేదని యాశ్వాసాంతగద్యమువలనం దెలియుచున్నది.

ఈగ్రంథములు నెల్లూరి కధిపతి యగుమనుమసిద్ధిరాజున కంకిత మొనర్చెను. మనుమరాజు తిక్కనపై మిక్కుటంపుమక్కువచే మామవరుసం బిలుచుచున్నట్లీకావ్యము ప్రథమాశ్వాసములోని—

"క. ఏ నిన్ను మామ యనియెడి, దీనికిఁ దగ నిమ్ము భారతీకన్యక నా
కీనర్హుఁడ వగు దనినను, భూనాయకుపల్కు చిత్తమున కింపగుదున్."

అనుపద్యమువలనం దెలియు చున్నది.

ఇఁక నీతనిభాషాంతరీకరణముంగుఱించి యించుక విచారింప వలసియున్నది. పూర్వకాలమున నాంధ్రకవులు, పురాణముల నితిహాసములం దెలిఁగించుతఱిఁ గథాసందర్భము మాత్రము మాఱకుండునట్లు కొంతదనుక బాటించుచు వచ్చిర కాని మూలములో నుండుప్రతిపదమునకు సరి యైన తెలుఁగుపలుకుల నిఱికింప వలయు ననియు, మూలములో లేనివర్ణనలను గల్పనలను జేయరా దనియు,

మూలములో నున్న విషయముల నన్నింటిని వరుసగానే చెప్పవలయు ననియు సంకల్పించినవారు కారు. దీనికిఁ గారణము తమకావ్యములు స్వతంత్రములు గా నుండవలయు ననియుఁ గవితాధార దడవుకొనినట్లుండక యవిచ్ఛిన్నము గా నుండవలయు ననియుఁ దలంచుటయె. లోకములో ఒకభాషశైలి మఱియొకభాషశైలికిఁ గొన్నియెడలం బోలియునికియుఁ బెక్కు తెఱంగులం బోలకయునికియుం గలదు. గీర్వాణంబునం గర్మణిప్రయోగ మింపు నింపును. ఆంధ్రంబున నది యంతగా రుచింపదు. మఱియు దేవభాష వంశస్థము, ఉపేంద్రవజ్ర, ఇంద్రవజ్ర ఆర్య మున్నగు వృత్తములు రచన కనుకూలములుగను విన సొంపుగ నుండును. తెలుఁగున సీసము, గీతము, చంపకమాల, మత్తేభము లోనగువృత్తములు సొగసుగ నుండుఁగాని వసంతతిలకాదు లంత రమణీయములుగ నుండవు. కొన్ని జాతీయము లాంధ్రంబునం గొన్ని గీర్వాణంబునను సహృదయహృదయానందంబు నొందించు. ఇట్లొక్కొకచంద మొక్కొకభాష కందంబుఁ బొందించుటం జేసి యాయాభాష కనుగుణం బగుశైలిం గబ్బంబు రచించుటయ కమనీయంబు. మహాకవు లగునన్నయ, భాస్కరుఁడు, తిక్కన, శ్రీనాథుఁడు లోనగు వా రీఘంటాపథమునకు వెలి గాకయే కావ్యనిర్మాణమునకుం గడంగిరి. అట్లుగాక మూలమునకు నన్నివిషయంబుల సరిగ భాషాంతరీకరణము సేయునిర్బంధమునకు లోగిన నట్టి భాషోచితశైలి యలవడుట దుస్సాధము. కాఁబట్టియే తిక్కనామాత్యుఁడు నిర్వచనోత్తరకాండకథ మాఁతగాఁ గైకొని వర్ణనాదులఁ దనయిచ్చవచ్చినట్లు స్వతంత్రముగ రచియించె. అయినం గొన్ని యుచితస్థలముల మూలము ననుసరించియు నాంధ్రీకరించి యున్నాఁడు.

ఉత్తరకాండలోని.—

"సువర్ణపృష్ఠే స బభౌ శ్యామః పీతాంబరో హరిః,
కాంచనస్య గిరే శ్శృంగే సతటి త్తోయదో యథా."

అనుశ్లోకమును.—

"క. గరుడునిపై శార్ఙ్గధనుర్ధరుఁ డగువిష్ణుండు మేరుతటీఁబోల్చుతటి
త్పరివృతజలదముఁ బోలుట, విరియ దనుజరాజహంసవితతి యితనికిన్."

అనియు, నిట్లె కొన్ని కొన్ని యెడలం గొంచె మించుమించుగఁ దెలిఁగించి యున్నాఁడు. కథాభాగములో సంస్కృతంబున బహుళంబుగ నున్న యెడం బ్రధాన కథాంశమును మాత్రము వివరించుచు మిగుల సంక్షేపించి శ్రీరామనిర్యాణమును వదలి 10 యాశ్వాసముల ప్రబంధమును వ్రాసెను. సంక్షిప్త భాగంబుల సూక్ష్మదృష్టిచే గ్రంథంబునం జూచుకొనునది.

ఇక్కవిసార్వభౌమునిసరసకవితానిర్మాణకౌశల మిట్టి దని వక్కాణింప నేరి తరము. ప్రబంధపరమేశ్వరుం డనాఁ గవిపుంగవులనడుమ వన్నె కెక్కినయెఱ్ఱాప్రెగ్గడ తనహరివంశములో నీతని.—

"తనకావించినసృష్టి తక్కొరులచేతం గాదు నా నేముఖం
బునఁ దా బల్కినపల్కు లాగమము లై పొల్పొందు నావాణిన
త్తను నీతం డొకరుండు నాఁ జనుమహాత్త్వాప్తిం గవిబ్రహ్మ నా
వినుతింతుం గవితిక్కయజ్వ నిఖిలోర్వీదేవతాభ్యర్చితున్."

అని కవిబ్రహ్మ కాఁ గొండాడియున్నాఁడు.—

నిరవధికకోమలపదమధురసరససరస్వతీవిలాసవైభవంబునను వేదమార్గప్రవర్తకత్వంబున నితని నపరకృష్ణద్వైపాయనుం డనియే చెప్ప నొప్పును. మహాభారతంబున నాశ్వాసాంతపద్యంబులంజూడ నితం డద్వైతమతావలంబి యనియుఁ బూర్వోత్తర మీమాంసాశాస్త్రములయందును, వ్యాకరణమునందు నసమానపాండిత్యము గల వాఁడనియుం గోచరింపకమానదు. ఇతఁడు కాళిదాసాదులువోలె సకలశాస్త్రమర్యాదల సమగ్రముగ నెఱింగిన పండితకవీంద్రుఁడు. ఇయ్యది భారతంబున నాయాఘట్టంబుల భాషాంతరీకరించుతఱి నెఱుంగనగు. ఈతనికి గీర్వాణాంధ్రంబుల నెక్కుడు వైశారద్యంబుకలిమి నుభయకవిమిత్త్రుం డనుబిరుదము గలిగె. సోమయాజియగుటఁ బరమాస్తికాగ్రేసరుం డనియుఁ, గర్మాచరణదీక్షాదక్షుం డనియుఁ దెలియుచున్నది. ఇక్కవినాథురచన లాంధ్రభాషాభిమానుల కాగమములు. ఈరసికు సరసంపుఁబలుకు లాంధ్రభాషాయోషాభూషణములు. ఈతనికృతు లాంధ్రకవిపుంగవులకుఁ గవితామార్గప్రదర్శకములు. ఆంధ్రభాషాతత్త్వము నెఱింగినకోవిదులలో నీతఁ డపరశబ్దశాసనుఁడు. ఇక్కవీంద్రునకు గీర్వాణభాషావైశారద్య మెక్కుడయ్యును గవనంబునం దెలుఁగుపలుకులే తఱచుగాఁ గాన్పించును. కవనంబున జల్లిపదంబుల నిఱికింపక కాదాచిత్కముగ ననతిదీర్ఘసమాసములం బొందుపఱచుచుఁ జిన్నచిన్న పదములంగూర్చి యతిప్రాసములకుఁ దడవుకొనక సరళముగా హృదయరంజకముగాఁ గవన మల్లుటయ య్యాకవికి నైజము. సంస్కృతంబున బాణభట్టప్రథమకృతి యగు హర్షచరిత్రమునంబోలెఁ దిక్కనబాల్యకృతి యగునుత్తరరామాయణంబున నవిచ్ఛిన్నకవితాధారకుఁ గొన్నియెడల సంకోచంబుగలిగినను, కాదంబరింబోలె భారతంబున నారితేరి సర్వాలంకారశోభిత యై నవరసోపేత యై సరసగుణసమేత యై ప్రౌఢకవితాయువతి దద్దయు సహృదయహృదయాంబుజంబుల నలరించుచున్నది. సమయోచితింబట్టి యేరసంబు వర్ణించుతఱి నెట్టిపదములంగూర్చిన రసము గృహీతాకృతివోలె సహృదయహృదయదర్పణంబులఁ బ్రతిబింబించునో, యట్టిమధురపదంబులం బొందించువిషయము నిక్కవిచంద్రుఁ డెఱింగిన ట్లొరు లెఱుంగరు. సర్వతో

ముఖపాండిత్యవిభూతి గలవాఁ డగుటమి బహుళార్థంబు గలభావంబు సంగ్రహించి యొకటిరెండుపద్యంబులలో నిముడ్చుటకున్నుతల్పాభిప్రాయంబునకుం జిన్నెలు వన్నెలు గల్పించి విపులంబుగా రమణీయంబుగా వ్రాయుటకును నేర్చినవలంతి. వేయేల? ఎఱ్ఱాప్రెగడ, శ్రీనాథుఁడు మున్నగుమహాకవులకే యీతనికవనమున నెఱుంగఁ దగినయంశము లనేకము లున్నవనఁ దక్కుంగలకవులఁ జెప్ప నేల? ఈతని కవిత్వంబున సందర్భోచితరీతిఁ బ్రయుక్తంబులై చక్కనిలోకోక్తులు శ్రోతలం బఠితల నానందార్ణవతలనిమగ్నాంతరంగులం జేయుచున్నవి. ఉదాహరణములు— 'చెవులు వట్టి యాడించు' పు. 37 ప. 22, 'ఒడల్ సివిమినఁ బాలు వచ్చు' పు 102 ప. 22. 'నేతికుండపై యెలుక' పు. 107. ప. 22 ఇట్లు గనుంగొనఁ దగినది.

ఈకవి తనకవిత్వంబున పాదపూరణంబుగ వ్యర్థపదములం బ్రయోగింపక (నిర్వచనోత్తరరామాయణము 1 వ పుటలోఁ) దాఁజేసిన ప్రతిజ్ఞనుఁ జెల్లించుకొనెను. ఈతనికవనంబున శబ్దచిత్రంబులు నర్థాలంకారములు విరళంబులు. కాళిదాసాదులకుఁ బోలె నీకవికి నుత్ప్రేక్షోల్లేఖాదులకంటె నుపమారూపకస్వభావోక్తులు గడుఁ బ్రియములు.

ఉదాహరణము.—

"ఉ. చారుబలాకమాలికల • చాడ్పున దంతము లొప్ప గర్జిత
స్ఫారరవంబులట్లుగ న•భంగురతం బటుబృంహితంబు లా
సారముమాడ్కి దానజల•సంతతి గ్రమ్మఁగఁ గాలమేఘమా
లారుచిరంబులై మద చ•లద్ద్విపసంఘము లొప్పె నప్పురిన్." 1 ఆ. 53 ప.

"సీ. అనవద్యవేదవి•ద్యాలతావితతికి, నాలవాలములు జి•హ్వాంచలములు......" 1 ఆ. 57 ప.

"సీ. పడఁతులనెఱివీఁగుఁ•బాలిండ్లు వెడదోఁప, లీలఁ బయ్యెదలు దూ•లించుటకును..." 1 ఆ. 59 ప.

శబ్దాలంకారంబులలో నీకవికిఁ బ్రియమైనది రెండురెండు గాని మూఁడు మూఁడుగాని పద్యములో నన్నియుఁగాని సమాసములయం దంత్యాక్షరావృత్తి నియమము. ఉదా.—

"మ. అతులౌదార్యుఁ డహీనశౌర్యుఁడు సము•ద్యద్ధైర్యుఁ డత్యంతవి
శ్రుతచారిత్రుఁడు సూరిమిత్రుఁడు జన•స్తోత్రవ్యగోత్రుండు సం
భృతసత్కీర్తి పవిత్రమూర్తి యసుహృ•ద్బృందార్తినిర్వర్తి పూ
జితధీమంతుఁడు పుణ్యవంతుఁడు జయ•శ్రీకాంతుఁ డిమ్మేదినిన్."

"చ. నిరుపమమూర్తి వైరిరథి•నీసమవర్తి వివేకవైభవ
స్ఫురితవిచారుఁ డుజ్జ్వలయ•శోమణివారుఁడు ధర్మసంగ్రహా
దరపరతంత్రుఁ డార్యజన•తామతమంత్రుఁడు వంశవారిజా
కరనవసూర్యుఁ డస్ఖలిత•గౌరవవర్తనధుర్యుఁ డిమ్మహిన్." 3 ఆ. 119 ప.

"మ. కమలాధారుఁడు భీతిదూరుఁ డసమా•కారుండు గంభీరుఁ డ
బ్జముఖీమారుఁ డపారసారుఁడు కళా•స్ఫారుండు వీరుండు దు
ర్దమదోస్సారుఁ డధర్మభీరుఁడు మహో•దారుండు దుర్వారుఁ డ
త్యమలాచారుఁడు నిర్వికారుఁడు యశో•హారుండు ధీరుం డిలన్." 1 ఆ. 86 ప.

ఇట్టివి సూక్ష్మదృష్టిఁ గనుఁగొనినచో నీతనికృతులం బెక్కులు గన్పట్టును. అయినను గథాసందర్భమున దీనిని పరమార్థ మని తలంచి రసభావాదులం దిగనాడి, శ్లిష్టార్థకల్పనైకశరణంబు లగుచిత్రబంధయమకాదులకొఱకుఁ గష్టపడక యాశ్వాసాంతమున మాత్రమీ వ్యావృత్తినియమమును గైకొనినాఁడు. ఇట్టి లక్షణములు విశేషముగ నాంధ్రపంచమవేదంబునఁ జూపట్టును.

ఈకావ్య మీతనిప్రథమకవిత యగుటంజేసి దీనియందు భారతమందలి కవితాప్రౌఢిమ యంత గాఁ గానరా కున్నను మొత్తముమీఁద భారతశైలిం బోలియే యున్నది. కాఁబట్టియే యిందలిపద్యంబులయందుఁ దిక్కన కత్యంతగౌరవ ముండి యుండెను. దీనికిఁ దనభారతంబున నిందలికొన్నిపద్యంబులఁ గొంతవఱకు మార్చియు మార్పకయుఁ బొందుపఱిచి యుండుటయే ప్రమాణము.

విస్తరభీతిచే వాని నిట నుదాహరింపక విరమించితి. ఇక్కవీంద్రుఁడు నన్నయభట్టసంప్రదాయానుసారముగఁ గావ్యాదిని సంస్కృతశ్లోకరూపంబుగనే మంగళాచరణం బొనర్చెను. షష్ఠ్యంతముల మానెను. దీనింబట్టి యేతద్వైకల్పికత్వంబు గవి కిష్ట మని తోఁచుచున్నది. ఈకవివల్లభుం గుఱించి వ్రాయఁదగునంశము లనేకము లున్నను, విస్తరభయంబునను ముఖ్యముగా నవి భారతమునకు సంబంధించిన వగుటను విరమించుచు స్థాలీపులాకన్యాయంబుగ రెండుపద్యముల నిట నుదాహరించుచున్నాఁడ.

"మ. కుచముల్ వాఁడెడిసీటిమీఁదివిలస•త్కోకంబులం గ్రేణి సే
యుచు నుండన్ మెడ యెత్తి పాదయుగళం • బూఁదంగ బాహాలతల్
పచరింపం గరమూలకాంతి నిగుడన్ • భావంబు రంజిల్లఁ బా
డుచుఁ గ్రీడించిరి పువ్వుఁబోఁడులు లతా•డోలాకళాప్రౌఢులన్." 8 ఆ. 37 ప.

"శా. ఏమేమీ రఘురాముఁతమ్ముఁడవె మీ • రేపారి పైనెత్తి మా
మామం బంక్తిముఖున్ వధించినను మీ • మౌర్ఖ్యంబు సైరించి యే
నేమిం జేయక యున్నఁ గ్రొవ్వి యిట నీ • వేతెంచితే మేలు మే
లీమై తోడన పోదు గాక యని దై•త్యేశుండు దర్పంబునన్." 10 ఆ. 17 ప.

ఇట్లు సరసగుణమణిగణభూషణభూషితకవితావనితామణి మధురశృంగారవిలసితంబుల రసికవరేణ్యు లనురక్తి ననుభవించి యానందాంబునిధిరంగత్తరంగంబుల డోలాకర్మ నాచరింతురుగావుత మని ప్రార్థించుచున్నాఁడ.

ఉత్పల - వేంకటనరసింహాచార్యులు.

విషయసూచిక.

ప్రథమాశ్వాసము.

విషయము.		పుట.
కృతిప్రశంస	...	1
కృతికర్తృనియమము	...	,,
కృతినాయకవంశావతారము	...	2
అయోధ్యావర్ణనము	...	6
పూర్వరామాయణకథ	...	9
ఆశ్వాసాంతము	...	11

ద్వితీయాశ్వాసము.

రామునికొల్వుకూటమునకు జనకాదులు వచ్చుట	...	12
మునులు రాముని నుతించుట	...	13
విశ్రవసు జన్మప్రకారము	...	,,
వైశ్రవణుని వృత్తాంతము	...	15
సుకేశుని వృత్తాంతము	...	17
మాల్యవదాదులు తపంబుచే బ్రహ్మవలన వరంబులు వడయుట	...	18
మాల్యవంతుఁడు లంకయందు నివసించుట	...	19
మాల్యవదాదులు పెండిలియై పుత్త్రులం గాంచుట	...	,,
మాల్యవంతుఁడు లోకంబుల బాధించుట	...	20
ఇంద్రాదులు హరుననుజ్ఞచే విష్ణువును వేఁడుట	...	,,
మాల్యవదాదు లమరావతిపై దండెత్తుట	...	21
ఆశ్వాసాంతము	...	22

తృతీయాశ్వాసము.

విష్ణువు దేవతలకుఁ దోడై రాక్షసులతో యుద్ధము సేయుట	...	23
మాల్యవంతుఁడు విష్ణువున కోడి పాతాళముఁ జొచ్చుట	...	25
అగస్త్యుఁడు రామునకు రావణాదులకథ దెల్పుట	...	26
రావణాదులు తపం బొనరించుట	...	29
రావణునకు బ్రహ్మ వరంబు లిచ్చుట	...	29
విభీషణునకు బ్రహ్మ వరంబు లిచ్చుట	...	30
కుంభకర్ణుని తపఃఫలము	...	,,
సుమాలిబోధనచే రావణుఁడు లంకను వశపఱుచుకొనుట	...	31
రావణుఁడు లంకం బ్రవేశించుట	...	33
శూర్పణఖకుఁ బెండ్లిచేయుట	...	34
ఆశ్వాసాంతము	...	

చతుర్థాశ్వాసము.

రావణకుంభకర్ణవిభీషణులు పెండ్లాడుట	...	35
మేఘనాదుని జననము	...	36

విషయము.		పుట.
రావణుఁడు దేవతలు మొదలగువారిని బాధించుట	...	37
కుబేరుఁడు దూతను బంపి రావణునకు బుద్ధి చెప్పించుట	...	,,
రావణుఁడు కుబేరునిపై దండెత్తి పోవుట	...	39
యక్షరాక్షసులయుద్ధము	...	,,
కుబేరుఁడు రావణుని దూరనాడుట	...	41
కుబేరుఁడు రావణునితో యుద్ధము చేసి యోడిపోవుట	...	,,
రావణుఁడు కుబేరు నోడించి పుష్పకవిమానము గొనుట	...	42
నందికేశ్వరుఁడు రావణుని శపించుట	...	43
రావణుఁడు కైలాసమును బెల్లగించి యెత్తుట	...	,,
శివుఁడు రావణునిచేతులు కైలాసము క్రింద నడఁగఁ ద్రొక్కి వాఁడు ప్రార్థింపఁగా ననుగ్రహించుట	...	,,
ఆశ్వాసాంతము	...	44

పంచమాశ్వాసము.

వేదవతి రావణునిచే నవమానిత యై యగ్నిప్రవేశము చేయుట	...	45
రావణుఁడు దిగ్విజయము చేయుట	...	47
నారదచోదితుఁ డై రావణుఁడు యమునిమీఁదికిఁ జనుట	...	48
నారదవచనప్రబోధితుం డై రావణుఁడు యమునిపై దాడివెడలుట	...	49
నారదుఁడు రావణునిరాక యముని కెఱింగించుట	...	,,
యమరావణసేనలు పోరాడుట	...	50
యమరావణులద్వంద్వయుద్ధము	...	51
బ్రహ్మ యమరావణులయుద్ధమును మాన్పుట	...	,,
రావణుఁడు నివాతకవచకాలకేయులతో యుద్ధము సేయుట	...	52
రావణుఁడు తనమఱఁది యైనవిద్యుజ్జిహ్వునిఁ జంపుట	...	,,
రావణుఁడు వరుణపట్టణముపై దాడివెడలుట	...	53
రావణుఁడు లోకములోని స్త్రీలనెల్లఁ జెఱలుపట్టుట	...	54
రావణునిచెఱం బడిన స్త్రీలు విలపించుట	...	55
చెఱఁ బడ్డయింతులు రావణుని శపించుట	...	56
రావణుఁడు దిగ్విజయము చేసి వచ్చి లంకం బ్రవేశించుట	...	,,
శూర్పణఖ తనమగనిఁ జంపె నని దుఃఖించి రావణుని దూఱనాడుట	...	57
రావణుఁడు శూర్పణఖ నూరడించి దండకారణ్యమునకుఁ బంపుట	...	,,
రావణుఁడు కుంభిల యనువనమున యజ్ఞము సేయుచున్న యింద్రజిత్తుం జూడఁబోవుట		58
రావణుఁ డింద్రజిత్తుఁ గుంభిళనుండి లంకకుఁ దోడ్కొనివచ్చుట	...	59
ఆశ్వాసాంతము	...	,,

షష్ఠాశ్వాసము.

విభీషణుఁడు కుంభీనసను మధుఁ డపహరించె నని యన్నతోఁ జెప్పుట	...	60
మధునిపై దండెత్తినరావణుఁడు కుంభీనసప్రార్థనచే వానితోఁ జెలిమి సేయుట	...	61
మధుఁడును రావణుఁడు నింద్రునిపై దండెత్తుట	...	62

విషయము.		పుట.
కైలాసవర్ణనము	...	63
అంధకారవర్ణనము	...	,,
చంద్రోదయచంద్రికావర్ణనములు	...	64
రంభారావణసంవాదము	...	65
నలకూబరుఁడు రావణుని శపించుట	...	67
రావణుఁడు దండెత్తి వచ్చుట విని యింద్రుఁడు విష్ణునిఁ గాన నేగుట	...	68
ఇంద్రుఁడు యుద్ధమునకు వెడలుట	...	,,
దేవదానవసేనలు పరస్పరము తలపడి పోరుట	...	69
మేఘనాదుఁ డింద్రుని మాయాతిమిరమున ముంచి పట్టుకొనుట	...	73
రావణుఁ డింద్రునిఁ బట్టి లంకకుఁ గొనిపోవుట	...	74
ఆశ్వాసాంతము	...	

సప్తమాశ్వాసము.

బ్రహ్మ యింద్రజిత్తు కోరినవర మిచ్చి యింద్రుని విడిపించుకొని వచ్చుట	...	75
రావణుఁడు కార్తవీర్యునితోఁ బోరాడి చెఱఁబడుట	...	76
పులస్త్యుఁడు కార్తవీర్యుని వేఁడుకొని రావణునిచెఱ విడిపించుట	...	80
రావణుఁడు వాలిచే భంగపడి యతనితో మైత్రి చేయుట	...	81
వాలి రావణునిఁ జంకలో నిఱికించుకొని నాలుగుసముద్రములను ముంచుట	...	82
వాలిచే భంగపడి రావణుఁ డతనితో మైత్రి చేయుట	...	,,
హనుమంతుని జననాదివృత్తాంతము	...	83
అగస్త్యాదిఋషులు రాముని వీడ్కొని చనుట	...	86
పట్టాభిషేకమునకు వచ్చినజనకరాజు మొదలగువారిని రాముఁడు వీడుకొలుపుట	...	87
ఆశ్వాసాంతము	...	88

అష్టమాశ్వాసము.

కుబేరపుష్పకము రామునియొద్దకు వచ్చుట	...	90
భరతుఁడు రామునిఁ బొగడుట	...	91
శ్రీరామునివినోదవిహారము	...	,,
సీతారాము లుద్యానవనమున విహరించుట	...	92
సీతారాములజలవిహారవర్ణనము	...	94
సీతారాముల లీలావిహారవర్ణనము	...	97
సీతాదేవి గర్భము దాల్చుట	...	99
రాముఁడు కోరిక యడుగఁగా సీత గంగాతీరవనములకుఁ బోఁగోరుట	...	,,
రాముఁడు నర్మసచివులవలన లోకాపవాదము నెఱుంగుట	...	100
లోకాపవాదభీతుఁడై రాముఁడు దమ్ములతో నాలోచించుట	...	101
లోకాపవాదమునకై రాముఁడు సీతను విడనాడ నిశ్చయించుట	...	102
రాముఁడు లక్ష్మణునివెంట సీత నడవులకుఁ బంపుట	...	103
ఆశ్వాసాంతము.	...	104

విషయము.		పుట.

నవమాశ్వాసము.

లక్ష్మణుఁడు గంగాతీరవనములకు సీతను దోడ్కొని పోవుట	...	105
రాముఁడు లోకాపవాదభీతుఁడై విడనాడినవృత్తాంతము సీతకు లక్ష్మణుఁ డెఱిఁగించుట		106
సీత తన్ను భర్తవిడనాడినందులకై చింతించి లక్ష్మణునితో నయనిష్ఠురంబు లాడుట		,,
లక్ష్మణుఁడు సీతను గంగఁ దాఁటించి విడిచి పురమునకు మరలుట	...	108
వాల్మీకి సీతవృత్తాంతము మునిపుత్త్రులవలన విని వచ్చి తనయాశ్రమమునకుఁ దోడ్కొనిపోవుట		,,
పట్టణమునకుఁ బోవుచు సుమంత్రుఁడు లక్ష్మణునకు దుఃఖోపశమంబుగా దొల్లిటికథ యెఱిఁగించుట	...	110
లక్ష్మణుఁడు పట్టణమునకుఁ బోయి యన్నతో సీత నడవిని విడిచి వచ్చితి నని చెప్పుట		111
లక్ష్మణుఁడు రామునకు దుఃఖోపశమంబు సేయుట	...	112
రాముఁడు దుఃఖము నడఁచుకొని ప్రజలం బాలించుట	...	,,
రాముఁ డేకాంతంబున సీతం దలంచి చింతిల్లుట	...	113
రాముఁడు మునులమొఱ విని శత్రుఘ్నుని లవణుం జంపఁ బంపుట	...	114
శత్రుఘ్నుఁడు లవణుపై నెత్తిపోవుట	...	,,
ఆశ్వాసాంతము	...	115

దశమాశ్వాసము.

మునులు శత్రుఘ్నునకు లవణుని వధించునుపాయం బెఱిఁగించుట	...	116
లవణశత్రుఘ్నులసంవాదము	...	117
శత్రుఘ్నుఁడు ద్వంద్వయుద్ధమున లవణాసురుం జంపుట	...	118
లవణు వధించి మధుర నేలుచున్నశత్రుఘ్నుఁడు పండ్రెండేండ్లకు నన్నం జూడ వచ్చుట		119
ఒకానొకబ్రాహ్మణుఁడు చచ్చినకొడుకుం దెచ్చి రామునినగరివాకిటఁ బెట్టి దుఃఖించుట		120
వసిష్ఠాదిఋషులు విప్రకుమారునిమృతికారణము రామునికెఱిఁగించుట	...	121
రాముఁడు పుష్పకారూఢుఁడై శూద్రతపస్విని వెదకి ఖండించుట	...	122
శూద్రమునిని వధించినరాముని దేవతలు ప్రత్యక్షమై గారవించుట	...	123
దేవతలు చెప్పినచొప్పున నగస్త్యునియజ్ఞము చూడ రాముఁ డరుగుట	...	,,
రాముఁ డగస్త్యునిచే సమ్మానితుఁడై యయోధ్యకేతెంచుట	...	124
రాముఁ డశ్వమేధయాగము సేయుట	...	125
కుశలవులు యాగశాలకు వచ్చి రామాయణగానము సేయుట	...	,,
రాముఁడు కుశలవులగానము విని సమ్మానించుట	...	126
వాల్మీకి రామునికి సీతావృత్తాంతము చెప్పి కుశలవుల నతని కొప్పించుట	...	127
సీత నిజపాతివ్రత్యప్రభావంబున భూమిం గ్రుంగుట	...	128
రామచంద్రుండు పుత్త్రసహితుండై నిజనగరంబుఁ జొచ్చుట	...	,,
కుశలవులకు రాముఁడు రాజవిద్యల నేర్పించుట	...	129
ఆశ్వాసాంతము.	...	130

శ్రీరస్తు.

నిర్వచనోత్తరరామాయణము

ప్రథమాశ్వాసము.

శ్రీరాస్తాం మనుమక్షితీశ్వరభుజాస్తమ్భే జగన్మణ్డల
ప్రాసాదస్థిరభారభాజి దధతీ సా సాలభఞ్జీశ్రియం
శుణ్డాలోత్తమగణ్డభిత్తిషు మదవ్యాసఙ్గనశ్యాత్మనాం
యాముత్తేజయతే తరాం మధులిహామానన్దసాన్ద్రా స్థితిః. 1

కృతిప్రశంస.

చ. హరిహరపద్మగర్భులను నాదికవీంద్రుల నూత్నసత్కవీ
శ్వరులను భక్తిఁ గొల్చి తగ వారికృపం గవితావిలాసవి
స్తరమహనీయుఁ డైనను సర్వగుణోత్తరమూర్తి మన్మభూ
వరుఁడు దగంగ రాఁ బనిచి వారనిమన్నన నాదరించుచున్. 2

క. ఏ నిన్ను మామ యనియెదు, దీనికిఁ దగ నిమ్ము భారతీకన్యక నా
కీ నర్హుఁడ వగు దనినను, భూనాయకుపల్కు చిత్తమున కిం పగుడున్. ౩

సీ. సకలలోకప్రదీపకుఁ డగుపద్మినీమిత్రవంశమున జన్మించె ననియుఁ
జూచిన మగ లైనఁ జొక్కెడునట్టిసౌందర్యసంపదసొంపు దాల్చె ననియు
జనహృదయానంద జనక మై నెగడిన చతురతకల్మి నప్రతిముఁ డనియు
మెఱసి యొండొంటికి మిగులు శౌర్యత్యాగవిఖ్యాతకీర్తుల వెలసె ననియు
తే. వివిధవిద్యాపరిశ్రమ వేది యనియు
సరసబహుమానవిరచనా శాలి యనియు
మత్కృతీశ్వరుఁ డగుచున్న మనుమనృపతి
సుభగుఁ గావించుటకు సముత్సుకుఁడ నైతి. 4

కృతికర్తృనియమము.

ఉ. భూరివివేకచిత్తులకుఁ బోలు ననం దలఁపన్ దళంబులన్
సౌరభ మిచ్చుగంధవహు చందమునం బ్రకటంబుచేసి యిం

పాఱెడుపల్కులం బడయ । నప్పలుకు ల్సరి గ్రుచ్చునట్లుగాఁ
జేరుప నేరఁగా వలయుఁ । జేసెద నేఁ గృతి యన్నవారికిన్. 5

చ. పలుకులపొందు లేక రసభంగము సేయుచుఁ బ్రాఁతవడ్డమా
టలఁ దమనేర్పు చూపి యొకకొఱ్ఱ హృదయం బలరింపలేక యే
పాలమును గానియట్టిక్రమముం దమమెచ్చుగ లోక మెల్ల న
వ్వులఁ బొరయం జరించుకుకవుల్ ధరదుర్విటులట్ల చూడఁగాన్. 6

క. తెలుఁగుకవిత్వము చెప్పం, దలఁచినకవి యర్థమునకుఁ । దగియుండెడుమా
టలు గొని వళులుం బ్రాసం,బులు నిలుపక యొగిని బులిమి । పుచ్చుట చదురే. 7

క. అలవడ సంస్కృతశబ్దము, తెలుఁగుబడి విశేషణంబు । తేటపడంగాఁ
బలుకునెడ లింగవచనం,బులు భేదింపమికి మెచ్చు । బుధజనము కృతిన్. 8

తే. ఎట్టికవికైనఁ దనకృతి । యింపుఁ బెంపఁ, జాలుఁగావునఁ గావ్యంబు । సరసులైన
కవులచెవులకు నెక్కినఁ । గాని నమ్మఁ, డెందుఁ బరిణతి గలుగుకవీశ్వరుండు. 9

క. అని సత్కవీంద్రమార్గము, మనమున నెలకొల్పి సరస । మధురవచోగుం
భనసుప్రసాదసంబో,ధనగోచరబహువిధార్థ । తాత్పర్యముగాన్. 10

క. ఎత్తఱి నైనను ధీరో,దాత్తనృపోత్తముఁడు రామ । ధరణీపతి స
ద్వృత్తము సంభావ్య మగుట, నుత్తరరామాయణోక్తి । యుక్తుఁడ నైతిన్. 11

తే. సారకవితాభిరాముఁ గుంటూరివిభుని, మంత్రిభాస్కరుమత్పితామహునిఁ దలఁచి
యైన మన్ననమెయి లోక । మాదరించు, వేఱ నాకృతిగుణములు । వేయునేల. 12

మ. అమలోదాత్తమనీష నే నుభయకావ్యప్రౌఢిఁ బాటించుశి
ల్పమునం బారగుఁడం గళావిదుఁడ నాపస్తంబసూత్రుండ గౌ
తమగోత్రుండ మహేశ్వరాంఘ్రికమలధ్యానైకశీలుండ న
న్నమకుం గొమ్మనమంత్రికిన్ సుతుఁడఁ దిక్కాంకుండ సన్మాన్యుఁడన్. 13

ఉ. జాత్యము గాని నొ ప్పయిన । సంస్కృత మెయ్యెడఁ జొన్ప వాక్యసాం
గత్యము సేయుచో నయిన । గద్యము తోడుగఁ జెప్పి పెట్ట దౌ
ర్గత్యము దోఁపఁ బ్రాసముప్రకారము వే ఱగునక్షరంబులన్
శ్రుత్యనురూప మంచు నిడ । సూరుల కివ్విధ మింపుఁ బెంపదే. 14

క. వచనము లేకయు వర్ణన, రచియింపఁగఁ గొంత వచ్చుఁ । బ్రౌఢులకుఁ గథా
ప్రచయముఁ బద్యములన పొం,దుచితంబుగఁ జెప్పు టార్య । లొప్పిద మనరే.

క. లలితపదహృద్యపద్యం,బులన కథార్థంబు ఘటిత । పూర్వాపర మై
యలఁతియలంతితునియలుగ, హాల సంధించినవిధంబు । నమరఁగ వలయున్. 16

కృతినాయకవంశావతారము.

క. ఈకృతికిఁ దొడవుగా నను,రాకృతి యగుమనుమనరవరాగ్రేసరుస
త్త్వాకృతివంశము గాథ, స్వీకృతి దగఁ గీర్తనంబు । సేయుదు నెలమిన్. 17

ఉ. అంబుజనాభునాభి నుదయంబయి వేధ మరీచిఁ గాంచె లో
కంబుల కెల్లఁ బూజ్యుఁ డగు కశ్యపుఁ డాతనికిన్ జనించె వి
శ్వంబు వెలుంగఁ జేయఁగ దివాకరుఁ డమ్ముని కుద్భవించె వా
నిం బొగడం జతుశ్శ్రుతులు ఽ నేరక యున్నవి నాకు శక్యమే. 18

క. ఆతనికి సకలలోక, ఖ్యాతుఁడు మను వుద్భవించి ఽ యనవద్యమతిం
జాతుర్వర్ణ్యస్థితిర,క్షాతత్పరవృత్తిఁ బరఁగె ఽ సర్వోత్తరుఁ డై. 19

శా. లోకాలోకతటీవిహారకలనాలోలద్యశస్సింహుఁ డ
స్తోకాపాదితపుణ్యమూర్తి మనుపుత్త్రుం డాక్రమక్రీడ మై
నేకచ్ఛత్రము గాఁగ భూమివలయం ఽ బెల్లం బ్రశాసించె ని
క్ష్వాకుం డప్రతిమానదానవహిమా ఽ కల్పోజ్జ్వలాకారుఁ డై. 20

క. ఆయిక్ష్వాకుకులంబున, సాయంతనసప్తజిహ్వ ఽ సాదృశ్యశ్రీ
స్ఫాయత్ప్రతాపనిధి నా,రాయణనిభపుణ్యమూర్తి ఽ రఘు వుదయించెన్. 21

మ మఘువిద్యాప్రియుఁ డై దివౌకసుల సమ్మానించుఁ బ్రత్యర్థిబా
హుఘనాటోపము మాన్చు దిగ్విజయలీలోత్సాహి యై సజ్జనా
లఘుకార్యంబులఁ దీర్చు వైదికవిధి ఽ శ్లాఘాదరస్వాంతుఁ డై
రఘుభూపాలకుఁ జెప్ప నొప్పదె జగత్త్రాణప్రవీణాత్మకున్. 22

క. ఆరఘువంశంబున వి,స్తారయశోధనుఁడు విమలచరితుఁడు బుధని
స్తారకుఁడు భూమిపాలన, సారనిపుణబుద్ధి రామ ఽ జనపతి వుట్టెన్. 23

మ. మునిలోకంబు ప్రశంస సేయ జగముల్ ఽ మోదంబు నొందంగ దు
ర్జనతానిగ్రహతత్పరాత్ముఁ డగుచున్ ఽ సద్వృత్తిసంరక్షణం
బున రాగిల్లుచు నేలె రామనృపుఁ డీ ఽ భూచక్రముం దత్కులం
బున రాజన్యు లనేకు లిద్ధరణిఁ బెంపుం బొంది పాలించినన్. 24

క. పిదపఁ గలికాలచోళుం, డుదయంబై జలధిపరిమితోర్వీవలయం
బు దనకు బంటుపాలమ్ముగ, నెదు రెందును లేక పేర్మి ఽ యొసకం బెసఁగన్. 25

శా. చేసేతం బృథివీశు లందుకొనఁ గాశీసింధుతోయంబులం
జేసెన్ మజ్జన ముంగుటంబున హరించెం బల్లవోర్వీశు ను
ల్లాసం బొందఁగ ఫాలలోచనము లీలం గట్టెఁ గావేరి హే
లాసాధ్యాఖిలదిఙ్ముఖుండు కలికాలక్ష్మావిభుం డల్పుఁడే. 26

చ. అతనికులంబునం దవనతారి యుగాంతకృతాంతమూర్తి య
ప్రతిమవదాన్యతావిభవ ఽ భాసి విలాసరతీశుఁ డప్రత
ర్కితవివిధావధానపరికీర్తితనిర్మలవర్తనుండు సం
శ్రితనిధి వుట్టె బిజ్జన యశేషధరిత్రియు నుల్లసిల్లఁగన్. 27

చ. పరుషపరాక్రముం డగుచుఁ । బల్లవపీఠ నుదగ్రు లైనప
న్నిరువుర నాతనిం గలయ । నెన్ని యనర్గళమత్సరంబుమై
మురరిపుసన్నిభుండు పదు।మువ్వుర గం డడఁగంగఁ బెట్టి దా
బిరుదు వెలుంగ బిజ్జఁ డరి । భీకరభూరిభుజాబలంబునన్. 28

క. తద్వంశంబునఁ బోషిత, విద్వజ్జనుఁ డహితభుజగ । విహగేంద్రుఁడు ధ
ర్మాద్వైతమూర్తి వరయో,షిద్వర్గస్మరుఁడు మన్మ।సిద్ధి జనించెన్. 29

సీ. భూరిప్రతాపంబు । వైరిమదాంధకారమున కఖండదీపముగఁ జేసి
చరితంబు నిఖిలభూజననిత్యశోభనలతకును నాలవాలముగఁ జేసి
కరుణ దీనానాథ । కవిబంధుజనచకోరములకుఁ జంద్రాతపముగఁ జేసి
కీర్తిజాలముఁ ద్రిలోకీశారికకు నభిరామరాజితపంజరముగఁ జేసి
ఆ. సుందరీజనంబు । డెందంబునకుఁ దన, నిరుపమాన మైన । నేర్పుకలిమి
నతిప్రసిద్ధి చేసి । యసదృశలీల మైఁ, బరఁగె మనుమసిద్ధి । ధరణివిభుఁడు. 30

క. ఆమన్మసిద్ధిసుతుఁ డా,శామండలశాసనుండు । సదయాకృతి సం
గ్రామశ్రీరాముఁడు రా,మామదనుఁడు తిక్కనృపతి । మహిఁ బాలించెన్. 31

ఉ. కేశవసన్నిభుండు పరి।గీతయశోనిధి చోళతిక్కధా
త్రీశుఁడు కేవలుండె నృపు । లెవ్వరి కాచరితంబు గల్గునే
శైశవలీలనాఁడు పటు।శౌర్యధురంధరబాహుఁ డైనపృ
థ్వీశనరేంద్రమస్తకము । నేర్తెఱఁ గందుకకేలి సల్పఁడే. 32

సీ. లకుమయ గురుములూరికి నెత్తి వచ్చినఁ గొనఁడె యాహవమునఘోటకముల
దర్పదుర్జయు లగుదాయాదనృపతుల ననిలోనఁ బఱపఁడే । యాగ్రహమున
శంభురాజాదిప్రశస్తారిమండలికముఁ జెర్చి యేలఁడె । కంచిపురముఁ
జేవిమండలము గాసిగఁ జేసి కాళవపతి నియ్యకొలుపఁడే । పలచమునకు
తే. రాయగండగోపాలు నరాతిభయద, రాయపెండారబిరుదాభిరాము నుభయ
రాయగండాంకు ఖండియరాయఁ దిక్క, ధరణివిభుఁ బోల రాజులకరిది కాదె.

మ. కమలాప్తప్రతిమానమూర్తి యగునా । కర్ణాటసోమేశు దు
ర్దమదోర్గర్వము రూపుమాపి నిజదర్పంబుం బ్రతిష్ఠించి లీ
లమెయిఁ జోళుని భూమిపై నిలిపి చోళస్థాపనాచార్యనా
మము దక్కం గొని తిక్కభూవిభుఁడు సామర్థ్యంబు చెల్లింపఁడే. 34

సీ. భృత్యానురాగంబు । పెంపుఁ జెప్పఁగ నేల పరివారసన్నాహ । బిరుదు గలుగ
వందిప్రియత్వంబు । వర్ణింపఁ గా నేల పాఠకపుత్త్రాఖ్య । పరఁగు చుండ
సకలవిద్యాపరిశ్రమముఁ దెల్పఁగ నేల కవిసార్వభౌమాంక । మవనిఁ జెల్ల
సుభగతామహిమఁ బ్రస్తుతి సేయఁగా నేల మన్మథనామంబు । మహిమ నెగడ
తే. నుభయబలవీరుఁ డనుపేరు । త్రిభువనములఁ

ప్రచురముగ ఘోరబహుసంగరముల విజయ
లక్ష్మిఁ జేకొనుబాహుబలంబుసొంపు
పొగడ నేటికిఁ గలికాల ॥ భూవిభునకు. 35

క. అతనికి నుదయించెను గల్పతరువునకుఁ బుట్టు రుచిర ॥ ఫల మన మనుమ
క్షితిపతి కవిహృదయశుక, ప్రతతిసమాస్వాదనీయ ॥ రసికత వెలయన్. 36

ఉ. అర్థిజనంబు లోభినృపులాసలు చూపినఁ బడ్డజాలి ప్ర
త్యర్థులు వైరిరాజులమరం బడఁగించుటఁ గన్న పెంపు నా
నార్థము లర్థి కిచ్చియు రణావని దోలియుఁ బాపు కామినీ
ప్రార్థితమూర్తి మన్మజనపాలుఁడు కేవలుఁడే తలంపఁగన్. 37

సీ. అడవులఁ గొండలఁ ॥ బడి యాలుబిడ్డప ట్టలుఁగని వైరిధాత్రీశులందుఁ
గట్టంగఁ దోడఁ బాయఁబెట్టఁ గొఱంత లే కానంద మందెడు ॥ నర్థులందుఁ
గని విని యించువిల్తునియలరమ్ముల బారికి నగపడ్డ ॥ భామలందుఁ
దమతమలో నద్భుతం బంది కొనియాడు నిఖలకళాగమ ॥ నిపుణులందుఁ
తే. గానఁగావచ్చు వేఱ పొగడ్త లాస్పదక తనయంత జగములఁ ॥ బరఁగుచుండు
దినకరాన్వయతిలకంబు ॥ మనుమనృపతి, వీర్యవితరణరూపవివేకమహిమ. 38

మ. ద్రవిడోర్వీపతిగర్వముం దునిమి శౌర్యం బొప్పఁ గర్ణాటద
ర్పవిఘాతంబు నొనర్చి వైరిమనుజేంద్రశ్రేణికిం గొంగ నా
నవనిం బేర్కొని యున్న యట్టివిజయలక్ష్మాధీశ్వరుం గాసిగా
నెవిచెం జోళనమన్మసిద్ధి యని ప్రాయేటం బ్రగాఢోద్ధతిన్. 39

సీ. దండప్రణామంబు ॥ దగ నభ్యసించిరో నెఱి బొరగిలఁబడ ॥ నేర్చునాఁడ
ప్రేళ్లు గఱపంగ ॥ వెర వల్వరించిరో నోరఁ జేతులు గ్రుక్కి ॥ నొల్లునాఁడ
కడుసంకటంపుఁబేరడవులు దూఱంగఁ దరము నేసిరొ యిలఁ ॥ దడవునాఁడ
పలుదెస విఱిగిపోఁ ॥ బరువు సాధించిరో క్రీడలుగాఁ బాఱి ॥ యాడునాఁడ
తే. బాలశిశులు గా కొండు ॥ భంగి నింత, యచ్చుపడియుండు నే వీరి ॥ కనఁగ నిన్ని
తెఱఁగులకు నేర్పుగలిగి వార్తింతు రాజి,మనుమన్నృపుఁడాఁకిపోయిన మనుజపతులు.

ఉ. రంగదుదారకీర్తి యగు రక్కసగంగనఁ బెంజలంబుమై
భంగ మొనర్చి మన్మజనపాలుఁడు బల్విడి నాఁచికొన్న రా
జ్యాంగము లెల్ల నిచ్చి తన యాశ్రితవత్సలవృత్తి యేర్పడం
గంగయసాహిణిం బదము ॥ గైకొనఁ బంచెఁ బరాక్రమోన్నతిన్. 41

సీ. కొండలునఱకునా ॥ ఖండలుకై వడి యెనయు నేనుంగులఁ ॥ దునుమునపుడు
బెబ్బులి వడి లేళ్లఁ బిండు హత్తినయొప్పు గలుగు రాహుతులకుఁ గడఁగునప్పు
డడవులఁ గార్చిచ్చు ॥ లడరుచందముగాన నగుఁ గాలుబలమున ॥ కలుగునపుడు
బలుగాలి మొగుళులపై వీచుక్రియ దోఁచుఁ దఱుమైన గొడుగులుననఁ గాఁచునపుడు

తే. కసిమసంగినమృత్యువు కరణి యంత, కాలరుద్రునికైవడి కాలదండ
ధరునిబలువిడి యలవడు దురములోన, నసమశౌర్యుఁడుమనుమథరాధిపునకు.

శా. శృంగారంబు నలంగ దేమియును బ్రస్వేదాంకురశ్రేణి లే
దంగంబుల్ మెఱుఁ గేద వించుకయు మాహారాష్ట్రసామంతు సా
రంగుం దోలి తురంగముం గొనినసంగ్రామంబునం దృప్తస
ప్తాంగస్ఫారయశుండు మన్మవిభుపం పై చన్నసైన్యంబునన్. 43

సీ. అనుపమబహురత్నహయవారణముల విద్విషులు గప్పములు పుత్తెంచుచోట
నెల్లికయ్యం బని యొద్ది యేనియు నొక్క కెలన శాత్రవదూతపలుకుచోటఁ
దలతలమని రెండు దడములవా రేటు న కమానముగఁ జేర నడచుచోటఁ
బరసేన సచ్చియుం బాఱియు బయ లైన యనిలోన జయము సేకొనెడుచోట
ఆ. నొక్కరూప కాని యెక్కుడు డిగ్గును, గానరాదు ముఖవికాసమునకు
నన్యరాజు లీడె యరిరాయవేశ్యాభు,జంగుఁ డైనమనుమ జనవిభునకు. 44

అయోధ్యావర్ణనము.

క. అమ్మనుమనృపతి కభ్యుద,యమ్ముగ నేఁ జెప్పఁ బూని నట్టి కథకు నా
ద్యమ్మయి యయోధ్య యనునా,మమ్మున నెగడినపురోత్తమము వర్ణింతున్

సీ. అఖిలభోగములకు నాస్పదం బగుట భోగీంద్రపట్టణమున కీడ యనియు
ధనసమృద్ధుల కెల్లఁ దల్లియి ల్లగుటఁ గుబేరునివీటికిఁ బెద్ద యనియు
వైభవంబులకు నావాస మగుట నమరాధీశుపురమున కధిక మనియు
నిర్మలవృత్తికి నెర వగుటను భారతీశ్వరుప్రోలికి నెక్కు డనియు
ఆ. వినుతి సేయఁ జాలి వివిధోత్సవంబుల, నతిశయిల్లి సజ్జనాభిరామ
మై కరంబు వొలుచు నన్నగరంబు వి,స్ఫురితసకలవస్తుపూర్ణ మగుచు. 46

క. చనిచని యచ్చోటను జి,క్కొనొకో తారకము లనఁ బ్రకీర్ణరుచులఁ ద
ద్ఘనవప్రప్రాగ్భాగం,బున ఖచితము లైనవజ్రములు చెలు వొందున్. 47

తే. ఇంతపొడ వని వాక్రువ్వ నేరి కైన, రాదనుట కోటవర్ణన గాదు నిజమ
యెగసి పఱపిన దృష్టులు నిగుడునంత, లెక్కలో నగ్రభాగంబు లేమిఁ జేసి.

క. మహనీయవప్రగోపుర, బహురత్నోత్కీర్ణసాల భంజిక లొప్పున్
విహరణతత్పరనిర్జర, మహిళాతతి వచ్చి యున్నమాడ్కి బెడం గై. 49

సీ. అవగాహనమునకు నరిగినగజములమదములు గూడిన నదులు గాఁగ
ఝషకకుళీరకచ్ఛపమకరాదిసత్త్వముల మొత్తము పర్వతములు గాఁగఁ
బ్రాకారమణిగణప్రతిబింబనికరంబు విలసిల్లుబహురత్నవితతి గాఁగ
రంగత్తరంగపరంపరలైఁ దేలు, కలహంసములు శంఖకులము గాఁగఁ
ఆ. గరము పొలుపు మిగులుఁ బరిఖ విశాలగం,భీర మగుచుఁ బఱపుఁ బేర్మిఁ జేసి
యఖిలభూమిచక్ర మనుతలంపునఁ బుర,వరముఁ జుట్టి యున్న శరధివోలె.

చ. తరుణులపీఁగుఁజన్నుఁగవ తాఁకున నున్మదచక్రవాకబం
ధురగతి లీలఁ గామినుల తోరపుటూరులఘట్టనంబునం
గరివరహస్తకాండపటుఘాతమునం బరిఖాతరంగముల్
దిరుగుడుపడ్డతీరములఁ దెట్టువగట్టు సరోజరేణువుల్. 51

సీ. ఉజ్జ్వలలక్ష్మికి నుద్భవస్థాన మై భువనసుందర మగు పొలుపు దాల్చి
యనుపమానంతభోగాస్పదం బనఁ జాలి హరినీలకాంతివిస్ఫురణ నొంది
సాంద్రచంద్రద్యుతిసమితి శోభిల్లి సుధాబహులప్రబోధమును గలిగి
బహుచిత్రసత్వసంపన్నత మెఱసి తుంగాచలాతిస్థితి నతిశయిల్లి
తే. యక్కజం బగుపెంపున నతుల మగుచుఁ
జూడ్కులకు వేడ్క సేయుచు సొంపు మిగిలి
తమకు రత్నాకరంబుచందము నెఱయఁగ
నప్పురంబున రమణించె హర్మ్యచయము. 52

ఉ. చారుబలాకమాలికల చాడ్పున దంతము లొప్ప గర్జిత
స్ఫారరవంబులట్లుగ నభంగురతం బటుబృంహితంబు లా
సారముమాడ్కి దానజలసంతతి గ్రమ్మఁగఁ గాలమేఘమా
లారుచిరంబు లై మదచలద్ద్విపసంఘము లొప్పు నప్పురిన్. 53

తే. మనముశిల్పియొ తనదువిన్ననువు మెఱసి
గాలి నశ్వరూపంబులు గాఁ దరించెఁ
గాక యీజవసత్త్వముల్ గలవె ఘోట
కముల కెందు నాఁ బురిఁ దురంగములు వొలుచు. 54

సీ. మవ్వంపుమేనుల జవ్వనంబుల కింపుమిగిలినచెయ్వుల మెఱుఁగు వెట్ట
నల్లనమధురంపు సల్లాపరచనకు లేఁతనవ్వున నునుఁబూఁత పూయ
నిడువాలుఁ గనుదోయి నిసుపారుకాంతికిఁ గలికిక్రేఁగన్నుల నలువుమిగుల
లలితంబు లగుచిత్తములచతురతలకు సరసంపునడవడిఁ దెరలువుచ్చ
తే. వెరవు గల్గి మనోభవు వీరరసము, నిరతముగ నేర్పు వాటించి కరువు గట్టి
పోసి చేసినరూపులపోల్కి వార, వనిత లొప్పుదు రప్పురవరమునందు. 55

చ. విలుచునెడన్ మనంబులకు వెక్కస మంద ధనంబు లమ్ముచో
విలసదనేకవస్తువులు విస్మయ మందఁగఁ జూడ్కు లెల్ల సొం
పులసహజంబు లై యెలమిఁ బొందఁగ నుజ్జ్వల లక్ష్మి యొప్పుఁ ద
మ్ములవడఁ జెంద వైశ్యజను లప్పురి నొప్పుదు రప్రమేయు లై. 56

సీ. అనవద్యవేదవిద్యాలతావితతికి నాలవాలములు జిహ్వాంచలములు
రాజితబహుకళారాజహంసికలకు మానససరసులు మానసములు
చారుసత్యవ్రతసౌరభ్యలక్ష్మికి నుచితవాక్యములు పుష్పోద్గమములు

సాదరకారుణ్య మేదురజ్యోత్స్నకు మధురాకృతులు శశిమండలములు
తే. గా సమస్తమహాధ్వరైకకర్తృతావిభూతిఁ దనరి యఖిలలోకపూజ్యు లగుచు
నిరుపమానసద్గుణగణనీతినిరతు, లై ధరామరు లొప్పుదు రప్పురమున. 57

చ. అమరనగంబు నెచ్చెలులొ హైమవతీశుననుంగుఁగొండవి
య్యము లొకొ రోహణాచలము నన్నలుఁ దమ్ములొ నాకు నా సువ
ర్ణమునను జారుతారమున రత్నచయంబునఁ దేజరిల్లు నం
దు మహిమ కున్కిపట్టగుచుఁ దుంగసముజ్జ్వలదేవసద్మముల్. 58

సీ. పడఁతులనెఱివేఁగుఁ బాలిండ్లు వెడదోఁప లీలఁ బయ్యెదలు దూలించుటకును
దెఱవలపూఁతలు మెఱయఁగ నాటమై నడరిననుఁ జెమటార్చుటకును
మెలఁతలచెక్కుల మెఱుఁగు వింతఁగ నవతంసమంజరులు గదల్చుటకును
గొమ్మలయలికదేశమ్ములఁ గ్రొత్తచెన్నొలయఁ గుంతలములఁ దెలచుటకును
తే. విటకుమారులు తనరాక వేచివేడ్క, నెదురుకొనియింపుసొంపువహించుచుండ
నడపు మెలపునజనులకానందమొదవ, గంధవహుఁ డప్పురంబునఁ గలయఁబొలయు.

చ. శుకపికసంకులత్వమున సుందరసాంద్రలతాంతపల్లవ
ప్రకరబహుచ్ఛవిం బురవరంబువిహారవనంబు లొప్పు న
మ్మకరపతాకుసైన్యములు మానవతీవిటకోటికైన కే
లికలహవృత్తి సైఁపక సలీలగతిన్ బయినెత్తి వచ్చె నాన్. 60

సీ. మన్మథునాస్థానమండపంబులు మీనకేతునేపథ్యనికేతనములు
రతివల్లభునివిహారప్రదేశములు సంకల్పసంభవునిభోగస్థలములు
కందర్పునాయుధాగారముల్ కుసుమశరాసనుసంగీతశాలయములు
శంబరసూదనుజయభూము లిందిరానందనుసంకేతమందిరములు
ఆ. రామణీయకంబు రమియించునిక్కలు, సొంపుగనులు చైత్రసంపదలకు
ననుగలంపుటిరవు లనఁగ రమ్యంబులై, యొప్పు నుపవనంబు లప్పురమున. 61

చ. వివిధగతిప్రకారముల వీథులఁ బాఱుసమీరణంబుచే
నవమకరందబిందుతతి నల్గడలం దగ నింపుగూడి య
త్యవిరళలీలఁ బర్వ మధుపావళి పువ్వులు రోయకెందు నా
డి వనములోన విచ్చలవిడిన్ మదలీల వహించు నెప్పుడున్. 62

సీ. పద్మినీకల్లోలపంక్తులపైఁ గ్రాలు రాజితరాజమరాళలీల
సహకారపల్లవసమితిఁ గదల్చునున్మదకలకంఠకు మాఱుమాడ్కిఁ
బుష్పితనవలతాపుంజంబులోపల విహరించుమత్తాళివిభునిభంగి
నుద్యానమునకు వేఱొకయొప్పుగావించుచారునవీనవసంతుభాతి
తే. నేను గలుగంగ మదనునికేల యొండు, పరికరము లని యన్నింటిపనులుఁ దాన
పూని చేయువిధమున మందానిలుండు, పురమునందుండునుపవనభూములందు,

పూర్వరామాయణకథ.

క. ఆపురి కధిపతి రఘుకుల, దీపకుఁ డమరేంద్రవిభుఁడు ౹ తేజోనిధి వి
ద్యాపారగుండు దశరథ, భూపాలుఁడు సకలలోక౹పూజితుఁ డగుచున్. 64

సీ. అష్టదిగ్గజశోభి౹తావనీచక్రంబు దమ్మి యై తనలక్ష్మి ౹ కిమ్ము గాఁగ
వివిధవర్ణాశ్రమ౹విహితవృత్తికిఁ దన యసదృశపరిరక్ష ౹ ముసుఁగు గాఁగఁ
బొలుచుచతుర్దశ౹భువనముల్ దనకీర్తి యాడెడునెలవుల ౹ మేడ గాఁగ
నమ్మూఁడుమూర్తుల ౹ యలవు లెన్నఁగఁ బుట్టి ప్రేలెడితనమూర్తి౹వాలుగాఁగఁ
తే. దనకృపాణంబు రిపుల సద్గతికిఁ బుచ్చు, పుణ్యతీర్థంబు గాఁ దన౹భూరిదాన
మర్థులకు భూరివాన గా ౹ నతిశయిల్లి, జలధివలయితవసుమతీ౹చక్ర మేలె. 65

ఉ. అత్తఱి లోకభీకరదు౹రాచరణుం డగుపంక్తికంఠును
ద్వృత్తి నలంగునిర్జరుల ౹ విన్నపముల్ దయ నాదరించి దే
వోత్తముఁ డైనవిష్ణుఁడు సుముత్సుకుఁ డయ్యె విశుద్ధవిశ్రుతో
దాత్తచరిత్రుఁ డౌదశర౹థక్షితినాథున కుద్భవింపఁగన్. 66

క. తనయులఁ బడయుకుతూహల,మున నిట నమ్మనుజపతియు ౹ మునికులవంద్యుం
డనఁ జాలుఋశ్యశృంగుని, యనుమతమునఁ బుత్రకామ౹యజనము చేసెన్. 67

సీ. ఆసుకృతంబు మ౹హానుభావంబున, నమ్మహీరమణుభా౹ర్యాత్రయమున
రాజన్యకుంజరు౹రామునిఁ గౌసల్య, కైకేయి గుణగణా౹కల్పు భరతు
మానితయశుని లక్ష్మణుని శత్రుఘ్ను సుమిత్రయుఁ గాంచిరి ౹ ధాత్రి యలర
విష్ణునంశమున ని౹వ్విధమునఁ బుట్టిన రామదేవుం డభి౹రామలీల
తే. వెలసి వేదతదంగాది౹విద్య లెల్ల, నభ్యసించి ధనుర్వేద ౹ మధిగమించి
సరససాహిత్యవేది యై ౹ సకలకళల, నెఱిఁగి యౌదార్యశౌర్యస౹మేతుఁ డగుచు.

చ. జనకునియజ్ఞవేదికఁ బ్ర౹శస్తముగా జనియించి యంగనా
జనతకు భూషణం బనఁగఁ ౹ జాలినసీతకు రుద్రచాపభం
జన మనుసుంకు విచ్చి నృపసత్తమసూతిఁ బరిగ్రహించి పే
ర్చినయుభయానురాగమున౹జిత్తభవుం జరితార్థుఁ జేయుచున్. 69
తే. మును సురాసురసంగ్రామ౹మున రథంబు, గడపి విభుచేత వరములు ౹ గన్నకైక
యడుగ నరపతి పంపంగ ౹ నక్కుమారుఁ, డరిగెఁ గాననమునఁ దప౹మాచరింప.

శా. రాముం దాపసవృత్తి కంపఁ దను సా౹మ్రాజ్యంబుపై నిల్పఁ జే
తోమోదంబునఁ గోరుతల్లికిఁ గుల౹ద్రోహంబు దక్కంగఁ ద
ద్భూమిం బ్రస్ఫుటరక్ష మై నడపి ని౹ర్లోభాత్ముఁ డై సర్వలో
కామోదం బొనరించె నాభరతుఁ డా౹ర్యస్తుత్యవృత్తంబునన్. 71

చ. వనితయు లక్ష్మణుండు సహ౹వాసము సేయఁగఁ బర్ణశాలల౯
మునిజనవర్తనంబునఁ బ్ర౹మోదముఁ బొందుచు దండకావనం

బున రఘురాముఁ డున్నయెడఁ । బొల్తుక యొక్కతె యేగుదెంచి యా
తనిఁ గని కాముచే నలఁగి । ధైర్యవిహీనతఁ గోర్కిఁ జెప్పినన్. 72

తే. అతఁడు నగి త్రిప్పిపుచ్చిన । ననుజుకడకు, నరిగి యాతండు ద్రోచినఁ । బెరిఁగివికృత
వేషయైయెత్తికొనిపోవ రోష మెత్తి, యక్కుమారుఁడు వెసఁగోసె ముక్కుసెవులు.

క. భంగపడి రామకడ క, య్యంగన చనుదెంచి యిట్టు । లనియెఁ ద్రిలోకో
త్తుంగచరిత్రుఁడు శశ్వద,భంగుం డగుపంక్తివదను । భగినిం జుమ్మీ. 74

తే. శూర్పణఖ యనుదాన మీ । దర్పమడఁప, నసుర లిప్పుడ వచ్చెద । రనుచుఁ గోప
మునఁ గడంగి జనస్థానమునకు నేగి, యనుజుఁ డగుఖరుతోడఁ జెప్పిన నతండు.

క. దూషణునిఁ ద్రిశిరుఁ గూడి స,రోషంబుగ నెత్తి వచ్చి । రోగంబులు ది
వ్యౌషధముఁ దాఁకుపగిది మ,నీష మెయిం జాలు రాము । నెదిరి మహాజిన్. 76

చ. పొలిసినఁ జూచి శూర్పణఖ । పోయి దశాననుఁ గాంచి బన్నముం
దెలుపునెడం బ్రసంగమునఁ । దేటపడన్ వినిపించె సీతకో
మలతనులీల యద్దివిజమర్దనుఁడున్ హృదయంబునం గుతూ
హల మెలరార శీఘ్రగతి । నయ్యెడ కేగె వియత్పథంబునన్. 77

క. చని కౌటిల్యమున మహీ,తనయం గొని లంక కరిగె । దానవుఁ డపుడా
మనుజేంద్రనందనుఁడు దన, మనమునయడ లనుఁగుఁదమ్ము । మాటల మలఁగన్.

సీ. ఎడసొచ్చి దైత్యుచేఁ । బడినజటాయువు వలన నంగనచన్న । వల నెఱింగి
శరణార్థి యగుదివాకరసూతిఁ జేకొని కోలతోడనె వాలిఁ గూల నేసి
వనచరబలముల । వసుధ నెల్లను నొక్క వాయిగా నడపించి । వార్ధిఁ గడచి
లంకపై విడిసి చాలంబు బలంబును జూపి రాక్షసకోటి । నూపడంచి
తే. కుంభకర్ణునిఁ గుంభనికుంభనాము, లైనతనయులతో నంత । కాలయమున
కనిచి దేవాంతకప్రహస్తాదిబంధు,వర్గసహితంబుగా దశవదనుఁ దునిమి. 79

తే. అఖిలదేవతాసన్నిధి । నగ్నిదత్త, యైనజానకి నానంద । మతిశయిల్లఁ
గైకొనియె రాముఁ డీమూఁడు । లోకములకు, నద్భుతప్రీతు లడరి పొం । గారుచుండ.

క. ఇంద్రజి ననిలోఁ జంపి మ,హేంద్రాదిత్రిదశనుతుల । కెక్కినయనుజున్
సాంద్రానుమోదమున రఘు,చంద్రుఁడు మోమెలమిఁ బొంద । సంభావించెన్.

ఆ. అతని నపుడ దివ్య । యానరత్నం బగు,పుష్పకంబుఁ దేరఁ । బుచ్చి దాని
కెదురువోయి యర్చ । లిచ్చి సంప్రీతి నా,తండు జానకియును । దాను నెక్కె. 82

చ. శర ణని వచ్చి చొచ్చి యని । శంబును గొల్చుచు నున్న రావణా
వరజు విభీషణున్ సమర । వర్తనుఁ డైనదినేంద్రనందనున్
శరనిధి దాఁటి దేవిఁ గని । చయ్యన నుంగర మిచ్చి పేర్చి య
ప్పురవర మేర్చి లోకనుతిఁ । బొందినపావని నాదరించుచున్. 83

ఉ. వారలు వారిభూరిపరివారముతోన విమాన మెక్కి రాఁ
గా రఘునందనుం డరిగి కాంచనతోరణచిత్రమై నవ
ద్వారనికాయ మైననిజపట్టణ ముత్సుకవృత్తిఁ జొచ్చె నిం
డారుముదంబునన్ భరతుఁ డాదృతిఁ జేసి సలీలఁ గ్రాలఁగన్. 84

క. వినయము గైకొనఁగాఁ జే,యను దగువా రెల్లఁ దన్ను నయ్యయిసంభా
వనమై నభినందింపఁగ, జననాథుఁడు పూజ్యరాజ్యసంపద నొందెన్. 85

ఆశ్వాసాంతము.

మ. కమలాధారుఁడు భీతిదూరుఁ డసమాకారుండు గంభీరుఁ డ
బ్జముఖీమారుఁ డపారసారుఁడు కళాస్ఫారుండు వీరుండు దు
ర్దమదోస్సారుఁ డధర్మభీరుఁడు మహోదారుండు దుర్వారుఁ డ
త్యమలాచారుఁడు నిర్వికారుఁడు యశోహారుండు ధీరుం డిలన్. 86

క. వికచకమలాయతాక్షుం, డకుటిలచిత్తప్రచారహారిమిత్రుం డ
ర్కకులప్రదీపుఁ డభినవ, మకరాంకుఁడు విజయమానవర్ధనుఁ డెలమిన్. 87

మాలిని. నమదరినృపచూడానవ్యరత్నాంశువీచీ
సముదయసుభగోల్లాసస్ఫురత్పాదపద్మం
డమరతరునికాయత్యాగలీలాపహాసో
ద్యమనిపుణనిసర్గోదార్యహస్తాబ్జుఁ డుర్విన్. 88

గద్యము. ఇది శ్రీమదుభయకవిమిత్ర కొమ్మనామాత్యపుత్ర బుధారాధనవిధేయ తిక్కన నామధేయ ప్రణీతం బయినయుత్తరరామాయణం బనుమహాకావ్యంబునందుఁ బ్రథమాశ్వాసము.

శ్రీ ర స్తు.

నిర్వచనోత్తర రామాయణము.

ద్వితీయాశ్వాసము.

మద్భగీరథాన్వయ
తామరసాకరసహస్రధాముఁడు సూరి
స్తోమారామవసంతుఁడు
భూమండనయశుఁడు మన్న। భూమీశుఁ డొగిన్. 1

రామునికొల్వుకూటమునకు జనకాదులు వచ్చుట.

క. శ్రీరామచంద్రుఁ డిట్లు మ,హారాజపదస్థుఁ డైన। నభినందింపన్
గారవమున జనకాది, క్ష్మారమణులు వచ్చి కాంచి। సంప్రీతిమెయిన్. 2

క. అన్నరపతివినయాదిగు,ణోన్నతి కెదలలర మంజు।లోక్తుల సమయో
త్పన్నవిషయోపలాలన, నున్నయెడన్ హర్షరసస।ముత్కర్షముతోన్. 3

సీ. కౌశిక బక దాల్భ్య। కణ్వప్రభృతు లైనదురితవిదూరు లా। తూర్పువారు
నాత్రేయ కుత్స దృ।ఢాయు రగస్త్యు లాదిగఁ గలదక్షిణ।దిక్కువారు
ఋషభ రైభ్యక యవ।క్రీవృషముఖ్యు లౌతపోమహనీయు లగుపశ్చి।మంబువారు
గశ్యప జమదగ్ని। గౌతమాత్రులు లోనుగా నుత్తరమ్మునఁ। గల్గువారు
తే. శిష్యసంఘంబుతో రాము।పోష్యవర్గ, మగుట మునికులమెల్లను। నరుగుదెంచె
నతనివిజయోత్సవముఁ గాంచ।నాడు వేడ్కఁ, బ్రీతిమొగములనెలకొనఁ।బిండుగట్టి

ఉ. అందఱుఁ గూడి మోసలకు। నర్థిమెయిం జనుదెంచి యెంతయుం
గ్రందుకొనంగ నున్నెడ న।గస్త్యుఁడు వాకిటివానిఁ జూచి మా
యిందఱరాక దాశరథి। కీ వెఱిఁగింపుము వేగ మన్న వాఁ
డుం దగఁ బోయి యల్లన న।డుంకుచు భూవిభుఁ జేరి నమ్రుఁ డై. 5

ఉ. దేవ మునీశ్వరుల్ సకల।దిఙ్ముఖవాసు లగస్త్యముఖ్యు లా
శ్రావితనామధేయులు వి।శాలతపోవిభవు ల్సముజ్జ్వల
త్పావకమూర్తు లయ్యును గృ।పారసపూరితశీతలాకృతుల్
దేవరఁ గాన వేడ్కఁ జను।దెంచినవా రని విన్నవించినన్. 6

క. విని యెంతయు సమ్మదమున, జనపతి తోడ్తెమ్ము వారి। జయ్యన ననుడుం
జనెఁ బణిహారియుఁ దోడన, మును లత్యంతప్రమోద।మున వచ్చుటయున్. 7

చ. పతి యెదురేఁగి నమ్రుఁ డయి । భక్తిమెయిం గొని వచ్చి యుజ్జ్వలో
న్నతకనకాసనంబుల మహాగ్రమదంబుగ నందఱిన్ యథో
చితగతి నుంచి మోమరల । నేమమె నావుడు బాధ లెల్లఁ దీ
ర్చితి భువనంబు లన్నిటికి । నేమమ యింకిట మాకు నేమమే.. 8

మునులు రాముని నుతించుట.

చ. అరిఁ బరిమార్చి ప్రీతి జనకాత్మజఁ దోకొని యేగుదెంచి రా
జ్యరమఁ బరిగ్రహించి యిటు । లద్భుతసంపద నొప్పి యున్ననిన్
గర మనురక్తి మై వినియుఁ । గన్నులు చల్లగఁ జూచియు న్మదం
బరుదుగఁ గంటి మెంతయుఁ గృతార్థుల మైతిమి రాఘవేశ్వరా. 9

ఆ. అలుక వాఁడమి చాప । మందికొనినను ద్రిజగము లైనఁగడఁకఁ సమయుననిన
సమరమందు రాక్షసశ్రేణి నోర్చుట, నీకు నెంత పెద్ద । నృపవరేణ్య. 10

క. వినను రావణుఁ డఁట రిపుఁ, డానెలకువ చొచ్చి పొదివి । తఁట పోరను నీ
చే నెత్తురు గాకుండఁగ, వానిం జంపి తఁట తగదె । వర్ణన సేయన్. 11

మ. అనిఁ గుంభుండు నికుంభుఁడుం బడినఁ గ్రోధావిష్టుఁ డై దర్పమున్
దనుజస్నేహముఁ బక్షయుగ్మకము గా । ధాత్రీధరాకారతం
జనుదేరం గని కుంభకర్ణుఁ బటువజ్రస్ఫారబాణాహతిం
దునుమం జాలుట నీడు లే దరయ నీవిక్రమక్రీడకున్. 12

చ. ఇవి యరయంగ నెంతపను । లింద్రజిచావుఁ దలంప వాని నా
హవమున శూలి కైనఁ జెనయ న్వర మాతఁడు పిల్కుమారినన్
భువనము లెల్ల నిర్భయతఁ । బొందె మహాద్భుత మంది లక్ష్మణ
స్తవనకథావిధాచరణతాపరతంత్రము లయ్యె రాఘవా. 13

చ. అని మును లెల్లఁ బంక్తిముఖు । నాతనితమ్మునిఁ గుంభకర్ణునిం
దనయుని మేఘనాదుని సుదగ్రబలాఢ్యులఁ గాఁ గడంగి పే
ర్కొన విని కౌతుకం బడరఁ । గుంభసముద్భవుమోముఁ జూచి యి
ట్లను ధరణీశ్వరుండు వినయంబు నిజాస్య మలంకరింపఁగన్. 14

క. కడిఁదిమగ లని దశాస్యుం, గొడుకుం దమ్మునిఁ గరంబు । గురువుగ మీచె
ప్పెడుభంగిఁ జూడ వారల, నడుగంగా వలసియున్న । యది మునినాథా. 15

క. అమ్మనుజభోజనులజ, న్మమ్ములునుం దపము చేసినతెఱంగును శౌ
ర్యమ్ములును జెప్పు మనవుడు, నమ్ముని రఘుపతికి నిట్టు । లనియెం బ్రీతిన్. 16

విశ్రవసుజన్మప్రకారము.

ఆ. తొల్లి కృతయుగమునఁ । దోయజసంభవ, నందనుఁడు పులస్త్యనామధేయుఁ
డైనమునివరుఁడు మహానుభావంబునఁ, దండ్రియట్ల యెన్న । దగినవాఁడు. 17

చ. అమరనగంబుచేరువ నియంత్రితనిర్మలచిత్తవృత్తి యై

శమదమసత్యశాలి యనఁ ౹ జాలి తపం బొనరించు చుండి కాం
చె మనుజదేవకింపురుష౹సిద్ధవియచ్చరకన్యకానికా
యముఁ దనయాశ్రమస్థలియు౹పాంతమున న్విహరింప వచ్చినన్. 18

క. పలుమఱుఁ గని కని యొకమఱి, మెలఁతలతో నిట్టు లనియె ౹ మీ రిచటికి రా
వల దింకిట ననుఁ జూచినఁ, గలుగుంజుఁడి తత్క్షణంబ ౹ గర్భము మీకున్. 19

క. అని నియతి సేయుటయు న,మ్మునిపలుకులు కన్యకాస౹మూహం బెల్లన్
విని యాయిరువునఁ జేరక, చన నం దొక్కర్తు విధివ౹శంబున వినమిన్. 20

ఉ. ముందటియట్ల నెచ్చెలుల ౹ మొత్తములోపలఁ గూడి యాడువే
డ్కం దరలాతఁ వోయి యచ౹ట న్మునియాకృతితోడ దృగ్రుచుల్
పొందినమాత్ర మై నెలఁత ౹ పొక్కిటితో విరియ న్వళు ల్దరం
బందము గాఁగ నారును గు౹చాగ్రములు న్మనుఁగప్పుసొంపు నై. 21

ఉ. గర్భముఁ దాల్చి మై గలయఁ ౹ గన్గొని వెక్కసపాటు మున్నుగా
దుర్భర మైనసంభ్రమము౹తోడ విషాదభయానుతాపముల్
నిర్భరభంగిఁ బుట్టి తన౹నెమ్మది దీఁటుకొనంగ జోటి యా
విర్భవదార్తి యై చనియె ౹ వేగమ యాత్మనివాసభూమికిన్. 22

క. అరుగుటయుఁ జూచి మది న,చ్చెరువడి తృణబిందుఁ డల్లఁ ౹ జేరఁ బిలిచి ని
ర్భరగర్భచిహ్నములుగా, నిరూపణముచేసి యవ్వ౹నిత కిట్లనియెన్. 23

ఉ. అక్కట కన్యకాత్వ మిటు ౹ లాఁడివోవ నకారణంబ నీ
కెక్కడిమాలు వచ్చె నిది ౹ యెయ్యెడ నెమ్మెయిఁ బుట్టె నన్న నా
వెక్కుచు మాట దొట్రుపడ ౹ వెల్వెలఁ బాఱుచుఁ గ్రమ్ముకన్నునీ
రక్కుపయిన్ వెసం దొరఁగ ౹ నామృగలోచన తండ్రి కిట్లనున్. 24

క. చెలులకడ నాడు వేడుకఁ, బులస్త్యమునియాశ్రమంబు ౹ పొంతకుఁ జని య
ప్పొలఁతులఁ గానక యయ్యెడఁ, గలయం బరికించు చుండ౹గర్భము దోఁచెన్.

ఉ. నాయెడ లేన కన్గొని మ౹నంబున బెగ్గల మంది యత్తఱిం
జేయునుపాయ మెయ్యదియుఁ ౹ జిత్తమునం దలపోయ లేక నా
కీయకృతంబు వాటిలుట ౹ యేర్పడ నీ కెఱిఁగింపఁ గోరి వే
వే యిటు పాఱుతెంచితి వి౹వేకనిధీ ననుఁ గావు నావుడున్. 26

క. ఆరాజర్షియు దీనికిఁ, గారణ మమ్మునియ కాఁ ప్ర౹కాశజ్ఞానో
దారమతి నెఱిఁగి కన్నియ, గారవమునఁ గొని పులస్త్యు౹కడకుం జనియెన్. 27

చ. చని మునినాథ యుత్తరుణి౹సాధ్వి గుణాన్విత నాదుకూర్మినం
దని నిగృహీతచిత్తుఁడఁ గదా యని త్రోవక దీని నాదరం
బునఁ బరిచర్యకుఁ గొమ్మనినఁ ౹ బొల్తుక నర్థిఁ బరిగ్రహించి యా
తనిఁ జరితార్థుఁ జేసె నుచి౹తమ్మున నమ్ముని ధర్మవేది యై. 28

చ. అది మొద లాలతాంగి వినయంబున వల్లభచిత్తవృత్తి స
మ్మదము దలిర్ప భక్తిగరిమంబునఁ బెంపు వహించి యుండఁ గొ
న్నిదినము లంతఁ బోయిన మునిప్రవరుండు ప్రసన్నుఁ డై దయా
స్పదసదపాంగవీక్షణము భామినిపైఁ బొలయంగ నిట్లనున్. 29

క. తరుణీ భక్తికి మెచ్చితి, వర మిచ్చెద నీకు విను భవద్గర్భము భా
స్కరతేజుం డగుకొడుకై, వెరవరి యయ్యెడును సకలవిద్యలయందున్. 30

క. ప్రశ్రయవతి వగునీచే, విశ్రుత మై గుణసమృద్ధి వెలయుట వాఁడున్
విశ్రవసుం డనఁగా భువనశ్రావ్యం బైనభవ్యనామము వడయున్. 31

క. మన రెండువంశములుఁ జేర్కొనఁ గను నీకొడుకువలనఁ గోమలి యనినన్
విని సంతసిల్లి యట్టుల, తనయుని జనకోపమానుఁ దడయక కాంచెన్. 32

శా. పౌలస్త్యుం డుదయించి నిర్మలకళాస్ఫారీభవన్మూర్తి యై
బాలేందుం బ్రహసించుచుం బెరిఁగి యల్పం బైనకాలంబునం
జాలం గీర్తన కెక్కి యుజ్జ్వలతపస్సంపత్తిఁ బెంపారి ధ
ర్మాలోకంబున లోకము ల్వెలుఁగ నార్యశ్లాఘ్యుఁ డై యున్నెడన్. 33

క. తేజోధనుఁ డగునమ్ముని, రాజితగుణజాలములకు రాగిల్లి సుతం
బూజాపూర్వముగ భర, ద్వాజుం డాతనికి దేవవర్ణిని నిచ్చెన్. 34

ఉ. విశ్రవసుండు నమ్ముదిత వేడుకతోడ వివాహ మై గృహ
స్థాశ్రమధర్మ మొప్పెసఁగ యజ్ఞసమృద్ధి వహించుచుం గృపా
విశ్రుతబుద్ధిసంపద వివేకవిశుద్ధి ప్రసిద్ధి కెక్క భ
వ్యశ్రుతిచోదితాచరణమాభరణంబుగ నిత్యపుణ్యుఁ డై. 35

వైశ్రవణుని వృత్తాంతము.

క. ఆరమణియందుఁ గులవి,స్తారకుఁ డగుతనయుఁ బడసి తత్సంతాన
శ్రీరమ్యతఁ గొరెదుసర,సీరుహసంభవుని సంతసిల్లఁగఁ జేసెన్. 36

ఉ. తత్సమయంబున న్మునివితానము గొల్వఁగ వచ్చి యెంతయున్
వత్సలతం గుమారునకు వైశ్రవణుం డనుపేరు వెట్టి య
త్యుత్సుకవృత్తి నెత్తికొనియుం గొనియాడియు నట్లు పుత్త్రపౌ
త్త్రోత్సవ మాచరించెఁ గమలోద్భవుఁ డుత్కటహర్షమూర్తి యై. 37

క. ఆవైశ్రవణుఁ డఖిలవి,ద్యావిదుఁ డై యావనమునఁ దప మొనరించెన్
దేవాసురసిద్ధమునీంద్రావళి తనధర్మనియతి కచ్చెరువందన్. 38

క. నీరాహారసమీరా,హారంబులఁ జేసి చేసి యది గాక కడున్
ఘోరం బగుతపము నిరా,హారుం డై చేసె బహుసహస్రాబ్దంబుల్. 39

క. నిష్ఠ మెయి నిట్లు వ్రతము ల,నుష్ఠింపఁగ సౌమ్యదర్శనుం డయి యమర
శ్రేష్ఠనివహమ్ముతోఁ బర,మేష్ఠి యరుగుదెంచెఁ దత్సమీహిత మొసఁగన్. 40

చ. ముదమున నేగుదెంచి తనముందట నిల్చినశంభుఁ గాంచి త
త్పదసరసీరుహంబులయుపాంతమునన్ ధరఁ జాఁగి మ్రొక్కి నె
న్నుదుటను మోడ్పుఁగేలును దనుద్యుతియుం బులకాంకురంబులున్
హృదయముభక్తిపెంపుఁ బెరయించుచు వైశ్రవణుండు నిల్చినన్. 41

ఉ. వత్స భవత్తపోనవదివాకరుఁ గాంచి వికాస మొందె నా
హృత్సరసీరుహంబు వర మిచ్చెద నిష్టము గోరు నావుడున్
వత్సలుఁ డైనపద్మభవు వైశ్రవణుండు సముజ్జ్వలార్థసం
పత్సముదాయనిత్యసుఖభవ్యదిగీశత వేఁడె వేఁడినన్. 42

ఉ. అక్కమలాసనుండు వరుణాంతకజిష్ణులఁ జూచి మీకుఁ దో
డొక్కని దిక్పతిత్వపదయోగ్యుని నే సృజియింప నున్నచో
గ్రక్కున నీతఁడుం దదభికాంక్షయ చేసెఁ దగంగ నింక మీ
రొక్కటి నై జగం బరయుచుండుఁడు నాలవవానిఁ జేసితిన్. 43

చ. అని వర మిచ్చి వైశ్రవణునాదరవిస్తృతనేత్రపద్ముఁ డై
కనుఁగొని నిర్జరత్వపదగౌరవనిత్యుఁడ వైతి గాన నీ
కనుగుణ మైనయీరుచిరయానముఁ గొమ్మని యిచ్చెఁ బుష్పకం
బనఁగఁ బ్రసిద్ధ మై మణిమయాకృతి నొప్పు విమానరత్నమున్. 44

ఆ. ఇవ్విధమున నిచ్చి యింద్రాదిసురులతో,నజుఁడు వోవుటయు ధనాధిపతియుఁ
దండ్రికడకు వచ్చి తత్పదాబ్జములకు,నెరఁగి భక్తియుక్తి నెదుర నిలిచి. 45

క. కోరినవరము విమానము, గారవమున నాకుఁ గమలగర్భుఁ డొసంగెన్
మీరలు నివాసదేశముఁ, గారుణ్యము సేయుఁ డనినఁ గడువేడుకతోన్. 46

క. ఆవిశ్రవసుఁడు తనదుప్ర,భావంబున నెల్లయెడలుఁ బరికించి తదీ
యావాసయోగ్యముగ మది, భావించి ముదమున నర్థపతి కిట్లనియెన్. 47

సీ. కమనీయముగ విశ్వకర్మ నిర్మించిన మున్ను దైత్యశ్రేష్ఠు లున్నపురము
జలనిధి పరిఖగాఁ గలిగినయది లంకయనఁగ లోకములఁ బేర్కొనిననెలవు
దనుజు లెల్లను జనార్దనుచేత మర్దితు లయి పోఁక జేసి పాడయ్యె నయ్యు
రమ్యనికేతనారామాభిరామ మై యుల్లసిల్లెడు సుఖ ముండు మచట

ఆ. ననిన నట్ల కాక యని తండ్రి వీడ్కొని, బహువిధానురూపపరిజనములు
వొదివి కొలువ నతఁడుపుష్పకంబునఁ జని, యందు దివ్యసుఖములనుభవించె.

క. జనకునకు మ్రొక్కఁ బోవుచు, ననిమిషవల్లభునికడకు నరుగుచుఁ గమలా
సనుఁ గొలువఁ జనుచు విహరిం,చె నిజేచ్ఛం బుష్పకమున సిద్ధపదమునన్. 49

చ. అన విని కుంభసంభవమహామునితో రఘువంశనాథుఁ డి
ట్లనియె మునీంద్ర మున్ను నసురాధిపు లేలెడివీడె లంక త

జ్జననతపోవిభూతిబలసత్త్వచరిత్రవిశేషము ల్జనా
ర్దనుదెస హాని పుట్టినవిధంబు వినం గడు వేడు కయ్యెడున్. 50

క. ఆతనికి మనయెఱింగిన, యీాతనికిని దారతమ్య మెట్టిదియో మీా
చేత నెఱుంగవలయు నఱ,చేత నిడినయట్లు దెలియఁ జెప్పు మునీంద్రా. 51

క. జనపతి తన్నట్లడిగిన, మునినాథుం డధికహర్షమునఁ బలికె దశా
ననదర్పదళన యేర్పడ, విను చెప్పెద నంతయును సవిస్తారముగాన్. 52

సుకేశునివృత్తాంతము.

క. హేతిప్రహేతు లనఁ బ్రఖ్యాతు లుదయమైరి రాక్షసాన్వయమున నా
హేతి గృహస్థుం డయ్యెఁ బ్రహేతి తపంబునకుఁ జనియె నెంతయు శాంతిన్.

ఆ అంబుజాక్షి కాలుఁ డనువానిచెలియలు, హేతిరమణి యైననాతి యొక్క
తనయుఁ గాంచె వీతవినయు విద్యుత్కేశు, నతులబలపరాక్రమైకరసికు. 54

చ. అతఁ డభిరాముఁ డై పెరిగి యౌవనసంపద నుల్లసిల్లుచుం
బ్రతి యిడరానిరూపమునఁ బ్రస్తుతి కెక్కి వివాహ మయ్యె వి
శ్రుతముగ సంధ్య నాఁ బరఁగు సుందరికూరిమిపుత్త్రి మన్మథా
స్త్రతులితగాత్రయష్టి యగు సాలకటంకటసమ్మదమ్మునన్. 55

క. ఆలలన యౌవనంబునఁ, జూలాలై వగచి తుదిఁ బ్రసూతిక్రియకుం
గాలం బగుటయు మందర, శైలతటంబునకు నొంటి సని యచ్చోటన్. 56

ఆ. వరతనూజుఁ గాంచి కరుణావిహీన యై, విడిచి వైచి వచ్చి విభునితోడ
వివిధకేళిఁ దేలి విహరించు చుండె మ,న్మథవికారపూరమగ్న యగుచు. 57

క. అంత నట నక్కుమారుం, డెంతయుఁ గరుణమ్ము దోఁప నేడ్చుచు నుండం
గొంతవడికి భూతేశుఁడు, కాంతాసహితంబు వృషభగమనుం డగుచున్. 58

క. ఆచక్కటిఁ గ్రీడార్థం, బై చని యాయేడ్పు విని దయార్ద్రిత బాలుం
జూచి యకటకట యని గౌ,రీచారుముఖాంబుజము నిరీక్షించు చౌగిన్. 59

మ. అతివా వీనికిఁ దండ్రితోడిసరిప్రాయం బాసురత్వంబు ను
ద్ధతబాహాబలగర్వనిర్వహణముల్ దైతేయవంశక్రమా
గతరాజ్యంబు నభశ్చరంపుఁబురముం గ్రామప్రచారంబు ని
చ్చితి నీచిత్త మెఱింగి నావుడుఁ గృపాశ్రీపారవశ్యంబునన్. 60

క. అప్పుడ గర్భం బగుటయు, నప్పుడ జన్మించుటయును నప్పుడ ప్రాయం
బొప్పెడిజవ్వన మగుటయు, నప్పుడు దనుజాన్వయమున కంబిక యిచ్చెన్. 61

క. కేశములు లెస్స యిప్పిశి,తాశనునకు ననుచుఁ గౌతుకాన్వితమతి యై
యీాశానుఁడు గావించె సు,కేశుం డనుపేరు వానికిం బ్రకటముగన్. 62

చ. అతఁడు వరప్రసాదమహిమాతిశయంబునఁ జేసి విష్టప
త్రితయము గీడ్వడం చనదు తేజము చెల్లుచునుండ లీల న

ప్రతిహతవృత్తి నెల్లెడ న।భశ్చర మైనపురంబుతోడ నం
చితగతులం జరించె విల।సిల్లుచు నీశ్వరలాలనీయుఁ డై. 63

క. ఉన్న యెడ నాసుకేశుమ,హోన్నతి కెద నోటువడి వ।యోరూపగుణో
త్పన్నానురూపమతిఁ దన, కన్నియ దేవమణి నిచ్చె । గ్రామణి ప్రీతిన్. 64

మాల్యవదాదులు తపంబుచే బ్రహ్మవలన వరంబులు వడయుట.

తే. ఇట్లు గంధర్వవల్లభుఁ । డెలమి గూఁతుఁ
దనకు నిచ్చిన వరియించి । దానివలన
మాల్యవంతుఁ డనంగ సు।మాలి యనఁగ
మాలి యనఁ గాంచెఁ గొడుకుల।మహితయశుల. 65

ఉ. ఇవ్విధిఁ బుట్టి తండ్రి పర।మేశువరంబున నద్భుతస్థితిం
జవ్వన మాదిగా నఖిల।సంపదలుం గను టెల్ల విన్కి నా
మువ్వురు నుత్సహించి తప।ముం బరమేష్ఠి గుఱించి చేయఁగా
నవ్విబుధాచలంబునకు । నర్థి నెయిం జని సువ్రతస్థు లై. 66

ఉ. ఆర్జవశాంతిదాంతినియ।మాదిగరిష్ఠగుణైకనిష్ఠ మై
నిర్జితచిత్తవృత్తు లయి । నిర్మలధర్మపరంపరాప్రభా
వార్జన మెల్లలోకములు । నద్భుత మందుచు సంస్తుతింప నా
వర్జితబుద్ధిఁ జేసి రన।వద్యతపంబునఁ బద్మసంభవున్. 67

శా. ప్రత్యక్షం బయి దేవబృందములతోఁ । బద్మాసనుం డర్థి నా
దిత్యాద్రిస్థలి నిల్చి పొల్చుటయు దై।తేయాత్మజు ల్సంభ్రమ
ప్రీత్యుత్కర్షము లంతరంగముల ఘూర్ణిల్లంగ సర్వాంగసాం
గత్యస్వీకృతభూతలం బగునమ।స్కారంబునం బుణ్యు లై. 68

క. కరకమలయుగళపుటశే,ఖరులును భక్తిభరనమ్ర।గాత్రులు నై ని
ల్చిరి వరదానౌత్సుక్య, స్ఫురితాధరుఁ డైనపద్మ।జునికట్టెదురన్. 69

ఉ. అత్తఱి వారిఁ జూచి కరు।ణార్ద్రిత ని ట్లనియె న్విరించి దై
త్యోత్తములార మీతపము । నుగ్రత కచ్చెరు వంది వచ్చితిం
జిత్తములందు మీ రభిల।షించినయట్టివరంబు లెల్ల నే
నిత్తుఁ గడంగి కోరికొనుఁ । డిప్పుడ దేవమునీంద్రసన్నిధిన్. 70

ఉ. నావుడుఁ బొంగి యద్దనుజ।నందను లి ట్లని రేకవాక్యు లై
దైవతయక్షకింపురుష।దానవమానవకిన్నరాదినా
నావిధభూతకోటుల ర।ణంబున గెల్వఁ బరస్పరప్రమో
దావహ మైననెయ్యముఁ జి।రాయురవాప్తియు మాకభీష్టముల్. 71

తే. ఇవ్విధంబునఁ గోరిన।నెలమిఁ బొంది
యట్ల కావుత మని కమ।లాసనుండు

వాసవాదులు వెఱఁగంద వరము లొసఁగి
మునులు గొలువ నిజావాసమునకుఁ జనియె. 72

— మాల్యవంతుఁడు లంకయందు నివసించుట. —

చ. వరములు గాంచి బాహుబలవంతుఁ డనం దగుమాల్యవంతుఁ డ
చ్చెరు వగువిక్రమంబునఁ బ్రసిద్ధి వహించి నిజానుజన్ములం
గర మనురక్తి మన్ననఁ దగం గొనియాడుచు సర్వలోకభీ
కరుఁ డయి దేవతామునినికాయము దల్లడ మందుచుండఁగన్. 73

క. దానవలక్ష్మీవిభవ మ,నూనంబై నెగడ నసదృశోద్ధతగతి నెం
దేనిం జని విహరించుచుఁ, దా నొక్కెడ విశ్వకర్మఁ దద్దయుఁ బ్రీతిన్. 74

క. రావించి యిట్టు లనియెను, దేవతలకు నెల్ల నీ వతిస్థిరమతి వై
కావింతు నివాసము లొక, యావాసము మా కొనర్పు మభిరామముగాన్.

తే. అదియు రజతాద్రి నొండె హిమాచలమున
నొండె మందరనగమున నొండె బాగు
చూచి నీశిల్ప మేర్పడ శుభగరత్న
సంపదుజ్జ్వలముగ రచియింపవలయు. 76

క. అని తనతోఁ జెప్పినయ, ద్దనుజపతికి విశ్వకర్మ తాఁ దొల్లి సురేం
ద్రునియనుమతమున దక్షిణ,వననిధిలో నొక్కపురము వర్ణన కెక్కన్. 77

క. ఒనరించుటయుఁ ద్రికూటం, బనుసున్నతభూధరంబునం దది శతయో
జనవిస్తీర్ణం బగుటయుఁ, గనకప్రాకారసప్తకము గల్గుటయున్. 78

సీ. అఖిలదిక్కులును సమ్ముఖములయగుటయు మందిరమ్ములు రత్నమయము లగుట
గోపురావళి నభోవ్యాపిని యగుటయు మార్గముల్ మృదుకుట్టిమమ్ము లగుట
తోరణోత్కరము రత్నారూఢ మగుటయు నంగణంబులు మనోహరములగుట
దేవాలయంబులు దివ్యంబు లగుటయు నాపణవ్రాతంబు హైమ మగుట

ఆ. పేరు లంక యగుట యారామకేదార, కమలషండదీర్ఘికావిభూతి
పాత్ర మగుట ప్రబలశత్రుపరాక్రమా, గమ్య మగుట చాలరమ్య మగుట.

క. ఎఱిఁగించి మీకు నునికికి, నొఱపు సకలదైత్యకోటియును మీరలు నే
ర్తెఱఁ జని యం దుండుఁడు గడు,నుఱవని నెయ్యంపుసముచితోక్తులఁ దెలుపన్.

క. దనుజపతి లంకకందువ, గని నిధి నిఱుపేదవాఁడు గన్నట్లు మనం
బునఁ బొంగి యనుజసహితము, చని యప్పురి దైత్యవంశసామ్రాజ్యముగాన్.

— మాల్యవదాదులు పెండ్లిలై పుత్త్రులం గాంచుట. —

ఆ. నెగడి యున్నయెడ ననింద్యచరిత్ర గం,ధర్వి నర్మదాభిధాన ప్రీతిఁ
గోరి యిచ్చెఁ దనదు కూఁతుల ముువ్వుర, దానవేశ్వరునకుఁ దమ్ములకును.

క. క్రమమున సుందరియును గే
తుమతియు వరదయు నన న్వసుధూటీత్రయముం
దమముప్పురుఁ బూర్వజపూ
ర్వముగఁ బ్రమోదములతో వివాహం బైనన్.

సీ. అందు సుందరి యను నరవిందనయన యున్మత్తు సుప్తఘ్నుని మత్తు యజ్ఞ
కోపు దుర్ముఖుని విరూపాక్షు వజ్రముష్టిని గని పుత్త్రికననలఁ గనియె
నా కేతుమతియు ధూమ్రాక్షుఁ బ్రహస్తుఁ గంపనుఁ గాలకార్ముకు భద్రదత్తు
భాసకర్ణాంకు సుపార్శ్వసంహ్రాదిని గాంచెను వరదయుఁ గైకసియును

తే. నోలిఁ గుంభీనసయును బుష్పోత్కటయును
ననఁగ నలువురు వామలోచనలఁ గనియె
ననలు నీలుని సంపాతిహరునిఁ బడసె
వరద పడపడి దానవాన్వయము వెలిఁగె. 84

మాల్యవంతుఁడు లోకంబుల బాధించుట.

శా. సంతానం బభివృద్ధి నొందిన బలోత్సాహం బెలర్పం బలా
క్రాంతాశేషదిగంతుఁ డై బలువిడిన్ రక్షోగణేశుండు దు
ర్దాంతుం డై శ్రుతిబాధ సేయుచుఁ గ్రతుధ్వంసంబుఁ గావించుచుం
గాంతాగాంతరవాసు లైనమునులం గారించుచుం గ్రూరుఁ డై. 85

మ. పరనారీహరణం బొనర్చు వివిధోపాయంబుల న్మేదినీ
సురవర్గంబుల నొంచు దేవగృహసంశోభాభిఘాతంబు సే
యు రవీందుద్యుతిజాలము ల్మలుపు మాయోపాయకేళీకృతా
దరుఁ డై నిర్జరకోటిఁ గష్టపఱుచున్ ధర్మంబు నష్టంబుగాన్. 86

ఇంద్రాదులు హరునను జ్ఞచే విష్ణువును వేఁడుట.

చ. ఋషులును దేవతాగణము లెంతయు బెగ్గల మంది యార్తు లై
వృషగమనుండు దీర్చు మనవేదన యంచు మహేశుఁ గాంచి దు
ర్విషహము లైనయాపరిభవించుట లెల్ల నెఱుంగఁ జెప్పి ని
స్తుషముగ దైత్యవర్గములఁ ద్రుంపఁగఁ గోరిరి దైన్య మేర్పడన్. 87

చ. హరుఁడు సుకేశుమీఁదికృప నాతనిసంతతి కల్గ కుండియున్
సురమునివృత్తభంగములు చూడఁగఁ జాలక యేను నేర నా
హరికడ కేగుఁ డాతఁ డభయం బొసఁగున్ దయ మీకు నన్నఁ జె
చ్చెరఁ జని శౌరి కంతయును జెప్పి రరాతులజన్మ మాదిగాన్. 88

శా. గోవిందుండు దయామతిం బలికె నాకుం జెప్పఁగా నేల రు
ద్రావిర్భావితశక్తి నే నెఱుఁగనే యాదైత్యుఁ డత్పుత్త్రకుల్
భావారూఢులు గారె పద్మజవరప్రాప్తానుభావు ల్తదీ
యావాసం బగులంక వింతయె త్రిలోకాక్రోశ మాలింపనే. 89

ఉ. ఐనను మీమతం బెఱుఁగు నంతకు నేమియుఁ జేయనైతి న
ద్దానవులన్ సముజ్జ్వలసుదర్శననిర్దళితాఖిలాంగులం
గా నొనరించి లోకముల కల్మష మంతయుఁ బాచి యుత్సవ
శ్రీనినుపారఁ జేసెద విరించిమహేశులు సమ్మతింపఁగన్. 90

మాల్యవదాదు లమరావతిపై దండెత్తుట.

క. అని వీడ్కొల్పిన మోదం,బునఁ బొందుచు నిజనివాసములకు శతమఖా
ద్యనిమిషులుఋషులుఁబోయిన,యనంతరము మాల్యవంతుఁడంతయువినియెన్.

క. విని యెక్కింత వగచి య, ద్దనుజేంద్రుఁడు విక్రమైకతత్పరుఁ డగుచున్
మనమున గర్వము గదురఁగ, ననుజుల రావించి యిట్టులనియెఁ గుపితుఁడై.

మ. మనలన్ ధూర్జటితోడ గోసడిచి కామధ్వంసి పట్టీక పొం
దని చక్రాంకునిఁ జూపి పోవిడ సురేంద్రాదు ల్సరోజాక్షునిం
గని యెగ్గు ల్ప్రకటించినం గినిసి లోకంబు ల్వినంగా నతం
డనుమానింపక పూనె దైత్యకులసంహారంబుఁ గావింపఁగాన్. 93

ఉ. పూర్వమునన్ హిరణ్యకశిపుప్రభృతుల్ దనచేతఁ జచ్చినన్
గర్వము మీఱి యున్కి మురఘస్మరుఁ డెట్లుఁ గడంగు నాతనిన్
సర్వజగంబులున్ బెదర సంగరరంగమునన్ జయించి హృ
త్పర్వ మొనర్పఁగావలయు దైత్యులకు న్మన మెల్లభంగులన్. 94

క. అనిన సుమాలియు మాలియు, నని రతఁ డిట వచ్చె నేని నదె యయ్యెడు న
య్యనిమిషు లెగ్గులు మనపైఁ, బొనరించినదాన నింత పుట్టెను గంటే. 95

క. కావున నమరావతిపైఁ, బోవలయుం జుట్టుముట్టి పోరిగొని పిదపన్
దేవతలపక్షమై యని, కేవీరుఁడుఁ గడఁగెనేని నెఱుఁగుద మతనిన్. 96

ఆ. అనిన మాల్యవంతుఁడగుఁ బోలు నిదియని,న్వయన మపుడచాటఁబంచి కదలి
యమితవివిధవాహనారూఢయోధపీ, రోద్ధతముగ నడిచె నుద్ధవిడిని. 97

ఉ. అత్తఱిఁ గెంపు మీఱెనఘనావళి యాకస మెల్లఁ గప్పి క్రొ
న్నెత్తురు నెమ్ములుం గురిసె నీరధి యెంతయు ఘూర్ణమానమై
యుత్తల మొందెఁ బర్వతము లొక్కమొగిం గదలెన్మహోల్కముల్
మొత్తముగట్టి రాలె బలము ల్వెఱఁ గందఁగ జేటు దెల్పుచున్. 98

ఉ. అంతయుఁ జూచియున్ దితిసుతాధిపుఁ డప్పు మనంబులోన నా
వంతయుఁ గొంకు లేక దివిజావళికిన్ మనచేయుహానికై
యెంతలు పుట్టెఁ జూడుఁ డని యేడ్తెఱఁ జూపుచుఁ దమ్ములన్ బలం
బంతటికిం బురస్సరుల నైచనుఁ డంచుఁ బరాక్రమోన్నతిన్. 99

క. చెలఁగుచు నమరావతి కిం, పలరంగ నడచు ఱెఱఁగి భయభ్రాంతి మెయిం
గలఁగఁగఁ బాఱె మహేంద్రా,దులు పుచ్చి రుపేంద్రుకడకు దూతం గడఁకన్.

ఆశ్వాసాంతము.

ఉ. కాయికవాచికాత్మికవికారవిసర్జనవిస్ఫురత్తనూ
దాయకు నానతారివసుధావరహర్షరసప్రకర్షసం
ధాయకు సూరిశోభనవిధాయకు నుద్భటరాజదుర్దశా
దాయకుఁ గీర్తివస్త్రపరిధాయకు దీనజనార్థదాయకున్. 101

క. పాండిత్యసుభగుఁ ద్రిభువన, పెండేరు నరాతిభూపభీషణబాహా
దండాభిరాము రామా, మండలచిత్తాపహారిమకరపతాకున్. 102

మాలినీవృత్తము. సకలజనమనోజ్ఞుం । జండభాషానభిజ్ఞుం
బ్రకృతిఘటితరాగుం । బ్రస్ఫురత్త్యాగభోగుం
జకితనృపశరణ్యుం । జారులావణ్యగణ్యుం
బ్రకటసుగుణసంగుఁ । రాయవేశ్యాభుజంగున్. 103

గద్యము. ఇది శ్రీమదుభయకవిమిత్ర కొమ్మనామాత్యపుత్త్ర బుధారాధనవిధేయ
తిక్కననామధేయప్రణీతం బయినయుత్తరరామాయణం బనుమహాకావ్యంబు
నందు ద్వితీయాశ్వాసము.

శ్రీ ర స్తు.

నిర్వచనోత్తరరామాయణము

తృతీయాశ్వాసము.

రమ్యతానిరూఢమ
హారస్కుం బుణ్యసంపదుదితయశస్కుం
గారుణ్యార్ద్రమనస్కుఁ బ్ర
జారంజనశీలు మనుమహాజగతీపాలున్. 1

విష్ణువు దేవతలకుఁ దోడ్పడి రాక్షసులతో యుద్ధము సేయుట.

చ. హరిఁ గని దేవదూత చరణానతుఁడై యసురేంద్రసేన ని
ర్జరనగరంబుపైఁ బెలుచ రాకయు నాకము బెగ్గలంబునం
దిరుగుడుపాటుఁ జెప్పిన నతిత్వరితంబునఁ గౌతుకంబుమై
గరుడుని నెక్కి శార్ఙ్గగుణగాఢరవంబు నభంబు నిండఁగాన్. 2

క. రక్షోవధయును సుమనో, రక్షయు మదిఁ గోరి యాదరంబున రాజీ
వాక్షుఁడు సిద్ధులజయశ, బ్దాక్షరములఁ గిన్నరీచయముగానంబున్. 3

క. కొంచెపునగవుల సంభా, వించుచు వివిధాయుధాంశువితతుల్ దిశలన్
నించుచు దనుజతమముఁ దూ, లించుచు రణకేళిలోలలీలం జనుచోన్. 4

క. గరుడునిపై శార్ఙ్గధను, ర్ధరుఁ డగువిష్ణుండు మేరుతటిఁ బొల్చుతటి
త్పరివృతజలదముఁ బోలుట, విరియ దనుజరాజహంసవితతి యితనికిన్. 5

మ. అని బృందారకవందిబృందము లమందానందముం బొంది కీ
ర్తన సేయం ద్రిదివంబు ముట్టికొన సుద్దామప్రతాపంబున
న్దనుజానీకము చేర కుండ నడుమ న్వారింపఁగాఁ బూని చ
య్యన నేగెం బతగేంద్రపక్షపవనవ్యాధూతదిగ్భిత్తి యై. 6

మ. చని నాకంబున కడ్డపడ్డ హరియుత్సాహంబు వీక్షించి య
ద్దనుజాధీశుఁడు చేయి వీచుటయు మాద్యద్దంతివర్గంబు న
శ్వనికాయంబుఁ బదాతిలోకము రథవ్రాతంబు నొక్కుమ్మడిన్
ఘనమార్గం బఖిలంబు గప్పి పడగల్ గ్రాలన్ వడిం దాఁకినన్. 7

తే. మందహాసంబు చేసి యమందరవము, మిగిలి రిపుతూర్యరవముల మ్రోఁగికొనఁగఁ

పాంచజన్యంబుఁ బెలుచఁ బూరించి శార్ఙ్గ,గుణముసారించి దానవగణముఁ జూచి. 8

క. కడఁకఁ దలమీఱి యల వేర్పడ మును దలపడఁ దలంచి పఱతేరంగా
విడుచుచు నొక్కొక్కయమ్మున, బడ నేయుచు వచ్చె వీరభటులం గడిమిన్. 9

చ. తొలితొలి పడ్డపీనుఁగులఁ ద్రొక్కుచు నొండొరు మీఱఁ జూచున
గ్గలికఁ గడంగి బాహుబలగర్వము చూపలు మెచ్చ నుగ్రదై
త్యులు దలపడ్డ వారిసమరోద్ధతి కుత్సన మంది శార్ఙ్గమం
దలవున నిల్వరించె నిశితాస్త్రము లూఁ తయి వ్రాలునట్లుగన్. 10

ఉ. కూలినవారిఁ జూచి వెడఁగొంకిన మెచ్చక మున్న వెన్నుగా
నేలకుఁ జొచ్చువారుఁ దమనెయ్యుర కడ్డము వచ్చువారు ను
క్కీలయి నేర్పులేక తమకించి పయింబడి నొచ్చువారు మున్
వాలినమచ్చరం బగుటవారణసేయక వచ్చువారు నై. 11

క. దానవు లేయుచు వైచుచు, సేనలఁ బురికొల్పుకొనుచుఁ జేరిన శార్ఙ్గ
జ్యానాదభరితరోదసి, యై నారాయణుఁడు మార్గణాంబుధి ముంచెన్. 12

చ. మునుమును వీఁకఁ దాఁకి యొకమోహర మచ్యుతుచేత మ్రగ్గటన్
మొదలు గలంగినం గని సముద్ధతవృత్తి నదల్చి వెన్నుద
న్ని నిలిచె దానవేశ్వరుఁడు నెక్కొనఁగాఁ దనముద్దుఁదమ్ములున్
దనయులు దండనాథులు నుదగ్రత సేనకు దర్ప మెక్కఁగన్. 13

క. బరవసమునఁ గొత్తలచే, సిరి పురికొని కడఁగి దైత్యసేనలు మగుడన్
హరిఁ బొదిసెఁ జపలజలదో,త్కర మతిసాంద్రముగ నభముఁగప్పినభంగిన్.

ఆ. ఓరలేక దొరలు పోరికిఁ జొచ్చిరి, కడిఁదిమగలఁ బేసు కలుగువారు
నదరి ముట్టఁ గవిసిరరవాయిగొనక కో,లాహలముగఁ గాల్బలమ్ము గదిసి.

క. శరములఁ జక్రంబులఁ దో,మరములఁ గుంతముల గుప్పిసోనగ ఖడ్గ
క్షురికా హల పరిఘామ్ము,ద్గర ముసల పరశ్వధములఁగప్పిరి కడిమిన్. 16

శా. సర్వారాతిపయి న్నిజాంగముల పైఁ జంచద్భుజాభీలతన్
దర్పం బేర్పడ నొక్కపెట్ట యటు లాదైతేయవీరు ల్దిశా
సర్వద్దీప్తిసటాజటాలపటుశస్త్రవ్రాతముల్ సాంద్రమై
యూర్పోవకుండఁగ నించిరన్ మురహరుం డుద్దామకోపాగ్ని యై. 17

చ గుణమున లస్తకంబుననుగోటియుగంబునఁ గేలఁ దారభీ
షణముగ నుప్పతిల్లి రభసంబుగ రేఁగినమాడ్కిఁ దీవ్రమా
ర్గణనికరంబు లొక్కట నరాతిబలంబులఁ గప్ప శార్ఙ్గని
క్వణనము రోదసీకుహరకర్పరముం బగిలింప నుగ్రతన్. 18

క. అరదములు రథికవరులును, హరిసారథికేతుసహిత। మై పొడిపొడి గాఁ
గరులును జోదులు డొల్లఁగఁ, దురగంబులు రావుతులును। దుత్తునియలు గాన్.

క. ఏయుచుఁ గౌమోదకిఁ గొని, వ్రేయుచు నందకమునను వి।విధగతిఁ దునియల్
సేయుచు మధుమథనుఁడు దై, తేయతతిం గూల్చె నుద్ధ।తిం బడలుపడన్. 20

చ. అడరినమేఘపంక్తి విరి।యం బటువేగమహా।నిలంబు బ
ల్విడి భయదప్రకారముగ। వీచుతెఱంగున దైత్యసైన్యముల్
సెడి నలుదిక్కులం బఱవఁ। జేసి యమందవిజృంభణంబునం
బిడుగులపిండు బిట్టులియు। పెల్లున విష్ణుఁడు శంఖ మొత్తినన్. 21

ఆ. పాఱలేక చాలు।పడ డొల్లె భటకోటి, కరులు గిరులు గూలు।కరణి మ్రొగ్గె
ఘోటకంబు లెల్ల।గుండియ లవిసి శో,ణితముఁ గ్రక్కెఁ శంఖ।నిస్వనమున. 22

చ. తదవసరంబునం బెలుచఁ। దాఁకి సుమాలి యుపేంద్రుపైఁ బటు
ప్రదరము లభ్ర మద్రిశిఖ।రంబును వారిని ముంచినట్లు పె
ల్లిదముగ నేసె దైత్యులు చ।లింపక సంగరకాంక్షఁ గ్రమ్మఱం
బొదువ సహోదరు ల్ప్రియమద।పూరితచిత్తులు గా నుదగ్రుఁ డై. 23

క. వనజాక్షుఁడు దరహాసం,బునఁ బొదివినకినుక వక్త్ర।మున ముసుఁగువడం
దునిమెను లీల మెయిన్ గ్ర,క్కున నాతనిసూతుశిరముఁ। గ్రూరాస్త్రమునన్. 24

ఉ. సారథి వడ్డ నశ్వములు। సంచలతం బెనఁగాడి యీడ్చినం
దేరను వేది యగ్రజుఁడు। ద్రిప్పికొనం గని మాలి యడ్డ మై
బోరన వచ్చి యవ్విహగ।పుంగవకేతను నేసె నెంతయుం
గ్రూరము లైనయమ్ములను। గుర్వగ దానవు లుత్సహింపఁగన్. 25

ఉ. మాలిశరంబు లొక్క మొగి।మంచుక గప్పినమాడ్కిఁ గప్పుడుం
గూలఁగ నేసె వానిరథ।ఘోటములన్ హరి వాఁడు గ్రక్కున
శైలతటంబు డిగ్గుమృగ।నాథుక్రియన్ గద పుచ్చికొంచు నా
భీలగతిన్ రథంబు డిగి। భీమజవంబున నంట నార్చుచున్. 26

క. పఱతెంచి కదియఁబడి యే,త్తెఱ వ్రేసిన మోము దాఁకి। తిరిగె గరుడి య
త్తఱిఁ జక్రంబున హరి పెడ, మఱి వైచెను దనుజుననుజు।మస్తకము దెగన్. 27

మాల్యవంతుఁడు విష్ణువున కోడి పాతాళముఁ జొచ్చుట.

శా. మాలిం జంపిన మాల్యవంతుఁ డుదితా।మర్షప్రకర్షంబునం
గాలాగ్నిప్రతిమానుఁ డై నిజభుజా।గర్వంబు మై లీల నున్
మీలజ్జ్వాలకరాళశక్తిఁ గొని మే। మే తాఁకి వక్షస్థలిం
గీలించెం జలదంబుపై మెఱుఁగుమా।డ్కిన్ శౌరికిం జెన్ను గాన్. 28

క. ఆశక్తియె కొని క్రమ్మఱఁ, గేశవుఁ డసురేంద్రు వైవ। గిరిపైఁ బడుతీ
వ్రాశనిచాడ్పున వక్షో, దేశంబునఁ బడిన నొచ్చి। ధృతి వాటించెన్. 29

ఆ. మూర్ఛవోక నిలిచి § మూఁడు మొగంబుల, శూల మెత్తికొని క§రాళవృత్తి
నడచి నెమ్మొగమునఁ § బొడిచె నింద్రానుజు, దేవతలమనంబు § దిగ్గనంగ. 30

క. పొడిచి పిఱిఁది దెసకయి పో,యెడిదానవు ప్రేసె గద మహీంధరుఁడు గడున్
వడిఁ బక్షంబులఁ బొరిఁబొరి, నడిచెను విహగాధిపతియు § నత్యుగ్రముగాన్. 31

సీ. గద దాఁకి మూర్ఛిల్లి § గరుడునియొఱకలగాలిచే దవ్వుగఁ § దూలిపోయి
తెప్పిఱి లేచి నల్§దిక్కులు గనుఁగొని పాఱియుఁ జచ్చియు § బయలుపడ్డ
బలములోపలఁ జేయఁ § గలవారి బంధుల దొరలను గానక § బరవసంబు
దక్కి తమ్ముండును § దాను నొండొరువులఁ జూచుచున్నంతనె § వీచె గరుడి

ఆ. పక్షమారుతమునఁ § బరిపరి యైనయా, సేనతోడఁ గూడి § దానవేంద్రుఁ
డాకులముగఁ జొరువు§టాకులచాడ్పునఁ, ద్రిప్పికొనుచు నెగసి § తెరలి పఱవ 32

క. అమ్మెయిని నోడి తానుం, దమ్ముఁడు హతశేష మైన§దానవబలముం
గ్రమ్మఱ తమవచ్చినమా,ర్గమ్మునఁ బాఱెను విహంగ§గమనుం డెగవన్. 33

మ. కడువేగంబున లంక కేగి తమదో§ర్గర్వంబు దైత్యారిచేఁ
బడి భంగంబునఁ బొందినన్ భయభర§భ్రాంతాత్ము లై యందునుం
దడయన్ బెగ్గిలి బృంద మెల్లఁ గొని పా§తాళంబు క్రిందం జొరం
బడి రా దేవమునీంద్రకోటికి నన§ల్పప్రీతి సంధిల్లఁగాన్. 34

అగస్త్యుఁడు రామునకు రావణాదులకథ దెల్పుట.

క. వనజాక్షుఁ డొకఁడు వెలిగా, దనుజుల నెవ్వరికి గెలువఁ § దలఁపఁగ నగు నిం
ద్రుని కప్పుడు తమ్ముఁడ వై, తనయుఁడ వైతిపుడు నీవు § దశరథపతికిన్. 35

ఉ. సత్త్వరజస్తమోగుణవ§శస్థితిఁ గైకొని నీవ లీల బ్ర
హ్మత్త్వము దాల్చి లోకముల § కన్నిటికిన్ జననం బొనర్తు వి
ష్ణుత్త్వము దాల్చి వానికి మ§నోజ్ఞతమస్థితి వృత్తిఁ జేర్తు రు
ద్రత్త్వము దాల్చి వాని కుచి§తంబుగ సంహృతిఁ గూర్తు రాఘవా. 36

ఉ. సాధులఁ గావ దుష్టజన§సంహరణం బొనరింప ధర్మముల్
బాధలఁ బొందకుండఁ బరి§పాలనసేయఁ దలంచి యాత్మమా
యాధృతిఁ బుట్టువుం బనుల § నాదర మొప్పఁగఁ దాల్చి పొల్పుటన్
మాధవ మర్త్యుఁ డండ్రు నిను § మందమతుల్ భవభావరూఢు లై. 37

తే. అధిపతి సాలకటంకటు§లనఁగఁ జనిన,నాఁటివారుఁ బౌలస్త్యుల§నాఁగఁ బరఁగు
నేఁటివారు సమానులు § నిక్కమరయ,బాహుబలమున నాహవ§దోహలమున.

మ. అనినన్ రాఘవకుంజరుండు మునినా§థాగ్రేసరుం జూచి యి
ట్లనియెన్ మాల్యవదాదివృత్తము ప్రసం§గాధీన మై పుట్టె నే
మును మీచే విను రావణాదులకథల్§ముట్టం బ్రశంసింపుఁ డా
తనిఁ దత్సోదరులం దనూజు వినఁ జి§త్తం బుత్సుకం బయ్యెడిన్. 39

ఆ. రాముఁ డిట్టు లడుగ నామున సెప్పెఁ బా, తాళభువనమున సమోదం బడంగి
యున్న యాసుమాలి యొకనాఁడు సౌందర్య, వినయమహితధనదతనయఁ జూచి.

ఉ. రూపగుణంబులందు ననురూపత గల్గువరుండు దీనికిం
జేపడు నొక్కొ పుత్త్రులఁ బ్రసిద్ధులఁ బల్వురఁ గాంచు నొక్కొ ల
క్ష్మీపరిణామహృద్య మగుజీవన మక్కట గల్గు నొక్కొ యి
ప్పాప మదన్వయక్రమముఁ బాత్త్రముఁ జేయు నొకో పొగడ్తకున్. 41

క. ఈలోకంబున నరసితి, మే లెల్లెడ వరునిఁ గాన మేదిని కరుగం
జాలక యున్నను బోవదు, బాలికఁ గొని పోవ వలయుఁ బరిణయమునకున్.

మ. అని యుల్లంబున నిశ్చయించి సుకుమారాకార నాకైకసిం
గొని వేడ్కన్ మహి నెల్లెడం దిరిగి రక్షోనాథుఁ డెం దైన న
ల్లునిఁ గల్యాణగుణోత్తరుం బడయ కెట్లుం బోవఁ బో మ్మంచు న
ల్లనఁ జేరెం దరుపోతకాంత మగుపౌలస్త్యాశ్రమోపాంతమున్. 43

ఆ. అచటఁ గనియెఁ దండ్రి నతిభక్తి వీడ్కొని, ఘనవిమాన మెక్కి యనుపమాన
మహిమ వెలయఁ బురికి మగుడఁ బోవఁగ ధనా, ధ్యక్షు రుచిరహారధవళవక్షు.

క. కనుఁగొని సుమాలి యితనిం, గనుమునిచంద్రునకు నిత్తుఁ గన్నియ నని సం
జనితకుతూహలుఁ డై య, వ్వనితకు నిట్లనియె గారవంపుఁబలుకులన్. 45

చ. తగినవరుండు నీకు వనితా విను విశ్రవసుండ యాతఁ డా
ర్యగుణవిభాసి యమ్మునిజనాధిపుపాలికి నీవు పోయి యిం
పుగ వరియింపు నీకనిన పుత్త్రులచేత మదన్వయంబు రూ
పగు నిదె చూచితే ఘనుఁ దదాత్మజు నుజ్జ్వలవైభవోన్నతున్! 46

ఉ. నా విని తాను మున్ మనమునం దలపోయువిధంబ తండ్రి సం
భావనఁ జెప్పినన్ వికచపద్మవిలోచన సంతసిల్లి యేఁ
బోవుట యుక్త మేని మునిపుంగవు నాశ్రమ మెద్ది పోదు నే
నావుడుఁ జూపి సమ్మదమునన్ సుత వీడ్కొలిపెన్ సుమాలియున్. 47

క. చని కైకసి పౌలస్త్యుం, గని వినయవిలాసభయవికాసవ్రీడా
జనితవికారసుభగనిజ, తనులత వెడవ్రాలఁ జతురతం బ్రణమిల్లెన్. 48

ఆ. మ్రొక్కి నిలిచి యతని ముందట మేదిని, నుంగుటమున నొరయుచున్నఁ జూచి
యెచటనుండి రాక యెవ్వనిసుత వేమి, పనికి నిందు వచ్చి తనిన నదియు. 49

ఉ. ఏను సుమాలికూఁతుర మునీశ్వర మి మ్మిటఁ దండ్రి పంపునం
గానఁగ రాక యంచు నునుగాంతి దలిర్చెడిమోము వాంచుచుం
దా నటఁ జెప్ప లేమి విదితంబుగఁ జెప్పుట యైన నంకుర
శ్రీనినుపారె విశ్రవసుచిత్తలతం గరుణాస్వరూప మై. 50

క. ముని యమ్మానినియింగిత,మును నెఱిఁగియు దివ్యబోధమున నేర్పడ నె
ల్ల నరసి యల్లనినగవున, మునింగి మృదుమధురవాక్యముల ని ట్లనియెన్. 51

చ. జనకుఁడు గోరి నిర్మలవిచారమునం దగ నిశ్చయించి ని
న్ననుమతిసేయ నీవును బ్రియంబున నియ్యెడ కేగుదెంచు టె
ల్లను నగు నాదెసం దనయలాభముఁ గోరితి వియ్యకొంటి నే
ను నకట వేళ క్రూరము తనూజులఁ గ్రూరులఁ గాంతు కామినీ. 52

చ. అనవుడు మీకృపం బడయు నాత్మజు లుగ్రులు గాఁగఁ బాడి గా
దనవుడు నీదుసంతతికి నంతకుఁ గొండొకవాఁడు శాంతుఁడై
వినయవివేకధర్మముల విశ్రుతబుద్ధి వహించు మత్కులం
బును భవదీయవంశమును బూతము సేయు సరోజలోచనా. 53

క. అని యూఱడించి ముని య,వ్వనితం గైకొనియె నదియువల్లభుచిత్తం
బునకుఁ దగుచరిత మన్ననఁ, గని సంతస మంది కొంతకాలంబునకున్. 54

క. పదితలలుం గోఱలు నిరు,వదిచేతులు నిరులు గవియు బలుమేనును గెం
పొదవిననయనంబులు నున్మద మగుహృదయంబుఁ గలతనయునిం గాంచెన్.

ఆ. కనినయప్పు డచటఁ గడు నుగ్ర మగురక్త,వృష్టి గురిసె నుల్కలష్టదిశలఁ
బడియెవఱళులఱచెఁ బిడుగులుర్వినిబడి,మ్రోసెగాడ్పుసుడిసెమానినుఁడు.

క. మునివరుఁడు వికటుఁ డగుతన,తనయుకడకు వచ్చి వదనదశకంబు గనుం
గొని వానికి దశవదనుం,డనియెడునామం బొనర్చె నాసుతుపిదపన్. 57

సీ. అధికప్రమాణసర్వాంగఘోరాకారుఁ గుంభకర్ణుం డనుకొడుకుఁ గాంచె
దంష్ట్రాపరస్పరతాడనరచితసంకుల శూర్పణఖ యనుకూఁతుఁ గనియె
నిట్టిసంతతిఁ గన్న యిమ్మహాపాతకంబునకుఁ బ్రాయశ్చిత్త మనఁగఁ బ్రీతిఁ
బడసె విభీషణుఁ బావనోజ్జ్వలమూర్తిఁ గైకసి మునికృపాగౌరవమున

ఆ. నిట్లు పుట్టి పెరుఁగునెడఁ బంక్తిముఖకుంభ,కర్ణు లెందుఁ గ్రూరకర్ము లగుచుఁ
దిరిగి జంతువుల వధింతురు ధర్మసం,ప్రీతిఁ బరఁగు నవ్విభీషణుండు. 58

ఆ. అంత నొక్కనాఁ డనంతవైభవముతో, ధనదుఁ డేగుదెంచి తండ్రిపాల
గారవమున నున్నఁ గైకసి గనుఁగొని, చిన్నవోయి కొడుకుఁ జేరఁ బిలిచి.

క. ఇతనిమహాసంపద సూ,చితె మీ రొక్కనిక పుట్టి శ్రీతేజములం
దితఁ డిట్లుండఁగ నీ వి,ట్లతిహీనత నున్నఁ బురుషుఁ డండ్రే నిన్నున్. 60

మ. తను ని ట్లాడినతల్లిమాటలకు మాత్సర్యంబు చిత్తంబునం
దనరంగా దశకంధరుం డనియె నుత్సాహంబు వాటించి యీ
తనితో సాటి యనంగ మేలన నమందశ్రీవిలాసంబు నే
కొని యీలోకము లెల్ల నేలుదును నీకుం జింత యింతేటికిన్. 61

రావణాదులు తపం బొనరించుట.

క. అని గోకర్ణమునకుఁ జని, యనుజన్ములుఁ దాను నెదలోనజు నిలిపి తపం
బొనరించి రత్తెఱం గొన,రను జెప్పెద నీవు వినుము । రఘుకులతిలకా. 62

సీ. వేసవి గనగనఁ వేఁగుచట్రాతిపై నగ్గి నల్గడ నుండ । నర్కుఁ జూచి
వానకందువను దివారాత్రములు జలధారల బయళులఁ । దడియు చుండి
సీతునఁ బెనుమంచు । శిరముపైఁ గురియంగనిష్ఠఁ గుత్తుకబంటి।నీర నిలిచి
ఫలముల వేళులఁ।బత్రంబులను నీళ్లలను గాలిఁ గాలంబు । దనరఁ గడపి
ఆ. కుంభకర్ణుఁ డిట్లు । ఘోరంబుగాఁ బది, వేలవత్సరములు । సాల నియతి
మునిగణంబు సిద్ధ।జనమును వెఱఁగంది, తన్నుఁ దగిలి పొగడఁ । దపము సేసె 63
తే. ఏకపదముననైదువే।లేఁడు లుండి, యూర్ధ్వబాహుఁడై మోమె।త్తియుండెఁ బిదప
నైదువేలేండ్లు లిట్లు మ।హాతపంబు, ప్రియము గుందక చేసె వి।భీషణుండు. 64

చ. అనుజులనిష్ఠ మెచ్చుక ద।శాననుఁ డుగ్రతపఃకుతూహలం
బునఁ ద్రిజగంబులం బొగడు । పొంపిరివోవ సహస్రవర్షముల్
సన నొకమస్తకంబుగ స।శంకతఁ దొమ్మిదివేలఁ దొమ్మిదిం
దునిమి హుతాశనుం దలలఁ । దుష్టునిఁ జేసె నజుండు మెచ్చఁగన్. 65

క. క్రమమున దశముఖుఁ డొగినొక్క ముఖమ చిక్కంగఁ బెఱము।ఖము లన్నియు న
గ్నిముఖంబున వేల్చియుఁ జిత్తమునం దొకకొంకు లేక । తద్దయు నెమ్మిన్. 66

రావణునకు బ్రహ్మ వరంబు లిచ్చుట.

చ పది యగువేయి నిండుటయుఁ । బంక్తిముఖుండు మనంబునన్ ముదం
బొదవఁగ నిర్వికారమున । నున్న శిరంబును గోయఁ జూచినన్
వదనచతుష్టయం బలర । వారిజసంభవుఁ డేగుదెంచి క
ట్టెదుర వరంబు వేఁడు మిదె । యిచ్చెద మెచ్చితి నంచు నిల్చినన్. 67

క. ధరఁ జాఁగి మ్రొక్కి దశకంధరుఁడు వినయ మొప్ప నిలిచి । తఱుగనితలపై
వెరవునఁ దనకరపద్మము, లిరువదియును మొగిచి యల్ల । నిట్లని పలికెన్. 68

శా. దేవా విన్నప మాదరింపుము భయో।ద్రేకంబునన్ మృత్యువుం
గావం గోరు బహుప్రకారముల లో।కం బంతయుం గావునన్
దేవవ్రాతవియచ్చరప్రకరదై।తేయవ్రజాదిక్రియన్
జా వేరూపున నాకు లే కునికి యి।ష్టం బాశ్రితశ్రీకరా. 69

క. ఏ నాబలవిరహితు లగు, మానవులను సరకుసేయ । మది నెన్నఁడు నీ
యానయె జగతిం దక్కటి, హీనపుజాతులకు వెఱతునే పరమేష్ఠీ. 70

చ. అని తను వేఁడినన్ సరసిజాసనుఁ డవ్వర మిచ్చి యొక్కమో
మున వినయావనమ్రుఁ డయి । ముందట నిల్చినపంక్తికంధరుం

గనుఁగొని క్రమ్మఱం దలలు గ్రక్కునఁ గల్ల ననుగ్రహించి ప్రీ
తి నొసఁగె నుజ్జ్వలంబు లగుదివ్యశరీరంబులుఁ గామరూపమున్. 71

క. వెల్లువ మించి పిదప నీ, రెల్లను వెస డొంకఁ గొలన నెసఁగెడుచంచ
త్ఫుల్లారవిందములక్రియ, నల్లన వదనములు దోఁచె నాశ్చర్యముగాన్. 72

విభీషణునకు బ్రహ్మ వరంబు లిచ్చుట.

మ. అజుఁ డిట్లద్భుతభంగిఁ బంక్తిముఖు నన్వర్థాభిధానోజ్జ్వలుం
ద్రిజగద్వీరునిఁ జేసి దుష్కరతపోనిష్ఠాప్రవృత్తిప్రకా
రజితాత్ముం డగునవ్విభీషణు వరప్రాప్త్యున్నతుం జేయఁగా
నిజబుద్ధిం దలపోసి వానిఁ గరుణాస్నిగ్ధాత్ముఁడై చూచుచున్. 73

తే. ధర్మనియతికి మెచ్చితిఁ దపము పండె, వత్స నీమది వలసినవరముఁ గోరు
మనిన భయభక్తిసంభ్రమహర్షభరిత,హృదయుఁడై యతఁ డాతని కిట్టులనియె.

ఉ. ప్రీతుఁడ నంటి నాతపము పెంపున నీవల దీని కగ్గలం
బై తగుకోర్కియుం గలదె యైనను గోరెద నామనంబు ధ
ర్మేతరవృత్తికిం జనమి యిష్టవరం బగుధర్మవర్తులై
పూతగుణాభిరాములగు పుణ్యులకుం సులభంబు లెవ్వియున్. 75

క. అనుపలుకుల కచ్చెరువడి, దనుజులలోఁ బుట్టి నీవు ధర్మంబు మనం
బునఁ గోరుట యరు దిచ్చితి, నని యజుఁ డమరత్వమును నిజాస్త్రము నిచ్చెన్.

కుంభకర్ణుని తపఃఫలము.

ఆ. ఇవ్విధమున శంభుఁ డవ్విభీషణుఁ బ్రీతుఁ, జేసి కుంభకర్ణుఁ జేరఁ బిలువఁ
దలఁచు టెఱిఁగి దేవతలు దేవ విన్నప, మవధరింపుఁ డనుచు నజునిఁ జేరి. 77

సీ. అప్సరోగణము విహారంబు సలుపంగఁ దునిమెఁ బెక్కండ్రు నందనమునందుఁ
దపములు సేయ మందరకుధరంబులో మురవడి మునులఁ బెక్కుర వధించె
నిల నెల్లయెడల ననేకభూసురులు యాగము లొనరింపఁ బ్రాణములు గొనియెఁ
దెరువుల నరుగంగ నరికట్టి చంపె నాబాలవృద్ధంబుగా బహుజనముల

తే. వేచి యాహారమున కనివేడ్క కనియు, నఖిలజీవుల నిట్లు నిత్యంబు సమయఁ
జేయు నీవరమున నిప్డు సిద్ధుఁడయిన, నితఁడు సైరించునే లోకహితవిచార.

క. కావున నీతని మోహితుఁ, గావించుట జగము లెల్లఁ గాచుట సుమ్మీ
నావుడుఁ దలఁపున భారతి, రావించిన వచ్చుడును సురజ్యేష్ఠుండున్. 79

ఆ. అసురమోమునందు వసియించి నను నిద్ర, యడుగు మనిన వాణియట్ల చేయు
దాన ననుచుఁ జనియె దానవుఁ బిలిచి నీ,కాంక్ష సెప్పు మనియెఁ గమలభవుఁడు.

క. నిద్ర దయసేయు మనియె సు,రద్రోహియు నమరవరులు రదనాంకురచం
చద్రుచులు నిగుడ నవ్వుచు,భద్రము మా కదియె యనఁగ బద్మజుఁ డిచ్చెన్.

క. ఆనేర్పుతోన వెసఁ జతు,రాననుఁడును సురలు నరిగి రవ్వాణియు దై
త్యాననముఁ బాసి పోయెను,దానవుఁడుఁ దలంచుకొని వృథాచింతనుఁ డై. 82

క. ఏరూపున నే నిట్లని, కోరితి నిది యేమి యొకో కుత్సిత మయ్యెన్
ఘోరతప మెల్ల దీనికిఁ, గారణమా సురలవలని కపటము సుమ్మా. 83

క. అని వగచుచున్న నాతనిఁ, గనుఁగొని ఖేదమునఁ బంక్తికంఠుఁడు నేరం
జనుదెంచి తానుఁ దమ్ముఁడు, ననునయ మొనరించి సముచితాలాపములన్. 84

క. కొనియాడిన నాఱవనెల,కును నొకదినమందు లేచుఁ గుడుపును గమనం
బును గల్లు నాఁడు పగతుర, కనిలోనన్ విజయుఁ డీతఁ డని యజుఁ డరగెన్.

క. వనజభవుచేత నివ్విధ,మున వరములు వడసి పంక్తిముఖుఁ డుద్ధతుఁ డై
యనుజులతో శ్లేష్మాతక,వనమున సుఖ ముండె దనుజవర్గము గొలువన్. 86

సుమాలిబోధనచే రావణుఁడు లంకను వశపఱచుకొనుట.

తే. ఇంతయును జెప్పవిని రాఘవేశ్వరుండు, మిగుల నచ్చెరువడి యటమీఁదవారి
చరిత మెట్లొకొ నావుఁడు ధరణిపతికి,నయ్యగస్త్యమునీంద్రుఁ డిట్లనియెఁ బ్రీతి.

సీ. కైకసి దీనికిఁ గడుసంతసంబునఁ దేలుచు నుండ సుమాలి తనదు
దౌహిత్రుఁ జూడఁ బాతాళలోకంబున నుండి మారీచమహోదరులును
నవ్విరూపాక్షప్రహస్తులు నాదిగా సచివులుఁ దక్కటిసైన్యపతులుఁ
గొలిచి రాఁ జనుదెంచెఁ గుంభకర్ణవిభీషణులు దోన చన దైత్యకులవిభుండు

ఆ. నెదురువోయి భక్తి నెరఁగి సమాలింగి,తాంగుఁ డై విభూతి యతిశయిల్లఁ
దననివాసమునకుఁ గొనిపోయి సముచితా,చారవిరచితోపచారుఁ డయ్యె. 88

క. వినయము దగఁ బాటించుచుఁ, దనపార్శ్వమునందు సముచితం బగురుచిరా
సనమున నాసీనుం డగు,మనుమనితో నిట్టు లను సుమాలి ప్రియమునన్. 89

శా. మావంశంబు ప్రసిద్ధిఁ బొందు హరి పోల్మాఱున్ సురేంద్రాదులం
గావన్ దానవమర్దనంబు గడఁకం గావించుటల్ మాను నా
దేవానీకముత్రుళ్లడంగు విభవోద్రేకంబు శోభిల్ల దై
త్యావాసత్వముఁ గాంచు లంక భవదీయస్ఫారవీరోద్ధతిన్. 90

శా. లంకాపట్టణ మేలి యే నసమలీలం గ్రాలి దేవేంద్రుపైఁ
గింకన్ దాడిగఁ బోయినన్ సురల రక్షింపంగ వేగంబ చ
క్రాంకుం డడ్డము వచ్చినం దెరలి దైన్యం బొంది పాతాళ మా
తంకం బేర్పడఁ జొచ్చి యం దడఁగి యింతదాఁకన్ వగం గుందుచున్. 91

క. ఉన్నంత నీవు గలిగితి, బన్నంబులు దలఁగ నింక బగఱ నోడుతు మీ
కిన్నరుఁడు రిత్త గాఁడిటు, గొన్న పురము మున్ను మగుడఁ గొనఁగావలయున్.

క. మాతామహుఁ డిటు దనకుం, జేతో ముద మంద నీతి సెప్పిన మదిలోఁ
బ్రీతుం డయ్యును దశముఖుఁ, డాతనిచిత్తంబుచందమారయుబుద్ధిన్. 93

ఆ. ధనదుఁ డగ్రజుండు తదధీన మగులంక, యాసపడుట యుచితమగునె యనిన
నధికవినయమున మహామతి యైనప్రహస్తుఁ డిట్టు లనియె నసురపతికి. 94

చ. తనయుఁడు తండ్రి యగ్రజుఁడు తమ్ముఁ డనం జనునయ్య రాజ్యముల్
గొనునెడ శౌర్యలంపటులకుం మఱి చుట్టఱికంబు గల్గునే
యను వగునంతకుం రిపు నుదగ్రత సైఁచిన నింక నూరకుం
డ నగునె వేగ పోరికిఁ గడంగుము నీభుజదర్ప మేర్పడన్. 95

క. విను మున్న దితియు దితియును, ననఁ గశ్యపుభార్య లిరువు రప్పాచెల్లెం
డ్రనిమిషుల నసురగణముం, గని రయ్యిరువురు దెఱఁగుఁ బగలు గారే తమలోన్.

ఉ. దైత్యులు దర్ప మెక్కి వసుధాతల మంతయుఁ దారవిక్రమా
ధత్యమునం గొనం గని మహిం బడఁగించి రసాతలైకసాం
గత్య మొనర్చె విష్ణుఁ డటు గావున వారలతోడివైర మా
చిత్యవిహీనమే తడవు సేయకు దాయకు నల్గు మిత్తఱిన్. 97

తే. ఇట్లు పలికినపలుకుల కియ్యకొని సు, మాలి సందియ మేటికి మాకు నెల్లఁ
బ్రభువ వీవ లంకాపురపతివి నీవ, పనుపు మొకదూత నాతనిపాలి కనిన. 98

చ. ధనదునియొద్ద కేగి యుచితంబుగఁ బల్కి పురంబుఁ బాసి పొ
మ్మని మును చెప్ప గోఱడము లాడిన మద్భుజశక్తి యంబుజా
సనవరశక్తిమూలబలశక్తియెఱుంగఁగఁ జాటి చెప్పి ర
మ్మని చతురాభిభాషణుఁ బ్రహస్తునిఁ బుచ్చె సురారి లంకకున్. 99

చ. చని యతఁ డాతనిం గని యసంభ్రముఁ డై సమయోచితంబుగా
వినయము సేసి దేవ యొకవిన్నప మిప్పురి తొల్లి దైత్యవం
శనిజనివాస మానడుమ శార్ఙ్గికతంబునఁ బాసి పోయి రా
దనుజుల దిప్డు నీయనుఁగుఁదమ్ముఁడు గ్రమ్మఱ నిన్ను వేఁడెడున్. 100

క. దశవదనుం డనుజుం డను, యశ మల్పమె నీకుఁ గిన్నరాధిప రక్షో
వశముగ లంక విడిచి యన, దృశబంధుప్రీతి సేయు దృఢముగ ననినన్. 101

తే. పురమునకు కాదు నాదగుసిరికిఁ బరిజ, నమున కొరు లెవ్వరొడయులు నాకు నేడు
గడయు నాకూర్మితమ్ముఁడ కాక దీని, కడుగ నేటికి రమ్మను తడయ కిపుడ.

క. అని యతనికి సాదరభో, జనవిధి యొనరించి వస్త్రచామీకరవా
హనభూషణాదివస్తువు, లనేకములు ప్రీతి నొసఁగి యానన మలరన్. 103

క. తగ వీడుకొలిపి ధనదుఁడు, వగ మనమునఁ గూర విశ్రవసుపాలికి శీ
ఘ్రగతిం జని యమ్మునిపద, యుగళంబున కెరఁగి సవినయోక్తిపరుం డై. 104

చ. అమరవిరోధిపంపునఁ బ్రహస్తుఁడు లంకకు వచ్చి నాకుఁ గా
ర్యముఁ దగఁ జెప్పినట్లు పుర మాతని కిమ్మని యాడె నాడినన్

సముచితమైనచందమునఁ జక్కనిమాటల బాంధవంబుతో
నమగుడ వానిఁ బుచ్చి మునినాయక మీకెఱిఁగింప వచ్చితిన్. 105

తే. ఏమిపురుషార్థములుఁ జేయు నెడలనెపుడు, మీయనుజ్ఞయనాకుసహాయమగుట
నరసి మీదివ్యచిత్తాన నవధరించి, చేయఁగలపని యెయ్యది చెప్పుఁ డనిన.

శా. మున్నీకార్యము వాఁడు నన్నడిగినన్ మో మీక కోపించి మీ
యన్నం బుణ్యచరిత్రు నేన మును లంకాధీశ్వరుం జేసితిం
జన్నే వానిపరాభవంబునకు నుత్సాహంబు సేయంగ నీ
కన్నన్ మోములు గంటువెట్టుకొని రోషాయత్తుఁడై యత్తఱిన్. 107

ఉ. దిగ్గన లేచి పోయె గణుతింపక వాఁడు విరోధలబ్ధికై
యగ్గలికంబునన్ మనలనందఱఁ జీరికిఁ జేకొనండు స
మ్యగ్గురుభక్తిధర్మరుచిమాన్యవివేకము లెంతదవ్వు నీ
కెగ్గొనరింప కుండఁ బుర మిచ్చి తొలంగుము చాటి చెప్పితిన్. 108

సీ. ఇంద్రాయుధద్యుతు లేసంగఁ జూడ్కికి రమణీయంబులైన మణిస్థలములు
సిద్ధగంధర్వాదిసేవ్యంబులైనయచ్ఛోదకంబులఁ జెలువొందునదులుఁ
బల్లవపుష్పసంపద లుల్లసిల్లంగ రమ్యంబులైనయారామములును
నంబుజమధుమత్తహంసికావితతుల రుచిరంబు లయినసరోవరములుఁ

ఆ. గలిగి యొప్పు మిగులఁ గైలాసశైలత, టంబునందుఁ బురవరంబుఁ జేసి
కొని వసింపు మచట ననుచరసహితమై, దివ్యభోగలీల దేజరిల్ల. 109

క. అని విశ్రవసుఁడు చెప్పిన, విని వైశ్రవణుండు లంక విడిచి పరిజనం
బును దాను రజతగిరికిం,జని యొకపుర మలక యనఁగ సంపాదించెన్. 110

రావణుఁడు లంకం బ్రవేశించుట.

తే. అంత నక్కడ మగుడఁ బ్రహస్తుఁ డరుగు
దెంచి విత్తేశుఁ గాంచినతెఱఁగు నచటఁ
దాను బల్కినక్రమమును దాని కాతఁ
డన్నచందంబుఁ జెప్పె దశాననునకు. 111

క. విని యయ్యవిచారంబులు, దన కేటికి వెడలుఁ గాక దాడిమెయిం బో
యిన గాసిఁగాఁడె యింతక, చనుఁ జూ వెఱచునఁట నిలువ సందియ మేలా.

మ. అని బాహాబలగర్వనిర్వహణవిద్యాపారగుండైనయా
దనుజాధీశుఁడు వైర మెత్తి బలముం దానున్ వెసం బోయి పో
యి నిజావాసముఁ బాసి విత్తపతి పోయెం బోయె నా వించుఁ బే
ర్చినయాద్ధత్యము నిత్యమైన విజయశ్రీవిభ్రమోద్భాసి యై. 113

ఉ. లంక[redacted]రాజ్యసుఖలంపటుఁడై యభిషేకమంగళా
లం[redacted]ర్తిఁ జేకొని చలంబు బలంబును నుల్లసిల్ల ని

శ్శంకత రాక్షసాన్వయభుజావిభవం బలరక్ జగద్భయం
బంకురితంబు చేసెఁ దొలఁగకాడెడువీరరసంబు పెంపునన్. 114

తే. ఇట్లు లంకాపురము వేడ్క । నేలె సకల
దనుజలోకంబు సేవింప । ననుజసహిత
ముజ్జ్వలశ్రీసమేతుఁ డై । యుల్లసిల్లు
చుండి యాదశకంధరుఁ । డొక్కనాఁడు. 115

శూర్పణఖకుఁ బెండ్లిసేయుట.

క. దర్పోన్ముఖయౌవనకం,దర్పాస్త్రసముజ్జ్వలాంగిఁ । దనచెలియలి నా
శూర్పణఖఁ జూచి యోగ్యవ,రార్పణసమయ మని తలఁచి యనుజన్ములతోన్.

ఆ. కాలకేయవంశకరుఁడు విద్యుజ్జిహ్వుఁ, డతులబలుఁడు సుందరాంగుఁ డతని
కిత్త మెల్లభంగి । నిత్తన్వి నని తగ,నాడి కార్యనిశ్చయంబు సేసి. 117

క. దనుజపతి యున్ననగరం,బునకుం దగువారినపుడ । పుచ్చి యతని రాఁ
బనిచి సబహుమానంబుగ, నొనరించెం బరిణయము మహోత్సవలీలన్. 118

ఆశ్వాసాంతము.

చ. నిరుపమమూర్తి వైరిరథినీసమవర్తి వివేకవైభవ
స్ఫురితవిచారుఁ డుజ్జ్వలయశోమణిహారుఁడు ధర్మసంగ్రహా
దరపరతంత్రుఁ డార్యజనతామతమంత్రుఁడు వంశవారిజా
కరనవసూర్యుఁ డస్ఖలితగౌరవవర్తనధుర్యుఁ డిమ్మహిన్. 119

క. కవిలోకవనవసంతుఁడు,యువతీనూతనజయంతుఁ । డుదయానంతుం
డు వినయధనవంతుఁడు దా,నవినోదైకాంతుఁ డమలినస్వాంతుఁ డిలన్. 120

మాలిని. అమరశిఖరిహేలాహారిధైర్యుం డవార్య
క్రమభుజబలదృప్తారాతిసంహారుఁ డంహ
శ్శమనవినుతిపాత్రాచారగణ్యుండు పుణ్యో
ద్యమవిరచితలోకాత్యంతహృత్పర్వుఁ డుర్విన్. 121

గద్యము. ఇది శ్రీమదుభయకవిమిత్ర కొమ్మనామాత్యపుత్ర బుధారాధనవిధేయ
తిక్కననామధేయప్రణీతం బయినయుత్తరరామాయణం బనుమహాకావ్యంబు
నందుఁ దృతీయాశ్వాసము.

శ్రీ ర స్తు.

నిర్వచనోత్తరరామాయణము

చతుర్థాశ్వాసము.

శ్రీరమణీయుఁ డుపాసక
నారాయణుఁ డాదిధరణినాయకసామ్యో
దారచరిత్రుఁడు కులని
స్తారకసంభవుఁడు మనుమజనపతి యెలమిన్. 1

రావణకుంభకర్ణవిభీషణులు పెండ్లాడుట.

క. ఆదశకంధరుఁ డఖిలవి,నోదంబులఁ దగిలి నిత్యనూత్నవిహారా
మోదితుఁ డగు చుండి మృగ,వ్యాదరమున నేగి కాననాంతరభూమిన్. 2

క. ఒకమార్గంబున రా మయుఁ,డొకకన్నెయుఁ దాను నచట నొయ్యన చనుదే
నకుటిలశాంతోదాత్త, ప్రకృతి యగుట చూచి యెఱిఁగి రాక్షసపతియున్. 3

ఉ. గౌరవశాంతమూర్తిఁ దగఁ గైకొని మార్గముక్రేవ నిల్చి య
చ్చేరువఁ బోవ నద్దనుజుఁ జేరఁగఁ బోయి మహాత్మ యిట్లు కాం
తారములోనఁ బోకకుఁ గతంబును నీ లలితాంగిపేరు నీ
పేరును దీనిజన్మమును బ్రీతిఁ దగంగ నెఱుంగఁ జెప్పవే. 4

చ. అనవుడు నాతఁ డిట్లను మహాపురుషా! మయనామధేయుఁడన్
దనుజుఁడ హేమ నాఁ బరఁగుదానిఁ బయోరుహవక్త్ర నప్సరో
వనిత నమర్త్యు లిచ్చిన వివాహవిభూతి వహించి నెమ్మి మైఁ
దనయుల నిద్దఱం గని పదంపడి కాంచితి నీతలోదరిన్. 5

తే. అగ్రతనయుండు మాయావి యనఁగ వాని
యనుఁగుఁదమ్ముఁడు దుందుభి యనఁగఁ బరఁగు
దీనిపేరు మందోదరి దేవ యిమ్మృ
గాయతాక్షికిఁ దగువరు నరయఁ దలఁచి. 6

మ. జగతిం గ్రుమ్మరువాఁడ నై కడఁగి యీచంద్రాస్యఁ దోకొంచు నే
ను గరం బుత్సుకవృత్తిఁ బోక యిది హృన్మోదంబు సంధిల్లె నీ
దగుసల్లాపరసంబు పెంపునఁ బ్రియం బంతంతకుం బేర్చున
ట్లుగ నీయన్వయనామధేయములు వినఁగం జెప్పు నా కేర్పడన్. 7

క. నావుడు ముద మంది యితం, డీవారిజనయన నాకు నీ నెదఁ గోరెం
గావలయు నని తలంచి మ,హావినయపరుండువోలె నతఁ డిట్లనియెన్. 8

క. నాకుం బ్రపితామహుఁ డా, లోకపితామహుఁడు తండ్రులుం బౌలస్త్యుల్
మీకె ననఁ బూన నేర గు,ణాకల్పా వేదములు చిరాభ్యస్తంబుల్. 9

ఉ. పేరు దశాననుండు కృపపెంపున నాదుతపంబుసొంపునన్
వారిజసంభవుం డొసఁగె వావిరి నైనవరంబు లిప్పు డిం
పారెడులంక నాకు నెలవై మహనీయవిభూతి నుండుదున్
దారపరిగ్రహంబు నకృతం బిటముందట నన్నుఁ బ్రీతుఁ డై. 10

తే. క్రూరుఁ డగుట యెఱుంగక కోరి యిచ్చెఁ, గన్యనప్పుడ మయుఁడుదకప్రదాన
సహితముగ వీటి కరిగి యుత్సవముతో వి,వాహమయ్యె నద్దానవవల్లభుండు.

క. తనసుతు లని యమ్మయు చె,ప్పినమాయావియును దుందుభియు సమరముఖం
బున వాలిచేత సీల్గుట, లినతనయుఁడు సెప్పె రఘుకులేశ్వర నీకున్. 12

క. ఒకయోధముఖ్యు నని నం,తకు నైనను గిటడంచు దాని నమోఘ
ప్రకృతి యగుశక్తి నిచ్చెను, వికసిల్లుచు మయుఁడు దనుజవీరాగ్రణికిన్. 13

క. కోరి వివాహం బయ్యెను,గారవ మెసఁగంగఁ గుంభకర్ణుడు దళదం
భోరుహలోచన యగున, వైరోచనికూఁతుకూఁతు వజ్రజ్వాలన్. 14

ఆ. సరమ యనులతాంగి శైలూషతనయఁ గ,పోలచంద్రబింబఁ బులినజఘన
హరిణశాబనయనఁ బరమోత్సవంబునఁ, బెండ్లియయ్యె నవ్విభీషణుండు. 15

మేఘనాదుని జననము.

క. పదపడి మందోదరి స,మ్మదమున సుతుఁ గాంచె నాకుమారకు నెలుఁగున్
మదదిగ్దంతావళములు, బెదరఁ జెలఁగె మేఘనాద భీకరభంగిన్. 16

క. దనుజేంద్రుండును జిత్తం,బున నెంతయు సంతసిల్లి పుత్త్రకునిఁ గనుం
గొని మేఘనాదుఁ డనఁగా, ననురూపం బయిననామ మప్పుడు వెట్టెన్. 17

తే. పిదప నింద్రజి యనుపేరుఁ బెంపుఁ బడసె, నద్దశాననందనుఁ డభిమతముగ
దానిఁ బదపడి చెప్పెద మానవేంద్ర,వినుము తరువాతికథలు సువిస్తరముగ.

ఉ. ఆసమయంబునన్ సరసిజాసను పెట్టినచొక్కు కుంభక
ర్ణాసురుమోమునం గదిరె నాతఁడు నగ్రజు వేఁడె గాఢని
ద్రాసుఖయోగ్యమందిరము రాక్షసవంశవరుండు నిచ్చెఁ గై
లాసమువోలెఁ బ్రాంశుధవళం బగునూత్ననికేతరత్నమున్. 19

క. అందు నివాసస్థానము,నం దల్ప మనల్పముగ నొసర్చిన నిద్రం
బొంది బహువత్సరంబులు, నిందితదురితాబ్ధిలో మునిఁగి యుండంగన్. 20

రావణుఁడు దేవతలు మొదలగువారిని బాధించుట.

శా. దేవోద్యానము లీల మై నఱకు బాధించు న్మునిశ్రేణి నా
నావిప్రావలిఁ బట్టి తెచ్చి తిను బన్నంబుల్ సురస్త్రీలకుం
గావించుం గ్రతువైభవంబులకు విఘ్నం బాచరించుం దశ
గ్రీవుం డప్రతిమప్రతాపపరుషక్రీడాకలాకల్పుఁ డై. 21

సీ. మదమున నలిరేఁగి నదులు సొచ్చి కలంచి యాడు నుద్ధతగంధహస్తిలీల
బలమునఁ జెలఁగి కానల రేగి రూపఱ విఱచు మహావాతవిభ్రమమున
బెడిదంపుఁదనమునఁ గడఁగి శైలమ్ములు పొడిపొడి సేయు దంభోళిభంగి
నొడలిపెంపున వీచి జడనిధు లిక్కడక్కడ వైచు మంథనాగంబుకరణి
తే. గరుడగంధర్వయక్షకిన్నరులఁ గన్న, జెవులు వట్టి యాడించు నశేషలోక
భీకరము లగువిధములు పెక్కు సేయు, గర్వ మెదుగంగ నాదశకంధరుండు.

కుబేరుఁడు దూతను బంపి రావణునకు బుద్ధి చెప్పించుట.

క. అత్తఱి నత్తెఱఁ గెల్లను, విత్తేశుఁడు గలయఁ గనియు వినియుం గరుణా
యత్తమతి యగుట దూతం, బుత్తెంచె దశాననునకు బుద్ధులు సెప్పన్. 23

క. చను దెంచి దూత ముందఱ, గనియె విభీషణు నతండుఁ గడు వేడుక న
ద్ధనపతి సేమ మడిగి పరి,జనముల వేర్వేఱ యడిగి సంభావించెన్. 24

ఉ. వచ్చినకార్య మాఁపసి యవక్రచరిత్రుఁడు దానవేశ్వరుం
జెచ్చెరఁ గానిపించె నెడసేయక దూత వినీతవేషుఁ డై
చొచ్చి ధరాతలం బురము సోఁకఁగ నానతుఁ డై యుపాయనం
బిచ్చి కరప్రదర్శితమహిం దగ సంకుచితోపవిష్టుఁ డై. 25

శా. దేవా దేవరతోడఁ బుట్టువు కృతార్థీభూతచేతస్కుఁ డై
నీవిఖ్యాతికి సంతసిల్లు సహజస్నేహుండు నీయందు నీ
శ్రీ వెంపారుటఁ గోరు నీమహిమఁ బ్రార్థించు న్మదిం గావునన్
దేవేంద్రాదులచంద మొప్ప దని యుద్దేశించి నీయొద్దకున్. 26

తే. నన్నుఁ బుత్తెంచెఁ దనవచనములు గాఁగఁ, జెప్పుమని కొన్ని బుద్ధులు సెప్పివాని
నవధరింపు మొకించుక యవసరంబు, నాకు దయసేసి కార్యవివేకచతుర. 27

చ. జగములకుం బ్రతాపము ప్రశస్తముగాఁ బ్రకటించుమాత్రకుం
దగ వగు నిప్డు సేసినవిధం బిటమీఁద నిజాన్వయోచితం
బుగ నొనరింపు ధర్మము దపోవిభవంబునఁ గాదె యింతపెం
పు గనుట లంకకై మనకుఁ బుట్టినముందటిహాని సాలదే. 28

చ. మునిజన మెల్ల దుర్దశల ముచ్చిరి యుండుటఁ జూచి యప్సరో
వనితలయార్తిఁ జూచి క్రతువర్గము దైన్యముఁ జూచి నామనం

బనయముఁ దల్లడిల్లెడు దశానన దుష్టచరిత్ర మింక నై
నను నిది మాని సత్పథమునం జను దూఱు లడంగు నంతతోన్. 29

తే. ఇంతకాలంబు నేఁ బోయి హిమనగమున, శాంకరం బగుధర్మంబు సలుపు చునికి
నెఱుఁగనైతి మగుడివచ్చి యెల్ల నెఱిఁగి, యెఱుఁగఁ జెప్పితి హితము నా యెఱిఁగినంత.

క. ఇది నా కానతి యిచ్చిన, పదకము గలరూపు విన్నపముఁ జేసితి నీ
హృదయంబునఁ గైకొను మొం, డుదలంపులు దక్కు మనవుడుం గుపితుం డై.

క. ఆతఁడు నీకుం దగు నీ, వాతనికిం దగుదు మీర లక్కట దొరయుం
దూతయు నఁట వచ్చుటయుభ, యాతురతం గలిపి పోవ నఁట యిది పోలున్.

ఉ. బుద్ధులు సెప్ప బెల్ల నటు వోవఁగ నిమ్ము ధనాధిపుం దప
స్సిద్ధికిఁ బోయి వచ్చె నని చెప్పితి వత్తెఱఁ గెట్టి దంతయున్
శుద్ధిగఁ జెప్పు మన్న సురసూదనుపల్కులు చూడ నిట్లసం
బద్ధము లైనదూత యెడఁ బాసియు దిట్టఁడు గాన నిట్లనున్. 33

ఉ. అర్థవిభుండు వోయి తుహినాద్రిఁ దపం బొనరింపఁగా విహా
రార్థము వచ్చినన్ గిరిసుతాన్వితు నీశ్వరుఁ గాంచియున్ వర
ప్రార్థన సేయఁ డయ్యె నతఁ డాతఁడు దానికి మెచ్చి యిచ్చె స
ర్వార్థవిధాయకం బయినయాత్మసఖిత్వము నిశ్చలంబుగన్. 34

తే. వామపార్శ్వభిగతు లగువారి తేజ, మదరి యద్దెసలోచన మతని కపుడు
పింగళం బైనవా రేక పింగళుండ, వనఁగఁ బరఁగుము జగము లనిరి ధనదు.

ఉ. అత్తెఱఁ గెల్ల నిట్టిద మహాత్మ శుభంబు సధర్మవృత్తి కా
యుత్తమ మూవె యిమ్మెయి నహంకృతి సత్త్వము గాఁ దలంతురే
యుత్తము లక్కటా చెడుట కోపక చుట్టము బుద్ధి సెప్పినం
జిత్తమునందు నీసరకు సేయమి గర్వము గాక కర్జమే. 36

తే. అనిన నిరువదికన్నుల నడరుకెంపు, పద్మవనగతబాలాతపంబుఁ బోల
భ్రుకుటివికటలలాటవిస్ఫూర్జదుగ్ర, కోపభీకరుఁ డగుచు రక్షోవిభుండు. 37

క. ఏమేమీ ననుఁ జెడు దని, నాముందటఁ గొంకు లేక నాలుకతుద కీ
వీమాట దెచ్చి తజువర, మేమిగఁ దలఁచితొకో నీకు నిది విధి యనుచున్. 38

క. కేసరము లదరు హరిక్రియ, మీఁప లదర లేచి దూత మెడ దునియఁగ సిం
హాసనము కెలన నున్న మ, హాసి వెఱికి వ్రేసెఁ దమ్ముఁ డడ్డము సొరఁగన్. 39

ఆ. ఆపులించు తలయు నడరెడు నట్టయుఁ, జూచి ప్రీతుఁ డగుచు సురవిరోధి
యచటడింభతతికి నాఁకలి మడుపుగా, నిచ్చి యాగ్రహమున నిట్టు లనియె. 40

శా. రక్షోవంశహితోపదేశ మను పేరన్ వీనిఁ బుత్తెంచె నా
యక్షాధీశ్వరుఁ డీశుతోఁ దనకు సఖ్యం బైనతేజంబు రా

జ్యక్షోభంబుగ లంకఁ గొన్న మనయన్యాయంబు సెప్పన్ సురా
దిక్షుద్రవ్యవసాయహేతు వగుభీతిం జూపి జంకింపఁగన్. 41

ఉ. నిక్కము నట్ల కాన తగునీతిపరు ల్పర లుక్కివంబునన్
మిక్కిలి యైనవారి నియమింపక తక్కుదురే ధనేశ్వరుం
డక్కట లెస్స సేసె నడియాస సెడన్ దిగధీశుఁ డొక్కఁడుం
ద్రిక్కక యుండఁ ద్రుళ్లడఁప ద్రిమ్మరఁ బోవలసెం గ్రమంబునన్. 42

రావణుఁడు కుబేరునిపై దండెత్తి పోవుట.

ఉ. కావున మున్నమున్న యలకాపుర మేర్చి ధనేశు నోర్చి య
హోవలిపే రడంత మని యప్పుడ యుద్ధవిధిన్ సమగ్రనా
నావిధసైన్యభూరిభరనమ్రవసుంధరుఁడై పురీసరి
ద్గ్రావమహాటవు ల్గడచి రాజతశైలముఁ జేరఁ బోయినన్. 43

తే. యక్షులంతంతఁ జూచి ధనాధిపునకు, రాక్షసేశ్వరుసైన్యంబు రాక చెప్ప
నతఁడు గ్రక్కున సేన లాయితము చేసి, బరవసంబునదలపడఁబంచటయును.

క. ధనదుబలము దనుజబలము, ననువునఁ దలపడఁ గడంగి యార్చుచుఁ దాఁకెన్
ఘనఘోషభీషణము లగు,వననిధు లొండొంటితోడ వడిఁ దాఁకుగతిన్. 45

యక్షరాక్షసులయుద్ధము.

శా. జ్యానాదంబు నిశాతహేతిపటలీసంఘట్టరావంబు ఘం
టానిక్వాణసమేతబృంహితము గాఢస్ఫారహేషాసము
త్థానోపేతఖురాహతధ్వనియు సాంద్రంబైనభేరీపటు
ధ్వానం బేర్పడ దయ్యె నయ్యెడ బలద్వంద్వంబునం దేమియున్. 46

ఉ. అందును నిందుఁ జేయఁగల యట్టిభటుల్ దలపడ్డ సైన్యముల్
గ్రందుగ నొక్కపెట్ట తమకంబునఁ బోరుట చూచి కైకసీ
నందనుఁ డిమ్మెయిన్ సరి పెనంగుట సైఁపక వచ్చి వీఁకఁ దాఁ
కెం దనమోములన్ వఱలఁ గీల లుదగ్రత వజ్రదంష్ట్రలై. 47

క. ఏటున వాటున ప్రేటునఁ, బోటున దశముఖుఁడు రౌద్రముగ నఱుముటయున్
లేటమొగముపడి యక్షులు, కోట సొరంబాఱె రసురకోటి యెగవఁగన్. 48

క. తోలుకొనిపోయి దనుజులు, కైలాసతటంబుబయలు గైకొనఁ జన నా
భీలశరనిహతి వారలు, గూలఁగ సంయోధకంటకుఁడు వడిఁ దాఁకెన్. 49

ఉ. ఏచినదైత్యసైన్యముల నెల్లను ద్రుళ్లడఁగించి యిట్లు శౌ
ర్యోచితలీలఁ గ్రాలి సమరోద్ధతి మైఁ దమసేనఁ జూచి చే
పీచుచు వచ్చుయక్షుఁ గని వీతభయుండు దశాస్యమంత్రి మా
రీచుఁ డుదగ్రుఁడై గిరి గిరిం దగ మార్కొనుమాడ్కిఁ దాఁకినన్. 50

క. ఇరువురశరజాలము లొం, డొరువులతురగములు సూతు లురుకేతనముల్
గరువలిక్రియఁ బడఁ గూల్చుచు, నెరగలిచిచ్చుగతిఁ గప్పె నిరువాఁగుపయిన్.

ఉ. యక్షుఁడు దానవుం గదిసి యార్చి దగం గద బిట్టు వ్రేసినన్
రాక్షసుఁ డీడఁబోక భిదురప్రతిమానమహాసి వ్రేసె ధూ
మ్రాక్షుఁడు నంతఁ గూడుకొని యాసురవృత్తిఁ దగంగఁ జేసె ను
గ్రక్షురికాక్షతిం బ్రతిముఖంబున రక్తనదీప్రవాహముల్. 52

ఉ. దానవవీరు లిట్లు ధనదప్రియభృత్యునిఁ గిట్టి నొంచినన్
మానము డిగ్గఁ ద్రాని గరిమంబు దలంప కతండు వాఱినన్
సేనలు పెల్లగిల్లి పఱచెన్ దశకంఠుఁడు కోట డగ్గఱం
గా నడచెన్ మణిస్ఫురితకాంచనతోరణకాంతిఁ జూచుచున్. 53

ఉ. అట్టియెడన్ సురారిసుభటావళి వాకిట లగ్గ సేసినం
గట్టుపకాసి దీర్ఘదృఢకాయుఁడు తత్ప్రతిహారపాలకుం
డొట్టినమఃటవోలెఁ గడునుగ్రతఁ బేర్చిన సూర్యభానుఁ డ
ప్పట్టునఁ దాఁకి దానవులు పాఱుటయుం గదిసెన్ దశాననున్. 54

ఆ. వీకఁ గొండతోడఁ దాకెడుతగరును, బోలె గగనచరులు భుజబలంబు
వొగడఁ బరిఘ ద్రిప్పి యెగసి దశానను, వెడఁదయురము పెలుచ నడిచి యార్చె.

క. ఆసూర్యభానుఁ డీక్రియ, వ్రేసినయప్పరిఘ దనుజవిభుఁ డధికబలో
ల్లాసమునఁ బుచ్చుకొని పొడి, సేసె నసురు లార్వ నతనిశిర మొకవ్రేతన్. 56

క. నుగ్గయినయతనిఁ గనుఁగొని, బెగ్గలమున నచటిభటులు పికపిక లైనన్
డగ్గఱి పిశితాశను లొక, మొగ్గర మై కోట సొర సముద్ధతు లయినన్. 57

మ. సమరక్రీడకు వచ్చె వైశ్రవణుఁ డుత్సాహోగ్ర మై మాణిభ
ద్రముఖం బైనబలంబు మున్ వెడలఁ దూర్యశ్రేణి గర్జిల్ల దు
ర్దమదోగ్రకాండవిమర్దితోద్ధతగదాదండోద్భటుం డై పరా
క్రమలీలం బటువందివాగ్విభవసంరంభంబు రంజిల్లఁగాన్. 58

క. ప్రకటబలు లమ్మహోదర, శుకసారణు లాదిగా నసురవీరులున్
భ్రుకుటిముఖు లగుచు యక్ష,ప్రకరముఁ దలపడిరి తూర్యరవములు సెలఁగన్.

ఆ. దొరలు వెన్నుదన్ని పురికొల్పి యిరువురుఁ జేరి చూచుచుండఁ జెలఁగి యుభయ
బలముఁ బోటులాడెఁ జలమున నొక్కింత, యోలమూసగొనక యోలి నార్చి.

సీ. కీలాలజలముపైఁ దేలుచు నవ్విన ట్లున్నశిరంబు లొక్కొక్కచోట
నంగుళీయకరుచు లడరంగ నెఱిఁ బాసియున్నహస్తంబు లొక్కొక్కచోట
గుత్తులకోలఁదికిఁ గృత్తంబు లై పడి యున్నపాదంబు లొక్కొక్కచోట
నవయవభేదంబు లమరక తునియ లై, యున్నగాత్రంబు లొక్కొక్కచోటఁ

తే. గమలషండంబు నాగలోకంబుఁ దలిరుఁ,బాన్పుఁగల్పాంతమునజముకౌనసంబు
నింటిలోపలఁబోలె నొప్పెసఁగెఁజూడ, నప్పుడుయక్షనిశాటయుద్ధాంగణమున.

ఉ. అయ్యెడ మాణిభద్రుఁడుఁ బ్రహస్తుఁడు నొండొరుఁ దాఁకి ప్రేసియుర్౯
వ్రయ్యఁగ మోదియుం జదియవైచియు నొచ్చి చనంగ నిమ్మెయి౯
డయ్యఁగఁ బోరి రంత వికటప్రముఖాసురు లంటఁ దాఁకినం
గయ్యము దక్కి యక్షుఁ డధికం బగునొప్పునఁ బెల్లగిల్లినన్. 62

ఆ. బలము పాయ యిచ్చి తొలఁగిన నలుకక, బరవసమున నర్థపతి గడంగి
రథముఁ బఱపఁ బనిచె రాక్షసభటకోటి,యఱుమలేక పాఱె తెఱపి యిచ్చె.

కుబేరుఁడు రావణుని దూరనాడుట.

క. ధనదుఁడు గట్టెదురం దమ్మునిఁ గనుగొని సూతుఁ దురగముల నిలుపంగాఁ
బనిచి పులస్త్యతనయనం,దనుఁ డగుటకు సముచితముగఁ దా నిట్లనియెన్. 64

ఉ. ఏను హితంబు సెప్ప నిటు లేచి దురాచరణంబు లిమ్మెయి౯
మానవు రోగి చేఁ దయినమం దఱువుం దెవు లంటఁ దాఁకినం
గాని యెఱుంగఁ డప్డు ప్రతికారము గల్గునె యట్లపోలె నీ
దైననికృష్టవృత్తిఫల మందిఁ దలంచెదుగాక పిమ్మటన్. 65

ఉ. కార్యము లెందుఁ దార యపుఁ గా దన నోపుదురే సహాయులై
యార్యులు ద్రోచి చెప్ప నుభయప్రతిపన్నము లైనఁ గాక యీ
శౌర్యము వట్టి దుర్ణయవిచారమున౯ వినయంబు దక్కట
స్థైర్యముఁ దేక యున్నె తుది దాఁకునె లోకవిరుద్ధవృత్తముల్. 66

తే. మేలు రెండులోకంబుల మేల తెచ్చు, కీడు సేసినఁ దప్పదు కీడ యగుట
దీని నాబాలగోపాలమైనజనము,సకలమును మది నెఱుఁగు నీవాకఁడుదక్క. 67

చ ఒకరునిమాటఁ బోక కడుకుగ్రత నీవు సధర్ము లైనవా
రి కలుగుచు౯ సముద్ధతిఁ జరింపఁగఁ జూచుట దేవతాగణం
బకట మనంబులోన ముదమందుఁ జుమీ వెడమాట లింక నే
టికి రణకౌశలంబుఁ బ్రకటింపుము వచ్చితి సారెసారెకున్. 68

కుబేరుఁడు రావణునితో యుద్ధముచేసి యోడిపోవుట.

క. అనిన మఱుమాట వలుకక, దనుజేంద్రుఁడు ధనదు నస్త్రతతిఁ గప్పె నతం
డును బాణవృష్టి గురిసి య,శనిక్రియ నుగ్ర మగునసరశర మేసె వడిన్. 69

ఆ. అదరు లెగయ వచ్చునాగ్నేయబాణంబు,రాక కంబుపతిశరంబుఁ దొడిగి
లాఘవమున నిజబలం బార్వ దశముఖుఁ, డనతిదూరమునన యాఱనేసె. 70

శా. శ్రావ్యం బై చెలఁగ౯ గభీరమధురజ్యానాద ముద్దామవీ
రవ్యాపారనిరూఢతం బ్రతిశరారంభంబు మర్దించుచు౯

సవ్యప్రౌఢి దృఢాపసవ్యగతి నాశ్చర్యంబుగా నేయుచున్
దివ్యాస్త్రంబులఁ బోరి రిద్దఱును సాదృశ్యం బదృశ్యంబుగన్. 71

ఆ. ఏటు లాడి యాడి యేడ్తెఱఁ గలిసి గ,దా ప్రవీణబాహుదండుఁ డయిన
ధనవిభుండు వ్రేసె దశముఖుశిరము లం,దంద యక్షు లార్వ నచల మద్రువ.

క. సురవైరి గినిసి యొక్కట, నిరువదిగద లెత్తుకొని ధనేశ్వరు నురమున్
శిరమును బరులుం గరములుఁ,జరణంబులు జదియ మోఁదె సరభసవృత్తిన్. 73

చ. కలయఁగ మేన శోణితము గ్రమ్మఁగ లావఱి యొల్లఁబోయి కెం
దలిరుల నొప్పుమాతము మొదల్ నఱకన్ ధర వ్రాలునట్లు వి
హ్వలుఁ డయి తేరిపై నొఱగు వైశ్రవణుం గని సూతుఁ డెంతయుం
దలరి రథంబు దోలుకొని దవ్వుల కెక్కుడి కేనిఁ బోయినన్. 74

క. వెల్లుగ నార్చుచు విజయస,ముల్లాసముతోడఁ బంక్తిముఖుబల మొగవం
జెల్లాచెదరై యక్షులు, వెల్లగిలం బఱచి రద్రిబిట్టులియంగన్. 75

సీ. కాలుకొన్నంతయుఁ గడువేగమునఁ బాఱి కనుకని దెసలందుఁ గాడుపడియుఁ
బాఱఁ జాలక ముట్టబడి జాడ దప్పంగఁ దొలఁగి వెన్గొందులఁ దూఱఁబడియుఁ
దలఁకుఁ జీరలును గంపలు వట్టికొని గాసి గా మ్రగ్గుటడవులఁ గాటువడియుఁ
గాళులఁ జేతులఁ గా నెట్టకేలకుఁ జఱు లెక్కి లోయలఁ జాఁగఁబడియు

ఆ. బయలిమొనలు గోట వట్టిన పెల్లున,నీటి ప్రజయు నొక్క మాట యురలఁ
దెరలి యిద్ద ఱొక్క తెరువునఁ బోవక,యాకులితను గాందిశీకు లయిరి. 76

రావణుఁడు కుబేరు నోడించి పుష్పకవిమానము గొనుట.

తే. అసురపతి గెల్పుగైకొని యలకఁ జొచ్చి,యొండు సేయంగ నొల్లక యుచితపరుఁడ
పోలెఁ దన ప్రజ వారించి ప్రోలిలఁ గామ,గమనరమణీయ మగుపుష్పకంబు గొనుచు. 77

క. చనియె నట ధనదుసూతుఁ డ,తని నొకపద్మాకరంబుతటమునను బె
ట్టిన నచటఁ బొలయునల్లని,తనుగాలిం దేఱి లజ్జితస్వాంతుం డై. 78

ఆ. అంత నంత విరళ మగుపరివారంబు, గూడి చిన్నవోయి కొలిచి రాఁగ
వాడి యున్న మోము వాంచినభంగిన, యలక కేగుదెంచె యక్షవిభుఁడు. 79

ఉ. అక్కడ దానవేంద్రుఁడు జయంబునఁ గ్రొవ్వెలరారఁ బుష్పకం
బెక్కి గిరీంద్రవైభవనిరీక్షణకౌతుకలగ్నచిత్తుఁ డై
యిక్కడ నక్కడం గలయ నిచ్చమెయిం జరియించు చుండఁగా
నొక్కెడ నెద్దెసం గదలకుండె విమానము విస్మయంబుగన్. 80

చ. అమరవిరోధి దాని కెద నచ్చెరు వంది యమాత్యభృత్యవ
ర్గములును దానుఁ గూడి వడిఁ గామగ మై చనునట్టి దివ్యమా
న మిచట నిట్లు దీనిగమనం బెడలం గత మేమి యక్షస
త్తముఁ డొకరుండు దక్కనొరుఁ దాల్పదొకో హృదయానువర్తి యై. 81

నందికేశ్వరుఁడు రావణుని శపించుట.

చ. అనుసమయంబునం ద్రినయనానుచరుం డగునంది వారలం
గని యనియెం దొలంగుఁ డెడఁగా నిది యీశనివాసదేశ మిం
దనిమిషయక్షకింపురుషులాదిగ నెవ్వరు రా రనంగ న
ద్దనుజవిభుండు వెండియు నుదగ్రతఁ బోవక యున్న నల్కతోన్. 82

క. ఈతఁడె యీశ్వరుఁ డిత్తఱి, పోతంబులకెలన శైలపుత్త్రియుఁ దానుం
బ్రీతిఁ గుసుమాపచయకే, లీతత్పరుఁ డైనవాఁడు లీలానుగతిన్. 83

క. అడిబీర ముడిగి రాక్షస, చెడక మరలి పొమ్ము నీకుఁ జేయలఁతియె యీ
యెడ యింక నీవు నిలిచినఁ, బడ నడుతురు గన్న నిన్నుఁ బ్రమథగణంబుల్.

తే. అనినఁ గోపించి యీశ్వరుఁ డనఁగ నెవ్వఁ, డతనికిచ్చోటు దక్కనొకతముఁ జెప్పు
మనుచు వానరవదనంబునట్టు లున్న, నంది మొగ మప్డు దేరకొనంగఁ జూచి. 85

క. కడుఁ బెల్చ నవ్వ యగు నీ, వడువునఁ జెలువంబు గలుగు వారలచేతం
జెడఁడే యీతఁడు నుడువకయుఁడుగు మనుచుఁ బంక్తివదనుఁ డుల్లస మాడెన్.

చ. తెగడినఁ గెంపుసొం పడరుకన్నులు గాడఁగఁ జూచి నంది యి
ట్లగు నిది నిక్క మివ్విధమునాననముల్ గలవార లేపున
న్మిగిలినరాక్షసాన్వయము నిన్నుఁ బురంబును సాగరంబు గా
సిగ మసి గాఁగఁ జిక్కు వడఁ జేద్పడఁ జేయుట యెట్లుఁ దప్పునే. 87

ఆ. నిన్నుఁ బట్టి యిపుడ నీలుగఁ దలలు దు,న్మాడ నాకు శక్యమగున యైన
జగముచేతినిండఁ జచ్చినవాఁడవు, మున్న కాన శవము ముట్ట ననిన. 88

మ. అతిరౌద్రాకృతి దైత్యుఁ డిట్లనియె మీ రాక్రోశముం జేయఁ బ
ర్వత మే నిప్డు చలంబునం బెకలెదన్ వారింపుఁడా నీవు మీ
యతఁడున్ వచ్చి విమాన మాఁగినఫలం బంనంగ నీశాను ని
ర్జితుఁ గావింపక మిమ్ముఁ ద్రుంపక దశగ్రీవుండునుం బోవునే. 89

రావణుఁడు కైలాసమును పెల్లగించి యెత్తుట.

ఆ. అనుచు శైలమూలమున కేగి చేతుల, గ్రుచ్చి యమరఁ బట్టి కూలఁ ద్రోవ
నప్పళించి యెత్తె నల్లాడె నమ్మహా,నగము జీవరాశి బెగడుపడఁగ. 90

క. తదవసరంబునఁ బ్రమథులు, బెదరిరి గిరిరాజతనయ బిట్టులికి పెసం
బొదివి పయి వ్రాలి కౌఁగిటఁ, గదియించెను శంభుమేను గరుపారంగన్.

ఆ. దనుజుచంద మంతఁ దనదుచిత్తంబున, నెఱిఁగి శంకరుండు చిఱుతనగవు
కాంతి మోముచెన్నుకింత గావింపంగ, నుంగుటమున నల్లనూఁదుటయును.

శివుఁడు రావణునిచేతులు కైలాసము క్రింద నడఁగఁ ద్రొక్కి వాఁడు ప్రార్థింపఁగా ననుగ్రహించుట.

చ. కరములు చాఁపకట్టువడఁగా గిరి యెప్పటియట్ల క్రుంగినన్
విరవిరఁ ద్రెళ్లి నొవ్వడరి విహ్వలుఁ డై దశకంధరుండు ఘో

రరవము లోకసంభ్రమకరం బగునట్లుగఁ జెల్చెఁ గూసె న
చ్చెరువును బెగ్గలంబుఁ గవిసెన్ వెస దైత్యునమాత్యకోటికిన్. 93

క. వెల్లువ ముట్టినపగిదిం, దల్లడమునఁ గూడఁ బాటి తనుఁ దనసైన్యం
బెల్లను ముసరఁగ దానవ,వల్లభుఁ డట్లఱచుచుండె వా విడిచి వడిన్. 94

తే. తా నెఱుంగనియట్టుల తడవు గాఁగ, నిల్చి కరుణించి పదపడి నీలగళుఁడు
నగము డీలించి బాహులుపిగిచికొనఁగ,నిచ్చి యానతియిచ్చెదైత్యేశ్వరునకు.

శా. కేలీకందుక మల్ల నెత్తుకొనుమాఱిక్కిం బట్టి నాయున్నయీ
కైలాసాచల మిట్లు నీవు నెగయంగా నెత్తినం జోద్యమై
నీలా వేఁగొనియాడు రెల్లరును వర్ణింపంగ నీ కొక్కపే
రేలోకంబునఁ జెల్ల దైత్యులకుఁ బెంపెక్కంగ నే నిచ్చెదన్. 96

క. ఏ వినఁగ నిపుడు నీదగు, రావంబు త్రిలోకభీకరం బయి చెలఁగెం
గావున విన్న భయం బగు, రావణుఁ డనునామమునఁ బరఁగు త్రిజగములన్.

ఉ. పుష్పక మర్థి నెక్కు మెటఁ బోయెదొ పొమ్మని వీడుకొల్పె వా
స్తోష్పతి సంతసం బెడల ధూర్జటి నిర్భరహర్షనిర్గళ
ద్బాష్పవిలోచనుం డగుచు దానవనాథుఁడు రత్నమాలికా
నిష్పతదంశుజాలరమణీయవిమానము నెక్కె మ్రొక్కుచున్. 98

ఆశ్వాసాంతము.

మ. బుధసంరక్షణశీలుచేత వినయాంభోరాశిచే శత్రుగ
ర్వధనాదానవిదగ్ధుచేత రమణీప్రద్యుమ్నుచే నవ్యయాం
బుధిసంపూర్ణసుధాంశుచేతఁ సుహృదంభోజార్కుచే భారతీ
మధునిష్యందముఖాబ్జుచేతఁ ద్రిజగన్మాన్యస్ఫురత్కీర్తిచేన్. 99

క. ఖండియరాయనిచే నుద్దండద్విపదవనిపతిమదావళహరిచేఁ
ఖండితవిధుచే విభవా,ఖండలుచే నృపనయప్రకారునిచేతన్. 100

మాలిని. నిరుపమరణకేళీనిర్దళద్వైరిధాత్రీ
వరతనుగళితాసృగ్వారిపూరావగాహా
దరభరపరిఖేలద్యాతుధానాంగనాని
ర్భరమదమధురస్తోత్రప్రసన్నాత్ముచేతన్. 101

గద్యము. ఇది శ్రీమదుభయకవిమిత్ర కొమ్మనామాత్యపుత్ర బుధారాధనవిధేయ
తిక్కననామధేయప్రణీతం బయినయుత్తరరామాయణం బను మహాకావ్యంబు
నందుఁ జతుర్థాశ్వాసము.

శ్రీ ర స్తు.

నిర్వచనోత్తరరామాయణము

పంచమాశ్వాసము

శ్రీరమణచరణశరదం
భోరుహభృంగపతిచేఁ ద్రిభువనప్రథితా
చారునిచేఁ గనకాచల
ధీరునిచే మనుమవసుమతీవల్లభుచేన్. 1

క. శంభునిచే నివ్విధమున, సంభావితుఁ డై తదీయశైలము డిగి సం
రంభమున రావణుఁడు దాఁ, గుంభిని నలుఁగడలఁ గలయఁ గ్రుమ్మరు చుండెన్.

క. ఒక్కొకమరి సేనలతో, నొక్కొకమరి వీరపరిజనోపేతుం డై
యొక్కొకమరి దనయంతన, యెక్కడ నేనిని జరించు నిచ్ఛాగతులన్. 3

వేదవతి రావణునిచే నవమానిత యై యగ్నిప్రవేశము చేయుట.

మ. హిమవంతంబున కేగి యొక్కయెడ నందేకాంత మొక్కర్తు చీ
రముఁ గృష్ణాజినముం గమండలువు నై రాగంబు వర్జించి సం
యమముం గైకొనిఁ యున్నఁ జేరఁ జని హృద్యాకారముఁ యౌవనో
ద్యమముం గాంతియుఁ జూచి రావణుఁడు గామాయత్తుఁ డై యి ట్లనున్. 4

క. ఎవ్వనితనయవు నీపతి, యెవ్వఁడు పే రేమి నీకు నీరూపంబుఁ
జవ్వనముఁ బాయ నీతప, మెవ్విధిఁ బాటిల్లె నకట యింతయుఁ జెపుమా. 5

క. అనుపలుకులు వినియుం దా, విననియదియుపోలె నుచితవిధి నాతిథ్యం
బొనరించినయక్కన్యక, ననిమిషరిపుఁ డట్ల మఱియు నడిగిన నదియున్. 6

సీ. అనఘ కుశధ్వజుఁ డనుమునీశ్వరుఁడు వేదాభ్యాస మనిశంబు నాచరించి
యాసుకృతంబునఁ జేసి నన్ గని వేదవతి యనుపేరిడి వంశమహిమ
వెలయంగ నిక్కన్య విష్ణున కిచ్చెద నని చాలఁ బ్రీతిసేయంగ నెల్ల
వారును మాయయ్యకోరిక యెఱుఁగక యర్థింప నర్థింప నతఁడు ద్రోచి

తే. పుచ్చ నసురేంద్రుఁ డై నజంభుండు నడిగి, తనకు నీకున్న నలిగి మాతండ్రిఁ జంపెఁ
దల్లి సొదఁ జొచ్చె సత్యవ్రతంబు నడపు, జనకుపూనికి నేఁ దీర్తు నని తలంచి.

క. అది మొదలు గాఁగ విష్ణుని, మది నిల్పి యతండ నాకు మగఁ డగు నని యి
ట్లు దపంబు సేయు చుండుదు, నిది నా తెఱఁ గనిన దానవేశ్వరుఁ డనియెన్. 8

ఉ. కాంతి దొలంగ మే నిటులు । గాఱియఁ బెట్టుచు జవ్వనంబుచె
న్నింతయు రిత్తవో సుఖము । లెల్లను డిగ్గఁగఁ ద్రావి నెమ్మదిం
జింత దళంబుగా నదరఁ । జేడ్పడి యొంటి చరించుచున్ జర
త్కాంతయుఁబోలె నియ్యెడుమఁ । గైకొనఁ బాడియె చారులోచనా. 9

మ. లలనా విష్ణుఁ డనంగ నెవ్వఁ డతఁ డేలా శుద్ధవంశంబు ని
ర్మలసంపూర్ణతపోమహత్త్వము వరప్రాప్తానుభావంబు దో
ర్బలసంపత్తియు నాకుఁ బోలెఁ ద్రిజగత్ప్రఖ్యాతిపాత్రంబులే
కలదే లంక పరాక్రమం బఖిలలోకశ్లాఘ్యమే వానికిన్. 10

ఆ. అనినఁ జెవులు మూసికొని యిట్టులను లోక, వంద్యు వేదవేద్యు వరదుఁ బరము
ననుపమాను నచలు నవ్యయు హరిఁ జెడ, నాడఁ గూడ దని మృగాక్షి మఱియు.

చ. తపముల కెల్లఁ దాన ఫలదాత కులంబున కాదికర్త యై
యపరిమితప్రభావుఁ డగు నాచతురాస్యుఁడు నాభిఁ బుట్టె వి
శ్వపతి యహీనబాహుబలసారఘను ల్మధుకైటభాదిదై
త్యపతుల నెల్లఁ ద్రుళ్ళడఁచె । నారయ విష్ణుఁ డమాననీయుఁడే. 12

క. అనిన నసుర యమ్మాటలు, విన నొల్లక కదియ వచ్చి । వెండియు సతి కి
ట్లనియె మరునంపవెల్లున, దనువు నిలువ దింకఁ గోర్కి । దఱిమెడుఁ బేర్మిన్. 13

చ. ఎఱుఁగవు గాక భోగముల । కెల్లను నెచ్చెలి జవ్వనం బయి
త్తఱి నుడివోవ కుండ నుచితంబుగ జక్కవదోయివోని క్రి
క్కిఱిసినచిన్నిచన్నుఁగవ । యిం పెసలారఁగ నాదువక్షమున్
వఱలుసరోవరంబున నవారణఁ గేలి యొనర్పు కోమలీ. 14

ఆ. అనుచుఁ దగిలి చూచు । నద్దానవేశ్వరు, నలిగి చూచి నిన్ను । నధముఁ డగుట
మును తపప్రభావమున నెఱింగియుఁ దగ, నాపులస్త్యమనుమఁ డని తలంచి.

క. అతిథిసపర్యయు సమయో,చిత మగుసంభాషణంబు । నేసితిఁ బోపో
మతి లేదు నీకుఁ జొప్పడు, నతివలలో నన్నుఁ దలఁప । నగునె దురాత్మా. 16

చ. అని కలుషించి వేదవతి । యచ్చటు వాసి చనం దలంచినం
గని దశకంధరుం డదరి । గ్రక్కున వేనలి వట్టికొన్న నం
గన యొకవ్రేల వ్రేయ నది । కత్తివిధంబునఁ దాఁకి కత్తిరిం
చినక్రియఁ ద్రెంచె వెండ్రుకలు । చేతఁ దెమల్చినయంత కివ్వలన్. 17

తే. వెండ్రుకలు చేతవచ్చుడు । వెఱఁగుపడుచుఁ, దపముపేర్మికి నలికి య । ద్దనుజవిభుఁడు
నిలిచె రోషమహానల । జ్వలనమూర్తి, యగుచుఁ బిఱిఁదికి బాసి య । ట్లనియె సతియు.

ఉ. బన్నము లిట్లు నీవు వఱుపం బడి మేను దొఱంగు చుండి యే
నిన్ను శపించినట్లయిన । నిర్మలనిత్యమహాతపఃప్రభా

వొన్నతిచేటుగాదె పునరుద్భవ మయ్యెడ నీకు మృత్యువై
సన్నుతపుణ్యజాత యనఁ । జాలి యయోనిజమూర్తిఁ దాల్చెదన్. 19

క. ఈపరిభవంబుఁ బడియుం, దీపే ప్రాణంబు లనుచు । దిగ్గన ననలం
బాపాదించి దశానను, నే పడఁగ౯ విష్ణు నాత్మ । నిడి సొదఁ జొచ్చెన్. 20

ఆ. కృతయుగమున వేదవతి యనఁగాఁ జన్ని, నాతి త్రేత నిపుడు । సీత యనఁగ
జనకుయజ్ఞవేది । జన్మించి నీసతి, యయ్యె నీవు విష్ణుఁ । డగుటఁ జేసి. 21

చ. అని ముని సెప్ప విస్మయము । నార్తియుఁ గోపముఁ బ్రీతియుం బెనం
గొనఁ దప మిట్టిదిం గలదె । కోమలి దొల్లియు నన్నె కోరెనే
దనుజుఁడు నాఁడు నియ్యనుచితం బొనరించెనె తత్ఫలంబు మె
ల్లన యిటు వొందెనే యని తలంచుచు రాముఁడు గౌతుకంబునన్. 22

క. ఇవ్విధమున సొదఁ జొచ్చిన, యవ్వనితం జూచి పిదప । నసురాధీశుం
డెవ్వలని కరిగె నెవ్వరి, కెవ్విధిఁ గావించె ననిన । నిట్లనె మునియున్. 23

రావణుఁడు దిగ్విజయము చేయుట.

శా. వీరుం డెవ్వఁడు నెందు లేఁ డనుచు నుర్విం ద్రిమ్మరు౯ దర్పదు
ర్వారస్ఫారపరాక్రమక్రమకళావైదగ్ధ్యవిస్తార మే
పారంగా ధరణీశుల౯ వెదకి వీరావేశి యై దుర్దమ
ప్రారంభం బొనరించుచు౯ సమరసంరంభంబు శోభిల్లఁగాన్. 24

సీ. ఒక్కచోఁ దా మరుత్తోర్వీశుజన్నంబునకుఁ జని యతని రణంబు సేయ
నడిగినఁ గ్రతుకాలమని సేయఁ దగవు గాదనుచు శాంతత నున్నయాన్నృపాలు
నోడితి వని యార్చి । యుడుగక యజ్ఞోపకరణంబు లన్నియు । గాసి చేసి
ప్రాగ్వంశ మంతయు । వ్రచ్చి వేదిక గ్రొచ్చి ఋత్విగ్గణంబులసత్వ మడఁచి
తే. యజ్ఞభాగంబులకు వచ్చిహరికృతాంత,వరుణధనదులు బర్హియువాయసంబు
హంసమునుగృకలాసంబునై భయమున,నడఁగియుండిననెఱుఁగకయసురవోయె.

ఉ. అంతకవిక్రము౯ సురథునార్యుఁ బురూరవు బాహుశాలి దు
ష్యంతు నజేయు గాధినృపసత్తమునిం గని కూడ ముట్టి మీ
రింతకు మున్ను న న్నెఱుఁగ । రెన్నఁడుఁ గావునఁ గయ్య మిందు మీ
కెంతబలంబు గూడు నదియెల్లను గూర్పుఁడు దర్ప మేర్పడన్. 26

ఉ. చాలక తక్కిన౯ వినుఁడు । శౌర్యము లజ్జయు నుజ్జగించి మీ
రోలిన నిల్చి నాయెదుర । నోడితి మే మనుఁ డన్న మేదినీ
పాలురు పోరిలో మనకుఁ । బంక్తిముఖుం జెనయంగ వచ్చునే
మే లిది యంచు నోటమిక । మేకొని యట్టుల చేసి రక్కటన్. 27

మ. దనుజుం డీపురి కేఁగుదెంచి మహిమోద్దామప్రతాపాగ్నిసం
జనితాశావలయప్రకాశబహుశస్త్రప్రౌఢిసంరూఢిచే

ననరణ్యక్షితిపాలు ముట్టిన నతం డత్యుద్భటాకారుఁ డై
యని కేగెం బృథివీపరాగపటలం బాకాశముం గప్పఁగన్. 28

ఉ. సైన్యయుగంబునుం బెనఁగి సంగరరంగమునందు వ్యగ్ర రా
జన్యవరుండు రావణుఁడు సమ్ముఖ మై మహి సంచలింప న
న్యోన్యవధాభిలాషమున నార్చి వడిం దలపడ్డఁ జూడ సా
మాన్యము లయ్యె నప్పు డొకమాత్ర జయాపజయప్రకారముల్. 29

చ. వికటము లైనహస్తములు వ్రేయుచు నోలిన తాఁకి యున్న మ
స్తకములు నుగ్గు సేయుచు నిశాతకృపాణకళావిదగ్ధుఁ డై
యొకవడిఁ బోరి డస్సి బలిమియుం దగుదానవుచేత నొచ్చి నే
ల కొరగునప్డు భూపతి చలంబున నాతనితోడ ని ట్లనున్. 30

మ. అని నీ కోపక పడ్డ నేమి యిఁక దైత్యాధీశ యే ధర్మవ
ర్తిని యేనిన్ శుచి నేని నాకులమునన్ దివ్యావతారుం డొకం
డనపాయుం డుదయంబు నేసి భువనం బానందముం బొంద నెం
దు నవధ్యుం బగునీశిరోదశకముం దున్మాడువాఁ డుద్ధతిన్. 31

ఆ. అనిన నసుర నగుచు నగు నగు నీయందుఁ బొంకు గలుగు నెట్లు పోలుఁ బోలుఁ
బిదపఁ జూచికొంద మిది నీవు గొమ్మని, పరిఘ నతనిశిరము పగుల వ్రేసె.

క. ఆర్చి విజయోత్సవమునం, బేర్చినచలమున వరంబుపెంపున సొంపుం
దీర్చి దిగులు రాజులయెదఁ, గూర్చి విడిసె మగుడ దైత్యకోటి మదింపన్. 33

క. ఇమ్మెయి నచట నచట య, జ్ఞమ్ములుఁ దపములును ధర్మచర్యలు బహువి
ఘ్నమ్ములఁ బెట్టుచుఁ గలయం, గ్రమ్మరి నరవరుల నొక్కకోటికిఁ దెచ్చెన్. 34

మ. ఒకనాఁ డొక్కఁడుఁ బోయి పోయి దివి నత్యుచ్చైప్రదీపయోదంబు నె
క్కి కడుం జె న్నగువీణ చే నమర నక్షీణప్రభావుండు సం
ఖ్యకళాసంజనకుండు నారదుఁడు రాఁగాఁ జూచి యాసన్నపు
ష్పకుఁ డై భక్తిఁ గృతప్రణాముఁ డగుచున్ సల్లాపసౌఖ్యంబునన్. 35

ఆ. అసురవరుఁడు కుశల మడిగిన, నుచితసంభాషణంబు నేసి బంధుభావ
మాదరమున నెఱపి యమ్ముని మానవ, హితముఁ గోరి యతని కిట్టు లనియె.

నారదచోదితుఁ డై రావణుఁడు యమునిమీఁదికిఁ జనుట.

మ. ధరణీచక్రమునందు నీవు సమరోత్సాహంబునన్ రాజులం
బొరివుచ్చం గనుఁగొంచు వించు మది నేఁ బ్రార్థన్ ముదం బందుదున్
హరియుద్ధంబును శూలిసంగరము దేవాధీశసంగ్రామముం
గర మర్థి న్మును సూతు నాకు నవివేద్యం జేయ వి ట్లెమ్మెయిన్. 37

క. ఏ నీకు నొకటి సెప్పెద, దానవకులముఖ్య దేవతలకు నవధ్యుం
డై ననినుఁ బోటివాఁ డీ, మానవుల జయింప విక్రమంబును గలదే. 38

క. కలయం ద్రిమ్మరి మేదినిఁ, గలవీరుల నోర్చి జయము గైకొంటి మను
ష్యులు నీ కెదురే యింకం, గలదే కొదవడ్డచో టఖండితశౌర్యా 39

తే. క్షుత్పిపాసలు జరయును ఘోరరుజలు, నడర నార్తులై యుండుదు రదియుఁ గాక
మర్త్యులిటమున్న వీరు లమర్త్యులైరి, పీనుఁగుల ముట్టి యొడిచిరి బిరుదుగలదె.

క. కావున నిమ్మనుజావళి, నీ వడుచుట మెచ్చుగా దనిన నప్పలుకుల్
దేవారి వోలు నని సం,భావించి మరుత్తపస్విపతి కిట్లనియెన్. 41

నారదవచనప్రబోధితుండై రావణుఁడు యమునిపై దాడివెడలుట.

ఉ. ఏను రసాతలంబునకు నేగెద నాగకులంబు నోర్చి య
ద్దానవులన్ జయించి బలదర్పము లేర్పడ దేవకోటిదు
ర్మాన మడంప వాసవపురంబునకుం జనువాఁడ సన్మునీం
ద్రా నినుఁ గంటి నాకభిమతంబులు సేకుఱు నింక నెమ్మెయిన్. 42

తే. అనిన విని నీకుఁ బాతాళయానమునకుఁ, దెరువుగా దిది సమవర్తిపురము సరణి
యందుఁ జనుమత నిమదంబు నడఁపవలయు, ననిన నమ్మునికనియె నద్దనుజవిభుఁడు.

ఉ. మున్ను ప్రతిజ్ఞ సేసితి సముద్ధతవృత్తి దిగీశకోటికిన్
బన్నముఁ దేరఁ గావున విరోధంబులు శీఘ్రమ చేత నీతి గ
ర్వోన్నతిఁ గ్రాలునాజముని నుక్కడఁగించి క్రమంబుతోడఁ ద
క్కున్న దిశల్ జయించెద సముజ్జ్వలదుస్సహవిక్రమంబునన్. 44

క. పనివినియెద నని మ్రొక్కుచు, దనుజేంద్రుఁడు సనిన వేల్పుఁదపసియు నీతం
డనుమానింపక జముపైఁ, జనియెడు నియ్యగుపురకును సమరం బైనన్. 45

క. వీఁడును వరసిద్ధబలుఁడు, వాఁడును జగ మెఱుఁగ దుర్నివారుఁ డలుకమై
నేఁ డిరువురుఁ దలపడుదురు, వేఁడి మొగంబులన చూతు వేడుకతోడన్. 46

నారదుఁడు రావణునిరాక యమునికెఱింగించుట.

మ. అని యొక్కించుక నిల్చి యుండుగడ గా నత్యంతశీఘ్రంబునం
జని వైవస్వతుఁ గాంచి తా నధికపూజాసత్కృతుండై కృతాం
తున కారావణు రాక సెప్పి యనిలో దోశ్శక్తిఁ జూపంగఁ బూ
ని నిజం బై యిట వచ్చె నేనిఁ జెడఁడే నీచేత నం చున్నెడన్. 47

క. అచటెల్లఁ బుష్పకంబున, రుచి గప్పఁగ రావణాసురుఁడు దైతేయ
ప్రచయకలకలనిరంతర, నిచితనభోభాగుఁడై యమునికి నేతెంచెన్. 48

క. చను దెంచి పురసమీపం,బునఁ దమతమపుణ్యపాపములు గనుఁగొనఁ ద
మ్మనివారణఁ బొందఁగ నున్న నిఖిలజంతువులఁ జూచి నయవిరహితుఁడై. 49

ఉ. కొందఱు సౌఖ్యముం బొరయఁ గొందఱు దుఃఖముఁ బొంద నేల మీ
రందఱు నొక్కచంద మగుఁ డంచు విపద్దశఁ బొందువారి మే

లోండ నొనర్చు దైత్యపతి యున్నదుఁ డై పితృరాజుకింకరుల్
గ్రందుకొనంగ నేపడర గాసిగఁ జేసెఁ దదాజ్ఞ నెంతయున్. 50

యమరావణసేనలు పోరాడుట.

ఉ. రక్షకు లెల్ల నొక్కటఁ దీరంబుగ మోహర మేర్చి యార్చి సం
ధుక్షితకోపు లై యతులదోర్బలదుస్సహలీలఁ దాఁకినన్
రాక్షసులుం బరాక్రమధురంధరతం దగ మాఱుకొన్న వీ
రక్షయకారి ఘోరసమరంబు ప్రకీర్తిత మయ్యె నయ్యెడన్. 51

ఉ. సేనలతోడ నద్దనుజసింహుఁడు సంగరకాంక్ష వచ్చినం
బూనికిఁ దీర్చి కింకరులు పోరుటకు న్మది నుల్లసిల్లి పె
ల్లైనబలంబులం దగుసహాయముగా సమవర్తి వుచ్చినన్
దానవసంగముల్ దలరఁ దాఁకె విశృంఖలదోర్విలాసతన్. 52

చ. జమునిబలంబు పేర్చి నిజసైన్యము నుక్కడఁగించినన్ భుజా
సముదయసంభృతాస్త్రబహుశస్త్రమహోగ్రతఁ జూపెఁ దాఁకి వి
క్రమరసికాంతరంగుఁ డగురావణుఁ డుజ్జ్వలరోషపావకో
ద్యమవినిహన్యమానరిపుదర్పమహానిబిడాంధకారుఁ డై. 53

క. పంపునకు వోఢఁ దగ దని, త్రుంపఁ గడఁగి కాలకింకరులు భీకరు లై
నొంపఁగఁ జంపఁగఁ దఱిమి ని,లింపరిపుం బొదివి రెదఁ జళింపక కడిమిన్. 54

ఉ. ఆశుగచక్రతోమరగదాసికుఠారముఖంబులన్ మహో
గ్రాశయు లై నిజాంగముల నన్నిటి నొక్కట నొంప నల్గి కీ
నాశునివారి నెల్లను వినాశము నొందఁగఁ జేయ వారిపైఁ
బాశుపతంబు వట్టి తెగ వాపె నిశాటవిభుం డుదగ్రతన్. 55

మ. తలఁకెం దోయధిసప్తకంబు గిరివర్గం బెల్ల నూటాడె సం
చలతం బొందె వసుంధరావలయ మాశాచక్ర మల్లాడెఁ గొం
దల మందెం ద్రిదశేంద్రపట్టణము పాతాళంబు ఘూర్ణిల్లె నా
కుల మయ్యెన్ గ్రహతారకాకులము సంక్షోభించె నవ్వేధయున్. 56

చ. అపరిమితప్రతాపుఁ డగునాదశకంధరుచేత ముక్త మై
త్రిపురము లేర్చుభూతపతి తీవ్రశరంబునుబోలె మండి మిం
టిపయిఁ గలంగఁ బేర్చి నిగిడించి యుగాంతమహాగ్నిరీతిఁ బా
శుపత మరాతిసైన్యముల సూరెల ముట్టి దహించె వ్రేల్మిడిన్. 57

చ. జయమునఁ బొంగి పెల్లుగ నిశాచరవల్లభుఁ డార్వ సేనలుం
బ్రియమున నొక్కపెట్ట నలరేఁగి నభంబు సెలంగ నార్చినన్
భయమున దండు గుండుగిలఁ బాఱుడు నాసమవర్తి యెంతయున్
రయమున నుద్భటారుణతురంగసమూహరథాధిరూఢుఁ డై. 58

యమరావణులద్వంద్వయుద్ధము.

ఉ. ముందట మృత్యు వుద్భ్రమితముద్గరహస్తతఁ గ్రాల నుజ్జ్వల
స్యందనపార్శ్వభాగమున నర్చితమై ఘనకాలదండ మొ
ప్పం దనకోప మాననము పైఁ బెనుమంటయుఁ బోలె నాకృతిం
బొంది వెలుంగ నయ్యసురపుంగవుమోహర మున్నచోటికిన్. 59

చ. చని తనమ్రోల వచ్చుమహిషంబుగళంబున ఘంటనిక్వణం
బును ఘనమార్వినాదమును, భూరితరాసురసైన్యతూర్యని
స్వనవిభవంబు మ్రేఁగికొనఁ శాతశరాంబుధినీట ముంచె న
ద్దనుజబలంబు నప్రతిహతప్రదరుం డగుచుం సముద్ధతిన్. 60

మ. జమునాటోపము దుస్సహం బగుడు నుత్సాహంబు వాటింప లే
క మదం బేది బలంబు పెల్లగిలినం గ్రవ్యాదనాథుండు దు
ర్దమబాహాబలుఁడై యెదిర్చె దశకోదండీపముజ్జృంభితో
ద్యమనిర్యాతనిశాతసాయకపటువ్యాపారఘోరంబుగాన్. 61

ఉ. ఈసున నంతకుండు నసురేశ్వరుఁడుం వివిధాస్త్రశస్త్రవి
న్యాసము లేర్పడం జన జయాపజయంబులఁ బొందుచుం రణం
బాసురవృత్తిఁ జేసిన లయావసరం బగుచున్న నాసరో
జాసనుఁ దొట్టి వారలెఱుఁ గారయ వచ్చి రమర్త్యు లందఱున్. 62

శా. దేవవ్రాతము వచ్చినం భుజబలోత్సేకంబుఁ జూడం దశ
గ్రీవుం డుగ్రము లైనసాయకములం గీనాశు నొప్పించినం
జావం జేయుదు దైత్యునం చతఁడు భాస్వత్కాలదండంబు బా
హావిన్యస్తము సేయుచుం భ్రుకుటిబంధాభీలసందీప్తుఁడై. 63

క. మృత్యుపురస్సరముగ లోకాత్యయసమయంబొ నాఁగ నంతకుఁ డధికౌ
ద్ధత్యమునఁ గడఁగి డగ్గఱి, దైత్యుం బొడిసేయఁ గాలదండము పూనెన్. 64

బ్రహ్మ యమరావణులయుద్ధమును మాన్పుట.

ఉ. అత్తఱి గ్రక్కునం సరసిజాసనుఁ డడ్డము సొచ్చి నిల్చి కే
లెత్తి మహాత్మ యిట్టు లుచితేతరవృత్తము నీకు నీడె మ
ద్దత్తవరానుభావమున దానవనాథుఁ డవధ్యుఁ డేన నీ
యుత్తమకాలదండముప్రయోగ మమోఘము గా నొనర్చితిన్. 65

క. కావున దీన నసురపతి, చావును బ్రదుకుటయు నాయసత్యము నిజముం
గావుము లోకము లన్నియుఁ, గావు సుమీ నాకు బొంకు గల్గినయేనిన్. 66

క. తగ దుడుగు మనినఁ బితృపతి, నగి జగముల కెల్లఁ బ్రభువు నలినాసన నీ
వగుట భవదాజ్ఞ కెమ్మెయి, మిగులుదు నే సమరమునకు మేకొని యైనన్. 67

క. నక్తంచరు సమయించుట, యుక్తము గాదేని నిచట నునికి దగదు నే
శక్తుఁడ నై యుండియు భవ, దుక్తికిఁ గాఁ దొలఁగవలసె నోపనిభంగిన్. 68

ఆ. అని రథంబు సూతుఁడును మృత్యుముఖకరి, జవముఁ దానుఁ గూడి జముఁడ దృశ్యుఁ
డైన వేధయును నిజావాసమున కేఁగె, నారదుండు నరిగె నాకమునకు. 69

క. కలయఁ గనుంగొని యెవ్వరు, మెలఁగమి సమరాంగణంబు మిన్నక యున్నన్
గెలిచినవాఁ డై దానవ, కులపతి సనె సుతలమునకుఁ గ్రొవ్వెసలారన్ 70

ఉ. ఆలములోన మైమయిఁ గృతాంతుని నోర్చితి నింక నన్నారుం
డేల యెదుర్చు నంచు మద మెక్కి నిశాచరవల్లభుండు పా
తాళజయార్థ మేగి మహితంబుగ భోగవతీపురంబు గ
ర్వాలసలీల ముట్టె భుజగాధిపుఁడుం గనిరొక్క వినీతుఁ డై. 71

రావణుఁడు నివాతకవచకాలకేయులతో యుద్ధముసేయుట.

క. గణనాతీతవినూతన, మణినికరము గప్పు మిచ్చి మన్ననఁ గని యా
ఫణిపతి సంతస మందెను, మణిమతి యనుపురికి నరిగె మనుజాశనుఁడున్. 72

సీ. అందుఁ బూర్వంబున నంబుజాసనుచేత వరములు గనిననివాతకవచు
లనియెడుదైత్యుల నానిశాచరపతి పోరికిఁ బిలిచిన వారు వొంగి
కయ్యంబు పెద్దయుఁ గాలంబునకుఁ గంటి మనుచు ననేకసైన్యములతోడ
వెడలిన నిరువాఁగు వివిధాస్త్రశస్త్రప్రహారఘోరంబుగా నసమసమర
తే. మేఁడుకాలంబు సేసిన నెఱిఁగి యపుడు, వచ్చి వారలవరముల వలను సెప్పి
తెలిపి సఖ్యంబుసేసినఁ గలసి యచట, జెలిమి మైనుండె దశముఖుఁ డెలమిమిగుల.

క. అతులితనవభోగంబులఁ, గతిపయదినములు నివాతకవచులచేఁ దో
షితుఁ డగుచు నిలిచి శౌర్యో, న్నతి వెలయఁగ నరిగెఁ బద్మనగరంబునకున్.

మ. చని వే ముట్టినఁ గాలకేయు లమితోత్సాహంబునన్ భూమికం
పనసైన్యోద్ధతు లై కడంగి నగరప్రాకారబాహ్యాంగణం
బున వీఁకం దలపడ్డ రావణుబలంబుల్ వీఁగినన్ రేఁగి య
ద్దనుజాధీశ్వరుఁ డస్త్రశస్త్రనిహతిం దత్సైన్యముం గూల్చినన్. 75

ఉ. చూచి మహోగ్రకోపమున శూర్పణఖాపతి వీఁగుసేనఁ జే
పీచి విశృంఖలప్రబల విక్రమదుస్సహుఁ డై దవానలం
బేచినకాననం బడరి యేర్చువిధంబున నన్యసైన్యముం
జూచియుఁ జూడకే బలము సొంపున రూపడఁగించి పేర్చినన్. 76

రావణుఁడు తనమఱఁది యైనవిద్యుజ్జిహ్వునిఁ జంపుట.

చ. వడిగొని కాలకేయభటవర్గము ద్రోచినఁ దాను సేనలుం
గడఁగి నిశాచరేశ్వరుఁడు గ్రందుగఁ దాఁకి రణంబుసందడిం

దాడిఁబడవ్రేసెఁ దీవ్రతరదో।రసినిం దను నీడఁ బోక కో
ఱడమున బిట్టు గిట్టినమ।అంది నెఱుంగక దుర్మదాంధుఁడై. 77

శా. విద్యుజ్జిహ్వుని ప్రేల్మిడిం దునిమి దో।ర్వీర్యం బవార్యంబుగా
నుద్యద్విక్రమవైరివీరసుభట।వ్యూహంబు నెల్లన్ ధను
ర్విద్యాకౌశల ముల్లసిల్ల సమరో।ర్విం గూల్చె నిర్ఘోషసాం
ద్రద్యావాపృథివీదిశావలయగ।ర్జస్ఫూర్జితాకారుఁడై. 78

క. రణవిజయము గైకొని పట్టణ ముద్భటసుభటసంక।టంబుగ భాస్వ
న్మణిగణధనములు మొదలుగఁ, దృణము తుదిగఁ జూఱగొనియె।దివిజారి వెసన్.

రావణుఁడు వరుణపట్టణముపై దాడివెడలుట.

ఆ. ఇట్లు భుజగదాన।వేంద్రుల నిర్జించి, యసుర మసురకవిసి । యంతఁ బోక
కంధివిభునిపురము । కందువ యారసి, యుద్ధవిడిని బురము । నొద్ద కేగి. 80

మ. వరుణుం డెక్కడ నున్నవాఁ డతనిగ।ర్వగ్రంథి మాన్పంగ నే
ర్పరి నై వచ్చితి శస్త్రఘట్టనమునన్ । రక్తంబు వోఁ జేసి నా
ఖరతేజంబునఁ గ్రాఁచి పొం గడఁచి చు।ల్కం జేసి నానాధనా
హరణం బే నొనరింతుఁ జెప్పుఁడు మదీ।యప్రౌఢి యం చుద్ధతిన్. 81

క. పురబహిరంగణమున మో,హరములు దీర్చికొని యున్న।యసురేశ్వరుపై
నురవడిమైఁ దోతెంచిరి, వరుణతనూభవులు రథిక।వర్గముతోడన్. 82

క. సేనలు సేనలఁ దలపడ, దానవపుష్పకము గగన।తలమునఁ గని యు
త్తానలసితరథు లై యం,భోనిధిపతితనయు లతనిఁ । బొదివిరి కడఁకన్. 83

క. చీకాకుపఱిచి బలుగదఁ, జేకొని యతఁ డేయ వ్రేయఁ । జేరువఁ జేరం
గైకొనక తఱిమి యీడం, బోక పెనఁగి రంబుధీశ।పుత్త్రులు గడిమిన్. 84

ఉ. అంత మహోదరాదు లగు।నంబరచారవిదగ్ధులైన దే
వాంతకవీరు లొక్కమొగి । నారథిసంఘముతోడఁ దాఁకి దు
ర్దాంతభుజాబలంబు ప్రథి।తంబుగఁ గేతనముల్ హయంబులున్
దంతిసమూహముల్ దునుక। తండము లై ధర డొల్ల నేసినన్. 85

ఆ. విరథు లైనయబ్ధి । విభుతనూభవులపై, నడరి రౌద్రమున సు।రారి కేలు
దోయిపదిటఁ బదియు । వేయి శస్త్రాస్త్రవి,తతిని బొదివి జర్జ।రితులఁ జేసె. 86

చ. వెఱచఱవన్ దశాననుఁడు । వీరభటావళియుం గడంగి ద
గ్గఱి జలధీశనందనులు । గ్రందుకొనన్ రథహీను లైనయు
త్తఱి నుఱుమాడఁ జొచ్చినఁ బ।దాతులఁ గూడి కడంగి పెల్లుగం
బఱచిరి పట్టణంబుదెసఁ । బౌరజనంబులు బెగ్గలింపఁగన్. 87

మ. వెఱ నిట్లంబుధినాథనందనులు దో।ర్వీర్యంబు సాలించి యం
దఱుఁ బాఱంగ నిశాచరేంద్రుఁడు జయో।త్సాహంబునన్ వెన్నడిం

దఱుమంగాఁ బ్రజఁ జేయి వీచుచు సముద్యద్వేగుఁ డై తోలి తొ
ప్పఱఁ బెట్టెన్ శరజాలముం బిఱుదఁ గుప్పంగూర నాఁటించుచున్. 88

ఆ. వరుణుబలముఁ దనయవర్గంబుఁ గోట సౌరంగఁ బాఱ నెగచి రావణుండు
జలదనిస్వనంబుచందంబు నెలుఁ గెత్తి, యెల్లదిశలు సెలఁగ నిట్టు లనియె. 89

క. పడుచులచేతను నీక్రియఁ, బొడిపించిన దశముఖుండు వో నిచ్చునె తాఁ
గుడిచెం గట్టెం గలనికి, నడచుం గా కింక నొదిఁగినం దను నగరే. 90

క. అనుపలుకులకుఁ బ్రభాసుం, డనువరుణామాత్యుఁ డచట నందఱుఁ జన గ్ర
క్కున మరలి యితని నుడిగిం,చినఁ గార్యం బగున యట్లు చేసెద ననుచున్.

చ. వరుణుఁడు పద్మగర్భుఁ గొలువం జనియెం బెఱవారు వచ్చి సం
గరమున నీకు నోడిరి జగద్విదితంబు భవద్భుజాబల
స్ఫురణము గావునన్ దివిజసూదన నీ కెదు రెవ్వ రిందులో
నరయఁగ నిందె కాదెచటనైన నొకండును గల్గనేర్చునే. 92

క. అనిన విని పొంగి తనుఁ జే,రొక్కని బొబ్బిడి రావణాసురుఁడు ప్రజ మరలుం
డని చేయి వీచె జృంభిత, దనుజసమూహప్రశంసితగుణుం డగుచున్. 93

ఉ. రాజితసౌధపంక్తిరుచిరద్యుతిజాలము పర్వి నిత్యవి
భ్రాజితచంద్రికావిభవభంగిన యెప్పుడునప్పురంబుఁ గే
లీజితవైరి రావణుఁడు లీలమెయిం జని కీర్తికాంతిసం
యోజితరేఖ గ్రొత్త యగుచుండఁగఁ జేసి మదం బెలర్పఁగన్. 94

క. మరల విడిసి గెలుపునఁ బొం,పిరివోవుచు లంకఁ దలఁచి పెను పొనరఁ జమూ
వరులఁ బిలిపించి పోదము, పురమున కని చెప్పె దనుజపుంగవుఁ డెలమిన్. 95

చ. పయనము చాటఁ బంచి సులభంబుగఁ బూరియు నీరు వంటక
ట్టియలును గల్గుచోట్లను గడిందిమగల్ దగునుక్కళంబుగా
భయ మనువేరు లేక నిరపాయముగా విడియించుచున్ మనగ
ప్రియ మగుభంగి సేన నడపించె విశృంఖలవైభవంబునన్. 96

చ. బలములతోడ మేదిని నభంబునచేరువ నంతకంటె న
గ్గలముగ నెక్కి సైనికులకన్నుల కందనిచోట డాపలన్
వలపల దవ్వుగాఁ దొలఁగి వావిరి నెచ్చట నేని వచ్చుఁ దా
నలసినయట్టు లల్పపరివారయుతంబుగఁ బుష్పకంబునన్. 97

రావణుఁడు లోకములోని స్త్రీలనెల్లఁ జెఱలువట్టుట.

ఉ. ఆసమయంబున న్నగనియాంద్రురు కన్యలు నాక చొచ్చి ధా
త్రీసురరాజవైశ్యులను దేఁకువ సేయక యెల్లజాతులుం
గాసిగ నొక్కపెట్టుగఁ బ్రకాశరహస్యవిభేదహీనుఁ డై
యాసురవైరి పట్టెఁ జెఱ లడ్డము లేక మృగాయతాక్షులన్. 98

క. మునిసిద్ధయక్షకిన్నర, దనుజోరగకన్యకావితానము నెల్లం
గొనివచ్చి వచ్చి పుష్పక,మునఁ బెట్టుచు వచ్చెఁ బంక్తిముఖుఁ డనయుం డై. 99

సీ. తట్టికి వచ్చి యిట్టట్టు వోనేరని లేళ్లవిధంబున లీల యెడలి
వలఁ జిక్కి యెక్కడ మెలఁగంగ నేరని చిలుకలచాడ్పునఁ జెన్ను దఱిఁగి
మావునఁ జొరఁబడి యావలఁ జన లేని మీలచందంబునఁ జాలఁ గుంది
యురులలోఁ బడి యెందు నరుగంగఁ జాలనినెమిళులతెఱఁగునఁ గొమరు దక్కి
తే. కలయఁ జూచుచుఁ బలుకంగ నెలుఁగు రాక,నలఁగు మేనులతో నెఱిఁదలలు వీడి
వెగడుపడి యెల్లనై కడు విన్నఁబోయి, పుష్పకంబున నున్న యప్పొలఁతు లెల్ల.

క. కొలఁదికి మీఱిననెవ్వగ, నలఁదురి నానావిధంబు లైనతమతలం
పులగతి నొర్తొర్తునకును, దెలియ విలాపములు సేయు తెఱఁ గెట్లనినన్. 101

క. చంపు నొకో యక్కట కా,రింపఁ దలంచు నొకొ లఘుచరిత్రంబులకుం
బంపఁ గడంగు నొకో శం,కింపం డీకఱకుటసుర గీ డొనరింపన్. 102

రావణునిచెఱం బడిన స్త్రీలు విలపించుట.

మ. మగఁడా నీవు జగంబునొప్పు మిగులన్ మానంబు వాటింతు వా
లిగ నెగ్గం బగుమాట వాటిలెనె తల్లీ నీకు లోకంబుపా
టిగ ని ట్లొందెనె నిందతోడివగ తండ్రీ యెందుఁ గీర్తింపఁగాఁ
దగునీసంతతి కీడునం దొడరెనే దైవంబు చెయ్యిం గటా. 103

తే. చమురు నెత్తురు నన్నుబంధుసమితి గరము, ప్రీతి నఱకాళులకు లత చేతు లొగ్గ
నునికి యెక్కడ నీక్రూరదనుజుబారి, కగ్గ మై వచ్చు టెక్కడ నకట విధియ.

ఉ. ఇమ్ములఁ దోడ నాడుచెలు లే మను చుండుదు రొక్కొ యిప్డు నా
తమ్ముని ముద్దుమాటలు గొదల్పడఁ బల్కెడుచిల్కబోద ని
త్యమ్మును బొత్తునం గుడుచు నర్మిలి చేడ్పడు మవ్వ మెక్కి యొ
క్కమ్మడి నంకురించులత లొప్పు దొఱంగవె నీరు గానమిన్. 105

ఉ. చిత్తము గుంది చుండఁ జెఱ నేయుటకంటె విశుద్ధ మైననా
వృత్తము గోలుపుచ్చుటకు వేగ తలంపక నన్ను లగ్గుగాఁ
గత్తులఁ గోసి దానవులు గండలు దిం డ్రని కట్టిఁ డైనవీఁ
డిత్తఱి నెట్టు లైన సమయింపఁ డొకో దొసఁ గెల్ల మానఁగన్. 106

క. అని పెక్కు తెఱంగుల న,వ్వనితలు దురపిల్లి యిట్లు వనరుచుఁ జదలం
జని చని నలుదిక్కులఁ గనుఁ,గొని పల్కరి తల్లడంబు గూరిన మఱియున్. 107

ఆ. ఇంక నేటిలోక మీదుష్టదైత్యుని, కిట్ల చెల్లె నేని యెల్లి నేఁటి
లోనఁ బాడు గాదె యీనలినాసను, రాజసంబు నిప్పు యోజనముగ. 108

చెఱఁ బడ్డయింతులు రావణుని శపించుట.

క. తగు విక్రమంబు సేయుట, యగునే పరసతుల నిట్టు లదయతమై నె
వ్వగలం బొగిలింప నతనికి, మగటిమి గా నేర్చునే యమంగళ చేష్టల్. 109

చ. పరమపతివ్రతావిభవభాసురలీల వెలుంగుమమ్ము ని
ష్కరుణత నిమ్మెయిం బఱిచెం గావున నీదనుజాధముండు స
త్పురుషపరిగ్రహం బయినపుణ్యసతిం గలుషింపం జేసి త
ద్వరునిపరాక్రమంబున నవశ్యము మృత్యువుం బొందుం గావుతన్. 110

క. అనవుడు దశాస్యుం డాశాపనిహతిం బ్రభ సెడియు బాహుబలమదమునం గై
కొనక నలి నపహసించుచు, ననుమానము లేక యెలమి నరుగుచునుండెన్. 111

సీ. ఉడుగక కాల్చుచు నుండెడుశోకంబ యతితీవ్రహవ్యవాహనుఁడు గాఁగ
నిట్టూర్పుగాడ్పులు నిగిడించుటయ విలసిల్లఁ బ్రజ్వలితంబు సేఁత గాఁగఁ
బాయక యొనరించు బహువిలాపంబుల రాజితమంత్రాక్షరములు గాఁగఁ
గన్నీరు బోరనఁ గ్రమ్మించుటల పొరిం బొరి నాజ్యధారలు పోఁత గాఁగఁ
తే. గొలఁది కగ్గల మై యెదఁ గలుగువగల, యొనరుసమిధలు గా నిట్టు లువిదపిండు
రావణాభిచారంబుగ భావమందు, నుగ్రముగ వేల్చు తెఱఁగున నుండెఁ జూడ.

రావణుఁడు దిగ్విజయము చేసి వచ్చి లంకం బ్రవేశించుట.

క. ఇత్తెఱఁగున దశకంధరుఁ, డత్తరుణులఁ గొంచు లంక కరిగెం బౌరుల్
చిత్తము లలరం గానిక, లుత్తమవస్తువులు దెచ్చి యొప్పింపంగన్. 113

చ. ప్రియ మెదఁ బల్లవింపఁగ విభీషణుఁ డాప్తులుఁ దాను నెంతయున్
రయమున భూషితద్విపతురంగముఁ డై యెదురేగి యన్న పా
దయుగము దాయ భక్తిమెయి దండనమస్కృతి సేసినన్ హరా
ద్రి యెగయ నెత్తి కీర్తిం బ్రచురించినబాహుల నెత్తెం దమ్మునిన్. 114

ఉ. ఎత్తియుఁ గౌఁగిలించి దనుజేంద్రుఁడు లోచనపద్మషండముం
జిత్తసరోరుహంబు విలసిల్లఁ గనుంగొని కుంభకర్ణుఁ డిం
దిత్తఱి మేలు కానఁడె యహీనపరాక్రమశాలిఁ దామసా
యత్తునిఁ జేసె మాలవిధియం బొకయించుక చిన్నవోవుచున్. 115

క. ఇభతురగస్యందనగతి, రభసంబునఁ బృథివి యద్రువ రక్షోవంశ
ప్రభువు నగరంబు సొచ్చెను, విభవోజ్జ్వలుఁ డగుచు వినయవినుతులు సెలఁగన్.

ఆ. ఒక్కచందురుండ యుదయింపఁ బొంగెడు
నంబురాశి యిది పురార్ణవంబు
దనుజపతిముఖేందుదశకసన్నిధి నుబ్బు
చున్నె యనఁగ వీట నులివు మిగిలె. 117

శూర్పణఖ తనమగనిఁ జంపె నని దుఃఖించి రావణుని దూఱినాడుట.

క. అయ్యవసరమునఁ దనపతి, కయ్యంబునఁ బంక్తివదను । ఖడ్గనిహతి రెం
డయ్యె ననిశూర్పణఖ విని, పయ్యెదకొం గెడల బుడమిఁ । బడి మూర్ఛిల్లెన్.

చ. సభయము లైనడెందముల । సంభ్రమ ముమ్మలికంబుఁ గప్ప సం
క్షుభితసఖీజనం బొలయఁ । గొండొకసేపునఁ దేఱి తీవ్రశో
కభరితచిత్త యై మొగముఁ గప్పెడుబాష్పజలంబు లంబుజ
ప్రభ సెడ ముంచు పెన్వఱద । భంగిగ నెవ్వరి నేనిఁ జూచుచున్. 119

ఆ. అరుగుదెంచి యన్న । యడుగులకడ నార్త
నాద మడరఁ ద్రెళ్లి । నాథుఁ బనవి
యేడ్చు చున్న నల్ల । నెత్తి యమ్ముద్దియఁ
దడవి కన్నునీరు । దుడిచి యతఁడు. 120

క. సముచిత మగు తెఱఁగున శోకము వాపుట కనునయింపఁ । గడఁగి తదాలా
పములకుఁ జొచ్చుటయును గోపమునను రక్కసియుఁ గరము । ప్రల్లదురాలై.

ఉ. అక్కటికంబు మాలి చెలియల్ వగఁ బొందదె నాకు దీన దూ
ఱెక్కు జగంబునం దనక । యింతయుఁ గొంకక పాపవృత్తికిం
స్రుక్కక వైర మెత్తి కడుఁ । గ్రూరుఁడ వై యిటు సేత చూడఁగా
దిక్కులు గెల్వఁ గాదు నను । ద్రెక్కొనఁ బోయితి గాని యిమ్మెయిన్. 122

క. అగ్గలిక మెఱసి కడఁగుచు, మొగ్గరములు గడచి పోయి । మును మును మఱదిం
మ్రొగ్గతిలఁజేసి దీనికి, సిగ్గువడనినిన్ను నేమి । సెప్పదుఁ జెపుమా. 123

రావణుఁడు శూర్పణఖ నూరడించి దండకారణ్యమునకుఁ బంపుట.

చ. అనవుడుఁ గ్రందుఁగయ్యమున । నప్పటికిం మనవారు లాఁతివా
రని మది నేర్పరింప వశ । మమ్మ దురుక్తము లేల యింక నా
తని మగిడింప వచ్చునె వృ।థాపరితాపము దక్కు నీదునె
మ్మనమున కెట్టు లట్టుల సమస్తధనంబులు వేడ్క నిచ్చెదన్. 124

క. అని యొకభంగిం దననేర్చినయట్టులు సెప్పి తీర్చి । చెలియలి నూరా
ర్చినవాఁ డై యవ్వనితకు, మనుజాశనుఁ డిట్టు లనియె । మఱియుం బ్రీతిన్. 125

సీ. దండకారణ్యంబు । దద్దయు హృద్యంబు శుక్రశాపమున నచ్చోటు దైత్య
వాస మయ్యెడుఁ గాన । నీసమయంబున నెలవు గైకొని ఖరు । నిల్పువాఁడ
నతఁడు పిన్నమఱఁదు । కయ్యును మనము దా మనుభేద మెఱుఁగని । యట్టివాఁడు
నీదెస మిగులంగ । నెమ్మివాటించు నయ్యెడ నీవు వసియింపు । మిపుడ పోయి
ఆ. యిష్ట మగుపదార్థ । మెయ్యది యేనియు, ననుదినంబు వేడ్క । నడిగి తెచ్చి
యనుసరించి నడపు । మని నియమించెద, నేను గలుగ నీకు । నేమి కొఱఁత.

చ. అని యిటు లూఱడించి ఖరు నప్పుడ పిల్వఁగఁ బంచి యాదరం
బునఁ దగు రాజచిహ్నములు భూరిబలంబును నిచ్చి మంత్రులై
చనుఁ డని దూషణుం ద్రిశిరు సత్కృతిపూర్వము గాఁగఁ బుచ్చి యం
దునిచె నతండు శూర్పణఖయుం బ్రియ మందిరి రాజ్యసంపదన్. 127

రావణుఁడు కుంభిల యనువనమున యజ్ఞము సేయుచున్న యింద్రజిత్తుం జూడఁబోవుట.

క. చెన్నొందఁగఁ దనయింటికిఁ, గన్నాకయి మెఱసియుండు గాదిలితనయుం
జన్నములు సేయ నడవిన, యున్నాఁ డని విని దశాస్యుఁ డుద్యోగమునన్.

క. అరదమున నేగె సముచిత, పరివారముతోడఁ జెలఁల పడఁతులు డెందం
బురియఁగఁ బుష్పకమున నిర్భరవేదన నుండ నసురపతి నిష్ఠురుఁ డై. 129

తే. తెరువు సూపుచుఁ జటులకేసరిని నెక్కి, కెలన వచ్చువిభీషణుపలుకు లర్థి
నాదరించుచు నతనిచే నచటివింత, లెల్ల నెడనెడ నెఱుఁగుచు నింపు మిగుల.

క. కుంభిళ యనునుగ్రాటవి, శాంభవ మగునొక్కపూజ్యసత్రముఁ దగఁ బ్రా
రంభించి శివునిచేతను, సంభావితుఁ డైనతనయు సవనము సేరెన్. 131

చ. చనుటయు నాతఁ డుల్లమున సంతస మాననకాంతి వింత సే
య నెదురు వచ్చి తండ్రిచరణాబ్జయుగంబు శిఖాభిరామ మై
ననిజశిరంబు గూడఁగఁ బ్రణామము సేసిన నెత్తి యర్మిలిం
దనపదిదోయిచేతుల నతం డిఱికౌఁగిటఁ జేర్చె నందనున్. 132

క. ఆదరమున మహితచతు, ర్వేదమహాఖ్యాతమంత్రవిధులను శుక్రుం
డాదైత్యపతికి నాశీ, ర్వాదం బొనరించె విప్రవరసహితుం డై. 133

చ. నగుచు దశాననుండు భృగునందనుతో నిది యేమి యీతనిం
బోఁగఁ బడఁ బంచి యివ్విపినభూమి నిరోధము సేసి దీన మీ
రు గనినలాభ మేమి యమరుల్ దగుభోజ్యము లెల్ల మ్రింగి మో
పుగొనుచు మిమ్ము నాలిగొని పోయిరి వేయును నేల నావుడున్. 134

ఆ. అట్టు లనకు మన్నయసదృశవ్రతుఁ డగు, నీదువరసుతుండు నిరుపమాన
మహిమ వెలయ మున్ను బహువిధయజ్ఞంబు, లాచరించి పిదప నభవుగుఱిచి 135

క. మాహేశ్వర మగుయాగము, దోహలమునఁ జేయఁ గ్రతువుతుది నాశివుఁ డ
ర్ధాహితనారీకమ్మగు, దేహం బుద్దామవృషగతిం జెలు వొందన్. 136

మ. దయ నిచ్చోటికి వచ్చి కామగతి హ్యాస్యస్యందనంబుం దమో
మయమాయాచరితంబు శాత్రవబలోన్మాథక్రియాదక్షదు
ర్జయశాపంబును దివ్యబాణనిచయస్ఫారానుభావంబు న
క్షయతూణీరయుగంబు నిచ్చెఁ బటుదోర్గర్వం బఖర్వంబుగాన్. 137

తే. నీవు సనుదెంచితనుమహానీయమహిమఁ, బురికిఁ దోకొనియరుగంగఁ బోవువేడ్క
నెదురుసూచుచు నున్నంతనేగుదెంచి, తనిన భార్గవుపలుకులు విని సురారి. 138

రావణుం డింద్రజిత్తుఁ గుంభికనుండి లంకకుఁ దోడ్కొని వచ్చుట.

క. అగుఁ గాక యింకఁ జేయునది గలదె పోనిమ్ము సురలుఁ దేఁకువ సెడఁగం
దగమికిఁ జెప్పితి మనకుం, బగ యింద్రుండ కాఁడె యెల్లభంగులఁ దలఁపన్.

చ. అని గురుఁ బ్రీతి వీడ్కొని మహాబలముల్ దనవజ్జ వచ్చినం
గని కరులం దురంగములఁ గాలుబలంబుల నేర్చి యొక్కయొ
డ్డనముగఁ దీర్చి సుందరపటధ్వజదండము లెత్తఁ బంచి తూ
ర్యనినదపూరితక్షితినభోంతరుఁ డై దనుజేంద్రుఁ డున్నతిన్. 140

క. ముసు రమ్యపదార్థంబులు, గొని వీథు లలంకరించుకొని జనులు గనుం
గొనియెడు వేడుక గుబురులు,గొని యున్న పురంబుఁ జొచ్చెఁ గొడుకుం దానున్.

ఆశ్వాసాంతము.

చ. పరిజనపద్మమిత్రునకుఁ బాతకమిత్రున కన్యసైన్యవి
స్ఫురణలతాలవిత్రునకు సుందరగాత్రున కిందిరామనో
హరసుభగాతపత్రునకు నంబుజనేత్రునకుం బ్రమోదని
ర్భరధరణీకళత్రునకు రాజితగోత్రున కిజ్జగంబునన్. 142

క. లావణ్యవిసరనవబా,లావృతచతురాంగనానయశచివరునకుఁ
సేవాగతబహువిధవసు,ధావల్లభసంకటీకృతద్వారునకున్. 143

మాలిని. శతమఖగురులజ్జాసంపదాపాదనోద్య
న్మతికి నమితశత్రుక్ష్మాపసేనాతమోగో
పతికి నిహతశేషప్రత్యయైకార్థకార్య
స్తుతికి విజయమానద్రోహిబాహాసికుర్విన్. 144

గద్యము. ఇది శ్రీమదుభయకవిమిత్త్ర కొమ్మనామాత్యపుత్త్ర బుధారాధనవిధేయ
తిక్కననామధేయప్రణీతం బయినయుత్తరరామాయణం బనుమహాకావ్యంబు
నందుఁ బంచమాశ్వాసము.

శ్రీ ర స్తు.

నిర్వచనోత్తర రామాయణము

షష్ఠాశ్వాసము.

యుతునకుఁ గాంతిప్రా
లేయరుచికి ధర్మమతికి లీలాసుమన
స్సాయకునకుఁ బుణ్యాధి
ష్ఠాయకునకు మనుమసిద్ధి జనపాలునకున్. 1

క. దనుజాధీశ్వరునకు మును,మును పుట్టినకొడుకు ధర్మమున నీశ్వరుఁ దృ
ప్తునిఁ గావించి వరంబులు, గనిన సుహృద్బంధుపౌరగణము లెలర్పన్. 2

చ. మన మలరంగ సద్భటసమాజము నూరెల నిల్వ నెంతయుం
బెనుపున మేఘనాదుఁడు విభీషణుఁడుం దనతోడ రా మదిం
చినకరివోలెఁ బుష్పకముఁ జేరి మృణాళలతాలివోనియ
వ్వనితలపిండు దైత్యకులవల్లభుఁ డల్లన డించి తెచ్చినన్. 3

మ. తరుణీబృందముఁ జూచి సారకరుణోదారుండు దైత్యేశ్వరా
వరజుం డావలిమోము సేసికొని యేవం బిచ్చరిత్రంబు ని
ష్ఠుర మోహో యని సంచలద్వదనుఁ డై శుంభద్భుజాగర్వవి
స్ఫురితుం డైననిజాగ్రజన్ము మొగముల్ సూచెన్ విషాదంబుతోన్. 4

ఆ. తన్నుఁ జూచి మనమునఁ గుందు తమ్ముని భావించి, నగుచు దైత్యవంశనాయకుండు
పగఱవారిఁ జెఱలఁ బట్టక ముద్దాడి, వత్తు రయ్య శౌర్యవంతు లనిన. 5

చ. గుణ మిది దోష మిట్టి దని కొంత యెఱింగినఁ గాక యిట్లు ని
ర్గుణతయ పట్టి క్రూరతమకుం దగువారలు సెప్పుసౌమ్యభా
షణము నిరర్థకం బనువిచారము నెమ్మదిఁ బుట్టి యవ్విభీ
షణుఁ డుచితంపుమాటలఁ బ్రసంగము డిగ్గఁగఁ ద్రావి యిట్లనున్. 6

విభీషణుఁడు కుంభీనసను మధుఁ డపహరించె నని యన్నతోఁ జెప్పుట.

క. నీ వరిగినదిగ్జయమున, నీవల మధుదానవేంద్రుఁ డేతెంచి పురిం
గావలి యున్న దనుజసుభ,టావలిఁ బొరిపుచ్చి భుజబలాటోపమునన్. 7

తే. ఉవిద లాక్రందనము సేయుచుండ నొక్క
రమణిఁ గొనిపోయె నంతఃపురంబుఁ జొచ్చి

యదియు మనమాల్యవంతుని యనుఁగుఁగూఁతు
ననుఁగుఁగూఁతురు కుంభీనసాభిధాన. 8

ఉ. యజ్ఞరసప్రమత్తుఁ డగునాత్మజుపై సడి వెట్ట లేదు నా
యజ్ఞత నప్పు డేఁ జని సమాధినిమగ్నమనఃప్రవృత్తిఁ గా
లజ్ఞుఁడఁ గాక వారిధిజలంబులలోన మునింగి యుండి య
ప్రాజ్ఞులచేత నాలిఁబడుపాటికి వచ్చితి నేమి సెప్పుదున్. 9

క. అనుడు బొమలు ముడివడునా, ననములఁ గెం పడర నసురనాథుం డేమీ
మనవీ డొకరుఁడు సొచ్చెనె, యనుమానము దక్కి గుండె లదరక చక్కన్.

క. రాసొబగున నున్మత్తుం, డై సెంకింపక కడంగి యాఁతం డింతల్
నేసెఁ గదె చెడితి రిప్పలి, మీసల నుయ్యాల లూఁగి మెయిమెయిఁ బోయెన్.

చ. చెలియలిఁ గోలుపోయి యెడనేసినఁ జాలమి వెట్టి నవ్వరే
కెలనను గాన నమ్మధువు గీటడఁగించెద దాడి వెట్టి నా
బలిమి దఱుంగ నీనడిమి బన్నము విన్న నమర్త్యు లెంతయుం
జెలఁగక తక్క రందుఁ జని చేతులతీఁటకు మందు సేసెదన్. 12

మధునిపై దండెత్తినరావణుఁడు కుంభీనసప్రార్థనచే వానితోఁ జెలిమిసేయుట.

మ. అని వీటం దనపిన్నతమ్ము నిడి నిద్రాసక్తుఁ డై యున్నత
మ్ముని బోధింపఁగఁ బంపి తోడ్కొనుచు నేము న్నేన ము న్నంచు నీ
సున నాతండును మేఘనాదుఁడును రక్షోవంశవీరోత్సవం
బొనరింపన్ మధుమానమర్దనవిదగ్ధోత్సాహసన్నాహుఁ డై. 13

క. చని మధురాపురి ముట్టిన, విని కుంభీనస భయంబు వినయంబు జనిం
ప నరుగుదెంచి ధరాలిం, గనముగఁ గృప పుట్ట నన్నకాళ్లం బడియెన్. 14

తే. అతఁడు కరుణాసమేతుఁడై యతివ నెత్తి, నిన్నుఁ దెచ్చినపాపాత్ముఁడున్నచోటు
సెప్పు మిప్పుడ వాని నిర్జించి నీకు, హర్ష మొనరింతు ననిన నయ్యంబుజాక్షి.

మ. తగునే నీయిలు సొచ్చి నన్నుఁ గొని రాదైతేయవంశాధముం
డు గరం బెగ్గొనరించెనైనను భుజాటోపంబు సూపంగ లో
కగరిష్ఠుం డగునీకు వాఁడు దొరయే కన్యాత్వమే నాకు లే
దు గదా పడ్డది కార్య మింకఁ జన దాదుష్టాత్ము నిర్జింపఁగన్. 16

క. మధువున కలుగుట యది నను, విధవంగాఁ జేత గాన వే యేటికి వాఁ
డధముం డనలే నెమ్మెయి, వధియించుట పాడి గా దనవద్యవిహీనా. 17

తే. అదియుఁ గాక రాక్షస మన మొదలఁ బరిణ
యప్రపంచంబునం దొకయధమవిధము
గలదు గావున నది గాఁగఁ దలఁచి యైనఁ
దప్పు సైరింపు నాకుఁ గా దళితవైరి. 18

క. అతఁడు నతిబహుళనిద్రా,యుతుఁడై యున్నాఁడు గాచు । టొప్పదె సంబో
ధితుఁ జేసి తెచ్చి సేవా,రతుఁ జేసెద ననిన దనుజ । రాజి ట్లనియెన్. 19

చ. అలఁతులఁ బోవుతప్పె యిది । యైనను నాతఁడు నేతికుండపై
యొలుక సలంబుఁ బోవిడిచి । యేను భవత్పతిఁ గాచితిన్ మనం
బలరఁగఁ బోయి నిద్ర దెలి । యుంగ నుపాయము సేయు నాకు నె
చ్చెలి యగుఁ దోడితె మ్మనినఁ । జేడియ సమ్మద మంది క్రమ్మఱన్. 20

చ. చని పతి నిద్ర దెల్పి దను । జప్రభు రాకయుఁ దాను బోకయున్
మన మలరంగ బాంధవపు । మాటల సంధి దగంగఁ జేసి యా
తనిఁ దమయన్న పాలికి ము । దంబునఁ దోకొని పోవఁ బూని వ
చ్చినతన దైనపూనికయుఁ । జెప్పిన గొండొక సమ్మతించుచున్. 21

క. మీయన్నకుఁ దేజముగాఁ, బోయి యతనిఁ గంటి నన్ను । బోధింపవ యే
నాయనకుఁ జాల నని యిఁకఁ, జేయునదియుఁ గలదె గడవఁ । జేసితి తరుణీ. 22

క. ఈచనవు సెల్ల నిచ్చితి, నీచెప్పినయట్ల యతని । నేఁ గనియెద మై
త్రీచాతుర్యసమగ్రుఁడ, నై చేసెదఁ బిదపఁ దగుస । హాయం బెల్లన్. 23

ఆ. అని యలంకరించు । కొని తనసేన స,న్నాహసుందరముగ । నడవఁ బనిచి
వారణేంద్రు నెక్కి । వచ్చి బావకుఁ బొడ,సూపె మధువు పెంపు । సొంపు మిగుల.

మధుఁడును రావణుఁడు నింద్రునిపై దండెత్తుట.

ఉ. ఆదశకంధరుం డుచిత । మర్యాదుభంగి మఱందికిన్ మహా
హ్లాద మొనర్చి పేర్చి యమ । రాధిపుపై నడవం దలంచు ట
త్త్యాదరలీలఁ జెప్పి తగ । నప్పురి నాఁడు వసించి యాతఁడుం
గా దన కెత్తితో నడవఁ । గా మఱునాఁ డటఁ బోయె నుద్ధతిన్. 25

ఉ. రావణుఁ డిట్లు దేవనగ । రంబుపయిన్ బలపాదధూళివి
ద్రావితసర్వదిగ్వలయ । రాజకులుం డగుచుం గడంక మై
బోవునెడం బథంబున న । భోవిభవంబుఁ దిరస్కరించుశృం
గావళి నుల్లసిల్లురజ । తాద్రిఁ గనుంగొని కౌతుకంబునన్. 26

ఉ శూలినివాస మై తెలుపు । సొంపునఁ బొంపిరివోవునమ్మహా
శైలముచక్కఁ జక్కటికి । సప్తతురంగముఁ దేగుదెంచి యు
త్తాలపుదేవగేహము సు । ధం జెలువొందఁగ నందుఁ బేర్మికిం
జాలి వెలుంగురత్నకల । శంబువిధంబునఁ దేజరిల్లెడున్. 27

ఆ. అనుచు నగముఁ జేర । నరిగి రక్షోవంశ,కరుఁడు దానిసొంపు । గలయఁ జూచి
యనుఁగుఁదమ్మునికిఁ బ్రి । యమ్మునఁ జూపుచు, నిట్టులనియె వేడ్క । యొసక మెసఁగ.

కైలాసవర్ణనము.

క. నెలఱేఁడు వాఱఁ జెలు వగు, శిలపైఁ దజ్జలము దిగుచు సింధురపతి చూ
డ్కులకొప్పెఁ బుండరీక, స్థలమున మకరంద మానుషట్పదము క్రియన్. 29

చ. అరవిరిగుత్తులం బొలిచి యల్లనిగాడ్పులఁ దూలునీలత
ల్దరహాసితోదయంబు సవిలాసతనూవలనంబుఁ గల్గుసుం
దరులతెఱంగు గాఁ బతిపిధంబున నున్నరసాలపోత మీ
గిరితటభూమికిన్ సరసకేలికి వచ్చినమాడ్కి నొప్పెడున్. 30

క. మనరాక హర్మ్యతలమునఁ, గనుఁగొనియెడు కామినులమొగంబులు వాతా
యనమునఁ గానఁగ నగుచా,డ్పున నీతమ్మికొల నొప్పె భూధరముపయిన్. 31

క. ఈవెండికొండశిఖరము, క్రేవఁ దమాలతతి దృష్టికిం బ్రియ మొసఁగం
గా వలఁతి యయ్యె నీల,గ్రీవునికంఠంబుకప్పుక్రియ నందం బై. 32

చ. అని గిరి రామణీయకమునందు మనం భెలయించి యద్దశా
ననుఁడు బలంబుఁ దత్తటమునన్ విడియింపఁ దలంచి సన్నివే
శనవిధిసూచనార్థము దెసల్ సెలఁగన్ బటుభేరి వ్రేయఁగాఁ
బనిచి మనోహరం బయినపట్టునఁ దా విడిసెన్ బ్రియంబునన్. 33

ఆ. ఇట్లు విడిసి దానవేంద్రుఁడు బహువినో,దములఁ దగిలి చతురసముచితాల్ప
పరిజనములతోడ గిరితటరమణీయ,తలమునందుఁ గేలి సలిపె నర్థి. 34

క. మగుడఁ జనుదెంచి యర్ఘ్యం, బగుగతి మజ్జనముఁ గుడుపు నైనపిదపఁ దాఁ
దగ లోపలికొలువున నిం,పుగ సుఖసత్కథలఁ బ్రొద్దు వుచ్చె సరసుఁ డై. 35

ఉ. అంత సహస్రపాదుఁ డపరాచలశృంగతటంబు సేరె దు
ర్దాంతుఁడు దానవేంద్రుఁ డమరప్రకరంబు జయింపఁ బోవుచో
నెంతలు వుట్టునో యనుచు నే పడఁగంగఁ దొలంగి కాలుకొ
న్నంతయు దవ్వుగాఁ జని భయం బడరన్ గిరిదుర్గ మెక్కెనాన్. 36

క. అరుణకరబింబ మస్తశి,ఖరిపైఁ గర మొప్ప బహులకస్తూరీలి
ప్తరుచిరకుచకాశ్మీర, స్ఫురితస్థాసకముచందమున నందం బై. 37

క. మఱి కొంతవడికిఁ జీఁకటి, తఱచై తోతెంచె దశవదనునుద్యోగం
బెఱిఁగి నిశాటబలము గ్రి,క్కిఱియం బలుదెసలనుండి యేతెంచె ననన్. 38

అంధకారవర్ణనము.

సీ. ఇది చూడ్కిఁ గప్పిన యంతటఁ బోక తక్కటియింద్రియంబులఁ గప్ప కున్నె
యిది వెల్లిగైకొని యేచి యిండ్లులు సొచ్చి దివియలఁ బొరిగొనఁగవియ కున్నె
యిది నేఁడు శశి గెల్చియెల్లి యేతెంచునన్నలినాప్తు మార్కొని నిలుప కున్నె
యిది వెలుం గనునామ మెల్లను నుడిపి యిజ్జగతి నింకెటుఁ దాన నెగడ కున్నె

తే. నిక్కముగ నిది చీఁకటి యొక్కొ తలఁప, నేమి మాయయొ కాక మున్నిట్టితిమిర
మెఱుఁగ మెన్నఁడు నాజను లెల్ల బెగ్గ,లించునట్లుగఁ గడు నగ్గలించెఁ దమము.

చంద్రోదయచంద్రికావర్ణనములు.

తే. యామినీకాంతమృగమద మలఁది మలయ, జమునఁ దిలకంబుఁ బెట్టిన చందమగుచు
నిఖిలదిక్కులఁ దిమిరంబు నిండియుండ, నలఁతి రైయొ ప్రాఙ్ముఖంబునఁ దెలుపు దోఁచె. 40

క. రావణుఁ డమరులమీఁదం, బోవుట విని యతనితోడి పురుడునకుం బాం
థావలిపై వెస వచ్చెం, గావలయు ననంగ నమృతకరుఁ డుదయించెన్. 41

సీ. చిత్తజుచిగురులం జిత్రంబుగా నిడ్డ లలితతమాలపల్లవ మనంగ
రతిపుమాణిక్యదర్పణమున నూనిన కమనీయమృగమదకణ మనంగ
వెడవిల్తులీలారవిందంబుమీఁదికిఁ దివుటమై నెరఁగిన తేఁటి యనఁగ
వలరాజుసిందూర తిలకంబులోఁ జెలువొందు కాలాగరుబిందు వనఁగ

ఆ. నుదయ రాగమహిమ నుజ్జ్వలం బైనబిం,బంబు నడుమ లాంఛనంబు చెన్నుఁ
జేయఁ బూర్వశైల శిఖరదేశంబున, నిందుఁ డొప్పె భువన మెలమి మిగుల. 42

ఉ. పంబినకెంపుఁ బాసి దివిఁ బ్రాఁకి దిశల్ వెలిఁగించి చంద్రకాం
తంబుల నీరు సేసి కుముదంబులఁ బండువు సేయఁ బంచి య
బ్జంబుల నిద్ర పుచ్చి మరుసాయకముల్ గరసానఁ బట్టి కో
కంబుల నేఁచి లోకముపొగడ్తలు సేకొని చంద్రుఁ డున్నెడన్. 43

క. బడి చేసినచందంబునఁ, గడు వేగం బొకటి నొకటిఁ గదిసి దివిని సం
దడి గా నెంతయు గుంపుగఁ, బడి వెన్నెలకుం జకోరపంక్తులు గవిసెన్. 44

క. ముసు ముసు నెగడెడురశ్ముల,కొన లెల్లం బట్టికొని చకోరంబులు ద్రుం
చిన నచట నచటఁ దఱఁగలి,గొని పెరిఁగెడు మాడ్కి దలముకొని ప్రభ లెసఁగెన్.

తే. తివిచి నవకంబు దీప్తులు ద్రెంచి యలఁతి
తునియలుగఁ జంచుపుటములఁ ద్రుంచి తల్లు
లాదరంబున నంది యీనట్టు లెత్తి
ప్రీతిఁ గముచుఁ జకోరంబుఁ బిల్లగములు. 46

క. చంచులఁ గాంతులు వెన్నెలఁ, జించి యమృత ముట్ట నొసఁగు చెన్నునకును రా
గించుచుఁ జవిఁ జొక్కుచుఁ గబ,ళించుఁ జకోరికలు సమదలీలాలస లై. 47

సీ. క్రమ్మి పైఁ దొరఁగెడు కౌముదితీయంబు సొంపునఁ దనుపునఁ జొక్కి చొక్కి
పచరించుచంద్రాతపంబు కాలువలలో నడ్డంబుగా నిల్చి యాఁగి యాఁగి
వెల్లువపెల్లు సూపెడుసాంద్రచంద్రికాపూరంబు గని మదిఁ బొంగి పొంగి
మిన్నులతో రాయు వెన్నెలకరడుల నెఱకలు సడలించి యీఁది యీఁది

ఆ. చెలఁగి చెలఁగి మలఁగి మలఁగి యల్లల్లన, వ్రాలి వ్రాలి బిట్టు తూలి తూలి
సమదవృత్తిఁ గేలిసలిపెఁ జకోరచ,యంబు సదలు దమమయంబు గాఁగ. 48

క. తడఁబడ నొండొంటికి ము,న్నెడఁ గముచుచు నొడిసికొనుచు నేపునఁ బైపైఁ
బడుచు నవు లవుల నీసునఁ, గడచుచు వెన్నెలఁ జకోరగణ మానునెడన్.

క. తినుగమి నొల్లక యొకయెడఁ, దనయిచ్చకు వచ్చునిందుధామనికాయం
బున మవ్వ మెక్కి నిగిడెడి, కొనలు గమిచి మేసె నొకచకోరము దివుటన్. 50

ఉ. సమ్మదవారి గన్నడలఁ జాలుగ మై గరుపార నిందుబిం
బమ్మున దృష్టి నిల్పి పయిఁ బ్రాఁకుమరీచుల నూఁగునూఁగు లేఁ
గొమ్మలు వట్టి చంచుపుటకోటిఁ గదల్చి తెమల్చికొంచు సౌ
ఖ్యమ్మ విహంగమ మ్మయినయాకృతి నొందెఁ జకోర మొక్కెడన్. 51

చ. కలయఁగ నూనునట్లుగ జగంబు సమస్తముఁ జాలఁ దోఁగెనో
జలజభవుండు గోరి పెఱచాయల నెల్లను మాన్పి యొందునుం
దెలుపు ఘటించెనో యమృతదీధితి వేడుక విశ్వరూపుఁ డై
నిలిచెనొ నాఁగ నెల్లెడల నిండఁగ వెన్నెల పర్వె సాంద్ర మై. 52

క. వెన్నెలపోఁతపనులొ యన, వెన్నెలగండరుపుపనులవిధమున మీఁదన్
వెన్నెలనీరు వఱపి రనఁ, గన్నుల కింపొసఁగె నిల సకలరూపములున్. 53

చ. అలసత యొప్ప నల్లన రతాంతమునం బ్రియుపొద్దఁ బాసి నె
చ్చెలికడ కేఁగుదెంచు సరసీరుహనేత్రవిలోచనంబులం
దలఁకెడుమందహాసము విధంబున సొంపున మీఱి యున్న చెం
గలువలలోన నింపడరుకౌముది వేడ్క లొనర్చెఁ జూడ్కికిన్. 54

సీ. భరితసుధారసపాత్రంబు లనుకుముదోత్కరంబులు దళుకొత్త మెఱసి
చంద్రకాంతోపలజలముల కాలువ లివి యవి యని యప్పు డేర్పరించి
దెసలు సూడఁగ గుండెదిగ్గనుచక్రసమూహంబునకుఁ దలమునుక లగుచు
నీఁదుచకోరంబు లెగుర ప్రేఁగై యాడిగిలఁ బడునట్లుగా దలముకొనుచు
తే. నంతకంతకుఁ బొంగి మిన్నంది వెల్లి, మిగిలి యెనిమిదిదిక్కులమీఁదఁ బొరలి
జనము లానందమునఁ దేల జగము లెల్లఁ, దొట్టి నిండారు వెన్నెలనిట్టవాడిచె.

తే. వివిధవర్ణ మై యసురేంద్రు వీడు విడిసి
యుండఁ జంద్రిక పర్వ నక్కొండ యొప్పె
మెఱయుపులితోలు గట్టి మైఁ దఱచు గాఁగ
భూతి యలఁదినభూతేశుపోలుపు దాల్చి. 56

రంభారావణసంవాదము.

ఉ. అత్తఱిఁ జంద్రుఁ జూచు మలయానిలురాకకు సుక్కఁ గామినీ
వృత్తము లాత్మ నెక్కొలుపు వెన్నెలఁ గోరి రమించుచున్న యు
న్మత్తచకోరదంపతుల మచ్చికకున్ మది మెచ్చు లోలుఁ డై
యొత్తినవేడ్కలన్ వెడలి యేకత మేగి దశాస్యుఁ డొక్కెడన్. 57

ఉ. అప్పు డొకర్తు గొంచెమగుఽవాభరణంబులు సన్నపూఁతయుం
గొప్పిడి త్రిప్పిలోఁ జెరివిఽకొన్న నడంగినపూవులుం బయిం
గప్పినచేలకొంగునునుఁఽగప్పును మెల్పున నేగుమెట్టెలేఁ
జప్పుడు చెన్నుఁజేయుగతిఽచందము వింతగఁ బోవునయ్యెడన్. 58

మ కని వేగంబున నడ్డ మేగి యతఁ డాఽకంపించునక్కాంతకే
లను రాగంబునఁ బట్టి యెవ్వతెవు నీఽవత్యంతకౌతూహలం
బున నెచ్చోటికిఁ బోయెదన్న నది యంఽభోజంబుచందాన నా
నన ముజ్జృంభణ మందఁ బెంజెమట మేఽనం గ్రమ్మఁగా నిట్లనున్. 59

చ. అతులితధైర్యసారఽకరుఽణాలయమానస యేను రంభ నా
పతి నలకూబరుం డతనిఽపాలికిఁ బోయెదనన్యచిత్తనై
యతివ సనంగ నెందు నిటుఽలడ్డము వత్తురె నాదుపేరుఁ బో
వు తలఁపు వింటి పాయు నగఽవుం దగుమాత్రయ కాక యొప్పునే. 60

క. పొలఁతుక యిమ్మెయి నేర్పడఁ, బలుకఁగ వెండియును మరునిఽబాణంబులకుం
గొలఁ దై యొప్పనివేడుక, చులుకఁదనము సేయ నయ్యఽసుర యిట్లనియెన్. 61

చ. పడఁతుక యేను రావణుఁడఽబాహుబలంబున నింద్రుపీటిపై
నడచుచు నుండి యిన్నగముఽనన్ విడియించితి సేన నిప్పు డి
య్యెడి కలవోక వచ్చి సొగఽయించువిధంబునఁ బోవుచున్న నిన్
బొడగని కాముబల్మితకఽముల్ నను నిమ్మెయి వెఱ్ఱిఁ జేసినన్. 62

ఉ. చిక్కితి నిష్టభోగములుఽసేకుఱుఁ బెంపును దేజ మెక్కఁగా
డక్కినబంట నైతి నొకఽటం గొద లేక జగంబు లెల్ల నీ
వెక్కటి యేలు మన్న హరిఽణేక్షణ పంక్తిముఖుండ వేని నే
నక్కట నీకుఁ గోడలఁ గఽదయ్య తొలంగు తొలంగు నావుడున్. 63

ఆ. కొడుకుపెండ్ల మైనఽకోడలు గాక పూఁ,బోఁడి యిట్లు దెసవెఽపోయిపోయి
నీవు మాట లాడఽనేర్తు గదా యని, యెట్టు లేని నాదుఽటిది క్రమంబె. 64

క. అనిన నసురేంద్రు పలుకులు, విని నవ్వుచు మీఁర లొక్కఽవిశ్రవసునకున్
జనియించుట యెఱుఁగనె యా, ధనదుండును నీవు నన్నఽదమ్ములు గారే. 65

క. అతనికొడుకు నీకును గొడు, కతనిసతిని నీకుఁ గోడఽలని నైజము చె
ప్పితిఁ గాక తప్పు గలదే, యతఁడు నతఁడు నీకు మాన్యుఽలగుదుర కాదే. 66

క. ఏ నీకు భక్తి సలుపం, గా నుపలాలనము సేయఁఽగలవాఁడవు నీ
వీనెఱితప్పినమాటలు, దానవకులనాథ యిట్లుఽదగునే యాడన్. 67

క. అని రంభ సిగ్గువడఁ బల్కిన దానికిఁ గొంకుకొసరుఽలేక దశముఖుం
డనుమానింపక యిట్లను, మనసిజదందహ్యమాసమానసుఁ డగుచున్. 68

చ. ధనపతి యన్న యే నతనితమ్ముఁడ నానలకూబరుండు నా
తనయుఁడ యింత నిక్కువము దానికిఁ గా దన నాకు నప్సరో
వనితలు వింత యైరె యనివారణ నెట్లయినం జరించునీ
వును గులభామవోలెఁ దగవుల్ ఘటియించెదు వైశికంబునన్. 69

క. విచ్చలవిడిరై యున్నెడ, మెచ్చక ననుఁ ద్రోచి పోవ మేలే తమకం
బచ్చువడునట్లుగా సిరి,వచ్చిన మోఁకాలు సూపువారుం గలరే. 70

క. నాకంబె మిగులువిటు నీ,లోకమునన కాదు దిగువలోకంబులఁ బై
లోకముల వెదకఁ బోయిన, నీకుం బడయంగ వచ్చునే హరిణాక్షీ. 71

ఉ. నావుడు నమ్మృగేక్షణ మనంబున రోయుచు నేను లంజియం
గావుడు వానితోడితమకం బది లంజియ గాదు ప్రేమస
ద్భావ మెఱుంగ వైతి గుణభాగివిపో నినుఁ గోర్కి సెందునే
నీవచనంబు తప్ప కట నీళ్లులపట్టున నేయి మందొకో. 72

క అని మొగమోడక విరసవ,చనముల భంగింప నాదశముఖుం డున్మ
త్తునిగతి నంతయు వినియును, విననిచెవులు సేసి లావు వెరవును మెఱయన్.

క. అంగనఁ బొదివి సగాఢా,లింగనముగఁ దామ్రచూడలీలాచతురా
నంగక్రీడాసంగతి, నెంగిలి గావించె మదము నేర్తెఱ మిగులన్. 74

సీ. పగరాజు పైవచ్చి బలువిడిఁ బరిభవించినఁ దలంకినపురశ్రీవిధమున
సమదద్విపము కేళిసలిపినఁ జాల నలంగినయుద్యానలక్ష్మికరణి
ఘనలులాయము సొచ్చి తనయిచ్చ నాడినఁ గలఁగిన నెత్తమ్మి కొలనిభంగిఁ
గడుబెట్టిదపుగాలి సుడిసిన నెఱి దప్పి తిరిగినమవ్వంపుఁ దీఁగమాడ్కి
తే. మున్ను గైసేసియలవడ్డచెన్ను దప్పి,యెలమిఁ బ్రియుపాలికేగెడులలియడంగి
వేఱుచంద మై యెంతయు విన్ననయ్యె, నసుర గారించి విడిచిన యమ్మృగాక్షి.

క. వెలవెలఁ బాఱుచుఁ గొంకుచుఁ, దలరుచు నడఁదొట్రుపడుచు వలఁకుచుఁ దనలోఁ
బలుకుచు నెడనెడ నిలుచుచు, నలకూబరుకడకు నింతి నలఁగుచుఁ జనియెన్.

నలకూబరుఁడు రావణుని శపించుట.

చ. చని ధరఁ జాగి మ్రొక్కి తనచందముఁ జూచి విషణ్ణుఁ డైనయా
తని కఱ లేక చెప్పిన నతండు ప్రభావమునన్ సమస్తముం
గని కలుషించి యింక దశకంధరుఁ డెవ్వతె నైన నీక్రమం
బునఁ బయిఁ బడ్డ నప్డ మృతిఁ బొందఁ గలం డని శాప మిచ్చినన్. 77

ఆ. తివిరె నంబరమున దేవతూర్యరవంబు, గురిసెఁ బుష్పవృష్టి సురగణంబు
సంతసిల్లె దీని నంతయు నేర్పడ, వినివసతుల కెల్ల వెఱపు వాసె. 78

క. నలకూబరుశాప మెఱిఁగి, యెలమి దఱిఁగి పంక్తివదనుఁ డిది మొదలుగఁ దా
బలిమిం బైపడ నెన్నఁడుఁ, జెలువల నని నిశ్చయించెఁ జిత్తములోనన్. 79

ఉ. కొండలపాటునన్ మనము గుందినఁ గంటికి నిద్ర రాక సే
సం దెలిపించి యడ్డ పయనం బయి దైత్యవిభుండు వోవ సం
క్రందనుఁ డంతయున్ విని సురప్రకరంబులఁ గూర్చి రాత్రి మైఁ
గ్రందుగ నానిశాచరులరాకకు నాకము సంచలింపఁగన్. 80

రావణుఁడు దండెత్తి వచ్చుట విని యింద్రుఁడు విష్ణునిఁ గాన నేగుట.

క. ఆదిత్యమరుద్వసురు,ద్రాదిదివిజగణము లెల్ల నప్పుడ భూభృ
ద్భేదికడ కేగుదెంచె ర,ణాదరదుర్దాంతభుజబలాటోపమునన్. 81

ఉ. వారల మోహరింపుఁ డని వాసవుఁ డేగె నుపేంద్రుఁ గాన నం
భోరుహనాభుఁడుం ద్రిదశపుంగవు సత్కృతుఁ జేసి రాకకుం
గారణ మేమి యన్న దశకంఠుఁడు మాపయి వచ్చె నీవునుం
బోరికి వచ్చి దేవగణముం గృపఁ గావుము దేవ నావుడున్. 82

చ. హరి సనుదెంచె నాజికి దశాననునోర్వక రిత్త యెట్లొకో
మరలెను జాలఁ డోర్కొ యనుమాటవడం బనిలేదు బ్రహ్మచే
వరములు గన్నగర్వమున వచ్చె నలంతులఁ బోఁడు వానికిం
బరువము గాదు కాలపరిపాకము వచ్చిన నేన తీర్చెదన్. 83

క. దేవఖచరాదిజాతుల,చే వానికిఁ జావు లేదు చెప్పెదఁ బిదపం
గేవలమును బోఁ డంతకు, నీవరుసకు నీవ చాలు దెల్లవిధములన్. 84

ఇంద్రుఁడు యుద్ధమునకు వెడలుట.

చ. బలరిపుతోడ నిట్లు హరి పల్కిన నాతఁడు నట్ల కాక యం
చలఘుపరాక్రమస్ఫురణనాహవదోహలచిత్తయుక్తుఁడై
తెలతెల వేగునంతఁ జనుదెంచి బలంబులు గూడఁ దేరు మా
తలి గొని వచ్చినన్ గిరికిఁ దాఁటెడు కేసరిమాడ్కి నెక్కినన్. 85

క. ఉడుపతి దోతెంచినఁ బొం,గెడుజలనిధికరణిఁ బోరికిన్ వజ్రి వడిం
గడఁగుట గనుఁగొని ఘోషం, బడరఁగ సురసైన్య మధికహర్షము నొందెన్.

ఉ. అంత సరోరుహాప్తుఁ డుదయం బరుదెంచె నిశాచరుల్పరా
క్రాంతి దగం గడంగి యమరావతి కేగిరి వారు రాత్రి మై
నెంతయు సగ్గలం బగుదురే బొడసూపెదఁ గాక దేవతల్
సంతస మందఁగా ననుచు సత్వరుఁడై చనుదెంచె నోర్కొనన్. 87

చ. కమలవనంబు చేసినయగణ్యతపంబుఫలంబు చక్రయు
గ్మములముదంబుప్రోక త్రిజగంబుల కన్నుల బ్రహ్మవిష్ణురు
ద్రమహిమ లొక్కలై కలయఁ గ్రాచినయుండ త్రివేదమూలకం
ద మని నుతింప నొప్పెసగెఁ దామరసప్రియబింబ మత్తఱిన్. 88

సీ. దళము లొండొంటిసందులను సమాలోలవలయంబు సడల మాసవ్వంబు గవిరి
యడరి కర్ణికలలో నంటిన కేసరంబులు దల మెక్కుచుం బొదలం బొంగి
సుడిగొని వెడలంగ గడంగు క్రొత్తావి యల్లన మీఁది కెగయంగ మొనలు విచ్చి
యొండొండ మకరంద ముప్పొంగి నలుగడ నిండి పైఁ బొరలంగ నెఱయ విరిసి
ఆ. మధుకరములఁ గలసి మలసియుఁ దమలోన, లలితగంధవహుఁడు చెలిమి సేయఁ
గమల సంతసమునఁ దమయంద వసియింపఁ, జాల నుల్లసిల్లె జలరుహములు.

చ. అరదము నెక్కి లోచనసహస్రము కాంతి వెలుంగఁ బొల్చు ని
ర్జరపతిఁ గన్నులారఁ గని సంతసమందెడువారితో డిమ
చ్ఛరమున నెక్కి నా నుదయశైలముమీఁద సహస్రదీధితి
స్ఫురణ దలిర్ప నొప్పు రవిసొంపున జృంభణ మొందె నబ్జముల్. 90

తే. అప్పు డసురేంద్రుసైన్యంబు లమరపురము, దప్పులే దంచుఁ గట్టాయితంబు సేసి
కూడి నైరృతి యారణక్రీడ కమరఁ, బడగ లంతంతఁ గ్రాలంగ సిడము నొప్ప.

క. పదపదఁ డంచు దిశలు గ్ర, క్కదలఁగ లేయెండచాయఁ గడు నుగ్రము లై
యెదురం గొందఱు గల రని, మది నించుక సరకుగొనక మదమున నడచెన్. 92

ఉ. చిత్రముఁ జూపిన ట్లసురసేనలు దుర్దమలీలఁ గిట్టినన్
వృత్రవిరోధిసైన్యమును విక్రమసంపద సొంపు మీఱ లో
కత్రయపూజ్యుఁ డవ్వసునికాయమునందుఁ బ్రసిద్ధుఁ డైన సా
విత్రుఁడు మున్నుగాఁ గడఁగి వీఁక నెదిర్చెఁ జెలంగి యార్పుచున్. 93

దేవదానవసేనలు పరస్పరము తలపడి పోరుట.

క. ఉభయబలముఁ దలపడి లో,కభయంకరభంగిఁ బోరఁగా రక్తనదుల్
ప్రభవించె నంబుచరస, న్నిభ మైన యమిత్రగాత్రనికరం బడరన్. 94

ఆ. దనుజబలము నొచ్చి వెనుకకు జరగ స,కంపనప్రహస్తఖరనికుంభ
దూషణప్రచండధూమ్రాక్షశుకసార,ణాదిసుభటకోటి యార్చి తాఁకె. 95

శా. ఆవీరావలి కీడఁ బోక మహసీయస్థైర్యసారంబునన్
దేవానీకము కుంతఖడ్గపరిఘాదిప్రౌఢిదుర్వార మై
సావిత్రోద్భటబాహువిక్రమకళాసాహాయ్యసంజాతశౌ
ర్యావేశంబునఁ బోరె రౌద్రరసదృప్తాకారఘోరంబుగాన్. 96

క. అమరులు వోరుట దానవ, సమితికి భర మగుడు సరభసంబున నిజనా
మము ప్రకటించి యదల్పుచు, సుమాలి సావిత్రుఁ దాఁకె సురలు దలంకన్.

మ. పటువేగంబున శాతభల్లచయసంపాతంబునన్ మింట మి
క్కుట మై పర్వ ధగద్ధగీయ మగుచుం గోపంబు రూపంబు లై
చటులక్రీడఁ జరించున ట్లిరువురున్ శౌర్యోన్నతిం బోరి రు
త్కటదర్పోద్ధతు లై పరస్పరజయాకాంక్షాప్రచండంబుగన్. 98

క. ప్రదరంబుల సావిత్రుఁడ,రదముం బోడి సేయఁగా విరథుఁ డైనయెడం
గదిసి గద యెత్తుకొని తల, చిదురుపలుగ వ్రేసె దైత్యసేనలు దలఁకన్. 99

క. దైతేయవంశవల్లభు, మాతామహుఁ డైనయాసుమాలి పడుటయున్
భీతిం దెరలిన దనుజ,వ్రాతముఁ గని కోపవేగరక్తాక్షుం డై. 100

శా. అగ్నిచ్ఛాయముఁ గామగంబు నగు తేరత్యుగ్రుఁ డై యెక్కి యా
భుగ్నభ్రూలతికాసహోదర మనం బో ల్పొందుచాపంబు ను
ద్విగ్నారంభత నెక్కు వెట్టి శరవార్ధిన్ మేఘనాదుండు ని
ర్మగ్నాకారులఁ జేసె నిర్జరుల శౌర్యస్ఫూర్తి శోభిల్లఁగన్. 101

క. పేర్చునరదంబు ప్రబలం, గార్చిచ్చువిధమున నతఁడు గడగినఁ బటుబా
ణార్చులు గవియుడు నిర్జరు, లేర్చినతరువులును బోలె నే పేది రనిన్. 102

మ. అసురాధీశతనూజుకోల్తలకుఁ గా కత్యంతభీతిం గలం
గి సురానీకము సూ రెగిల్లిన రణక్రీడాదరం బారఁగా
రసికుం డై రథ మెక్కి గోముఖుఁడు సారథ్యంబు సేయం గడున్
వెసఁ దాఁకెం ద్రిదశేంద్రనందనుఁడు దోర్వీర్యం బవార్యంబుగాన్. 103

క. దైతేయు లదర నిట్లని, కేతెంచినఁ గాంచి దానవేశ్వరుతనయుం
డాతనిసూతుం డగునా,మాతలిసుతు మేను బాణమయముగఁ జేసెన్. 104

క. అతఁ డాతనిసారథిమై, శితశరములు నించుటయును జెలఁగుచు వడిఁ ద
చ్చతురంగంబులుఁ దాఁకెను, బ్రతిభటరథతురగదంతిపంక్తులు సెదరన్. 105

ఉ. అత్తఱి మేఘనాదుఁడు జయంతుశరావలిఁ ద్రుంచి వాని మై
నెత్తురువఱ్ఱు సేసి రథినిం బోడి సేసినయంతఁ బోక యు
ద్వృత్తిఁ గడంగినం దమము వీటుకొనం గవియించె దృష్టియుం
జిత్తము లావు మాలి సురసేనలు బెగ్గిల నగ్గలంబుగన్. 106

క. చీఁకటి గవిసిన విబుధా,నీకం బోడి చన నైననేరద హృదయ
వ్యాకులత మునింగి భయో,ద్రేకముపడి తెగువ దలరి త్రిప్పికొనంగన్. 107

క. ఆమాయాతిమిరము పౌ,లోమీజనకుఁ డగునప్పులోముఁ డెఱిఁగి సు
త్రామతనూభవునకు నది, యేమిటఁ బో దంచు నచటి కేతెంచె వెసన్. 108

ఉ. వచ్చి జయంతు నాఁగి యనివారణఁ బర్వెడు నీతమంబు ము
న్నిచ్చె జయార్థ మై యభవుఁ డీతని కీరిపుచేతఁ జచ్చినన్
వచ్చెడి దేమి సంగర మవశ్యముఁ జేయఁగ నీను వార్ధిలోఁ
జొచ్చుట చాలఁ గార్య మనుచుం బలిమిం గొని పోయె డాఁగఁగాన్. 109

తే. అమరపతినందనుఁడు పాదవడఁగి చనిన,నసురమాయయు నుడివోయెనట్లకాదె
యదరి దరికొని మండుతీవ్రానలంబు, పుడుక లెడ గల్లవైచినఁ బొనుఁగువడదె.

క. ఇవ్విధమున నింద్రసుతుం, డెవ్వరు నెం దరుగుటయును ॥ నెఱుఁగక యుండం
గ్రొవ్వాతి తనపరివారలు, నప్పాట కియ్యకొని పోరి ॥ నవిజృంభితులై. 111

క. దనుజాధీశ్వరుతనయుం, డనిమిషు లనుహంసముల రోయంబునఁ బఱపం
దనయూరుపులెలుఁగున మేఘనాదుఁ డను పేరు సార్థకంబుగఁ జేసెన్. 112

ఆ. ఇట్లు దనతనూజుఁడే పేది సైన్యంబు, గాసి యగుడు నలిగి ॥ వాసవుండు
కెంపు గన్నులందు ॥ బెంపారుచుండఁ జెంగలువకోలనిమాడ్కిఁ ॥ జెలువుమిగిలి.

ఉ. మాతలిఁ జూచి దానవసమీరాజము దర్పము మీఱె నిత్తఱిన్
వాతజవంబునం గడఁగి ॥ వారక వీరికి సమ్ముఖంబుగా
వే తురగంబులం బఱపు ॥ విక్రమసంపద యుల్లసిల్లఁగాఁ
జేతులతీఁట వో నుఱుము ॥ సేసెద నెవ్వఁ డెదిర్చి వచ్చినన్. 114

క. అనుచు నిజబలము నిలునిలు, మని కరతల మెత్తి నిలిపి ॥ యదలిచి సమరం
బునకు మగుడఁ బురికొల్పుచుఁ,దనచుట్టును నున్నదొరలుఁదానును గడఁగెన్.

చ. ఎదురుగ వీచె నిష్ఠురసమీరము లుల్కము లుగ్రభంగి నె
ల్లదిశల డుల్లెఁ బెల్లుగ బలంబులపైఁ బెనుగ్రద్ద లాడె బె
ట్టిదముగ మ్రొగ్గి యభ్రకరి ॥ డిల్లపడెన్ వెస నందనంబు గ్ర
క్కదలఁగఁ గూసె నొక్కట సృగాలము లప్రియసూచకంబులై. 116

క. కలయంగ దుర్నిమిత్తంబులు పుట్టినఁగనియు వినియుఁ ॥ బొలివోవనియ
గ్గలికమెయి నెమ్మనమ్మునఁ, దలఁ కొకయించుకయు లేక ॥ దర్పోద్ధతుఁడై. 117

క. సురపతి గడఁగుడు దనుజుల, బరవస మెక్కింత మట్టుపడుటయు దశకం
ధరుఁడు సమరోత్సుకుం డయి, యరదము సన వసము గాకయత్యుగ్రముగన్.

క. అమరవిభుం దలపడఁ జను, సమయంబున నడ్డపడిరి ॥ సంభ్రమలీలన్
సమదుఁ డగు మేఘనాదుఁడు, దమతండ్రిరణంబు మాన్చి ॥ తాన కడంకన్. 119

చ. తలపడి యింద్రుతోడ నతిదారుణయుద్ధము సేయఁ జొచ్చినన్
బలము బలంబుఁ దాఁకుటయు ॥ బాసటగా వడిఁ గుంభకర్ణుఁ డు
జ్జ్వల మగుశూల మెత్తికొని ॥ వచ్చి యుగాంతపురుద్రుకైవడిం
జెలఁగుచు నార్చి మోహరము ॥ చెంగటఁ దాఁకె భయంకరంబుగన్. 120

క. అడరి మొన లెక్కడక్కడ, వడిఁ దిరిగిన దిశలు బడలు ॥ వడ రౌద్రము చూ
పుడ బాహుశక్తి యేర్పడఁ, గడిమి పొగడ్తవడఁ గుంభకర్ణుఁడు పోరెన్. 121

క. ప్రతివీరుఁ డొక్కరుఁడు లేకతులబలుం డైనహీనుఁ ॥ డైనను నప్పా
ట తనకు గుఱిగా నురవడి,నతండు మునుకూడి సురల ॥ నందఱఁ దఱిమెన్.

ఆ. ఎదిరి తేరినొగయు ॥ నిభముదంతంబును, దనకరంబుఁ బొదితలము లోను
గాఁగ నాయుధములు ॥ గానివి లే వయ్యె, నరివిమర్దనమున ॥ కతని కపుడు.

క. అంతకు ముందఱ యీవృత్తాంతము విని తోడుపడుట కని సత్వరులై
యంతకవరుణధనేశులు, దాంతిమెయిన్ వచ్చువారు తదవసరమునన్. 124

క. తమతమబలములతో సంభ్రమగతిఁ బఱతెంచి దివిజపతికిం బొడసూ
పి మనుజభోజనసైన్యము, సమయింపఁగఁ జొచ్చి రధికసంరంభమునన్. 125

క. చిచ్చునకుఁ దోడు గరువలి, వచ్చినక్రియఁ బోర నమరవరులమొనలకున్
హెచ్చుగ దిక్పతిసేనలు,వచ్చుటయును మ్రొగ్గె నసురవర్గము గలయన్. 126

ఉ. సన్నబలంబులైననిజసైన్యములం గని రావణుండు శౌ
ర్యోన్నతుఁడై నన్నందనుని నొప్పరికించితిఁ గుంభకర్ణుఁడుం
గన్నది లేదు మెల్ల మురికాఱు దిగీశులు వచ్చి రేను బో
కున్న భరంబు గాదె యనియుద్ధతిఁ బేర్చి రథాధిరూఢుఁడై. 127

శా. సొంపారంగఁ బసిండి పైఁ బఱపినన్ శోభిల్లువిల్లందమై
శంపావల్లిక నిల్చి పొల్చుగతి భాస్వత్కాంతిఁ జెల్వొందమై
పెంపుం జాయయుఁ గాలమేఘు మన నాభిలంబుగా దిక్కులా
కంపింపం బటుబాణవర్షమున నాకాశం బడంగించుచున్. 128

క. అరదంబున యురవడికిం, దెరలి తెఱపి యిచ్చి సురలు దిరుగుడువడ ని
ర్జరపతిరథంబునకు భీకరగతి సమ్ముఖముగాఁ వేగం బఱపుటయున్. 129

చ. వదనసరోజపంక్తి శరవర్షమునన్ మొగిడింపఁ గాన న
య్యెద దశకంధరుం డిచట నెచ్చట లేఁడు తనూజుఁ జూపి తా
ను దొలఁగి యున్నవాఁ డతని నొంపక గెల్పన రాదు రాఁడె దు
ర్మదమున నంచు నున్నబలమర్దనుఁ డాహవదోహలంబునన్. 130

తే. ఏచి మాతలిఁ గనుఁగొని యిటులు వచ్చు, దనుజుతేరికి నెదురుగా మనరథంబు
శీఘ్రగతిఁ బోవ నిమ్మని చెప్పి మార్వి,భీకరధ్వని దిక్కులు పిక్కటిల్ల. 131

శా. రుద్రాదిత్యమరుద్వసుప్రభృతు లార్పుల్ నింగి ముట్టంగ వీ
రోద్రేకంబున దాపలన్ వలపలన్ హోరాటమై ముంచి స
ర్వద్రోహిం బరిమార్త మంచు వికటభ్రామ్యద్భుజామండలీ
రౌద్రాకారతఁ దాఁకఁ దాఁకె రిపుధైర్యస్రావణున్ రావణున్. 132

తే. ఇట్లు దాఁకుడు దశకంఠుఁ డేపు మిగిలి, యందఱకు నన్నిరూపంబులైనయట్లు
వివిధశస్త్రాస్త్రకేళీప్రవీణబాహు, దండనికురుంబదుస్సహోత్సాహుఁ డగుచు.

క వడి నడరుచుఁ దెరలుచుఁ బై, పడి పోక పెనంగునమరబలమునకుం గీ
డ్పడక నిలిచి మెఱసెను బలు, కడళ్ల కెదురైనఱాతికరణిం దిరమై. 134

ఉ. ముందటఁదాఁకి పోరుతనమోహరమున్ వెసఁ బోనడల్చి కొం
చుం దఱియంగఁ జొచ్చి బలసూదనుఁ డాదశకంఠు నస్త్రపం

క్తిం దునుమాడి బాణమయదేహునిఁగా నొనరించె వాఁడు సం
క్రందనుపై నిశాతవిశిఖంబులు నించె సురల్ దలంకఁగన్. 135

శా. వ్యగ్రాటోపత నొండొరున్ మిగుల బాహాశక్తి సూపన్ మహో
దగ్రం బయ్యె సురాసురేంద్రరణ మన్యోన్యధ్వజచ్ఛేదనా
త్యుగ్రం బై యితరేతరవ్యథితరథ్యోదాత్త మై శౌర్యసా
మగ్రీగాఢపరస్పరాంగదళనోన్మాదోద్భటాకార మై. 136

క. ఈసున నాసురపతి జంభాసురున ట్లసరి రావణాసురు శీఘ్రం
బేసియు వ్రేసియు బొడిచియు, వేసరి దిక్పాలకోటి విన ని ట్లనియెన్. 137

ఉ ఎద్దెస నైన శంక చెడి యేగు విరించి వరంబు నెమ్మదిం
బెద్దయు నమ్మి వీఁ డిటు లభేద్యతఁ గ్రుమ్మరు చున్నలోక మా
పద్దశఁ బొందు మానుపను పాయము నారసి చూడ నొండు లే
ధిద్దనుజాధముం బొదివియే పఱఁ బైపడి పట్టుకొందమే. 138

చ. అనవుడుఁ జాల మే లని దిశాధిపు లందఱుఁ జేరి చుట్టు ము
ట్ట నమరవల్లభుండును గడంక దశాననుతేరిరాక క
ల్కినగతి మాతలిం గెలనికిన్ రథ మల్లఁ దొలంగి పోవ ని
మ్మని వెసఁ జొచ్చి పట్టుకొన నాయిత మై యతిసాహసంబునన్. 139

మేఘనాదుఁ డింద్రుని మాయాతిమిరమున ముంచి పట్టుకొనుట.

క. ఒరసికొని పోవ నత్తఱి, సురసైన్యం బార్చుటయును జూచి తిమిరముం
గర మచ్చెరువుగ గ్రక్కునఁ, బరఁగించుచు నసురకొడుకు పఱతెంచె వడిన్.

క. మాయాతమమున మునిఁగిన, దాయల దివ్యాస్త్రజాలదళితాంగులఁ గాఁ
జేయుచు నాబృందారక,నాయకు డగ్గఱియె మేఘనాదుఁడు గడిమిన్. 141

క. తుహినంబునఁ బడినపయో,రుహషండముమాడ్కి నమ్మరుత్పతి మాయా
పిహితతమోవృతలోచన,సహస్రుఁ డై యున్న నతనిసారథి నేసెన్. 142

ఉ మాతలి మూర్ఛపోయిన నమర్త్యవిభుండు రథంబు డిగ్గి జీ
మూతగజంబు నెక్కి బలముం జలముం జెడి యాత్మసైనికా
రాతిభటప్రభేదవిదురస్థితి దీనతఁ బొంది యుండియున్
భీతి యెఱుంగ కుండ వెడబీరము సేయుచు నుండె వెండియున్. 143

చ. నిలువులు పడ్డయట్లు తననేత్రము లేమియుఁ గానలేమి న
గ్గలముగ బెగ్గలించుబలఘస్మరు నమ్ముల నోడు సేసి ని
ట్టల మగుడప్పి సోలుటయు డాసి దశానననందనుండు వి
డిఁ బట్టి కట్టి జయశంఖముఁ బట్టఁగఁ బంచి యార్పుచున్. 144

రావణుఁ డింద్రుని బట్టి లంకకుఁ గొనిపోవుట.

చ. అరదముమీఁదఁ బెట్టుకొని యాతనిఁ దండ్రికిఁ జూపి యింక సం
గర మిది యేటికిఁ జయము గైకొని పోదము రమ్ము నావుడుం
గరము ప్రియంబునం దనయుఁ గౌఁగిటఁ జేర్చి త్రిలోకరాజ్యవి
స్ఫురణము నాకు దక్కె నని పొంగి దశాస్యుఁడు మిన్ను ప్రేయుచున్. 145

ఉ. మోదమునం దనూభవుని ముంగలిగా నడపించి తాను దు
ర్భేదబలాన్వితుం డగుచుఁ బింగలి యై చన దేవకోటి శౌ
ర్యోదయలీలఁ గూడుకొని యొండొరుఁ బల్కుచు శక్రమోక్షణా
హ్లాదము గోరి పెంపున రణోద్యమం బెసఁగం బఱతెంచి తాఁకినన్. 146

ఉ. ఎత్తెల గొందుదిక్పతుల నిందఱ ముంద తెలుంగనట్ల యీ
తత్తబడం బిఱిందిదెసఁ దాఁకిన దీనికి సంభ్రమంబుమై
నిత్తల కేగుదేవలవ దేత్తెఱఁ బొమ్మని చెప్పి పుచ్చినం
జిత్త మెలర్పఁగా సుతుఁడు శీఘ్రమునం జనఁ దా నుదగ్రుఁ డై. 147

క. బకమరి తిరిగిన నమరులు, పికపిక లై పోవ లావుఁ బెం పేర్పడ సే
నకు వెనుకై చనియెను లంకకు దానవవిభుఁడు బాహుగర్వోద్ధతుఁ డై. 148

ఆశ్వాసాంతము.

మ. అతులౌదార్యుఁ డహీనశౌర్యుఁడు సముద్యద్ధైర్యుఁ డత్యంత వి
శ్రుతచారిత్రుఁడు సూరిమిత్రుఁడు జనస్తోతవ్యగోత్రుండు సం
భృతసత్కీర్తి పవిత్రమూర్తి యసుహృద్బృందార్తినిర్వర్తి పూ
జితధీమంతుఁడు పుణ్యవంతుఁడు జయశ్రీకాంతుఁ డిమ్మేదినిన్. 149

క. సన్మార్గచతురపథికుఁడు, జన్మవిశేషప్రసిద్ధసగరకులుఁడు భూ
భృన్మకుటఘటితచరణుఁడు, మన్మథనాథుఁడు కవీంద్రమందార మిలన్. 150

మాలిని. నిరుపమజయలక్ష్మీనిత్యవిస్తారవక్షుం
డరిబిరుదమహోత్సాహప్రతిక్షేమదక్షుం
డరుణకిరణదీప్తవ్యాప్తపద్మాయతాక్షుం
డురగశయనరేఖాయుక్తసంరక్షుఁ డుర్విన్. 151

గద్యము. ఇది శ్రీమదుభయకవిమిత్త్ర కొమ్మనామాత్యపుత్త్ర బుధారాధనవిధేయ
తిక్కననామధేయప్రణీతం బైన యుత్తరరామాయణం బను మహాకావ్యంబు
నందు షష్ఠాశ్వాసము.

శ్రీ ర స్తు.

నిర్వచనోత్తరరామాయణము

సప్తమాశ్వాసము.

శ్రీరంజకత్వచతురా
చారుఁడు వర్ణాశ్రమప్రచారుఁడు విద్యా
ధౌరేయుఁ డార్యవినుత
ప్రారంభుఁడు మనుమమానవాధీశుఁ డొగిన్. 1

బ్రహ్మ యింద్రజిత్తు కోరినవర మిచ్చి యింద్రుని విడిపించుకొని వచ్చుట.

క. అక్కడఁ గమలాసనుఁ డా, రక్కసుఁ డమరేంద్రుమీఁద రాకయు సమరం
బెక్కుడుగఁ జేసియును హరి, యుక్కఱి పట్టువడి పోకయుం దెలియంగన్. 2

చ. విని మునిబృందముల్ గొలువ వేగమ లంకకు నేగుదెంచి య
ద్దనుజవిభుండు సేయునుచితప్రతిపత్తిఁ బ్రియంబు వొందియా
తనిదృఢశౌర్యముం దనయు ధైర్యమునుం గొనియాడి వెండి యా
యనిమిషనాథు గెల్చిన జయాతిశేషము సూపి చెప్పుచున్. 3

ఆ. భువనములకు నెల్లఁ బ్రోదిగ శతమఖుఁ, డాను నిలుపుటయు నతండు లేమి
సకలభూతములకు సంకటం బగుటయు, నెఱుఁగఁ జెప్పివారి యిచ్చ యెఱిఁగి.

చ. ముదమున నింద్రుబంధనవిమోక్షము సేయుఁ డభీష్టవస్తు వి
చ్చెద మదికోర్కి యేర్పడఁగఁ జెప్పుఁడు నా కనుచుం సముల్లస
ద్వదనచతుష్టయుం డయినవారిజసంభవుఁ జూచి వాంఛిత
ప్రదుఁ డగు టాత్మలో నెఱిఁగి రావణసూనుఁడు ప్రీతి నిట్లనున్. 5

క. కమలాసన విను నావిక్రమమున వెల వెట్టి దేనిఁ గారుణ్యము సే
యుము నాకు శాశ్వతం బగు,నమరత్వం బనిన నతనిఁ గజుఁ డిట్లనియెన్. 6

క. ఆశ్వాసంబుగ బలికిన, విశ్వాసము నేసి మున్ను వేఁడితి కలదే
శాశ్వత మగునమరత్వం, బీశ్వరుఁ డొకరునిక తక్క నితరుల కెందున్. 7

క. అనుడు నొకతెఱఁగు సెప్పెద, వినుఁ డని రావణసుతుండు వినయవిశేషా
వనతశరీరుఁ డగుచు ని, ట్లనియెం గరకమలముకుళనాదరపరుఁ డై. 8

ఉ. ఆల మొనర్పఁగా వలయునప్పుడు వహ్ని నుపాస్తి చేసి యా
వేలిమి నొక్కతేరు ప్రభవించిన గ్రక్కున దాని నెక్కి దో

ర్లీల వెలుంగ నేగిన సరిత్ప్రకరంబులచేత నెమ్మెయిం
గాలవశంబు నొందక యఖండితవిక్రమశాలి నయ్యెదన్. 9

ఉ. హోమసమాప్తి నుత్థితరథోత్తమ మొక్కటి దక్క నొంట సం
గ్రామము సేయఁబో నది యకాలముగా దుది కియ్యకొంటి నా
కీమెయి మేరవెట్టి వర మిమ్ము పరాక్రమలీల మెచ్చి నీ
వేమియు నీక పోక తగ వేనియుఁ బొమ్మమరేంద్రు నిచ్చితిన్. 10

తే. అనుడు దరహాసచంద్రికతనదువదన, కమలవనమున కభినవకాంతి యొసఁగఁ
జిత్రచారిత్రుఁ డగుపితృపుత్త్రపుత్త్రు, నర్థిఁగనుఁగొని యవ్వర మతని కిచ్చె. 11

చ. అడిగినయట్ల యిచ్చిన దశాననసూనుఁడు ప్రీతి మేన నె
ల్లెడ వెలిఁ జేర్చె నాఁ బులక లెంతయు వింతగ మ్రొక్కి పెంపు సొం
పడరఁ గులం బెలర్ప జనకానుమతంబున నాబలారికిన్
విడుగడ సేసె నప్పు డరవిందభవుండు ప్రమోద మందఁగాన్. 12

ఆ. అంబుజాసనుఁడు దశాననుఁ జూచి నీ, నందనునకుఁ ద్రిభువనముల నెగడ
నింద్రజిత్సమాఖ్య యిచ్చితి సుముఖులై, యుండుఁ డనియె దనుజులుల్లసిల్ల.

చ. అసురుల నిమ్మెయిం బ్రముదితాత్ములఁ జేసి పయోజసూతి సం
తోసమున నాకలోకపతిఁ దోకొని పోవు నెడం దదీయవ
క్త్రసరసిజంబు లజ్జ యనురాత్రి గడుం జెడి యున్కి కిం గృపా
రసపరుఁ డై హితార్థ మధురస్ఫుటసత్యమృదూక్తి ని ట్లనున్. 14

చ. తమతమదుష్కృతంబు సుకృతంబును నాపదయున్ శుభంబు లై
తముఁ దఱి నైనఁ బొందు నది దప్పునె సాధ్వి నహల్యఁ గోరి గౌ
తమునికి నప్పి తీ వకటతత్ఫల మీయశుభంబు దోషసం
గమవినివృత్తికై యొకమఖం బొనరింపుము విష్ణుతుష్టిగన్. 15

క. అని చెప్పి పోవుటయు న, య్యనిమిషవల్లభుఁడు విష్ణుయాగం బొనరిం
చి నిఖిలదురితరహితుఁ డై, చనియెన్ ద్రిదివంబునకు విశాలవిభూతిన్. 16

మ అనినం జిత్తము చోద్య మంద రఘువంశాధీశ్వరుం డిట్టు లా
తనికిన్ బీరము సెల్లెఁ గాని యొచటం దద్విక్రమక్రీడ మా
న్ప నొకం డైనను జాలఁడే యనుడు భూపాలాగ్రణిం జూచి య
మ్ముని మందస్మితసుందరుం డయి మనోమోదంబుతో ని ట్లనున్. 17

రావణుఁడు కార్తవీర్యునితోఁ బోరాడి చెఱఁబడుట.

ఉ. నిర్జితశత్రుఁడున్ భువననింద్యచరిత్రుఁడు నైనరావణుం
డూర్జితవిక్రమస్ఫురణనుర్విఁ జరించుచు మించి యేచి శౌ
ర్యార్జనలోలబాహుమహిమాస్పదుఁ డై చనునాసహస్రభా
హార్జును పెంపుసొంపు హృదయంబున సైఁపక వచ్చె నాజికిన్. 18

తే. అరుగుదెంచి మాహిష్మతీపురము సుట్టి, వేగ పోరికి నర్జును వెడలు మనుఁడు
రావణుఁడు వచ్చె నలంతులంబోవఁడనుచు, గోపురాంగణస్థితజనక్షోభ మెసఁగ.

క. పన్ని బహిరంగణంబున, నున్న ససంభ్రాంతిగతి సముచితమ్ముగ నా
సన్నులయి మంత్రు లిట్లని, రన్నరపతిపెంపురన్ భయమం బెద లేమిన్. 20

చ. అధిపతి వీట లేనిసమయంబున సంగరకాంక్షతోడ ని
ట్లధికబలంబులం గొని వ్యథాతిశయంబుగ నేగుదెంచి యి
వ్విధమునఁ బన్ని నీ వనృతవిక్రమముం బ్రకటించుకంటె నం
బుధినడుమైన నీపురికిఁ బోయి యొదుంగుము చాల మేలగున్. 21

చ. అనుబలుమాట లియ్యకొని యర్థసుజేశ్వరుఁ డాతఁ డున్న హా
డని యని సేయు వేడుక రయంబున వచ్చితి నెందుఁ బోయె మీ
జనపతి లావు నాదుభుజశక్తియు నించుక తూఁచి చూడ నేఁ
జన నెఱింగించి యెయ్యెడకుఁ జయ్యనఁ దోకొని రండు నావుడున్. 22

ఆ. అతనిపెంపుఁగలిమి కయ్యమాత్యులు దమ,నెమ్మనముల మెచ్చి నృపతివృత్త
మున్నరూపు సెప్పి యిన్నరభోజను, నిచట నునుత మనుచు నిట్టు లనిరి. 23

క. వారవము నెక్కి వనితలు, గారవమునఁ గొలువఁ గంతుకైవడి వెడలం
జేరక యంతంతను బరి, వారము నిలువఁ బడ వర్షవరపరివృతుఁడై. 24

క. సరసకవివిటవిదూషక, పరిహాసకగాయకాదిపరిజనములు వే
సరటపయి మేలు వొలఁకెడు,తురగము నెడఁ దూఱఁ గాంతవొలఁకాడంగన్.

ఉ. చూడ్కికిఁ బండువై ముదము సొంపునఁ జూపఱు సొక్కుచుండ ని
మ్మాడ్కి నరేశ్వరుం డరిగె మాపటికిం జనుదెంచు నాతనిం
దోడ్కొని తేరఁ బూను టది దుర్వినయం బగుమాకు రాజులన్
వేడ్కమెయిం జరింపఁ జని వీటికి రమ్మని పిల్వవచ్చునే. 26

క. నటదళికులశుకపికసం,కటలీలోద్యానములను గమనీయసర
స్తటినీతటాకముల ను,త్కటకౌతుకవృత్తి నాడుఁ దరుణులుఁ దానున్. 27

క. ఎయ్యెడ నిలుచుట యెఱుఁగమ, యియ్యెడ నేఁ డీవు విడియు మెల్లి యతనితో
నియ్యకొని యెల్లభంగులఁ, గయ్యము సేయంగఁ దలఁపు గలిగిన యేనిన్. 28

ఆ. వేగపడకు మనుజవిభుచేతిబలుపును, జూతు గాక యనిన శూరశేఖ
నగుచు మంత్రివరుల మొగములు గనుఁగొని, యిట్టు లనియె దానవేశ్వరుండు.

ఉ. ఏపున నేను వచ్చుటయు నిచ్చట నిల్చుట కోహటించుటన్
మీపతి యొక్కడేనిఁ జన మిన్నక మాటలు పేర్చినన్ రణా
టోపము మాన నేర్తునె కుటుంబసమేతము డాఁగె నాతనిం
జూపరు మీరు నింకఁ దలసూపఁ డతండును బోయి వచ్చెదన్. 30

క. మెలఁగుదెస మెలఁగి క్రమ్మఱు, తల నొకమరి యేమఱించి । దాడిమెయిన్ దో
ర్బలము మెఱసి పై పడి నా, చలము నెఱపి పోదు మీకుఁ । జాటితిఁ జుండీ.

క అని దుర్మదాంధకార,మ్మునఁ గానక బిట్టు వలికి । పోయెను గలని
స్వనకోకిలకర్బురకా,ననరేఖావంధ్యవింధ్య।నగమున విడియన్. 32

మ. చని దైత్యేంద్రుఁడు తత్ప్రదేశమునఁ జం।చత్కాంచనాంభోజధూ
ళినితాంతప్రవిలిప్తహంసకుల కే।ళీజాతసంధ్యాభివం
దనలోలవ్రతిజాలమార్ఘ్యమున మో।దస్థాన మై లోకపా
వనతం బేర్చిననర్మదం గని మృదు।స్వచ్ఛందలీలారతిన్. 33

తే. నెమ్మి మజ్జన మొనరించి । తమ్మివిరులు, పాలఁ గోయించి హృద్యవి।శాల మైన
పుళినతలమున శివలింగ । పూజసేయఁ,దొడఁగె నట నర్జునుండును।బడఁతిపిండు.

క. వనకేళీకౌతూహల,మునఁ దగిలినయట్టివారు । ముదితహృదయు లై
వనిఁ బరిచితస్థలములకుఁ, జని హృద్యవిహారతంత్ర।చాతుర్యమునన్. 35

మ. లలితక్రీడ మెయిన్ సముత్కటమదో।ల్లాసంబునం బెక్కుభం
గులఁ జేతోరమచూతపోతలతికా।గుల్మప్రదేశంబులం
గలయం గ్రుమ్మరి పొద్దునుం జెమట నం।గంబుల్ నవాంకూరసం
కలనాశోభితవల్లరీనిభము లై । క్రాలంగ రాగిల్లుచున్. 36

క. ముదమున జలకేళికి న,ర్మదకుం జనుదెంచి లలిత।మకరవిహారా
స్పదతత్ప్రవాహమున నిం,పొదవఁగ నాడునెడ నధిపుఁ । డుల్లాసమునన్. 37

తే. బాహువులు సాఁచిపడమర।పాఱుచున్న,యాతరంగిణిఁ బోకుండ।నాఁగుటయును
నెదురువొట్టి దశాననుఁ । డీశుఁబూజ, సేయునెడ ముంచికొనియెన।చ్చెరువుగాఁగ.

క. రావణుఁడు సంభ్రమంబున, దేవార్చనకొఱఁతతో న।ది వెడలి కలయన్
భావించి యెదురు క్రమ్మెడు, నావెల్లువఁ జూచి విస్మ।యం బెదఁ గదురన్. 39

క. తూర్పుదెస వచ్చు నీనది, దర్పంబున నెదురురాఁ గ।తం బేమియొ మీ
రేర్పడ నెఱింగి రం డని, శూర్పణఖాభ్రాతచరులఁ । జూడఁగ నంపెన్. 40

ఆ. వార లరిగి విభుఁడు । వామలోచనలును, జలవిహార మర్థి । సలుపు చునికి
చూచి వచ్చి యానిశాచరవల్లభు, నెదుర నిలిచి మ్రొక్కి । యిట్టు లనిరి. 41

క. దేవా దేవర పంపిన, నీవెల్లువ తెఱఁ గెఱింగి । యేతెంచితి మె
చ్చో వినఁగఁ జూడఁ బడయమ,యావిధ మద్భుతరసావ।హం బై యుండెన్. 42

ఉ. భూరిబలాభిరాముఁడు వి।భూషణభూషితమూర్తి కామినీ
స్మేరముఖేందుబింబముల । చెన్నున నుజ్జ్వలచంద్రలోకకే
ళీరతి నున్నచందమున । లీల మెయిన్ సలిలావగాహన
స్ఫారకుతూహలుం డయి వి।శంకత నొక్కఁడు కేలి సల్పెడున్. 43

క. ఆతతబహుబాహుం డగు, నాతఁడు నేతులఁ బ్రవాహ।మాఁగిన మరలం
దోలెంచె నావృడును విని,వీతభయుఁడు కార్తవీర్య।విభుఁ డని యెఱిఁగెన్. 44

చ. ఎఱిఁగి కరంబు వొంగి కడు। నేకత మి ట్లగపడ్డచో నతం
డెఱుఁగక యుండ ముట్టికొని। యే పడఁగించెద నంచు మంత్రులం
దఱకు నెఱుంగఁ జెప్పికొని। దానవుఁ డున్మదుఁ డై చనంగ న
త్తఱి నరుణాభ్ర మస్థిమయ।ధారలతో దివిఁ దోఁచె ముందటన్. 45

ఉ. దానికి శంక సేయక యు।దగ్రరణోత్సుకుఁ డైనయట్టియా
దానవవల్లభుండు బల।దర్పసముద్భటసంకులంబుగా
సేనలు ముందటం దఱుమ। శీఘ్రత మేదిని సంచలింపఁ గాం
తానిచయంబుఁ గంచుకివి।తానము బెగ్గిల బిట్టు ముట్టినన్. 46

మ. వనితాబృందములోన నున్నపతి తీ।వ్రక్రోధుఁ డై గంగ గా
హనకేలిం బిడియేనుఁగుల్ వొదువ మో।దాయత్త మై యుండి గ్ర
క్కున నన్యద్విపదానగంధమునకుం। గోపించునైరావతం
బును బోలెన్ మదు నల్ల వెల్వడి రణ।ప్రోత్సాహయోగ్యస్థితిన్. 47

క. కట్టాయిత మై యునిదల, నిట్టుండుఁడు వెఱవ కిచట। నిదె వచ్చెద నన్
ముట్టినదానవులను బలి, వెట్టెద నర్మదకు ననుచు। భీకరవృత్తిన్. 48

చ. అతఁడు వినూత్నరత్నరుచి।రాంగద మై వివిధాయుధప్రభా
న్వితమగుబాహుసంఘము య।నీకముగాఁ బటువిక్రమక్రమో
ద్ధతి దితిసూనుసేనల మోదం బఱె నల్లడఁ దూలఁ దోలె ఘో
రతిమిరపుంజభంజనక।రప్రకరుం డగుభానుకైవడిన్. 49

క. తెరలినబలములఁ గని యు,ద్ధరవృత్తిఁ బ్రహస్తుఁ డతని।తోఁ దలపడియెం
గరి కేసరి హరిణము పులి, నురగము గరుడిఁ దలపడ్డ।యొ ప్పమరంగన్. 50

క. తాఁకి ముసలమున వ్రేసిన, వీఁక నొడిసిపట్టి యతఁడు। వెసఁ దిగిచిన నా
రోఁకలి తనచే వచ్చిన, నాఁకగొనక దాన నసుర। నడిచెం గడఁకన్. 51

ఉ. ఆటున మూర్ఛపోయినఁ బ్రహస్తుఁ గనుంగొని యింకఁ దాఁకినం
గీటడఁగించు నర్జునుఁడు। గేవలుఁడే యని భీతచిత్తులై
మేటిమగల్ సలం బెడలి। మేమెయి మార్కొన లేక పాఱినం
గాటుకకొండవోలె దశ।కంఠుఁ డెదిర్చె మహీమహేంద్రునిన్. 52

ఉ. వీరగుణాభిరాము లగు।వింశతిబాహుసహస్రబాహు లా
తారకకార్తికేయులవి।ధంబున నాబలనిర్జరేశ్వరా
కారత నమ్మురాచ్యుతుల। కైవడిఁ బెద్దయుఁ బ్రొద్దు మేమెయిం
బోరిరి చూచు ఖేచరులు। భూరిబలంబుఁ జలంబు మెచ్చఁగన్. 53

క. లావఱి వివిధాయుధముల, భూవిభుఁడుం దాను నట్లు । పోరి యలసి వీ
రావేశ మడర జయకాం,క్షావశుఁడై రావణుండు । గదుఁ దమకమునన్. 54

మ. మది శంకింపక ముట్టి విక్రమరసోన్మాదంబునన్ భూవిభున్
గద వ్రేయంగ నతండు పైపడి భుజాగర్వంబునం బట్టె నా
రదుఁ డార్వం బరికాఁడు నిర్భయతఁ జేరం జూచినం బట్టుసు
న్నదశుండాలములీల దిక్కలితనాదశ్రావణున్ రావణున్. 55

క. పట్టి యిరువదికరంబులు, గట్టిగ వీఁపుపయి మోపుగాఁ బెట్టి తగన్
బెట్టు మెడ పట్టుకొనితువి, ముట్టినమగఁటిమి నభంబు । ముట్టఁగ నార్చెన్. 56

ఆ. నృపవరేణ్యుఁ డిట్లు । రిపుఁ బట్టు వఱచి కం,చుకిగణంబు నల్లఁ । జూచి యొకనిఁ
బిలిచి యోరి వీనిఁ । బెడకేలితోన తె,మ్మని సముద్ధతముగ । నప్పగించి. 57

క. తరుణీజనము వినోదపుఁ, బరివారము మున్ను నడవఁ । బనిచి పిఱుందై
పురమున కరుగ నిజప్రభు, పరిభవముం జూచి దైత్యభటకోటి వడిన్. 58

క. నిలునిలు విడువిడు మంచును, బలువిడిఁ గూడుకొని పిఱుఁదఁ । బఱతెంచిన న
మ్ముల నోడు నేసి యందఱ, నిలిపె విజయలక్ష్మిసొంపు । నెలకొన నెలమిన్. 59

క. తనకొలఁది యెఱుంగక యీ, దనుజుఁడు వనితావినోద । తత్పరు నన్నుం
జెనసె నని యుగ్గడించుచు, ననిమిషరిపుమీఁదఁ బోరిఁ । గటాక్షం బెలయన్. 60

తే. ఎదురువచ్చినమంత్రుల । కెగ్గు లెన్ని, చూపి చెప్పుచు నివ్విధి । కోపమునకు
నుపశమం బెట్టు సేయుదు । నొక్కొ యనుచుఁ, బురికిఁ జనిమందిరాంగణ । భూమి నిలిచి.

క. పొంపిరివోయెడుతనయను, కంపాతిశయమునఁ బంక్తి । కంధరు నెట్లుం
జంపం జాలక రోషము, పెంపునఁ గారాగృహమునఁ । బెట్టఁగఁ బనిచెన్. 62

క. మనుజపతి యివ్విధంబునఁ, దనచెఱయింటికిని ముచ్చుఁ । దప్పున నొప్పిం
చినయట్టుల మదిని సరకు, గొనక మఱచి యున్నయెడను । గొన్నిదినములకున్. 63

పులస్త్యుఁడు కార్తవీర్యుని వేఁడుకొని రావణునిచెఱ విడిపించుట.

మ. దనుజేంద్రుండు సహస్రబాహువిభుచేతం బడ్డపాటంతయున్
విని మాహిష్మతికిం బులస్త్యుఁడు గడున్ । వేగంబ యేతెంచి య
జ్జనపాలుం గనినన్ యథోచితముగా । సత్కారముల్ సేసి వ
చ్చినకార్యం బెఱిఁగింపుఁ డన్న నతఁ డౌ । చిత్యంబు మై నిట్లనున్. 64

చ. అలవి యెఱుంగ నేరక దశాస్యుఁడు లోకముతోడివానిఁ గాఁ
దలఁచి జితాఖిలాధ్యుఁడఁ గదా యని నచ్చి కడంగి వచ్చి సం
కలియకుఁ జొచ్చె వానిఁ బలుకం బని లే దటు లుండె నింతలం
తలుపను లెల్ల నీకు భుజదర్పముగాఁ గొన్న నేర్పు సాలు నే. 65

క. ఆక్రమసంచిత మగుభూ,చక్రం బుదయాస్తశైల । సహితంబుగ ని
ర్వక్రపరిపాలనస్థితిఁ, జక్రము చెల్లించుపూజ్య । సామ్రాజ్యమునన్. 66

క. తుదిముట్టి యున్నసీ కొఱకఁ, దెదురే యది గాక పగఱ యే పడఁగినఁ ద
ప్పు దలంప నిదియ కడు నొ, ప్పిద మగు నినుబోఁటినృపుల కెంపున కరయన్. 67

చ. నలినజుఁ డైన బ్రహ్మకును నాలవవాఁడు దశాననుండు ని
ర్మలగుణలోల వీఁడు మనుమం డని చెప్పఁగ నాకు సిగ్గగుం
బలుకులు వేయు నేటికిఁ గృపాపరతా స్తుతి దక్క వీని మం
దల విడు నాకుఁగా నృపతిధర్మవిచక్షణ పుణ్యవీక్షణా. 68

చ. అనవుడు నట్ల చేయుదు మహాత్మ భవద్విపులాంతరంగ మో
దన మగుదానిఁ జేయఁ గని ధన్యుఁడ నైతి దశాస్యు వేగ తో
డ్కొని చనుఁ డన్న నానృపతికుంజరుమంజుమృదూక్తిఁ జిత్తరం
జన మగుడున్ మొగం బలరసంయమి దీవన లిచ్చి మెచ్చుచున్. 69

తే. దనుజవల్లభు విడిపించుకొని పులస్త్యుఁ,డరుగ లజ్జావనతుఁ డగునతఁడు నతని
ననుపఁ బోయిన సానునయంబు గాఁగ, బుద్ధిఁ దగఁ జెప్పి లంకకుఁ బుచ్చె ననియె. 70

రావణుఁడు వాలిచే భంగపడి యతనితో మైత్రి చేయుట.

ఉ. రావణుఁ డివ్విధంబునఁ బరాజయ మందియు లంకలోనికిం
బోవుడు నంతయున్ మఱచి భూవలయంబునఁ దొంటియట్ల నా
నావిధదుశ్చరిత్రము లొనర్చుచుఁ గ్రుమ్మరి యొక్కనాఁడు వి
ద్రావితశత్రుభూరుహచరప్రభు వాలి నెదుర్చు వేడుకన్. 71

శా. కిష్కింధానగరంబు పై నరిగి సుగ్రీవాదు లెల్లన్ రణా
విష్కారోద్యమతీవ్రు లైనఁ గని తద్విక్రాంతి మానంగ మ
స్తిష్కంబున్ రుధిరంబు మాంసమును ధాత్రిం గూల్చ నుంకించియున్
దుష్కర్మం బగు వాలిలేమి నని చేతోవృత్తి నూహించుచున్. 72

క. పడుచుంబైదలు పన్నినఁ, గడపి చనక చిఱుతతోడి కయ్యమునకు నేఁ
గడఁగుట తగ దని యాయని, విడిచి దశాననుఁడు వారి విన నిట్లనియెన్. 73

క. మీలోనఁ గూడుకొని రాఁ, డాలం బాలంబు సేసి యది యెట్లొకొ తాఁ
జాల నని చెప్పఁ గా క, వ్వాలికి డాఁగినను బోవవచ్చునె నాచేన్. 74

చ. అనవుడు సూర్యసూనుఁడు దశాననుఁ గన్గొని నీవు నన్ను మె
చ్చనికత మేమిటం గొలఁది సాలనె వాలిని గూర్చి వచ్చి తే
యనికిఁ గడంగినన్ బిరుదు లైనమగల్ గని వీరు గారు నా
కనియు నెఱుంగ కిట్లు భయ మంది తిసీ వెడమాట లేటికిన్. 75

శా. నాకి ట్లింతయు నీడఁ బోయితి జగన్నాథుండు నా నొప్పునా
నాకేశప్రియనందనుం జెనసి మానప్రాణముల్ గావఁగా
నీకుం దీరునె యిప్డు దక్షిణపుమున్నీటం గృతస్నానుఁ డై
యేకాంతంబున నుండుఁ బొమ్మనినఁ బోయెం బుష్పకారూఢుఁ డై. '6

మ. దనుజేంద్రుండు మరుద్గతిం జని సముద్రస్నానసంజాతశు
ద్ధి నితాంతామలచిత్తనిశ్చలసమాధివ్యంజితానందమీ
లనసంభావితలోచనుం గపికులశ్లాఘాత్ము నవ్వాలివిం
గను తన్మూర్తినివృత్తవిక్రమకళాకౌతూహలస్ఫూర్తి యై. 77

వాలి రావణునిఁ జంకలో నిఱికించుకొని నాలుగుసముద్రములను ముంచుట.

క. ఎదురెదురను ముదలింపఁగ, మదిఁ గొంకి పిఱిందివలన మందగతిం జే
రెద నేమఱి యున్నెడఁ బట్టెద నను వగఁ బుష్పకంబు డిగి వచ్చుతఱిన్. 78

క. రావణునుద్యోగమునకు, దైవము ప్రతికూల మైనఁ దత్త్వనిదిధ్యా
సావేశవిరామం బై, యావనచరవిభుఁడు గన్నులర విరియంగన్. 79

క. కడకంటిచూడ్కి దశముఖుఁ, బొడగని సంభ్రమము లేమిఁ బొంచి నతనిఁ దాఁ
బెడమఱి చూచుట యుడిగి మగుడ నేత్రము లల్ల మూసికొని చిత్తమునన్. 80

క. వంచన నను నియ్యెడ ని, ర్జించుతలంపునను నసుర సేరెడు నే భం
జించెదఁ బాపాత్ముల నొ, ప్పించుట ధర్మంబ యనుచుఁ బిఱుఁ దారయుచున్.

క. ఉన్నయెడఁ మునిప్రేళులఁ, దిన్ననినడ నసురపతి పాదిలుఁ డై చేరం
గొన్నియడుగు లరిగి యదరి, యన్నగచరనాథుపై రయంబునఁ బడియెన్. 82

క. వెనుకకు మొనసి కరంబునఁ, బెనఁచి తిగిచి నిఖిలలోకభీకరుఁ డగున
ద్దనుజేంద్రు ననాయాసం, బునఁ జంకిట నిఱికి యింద్రపుత్త్రుఁ డచలుఁ డై. 83

చ. ఎఱుఁగనియట్ల యున్న నసురేశ్వరుఁ డప్పుడు గాలుఁ జేయు లా
వఱి రభసంబునం గుదుప నక్కడ నిక్కడ సూడఁ జూచి మై
గిఱుపఁగ నవ్విశక్తి యొఱఁగించుట నెమ్మదిఁ గోరి వానిమై
సుఱసుఱ స్రుక్క నొక్కె బలసూదనసూనుఁడు ప్రక్కదాపునన్. 84

చ. చదియఁగ నొత్తి యెత్తికొని శాతనఖంబులఁ గ్రూరదంష్ట్రలన్
వదనములన్ శరీరమును వారక ప్రచ్చుచు మేనిగాలిఁ దో
యదములు దూలఁ బశ్చిమదిగంబుధికిం జనియెన్ రయంబునం
జదల భుజంగమగ్రహణచారుసుపర్ణవిలాసభాసి యై. 85

చ. చని దనుజేశ్వరుండు వసచంకన యుండఁగఁ దజ్జలంబులన్
మునిఁగి శమంబుమై నియమముల్ దగఁ దీర్చి క్రమంబుతో నుద
గ్వననిధిఁ బ్రాక్పయోధిఁ గపివల్లభుఁ డట్టుల చేసి యశ్రమం
బున నిజపట్టణోపవనభూమికిఁ దెచ్చి సుఖోపవిష్టుఁ డై. 86

వాలిచే భంగపడి రావణుఁ డతనితో మైత్రి చేయుట.

శా. కోపం బాఱినఁ జంక వాపి ధరణిం గూర్చుండఁగాఁ బెట్టి ని
ష్పాపోల్లాసకటాక్షు మల్ల నొలయం బ్రాఘస్మితజ్యోత్స్న ల

జ్జాపూరావృతతన్ముఖాబ్జములపై సాంద్రంబుగాఁ జూపి ని
ర్వ్యాపారామరసుందరీప్రకరగర్భస్రావణున్ రావణున్. 87

క. కనుఁగొని యచ్చట నప్పుడ, కనినట్టులు సంభ్రమించి గౌరవమున న
వ్వనచరవీరశిఖామణి, దనుజపతికి నిట్టు లనియెఁ దదభిముఖుం డై. 88

క. ఎందుండి రాక యిక్కడి, కెందులకుం బోక యిచట నేకార్యము సే
యం దలఁచి నిలిచి తప్పని, విందము నీ వింటికడకు విచ్చేయు తగన్. 89

క. అనవుడు వెలవెలఁబాఱువ, దనములు వెడ వాంచి యెత్తి దశముఖుఁడు గపీం
ద్రునిమోము దీనదృష్టిం, గనుఁగొని గద్గదిక నెలుఁగు గడలుకొనంగన్. 90

మ. తగు నీకే మని పల్కినన్ విను భుజాదర్పంబునన్ మూఁడు లే
క గిరీశున్ గిరితోన యెత్తి సురలోకస్వామి జంభారి గా
సిగ బంధించి జగత్త్రయంబును బనుల్ సేయన్ విజృంభించి గ
ర్వగరిష్ఠుం డగునన్ను నిద్దెసకుఁ దేరం జాలుటన్ వాసవీ. 91

చ. అనవుడుఁ గౌఁగిలించి దనుజాధిపతిం దగ గారవించి తో
కొని పురి కేఁగి తత్తదనుకూలచరిత్రములన్ సఖిత్వరీ
తి నడపి తాను దమ్ముఁడు నతిప్రియభాషలచేఁ బ్రసన్నుఁ జే
సిన నతఁ డాకపీంద్రవరుచెల్మికిఁ బల్లవితాంతరంగుఁ డై. 92

ఆ. వివిధ కేళిఁ దగిలి వేడుకఁ గతిపయ, దినములందు నిలిచి దివ్య మకుటఁ
దోన వచ్చియున్న మానితనిజవిమా, నమునఁ బ్రీతిఁ దనపురమున కరిగె. 93

క. లీల నటు లసురవల్లభుఁ, గేలిపాత్రంబుఁ జేసి క్రీడించినయ
వ్వాలి భవదస్త్రమున కర, సాలియుఁ జాలమి నుతింపఁ జాలదె యెందున్. 94

క. అని మునిపతి యివ్విధమున, దనుజపతిం జెప్ప రామధరణీపతి తి
న్ననినవ్వ మెఱయ నాతని, వినితిమి యిఁక నొకటి వినఁగ వేడుక యనుచున్.

క. ఏమియొకో న న్నడిగెడు, నీమానవనాథుఁ డంచు నెద నూహింపం
గా మునిజనవల్లభుతో, రామనృపతి కౌతుకస్ఫురణ ని ట్లనియెన్. 96

హనుమంతునిజననాదివృత్తాంతము.

క. కొంత యెఱుంగుదుఁ బవనజు, వింత దివిజరాజతనయువిక్రమము, హనూ
మంతునకు వాలికిం గల, యంతర మేకొలఁదియొకొ చరాచరవేదీ. 97

ఆ. అనిన నాంజనేయు నతులబలము విన, వేడ్క నేసె నితఁడు విస్తరించి
కలతెఱంగు సెప్పవలయు నా కని ముని, యిట్టు లనియెఁ బ్రీతియెసక మెసఁగ.

శా. వాలిం గీలియు వాయుపుత్త్రుసరియే వాఁ డాత్మశక్తిజ్ఞుఁ డై
యాలోకంబులు గెల్తు నే ననిన మా తెందుం గలండే మహీ
పాలాగ్రేసర వానివర్తనముఁ జెప్పం జిట్ట లావిక్రమ
శ్రీలోలున్ భవదీయసన్నిధిఁ బ్రశంసింపం దగుం జెప్పెదన్. 99

చ. సురగిరిసానుదేశమున సుస్థిరసంపద నుల్లసిల్లు కే
సరి యనువానిభార్య గుణశాలిని యంజన నాఁగ నొప్పుసుం
దరి యనిలప్రసాదమున ధర్మవిధిజ్ఞ మహనీయమూర్తివి
స్ఫురితుఁ గుమారుఁ గాంచె బరిపూర్ణతపోమహిమాభిరామ యై 100

ఉ. ఆతనిరక్షణంబున నహర్నిశముం దగ సావధాన యై
యేతరుపండు లొప్పు నవి యేటి వనంబులఁ దెచ్చి యిచ్చుచుం
బ్రీతిఁ జరించుచున్నెడఁ గపిప్రవరార్భకుఁ డొక్కనాఁడు ప్ర
ద్యోతనబింబముం బొడుచుచుండఁగఁ జూచి సముత్సుకాత్ముఁ డై. 101

చ. ఫల మనుబుద్ధిఁ బుచ్చికొనఁ బాఱె నభంబున వాయుదేవుఁడుం
సలిలకణార్ద్రితం గిరణజాలము వేఁడిమి దాఁక కుండ నే
వలనను దాన యై పొదివి వచ్చెఁ దనూభవు నాఁడె పర్వ మై
జలరుహమిత్రుఁ బట్ట రభసంబున రాహువు జేర నత్తఱిన్. 102

క. ఆసైంహికేయుఁ డర్కగ్రాసాదరవృత్తి వచ్చు కపిఁ గనుఁగొని సం
త్రాసభరితమానసుఁ డై, వాసవుకడ కేగి ఖిన్నవదనుం డగుచున్. 103

క. రవిశశిబింబగ్రహణోత్సవ మెల్లను నాకు మున్నొసఁగి యెప్పుడుఁ జె
ల్ల విడిచి యుండుదు నేఁ డొకఁ డవార్యవిక్రముఁడు వచ్చె నర్కునిఁ బట్టన్.

మహా. అనినం గోపించి యింద్రుం డఖిలభువనమర్యాద లయ్యైవిధిం ద
ప్పనిభంగిం జొప్పుతో నేర్పడ నడవఁగ నా పంపు గానీక యెవ్వం
డినబింబగ్రాహి యై యయ్యెడకు ముదముమై నేగుదెంచెం దదంగం
బనఘా మద్వజ్రధారాహతిఁ బొడిపొడి సేయంగ నే వత్తు నంచున్. 105

మ. అనికిం బూని కరీంద్రు నెక్కి చనుజంభారాతికిన్ ముందటం
జని తద్బాహుపరాక్రమంబున మహోత్సాహంబుతో సింహికా
తనయుం డాకపిబాలుపై నడరి యుద్యద్విక్రముం డై నయా
తనియాటోపము నోర్వఁజాలక విభీతస్వాంతుఁ డై పాఱెనన్. 106

తే. ఎగచికొనిపోయి కపి దివిజేంద్రదంతి, వెనుకసార నంటఁ దఱిమినమనములోన
మెచ్చియును దనచేసినమేరతప్పు, నని తలంచుచు మృదురోషుఁ డై యతండు.

క. భాసుర మగువజ్రంబున, వ్రేసిన హనుదేశ మర్థవిదళిత మైనం
గేసరితనూభవుఁడు మూర్ఛాసంగతుఁ డై ధరిత్రిఁ జాఁగం బడియెన్. 108

క. తనవచ్చినపని దీఱిన, ననిమిషపతి నాకమునకు నరిగెఁ దనయునిం
గనుఁగొని వేదనఁ బొంది పవనుఁ డప్పుడ యుడిపెఁ దనదువర్తన మెందున్.

ఆ. జగములందు వాయుసంచార ముడిగిన, సకలజీవలోకసంకటంబు
పుట్టుటయు విరించి పురుహూతవరుణాదిసురులు బలసి కొలువ నరుగుదెంచి.

క. మాత్సర్యము ప్రాణంబు చికిత్సిత మగునొక్కొ వీనికిఁ బ్రణ మనుచున్
వాత్సల్యంబునఁ బుత్త్రకు, నుత్సంగమునందుఁ దాల్చియున్న సమీరున్. 111

క. కనుఁగొని కరుణాపూరిత, మనస్కుఁడై యక్కటకట మారుతుఁడు సుతా
ననసక్తలోచనుం డై, మనవచ్చుటఁ గానఁ డనుచు మక్కువతోడన్. 112

శా. చేరం బోవుటయున్ సమీరుఁడు సురజ్యేష్ఠున్ నిరీక్షించి దు
ర్వారాంతరపరితాప మేది తనయున్ వక్షోగతుం గా సమా
చారప్రౌఢత నెత్తికొం చెదురుగా సద్భక్తిమై నేగి లో
కారాధ్యం బగుతత్పదాంబుజయుగం బర్చించె నానమ్రతన్. 113

క. వనజాసనుండు ఫాలంబునఁ గేలిరవొంద నెత్తి పొడివి భుజము నా
తనిమస్తకంబు వక్షంబునఁ జేర్చి కృపాతిరేకమున గాఢముగన్. 114

క. పశ్చిమదిశచందంబున, నిశ్చేష్టుం డయినబాలునిం జూచుడు వాఁ
డాశ్చర్యంబుగ నపుడ పునశ్చేతనాగమంబునం దెప్పిఱిలెన్. 115

క. దర్శనమాత్రన శోకవిమర్శక్షమచిత్తుఁ డయ్యె మారుతి బాహా
స్పర్శమునఁ బ్రబలదురితనికర్షుఁడు వ్రణనిర్వికారుఁ గా నొనరించెన్. 116

చ. తనయుఁడు సేదదేరిన ముదంబునఁ గౌఁగిటఁ జేర్చి యంబుజా
సనునకు మ్రొక్కఁ బంచి వికసద్వదనుం డయి వాయుదేవుఁ డెం
దు నిఖిలదేవకోటి పరితోషవిధాయక మైనయాత్మవ
ర్తన మొనరంగఁ జేసె నమరప్రభుచిత్తము పల్లవింపఁగన్. 117

చ. కమలభవుండు దేవతలఁ గన్గొని మారుతిఁ జూపి దేవకా
ర్యమునకుఁ గా జనించె నితఁ డద్భుతవిక్రమశాలి రామనా
మమున వెలింగి లాఘవసమాజవిభూషణ మైనకేలిజ
న్మమున దశాస్యదుర్మదము మాన్పునెడం బనిసేయు శార్ఙ్గికిన్. 118

క. కావున మీ రిందఱు సంభావించి వరంబు లొసఁగి పవనునకుఁ బ్రమో
దావేశము లోకహితముఁ గా వీనిఁ గృతార్థుఁ జేయఁగాఁ దగు ననినన్. 119

ఆ. వాసవుండు తనదువక్షస్స్థలంబునఁ, గ్రాలు సురభికుసుమమాల యర్థిఁ
గపికుమారుచారుకంఠభాగంబున, నాదరార్ద్రహృదయుఁ డగుచుఁ బెట్టె. 120

క. హనువున మత్కులిశము దాఁకినచో నొఱుకవడి వీనికిం దొడ వగుచి
ట్టునికికిఁ దగ హనుమంతుం, డను పే రిచ్చితిఁ బ్రసిద్ధ మై పెంపొనరన్. 121

క. కులిశము మొద లగు నాయుధములు నేమిట వీనియంగములు నిర్దళితం
బులు గాకయుండ నొసఁగితి, నలఘువరం బనియె దృక్సహస్రం బలరన్. 122

సీ. వారి నెయ్యెడల నీ వానరోత్తమున కాపద పుట్ట నీనని యుదధిపతియు
నగ్ని యెన్నఁడును నీ యగచరాగ్రణికిఁ గీడొందఁగ నీఁడని హుతవహుండు

భూతగణంబులచేత నీహరిసత్తమునకు నెగ్గొనర నీ నని శివుండుఁ
గాలదండమున నీ కపిముఖ్యునకుఁ జింత వంత రా నీనని యంతకుండు
తే. వరము లిచ్చిరి తక్కటిసురలు నిజమ,హానుభావానురూపంబు లైనపదవు
లొసఁగి రిమ్మాడ్కి మారుతి నసదృశప్ర,భావుఁ గావించి పద్మసంభవుఁడు ప్రీతి.

చ. అనిలుని వీడుకొల్పి దివిజావళితోడ వియత్పథంబునం
జనియె నతండుఁ బుత్త్రుఁ గొని సంతస మందుచు నేగుదెంచి యం
జనకుఁ దదీయబాహుబలశౌర్యములున్ వరలాభముం గ్రమం
బున నెఱిఁగించి పోయెఁ గపిపుంగవుఁడున్ శిశుకేలిలోలుఁడై. 124

క. మునిజనులయాశ్రమములకుఁ, జని చని యాగోపకరణచయ మెల్లను దు
ర్వినయమున గాసి చేయుచు, నునికి కలిగి వా రమందహుంకారములన్. 125
క. తనశక్తియు వరలాభం,బున వచ్చినపెంపు నుల్లమునఁ దలఁపక యి
వ్వనచరుఁడు నిజబలం బెఱుఁ,గనిగజజాతియునుబోలెఁ గావుత మనినన్. 126
తే. బుద్ధిమంతుఁడు గావున వృద్ధతాప,సోక్తులకు సుక్కి దౌర్జన్య ముడిగి మెలఁగె
నితఁడు తనలా వెఱుంగనికతన మఱియు,వీరులనఁ గొంద ఱిమ్మహి వినఁగఁబడిరి.

క. ఇనునరదముముందట వెను, వెనుకకు వెసఁ జనుచు శబ్దవిద్యాధ్యయనం
బొనరించె నాతఁ డోజ్జగ,హనుమంతుం బోల నలవి యగునె యొరులకున్. 128
తే. జనకుఁ డగుఋక్షరజసుండు సచ్చుటయును, వాలిఁ బట్టంబుగట్టినవానితమ్ముఁ
డైనసుగ్రీవుఁడత్తఱి యావరాజ్య,భరముఁ దగఁ దాల్చి యుండి యిప్పవనతనయు.
క. చెలిఁ జేసి కొని ముదంబునఁ, గలసి మెలఁగుచుండి పిదపఁ గౌశికసుతుతోఁ
గలుపించి ఋశ్యమూక,స్థలి కాతఁడు వోవఁ దోన చనియె నితండున్. 130
క. తనలా వెఱుఁగనికతమున, నినసుతునకు వశ్యుఁ డయ్యె నేడ్తెఱ సంక్రం
దననందనుభుజబలమ,ర్దనమునకుఁ గడంగఁ డయ్యె రఘువంశనిధీ 131

చ. అనవుడు సమ్మదంబు దొలఁకాడఁగ నిక్కము నట్ల కాక య
వ్వననిధి దాఁటి లంకయును వానివనంబును గాసి చేసి నం
దనుఁ దెగఁ జూచి వచ్చినవిధం బది యల్పులచేతఁ దీరునే
జనకజఁ గాంతు మే యసమసాహసుఁ డీతఁడు లేక తక్కినన్. 132
క. అని లజ్జావనతుం డగు, హనుమంతుఁ గటాక్షవీక్షణాదరముదితా
త్మునిఁ జేసి దాశరథి య,మ్మునిజనముం జూచి కేలు మొగుచుచు భక్తిన్. 133

అగస్త్యాదిఋషులు రాముని వీడ్కొని చనుట.

క. మసలితిరి విచిత్రకథా, రసవృత్తిం దడ వెఱుంగ రాక యనుష్ఠా
నసమయ మయ్యె నభోమ,ధ్యసమీపంబునకుఁ దరణియరదము వచ్చెన్. 134
మ. విజయంచేయుఁడు నావుడున్ మునులు పృథ్వీనాథ యూహింప వి
శ్వజనీనుం డగునిన్నుఁ జూపు సదనుష్ఠానంబు గాదే భవ

ద్విజయశ్రీ దమకోర్కి గా సుకృతముల్ వే భంగులం జేయునీ
ద్విజకోటిం బరికించి కొమ్మని కృతార్థీభూతచేతస్కులై. 135

క. క్రందుకొనంగ నొక్కుమ్మడి, నందలు దశవదనదమను నాశీర్వాదా
నందితుఁ జేసి యమందానందముఁ బొందుచుఁ దపోవనములకుఁ జనినన్. 136

క. తగ నెల్లవారిఁ బొమ్మని, జగతీపతి యచటు వాసి సమయసముచితం
బుగ నయ్యెయెడలకుఁ జని, పగలిటివర్తనము ప్రాజ్యపదవిఁ సలిపెన్. 137

తే. రాత్రియగుటయుఁ గార్యతూర్యత్రయాది, వివిధగోష్ఠీవినోదముల్ వేడ్కనడపి
యతిమనోహరవాసగేహమున కేగి, నిరతిశయమోదమున సుఖనిద్రఁ జేసి. 138

చ రవియుదయంబుకంటె మును రాజశిఖామణి మేలుకాంచె దా
నవకులమర్దనాంక సునినాదములై నసురంగగీతముల్
వివిధగతిప్రవర్తన నవీనములై సొగయింప మాగధ
ప్రవరులు పాడుమంజుమృదుభంగికి వీనులు దొల్త మేల్కనన్. 139

ఆ. అపుడు సముచితంబు లగుకరణీయంబు, లాచరించి రఘుకులాధినాథుఁ
డభిమతప్రసాధనాభిరామాకృతి, యై మహావిభూతి నతిశయిల్లి. 140

చ. కొలువున కేగుదెంచి నృపకోటియు మంత్రికదంబకంబు దై
త్యులుఁ గపులుం గవీంద్రులు నియోగులు వందిజనంబు లిష్టభృ
త్యులు మొదలైనవారలు నిజోచితభంగి సుఖోపవిష్టులై
బలసి ముదంబునం గొలువఁ బ్రస్తవనీయసముజ్జ్వలస్థితిన్. 141

తే చామరగ్రాహిణీకరచారుకటక, రశ్మిరాజినీరాజనరంజితుండు
భరతలక్ష్మణశత్రుఘ్నపరివృతుండు, నగుచు సామ్రాజ్యలక్ష్మిసొం పగ్గలింప. 142

సీ. పౌరజానపదాభిభాషణంబులు దగ నయ్యెతెఱంగుల నాదరించు
నుత్తమహయదంతి సత్తమరథరత్నములు సూచి సవరణ లలవరించు
యోధవీరప్రకారోక్తినిరూఢన ముద్ధతి కెడఁదలో నుల్లసిల్లు
నిఖిలవిద్యాగమనిపుణవిద్వజ్జనసంభావనంబుల సంతసిల్లు

ఆ. ననుదినంబు నిట్టు లభిమతబహువిధ, సముచితప్రవర్తనము లొనర్చు
చతివిభూతినుండి కతిపయదినములు, వోవుటయును రామభూవిభుండు. 143

పట్టాభిషేకమునకు వచ్చినజనకరాజు మొదలగువారిని రాముఁడు వీడుకొలుపుట.

మ. జనకాదిక్షితిపాలలోకములకుం సంభావనాపూర్వకా
ర్చన లర్థిం దగ నిచ్చి వీడ్కొలిపి మార్గక్షేమసంవాహనం
బొనరింపం దనతమ్ములం బనిచినం బ్రోద్దామసేనాసహా
ప్రనమద్భూమిభరస్ఫుటానమితశేషస్కంధులై పోయినన్. 144

క. వనచరనిశాచరులమ్మన్నన నిచ్చలుఁ గ్రొత్త గాఁగ నరపతి వారిం
గొనియాడుచుండఁ గతిపయదినములకుం దమ్ము లరుగుదెంచిరి మగుడన్.

ఉ. అచ్చట రాజు లిచ్చినయనర్ఘమణిప్రకరం బుపాయనం
బిచ్చిన వేలువేల ధరణీశుఁడు వారల నాదరించి మీ
రెచ్చినవస్తుకోటి గణుతింపఁ గృతార్థతఁ బొందె డెంద మే
నిచ్చెద వీరి కంచు నసురేంద్రహరీంద్రులఁ జూచి వేడుకన్. 146

ఆ. పురుషరత్నములనఁ బొందుట యుచిత మీ, రత్నములకు నని ధరావిభుండు
వారి కప్పు డొసఁగెఁ గారవ మేర్పడ, జాత్యరుచిరరత్నజాలకంబు. 147

క. వనచరులకు నసురులకుం, గనకాంబరభూషణములు గణనకు మిగులం
దనుఁ జేరఁ బిలిచి యిచ్చుచు, జననాథుఁడు వేలువేల సంభావించెన్. 148

ఆ. ఇవ్విధమున వారి కెల్ల సంప్రీతి యొ,నర్చి రామధరణినాథుఁ డర్క
తనయుతోడి నిట్టు లనియెఁ బ్రసాదవి,కాసలలితవదనకమలుఁ డగుచు. 149

క. నీపురి కేగుము హరిసే,నాపరిపాలనము సేయు నయదక్షుఁడవై
నాపిలిచినయప్పుడ సే,వాపరతంత్రత వహింపవలయుం జుమ్మీ. 150

క. అంగదుఁ బాటింపుము త,క్కుంగలయీసుభటకోటిఁ గొనియాడుము వీ
రిం గైకొంటిమి గాదె య,భంగుల యెప్పాట నరిది పనులకు నైనన్. 151

మ. అని సుగ్రీవునిఁ బ్రీతి వీడ్కొలిపి దైత్యాధీశ్వరుం జూచి యి
ట్లను లంకాపురి కేగు ధర్మమహితన్యాయంబు లోకంబు కీ
ర్తనసేయన్ భవదీయరాజ్యము చిరస్థాయిత్వముం బొందఁగా
మను నీబంధుల నీగి తేజమున సమ్మానింపు మెక్కాలమున్. 152

క. అని కారుణ్యజ్యోత్స్న, జనకం బగుతనదువదనశశిమండల మా
తని నెమ్మనమ్ము సమ్మద, వనధిం బొంగింప నసురవరు వీడ్కొలిపెన్. 153

క. హనుమంతుఁ జూచి మత్కీ, ర్తనములు భువనముల నెంత దాఁక నడచు నీ
వును నంతకాలమును ని,త్తనువు విడువకుండు మనుచు దయ చిగురొత్తన్.

క. హిమధరణీధరతటసం,గమచారుమరున్నదీప్రకారసుభగతం
గమనీయంబుగఁ దద్వ,త్సమునం దొకహార మిడి యసదృశప్రీతిన్. 155

ఆ. తిరిగి కౌఁగిలించి యగచరసత్తము, సద్గుణములఁ దగిలి సంస్తుతించి
రఘువరేణ్యుఁ డాదరం బెలరారంగ, వికచవదనుఁ డగుచు వీడుకొలిపి. 156

క. తనుఁ బాయఁ జాల కందఱు, వెనుఁబడుట యెఱింగి ధరణివిభుఁ డొండొరు నె
మ్మనము మఱుఁగు చుండఁగ ని, వ్వనటకుఁ బనియేమి యనిన వా రతిభక్తిన్.

క. ధరఁ జాఁగి మ్రొక్కి తమతమ, పురములకుం జనిరి రామభూపాలుండున్
భరతాద్యనుజసమేతము, పరిపాలనచేసె రాజ్యభారంబుఁ దగన్. 158

ఆశ్వాసాంతము.

చ. శరదభిరామచంద్రరుచిరాజాలసఖత్వసముల్లసత్ప్రయ
శ్శరనిధిగర్వచర్వణవిశారదమేదురకీర్తిపూరభా

సురలహరీకదంబపరిచుంబితపూర్వమహీభృదస్తభూ
ధరమలయాభిధానగిరిదైవతపర్వతమేఖలుం డిలన్. 159

క. ఫలితామరతరుశాఖా,తులితభుజుం డఖిలదిగ్వధూమస్తసము
జ్వలదీధితిశాసనమణి, కులదీపక రాయగండగోపాలుఁ డిలన్. 160

మాలిని. చిరవితరణలీలాశీలుఁ డుత్సాహవిద్యా
పరిణతదృఢసంగాభంగుఁ డక్షీణపుణ్యో
త్కరపరిచయశిల్పాకల్పుఁ డాభోగశుంభ
ద్ధరణివలయరక్షాదక్షుఁ డబ్జాక్షుఁ డుర్విన్. 161

గద్యము. ఇది శ్రీమదుభయకవిమిత్ర కొమ్మనామాత్యపుత్ర బుధారాధనవిధేయ తిక్కననామధేయప్రణీతం బయినయుత్తరరామాయణం బనుమహాకావ్యంబునందు సప్తమాశ్వాసము.

శ్రీరస్తు.

నిర్వచనోత్తరరామాయణము

అష్టమాశ్వాసము

శ్రీపతిగౌరీపతివా
ణీపతిలీలాచతుర్థనిజవర్తనుఁ డి
ష్టాపూర్తనిరతమతి కరు
ణాపూర్ణుఁడు మనుమసిద్ధినరవరుఁ డెలమిన్. 1

క. అంత నొకనాఁడు నృపుఁ డత్యంతమహిమఁ బెద్దకొలువునం దున్నయెడన్
వింతయిన కొన్నివచనము, లెంతయు మధురములు గాఁగ నిట్లనెఁ జదలన్. 2

కుబేరపుష్పకము రాముని యొద్దకు వచ్చుట.

ఆ. ఏను బుష్పకంబ మానవాధీశ్వర, నీవు పరమధర్మనిపుణబుద్ధి
నపుడు నన్నుఁ గిన్నరాధిపుపాలికిఁ, బోయి యతనిపంపు సేయు మనుడు. 3

మ. భవదాజ్ఞం జని యాధనేశుఁ గని నీపం పెప్పుడుం దొంటియ
ట్ల విధేయాత్మతఁ జేయ నన్నుఁ బనిచెన్ లావణ్యవారాశి దా
నవవిధ్వంసనుఁ డాశ్రితాపదుదయోన్నాథక్రియాశాలి రా
ఘవచూడామణి రామదేవుఁడు గృపాకల్పాత్ముఁడై నావుఁడున్. 4

శా. ఆతం డచ్చెరుపాటు సంతసము వక్త్రాబ్జంబునం దోఁపఁగా
నాతో నిట్లని పల్కె రామధరణీనాథుండు లోకత్రయం
బాతంకం బెడ నుజ్జగింప సురకోట్యానందముం బొంద దు
ర్జాతుం బంక్తిముఖున్ వధించి కొనియెన్ సర్వంబు లంకాపురిన్. 5

క. నీవును నం దొకసరకా, భూవల్లభునకు వినోదమునకును బాత్రం
బై వలసినచోటులకుం, బోవలఁతివి నిన్ను నిందుఁ బుత్తేఁ దగునే. 6

చ. అదియునుగాక లోకముల నన్నిటిఁ గావఁ దలంచి దుష్టదు
ర్మదఖరదండమండనపరాయణులై చనునట్టివారి కి
ట్టిది దగుఁ గాక పూని యొకకోటిం గడ తేర్పఁ గడంగ లేక యె
ల్లిదు లగువారి కేటికి సలీలవిహారము వేడ్క సేయఁగన్. 7

ఉ. కావున నెల్లభంగులను గ్రమ్మఱఁ జయ్యనఁ బోయి రామధా
త్రీవిభునొద్ద నిల్వుము మదీయహితం బిది యేను బంపఁగాఁ

బోవుట నెగ్గు లేదతఁడు పొచ్చెము సేయక సమ్మతించి సం
భావన సేయు నన్ను జనపాలక సమ్మద మంది వచ్చితిన్. 8

క. పనిగొనుము నన్నుఁ గైకొని, యనునప్పలుకులకు మానవాధీశుఁడు సం
జనితబహుమానుఁ డై యి, ట్లనియెం బుష్పకవిమానమానందింపన్. 9

క. ఏవలన నుండి యైనను, నావలసినయపుడ గ్రక్కున నం జనుదేరం
గావలయుఁ దలఁచునంతకు, నీవల నెట్టట్ల తిరుగు నిఖిలజగములన్. 10

క. సిద్ధులగమనంబులకు వి,రుద్ధముగాఁ జనకు, మానరోషంబులు స
ద్బుద్ధులకుఁ దగమి యెఱిఁగి జ,గద్ధిత మతి సంచరింపు గౌరవ మొప్పన్. 11

తే. అని మహీపతి ముక్తాయతాక్షతములు, గంధపుష్పంబులును గొని గౌరవమున
మన్ననకుఁ దగుదివ్యవిమానమునకు, నర్చనము నిచ్చి వీడ్కొల్పె నది యుఁ బ్రీతి.

క. తన కిష్ట మైనయెడకుం, జనినయనంతరమ రాజసత్తముతో ని
ట్లనియె భరతుండు పరిజను, లనుమోదరసానుభావితాంబుధిఁ దేలన్. 13

భరతుఁడు రాముని బొగడుట.

ఉ. చోద్యముగా నమానుషవచోరచనల్ విలసిల్లె నెంతయున్
హృద్యము గాఁగ నామయవిహీనత నొప్పెఁ దపఃప్రకర్షముల్
మాద్యదరాతిసంచరణమార్గము లెల్లను మాసె, నెందు సా
వద్యులు లేరు, బాలమృతివాదము లేదు, ధరిత్రి నెయ్యెడన్. 14

చ. కొడుకులఁ గాంచి రంగన లకుంఠితసిద్ధులఁ బొందెఁ గర్షముల్
గుడువఁగఁ గట్ట నెల్లజనకోటికి నేమిఁ గొఱంత లేద యి
ప్పుడు భవదీయరాజ్యమున భూవరకుంజర, సౌఖ్య మంది యి
ప్పుడమికి నిన్ను శాశ్వతవిభుండుగఁ గోరెద రెల్లవారలున్. 15

క. అనవుడుఁ దమ్మునిపలుకులు, విని మది ముదమంది మోము వికసిల్లఁగ నా
తనిఁ బ్రీతి వొందువీక్షణ,మున సీతావల్లభుఁడు ప్రమోదితుఁ జేసెన్. 16

ఆ. పుష్పకప్రసంగమునఁ దనుఁ గొనియాడు, భరతు నివ్విధమున భరితపరమ
హర్షుఁ జేసి సమయ మగుడు నాస్థానమం,డపము వాసి చనియె నృపవరుండు.

శ్రీరామునివినోదవిహారము.

ఉ. నిచ్చలు నిత్తెఱంగున ననింద్యచరిత్రుఁ డనేకభంగులన్
వచ్చినవిన్నపంబు లనివారణమై విని, నిశ్చయంబుగా
నిచ్చు సదుత్తరంబులకు నెల్లజనంబులు సంతసిల్ల రా
లచ్చి నహీనసద్గుణకలాపములం దగిలించె దక్షుఁ డై. 18

చ. ప్రజ ననురాగ మందఁ బరిపాలన సేయు నరేశ్వరుండు దో
ర్విజితవిరోధి యై తుదిని వేడ్క మెయిన్ విహరించు నెందు నా

ర్యజనులు మెచ్చఁగా నరసి యాదిమునీంద్రనిబద్ధనీతివా
క్యజనితకౌతుకుం డగుచు నమ్మనుజేంద్రుఁడు సమ్మదంబునన్. 19

క. రమణీయస్థలముల హృద్యము లైనపదార్థములఁ బ్రియాసహితవిహా
రము సలుపు నుచితపరివారము నాగరికంబునను సరసమధురముగాన్. 20

ఉ. వేడుక నెత్త మాడుచుఁ బ్రవీణత మై గరువంపుఁ బన్నిదం
బాడుచుఁ జూచి యొండొరులయంగకముల్ మది మెచ్చి యుల్లసం
బాడు నెపంబు వెట్టి కొని యాడుచుఁ బువ్వులఁ బ్రేటు లాడుచుం
జేడియయుం విభుండు విలసిల్లిరి పొచ్చెము లేనిమచ్చికన్. 21

సీ. కలపంబు లభినవగంధంబులుగఁ గూర్చి తనువల్లిఁ గలయంగ దాన యలఁదుఁ
బువ్వులు బహువిధంబుగఁ గట్టి ముడి కొకభంగిగా నెత్తులు వట్టియిచ్చు
హారముల్ మెఱయ నొయ్యారంబుగా గ్రుచ్చి యందంబు వింతగా నలవరించు
మృగమదపంకంబు మృదువుగా సారించి, తిలకంబు వెట్టి నెచ్చెలికిఁ జూపు
ఆ. జనకరాజతనయ మనము దలిర్పంగ, వివిధనిపుణలీల వెలయ నిట్లు
చతురముగ నొనర్చు సౌభాగ్యసౌరభి, రామమూర్తియగుచు రామవిభుఁడు.

మ. ప్రణయక్రోధముఁ దాన యొక్క మెయి సంపాదించుఁ బాదాంబుజ
ప్రణతిం గ్రమ్మఱఁ దీర్చు, నేర్చి ధరణీపాలుండు సాకూతభా
షణముల్ వీనుల నించు, మన్మథకళాస్వాతంత్ర్య మానంద ప్ర
రణమార్గంబునఁ జెల్ల నిచ్చు రమణీరాగాబ్ధిపూర్ణేందుఁ డై. 23

సీతారాము లుద్యానవనమున విహరించుట.

చ. ఉపవనదేశకేళిజనితోత్సుకతాభరితాంతరంగుఁ డై
నృపుఁడు సఖీసమేతధరణీతనయాసహితంబు గాయకా
దిపరిజనంబుతోఁ జని తదీయసమీరుఁడు దన్నుఁ గానరా
కపగిది వీచినం గొలువు గైకొని యింపెద నాదరించుచున్. 24

క. చొత్తెంచిన వనపాలిక, మత్తమధుపములకుఁ దప్పి మధుభరితం బై
క్రొత్తావి గ్రమ్మునరవిరి, గుత్తి విభున కిచ్చె వినయకుంచితతను వై. 25

చ. జనపతి యందఁగా వెఱచు చాడ్పున జానకిఁ జూపి, కానుకల్
గొనఁ దగువార లుండ మనకుం జను నే యని చేయి వాయఁ బె
ట్టిన వనపాలికాకరపుటీకలితస్తబకంబు పుచ్చె మె
ల్పున సతి లేఁతనవ్వునఁ గపోలతలంబులఁ గాంతి వింతగాన్. 26

క. తరుపోతలతాకృత్రిమ, సరిదంబుజషండకేళిశైలముల మనో
హరము లగునెడలఁ గ్రీడా, పరతంత్రాత్ములయి లలితభంగిఁ జతురతన్. 27

చ. అరవిరు లెవ్వ రెక్కుడుగ నారసి మేలుగ నేటి కోయఁగా
వెరవరు లెవ్వ రొక్క కడువేగమ సెజ్జకుఁ జాలఁ గందునం

పొరయనియట్ల కెంజిగురుఁ బ్రోవొడఁ గూర్తురు చూత,మంచు న
న్నరపతియుం దలోదరియు నర్మవచోరచనార్ద్రచిత్తులై. 28

చ. అలరులఁ గోయుచున్, మధుకరావళిఁ జోపుచుఁ గీరపోతకం
బులపలుమాఱుమాటలకుఁ బొంచుచు, నంచలఁ బట్టఁ దారుచున్
లలితమయూరనర్తనవిలాసముఁ జూచుచు బోటిపిండుతోఁ
గలయుచుఁ బాయుచున్ బహుళకౌతుకవృత్తి రమించి రెల్లెడన్. 29

సీ. తీఁగెయుయ్యెల లెక్కి తూఁగియాడుచుఁగూడి పాడెడుమత్తాళిబాలికలను
బలుకులతోడన యలవడఁ దొడఁగిను నేరనికీరకుమారకలను
నింపారు లేఁదూడు లేఱి పిల్లలకుఁ బెట్టుచు నున్నహంసకుటుంబినులను
ఫలరస మొండొంటి కెలమిఁ జంచుల నించు తఱిఁ జొక్కు కోకిలదంపతులను
తే. జూచిచూచి యొండొరులకుఁ జూపిచూపి, చెలుల కెఱిగించికొనియాడి చెప్పిచెప్పి
చిత్తహారివిహారసంసేవఁ దగిలి, యుల్లసిల్లిరి వనితయు వల్లభుండు. 30

ఉ. అల్లవె లెస్సపువ్వు లని యందనిగుత్తులదిక్కు సూపి, తా
నల్లన చేరి నేను నెగయ న్నిను నెత్తెదఁ, గోయు మంచు భూ
వల్లభుఁ డాదటం బొదివి వామవిలోచన నెత్తెఁ, దత్తనూ
వల్లికతోన మైఁ బులకవర్గము కాముఁడు నారు వోయఁగన్. 31

చ నవకపుమావిమోకలఁ బెనంగినతీవలు వేడ్కఁ బెంపఁ బ
ల్లవములసెజ్జ లుల్లముల లజ్జ లడంపఁగఁ దేఁటితండముల్
దివుటల ముంపఁగా సమదలీల మనోజవినోదసక్తులై
యవసరసేవ మెచ్చి మలయానిలు సౌరభధన్యుఁ జేయుచున్. 32

ఆ. ఇవ్విధమునఁ బతియు నెలనాఁగయును వివిధప్రకారలీలఁ దగిలియుండఁ
జెలులుఁ గేలివనము గలయంగఁజొచ్చి నెమ్మనములందుఁ గోర్కికొనలు నిగుడ.

చ అలరులు గోయుచోట మధుపావళి మ్రోఁతకు ముగ్ధ లుల్కినం
గలకల నవ్వుచుం దొలుతఁ గైకొని మవ్వపుఁదీఁగె లాగి, పు
వ్వు లొరులు గోయ నింకఁ దలఁపుం డని యొప్పుగ జంకె సేయుచున్
లలిఁ దమలోన మత్సరములం దుదికొమ్మలగుత్తు లందుచున్. 34

సీ. మావిలేమోకలమవ్వంపుఁదీవలఁ జెన్నొందఁ బెండ్లిండ్లు సేసి చేసి
పలుదెఱంగుల క్రొవ్విరుల నేర్పువాటించి తొడవులు గావించి తొడివితొడివి
పతులను బ్రియలఁ గా భావించి పొదరిండ్ల నిక్కలుగాఁ జేసి యేగి యేగి
చెట్టుపల్ నెఱయని చిలుకబోదలఁ బట్టి తెచ్చి బిడ్డలుగఁ జన్నిచ్చి యిచ్చి
తే. పొదివి పుప్పొళ్లు సల్లియుఁ బువ్వుఁ దేని,యలఁ బదంపడి తడిపియు నలి వసంత
మాడి యాడి యుద్యానవిహారలీల, సలిపి రంభోరుహానన లెలమి మిగుల.

చ. నినుపు లొకర్తుచేతఁ గమనీయలతాంతము లున్న నొక్కెడం
గనుఁగొని ముగ్ధ యొక్కతె వికాసిని యై నవకంపుఁదీఁగెఁ బా
సినయెలగొమ్మగుత్తి సవిచేరి నయంబునఁ బట్టి కోయఁ జూ
చిన నగి యల్ల నవ్వ నది । సిగ్గువడం గని యార్చి రందఱున్. 36

మ. కుచముల్ వాతెడినీటిమీఁదివిలసత్కోకంబులం గ్రేణి సే
యుచు నుండన్, మెడ యెత్తి పాదయుగళం । బూఁదంగ బాహాలతల్
పచరింపం గరమూలకాంతి నిగుడన్ । భావంబు రంజిల్లఁ బా
డుచుఁ గ్రీడించిరి పువ్వుఁబోఁడులు లతాడోలాకళాప్రౌఢులన్. 37

సీ. చిగురాకు రెంగేలి । చెలిమి యొనర్పంగ మవ్వంపులేఁబొదల్ । మలఁచిపట్టి
పెఱచేతినఖపంక్తి । గిఱికొని చెన్నొంద నెగయుదీప్తుల విరు । లినుమడింప
గురులుగన్గవమీఁద । నెరసిన నెమ్మొగ మడ్డ మంకించి చూ । పలవరించి
తనురెంపు గడ చని । దళములు సడలఁ బువ్వులు గోయ నొల్లకతొలఁగ నెత్తి
తే. యడరునెత్తావిపాలివోని । యలరులేఱి, మెలపునలవాటు నెడఁదల మేకొనంగఁ
ప్రణయసఖులకుఁగన్నులపండువగుచుఁ, జతురముగనొర్తుపుష్పావచయము చేసె.

క. చెలిచెక్కు చెమట యొక్కతె, యలుసులఁ గొనితుడువ రెంటియందలి మెఱుఁగుల్
పొలివోవుట సరి యై యిట్టలముగ నొండొండ రాయుటయు జిగి దఱిఁగెన్.

ఆ. వనజవదన లిట్లు । వనకేలి సలిపి చాలించి జలవిహారలీలఁ గోరి
జనకరాజతనయ । సముచితముగఁ జేరి, యిష్ట మెఱుకపడఁగ । నిట్టు లనిరి. 40

ఉ. నీదుకృపాకటాక్ష మనునీరజషండమునందు నిర్భరా
హ్లాదముఁ బొందఁగా వనవిహారపరిభ్రమవృత్తి యొమ్మెయిన్
ఖేదము సేయ లేకునికిం గమలాకరకేలిమీఁద లే
దాదర మించుకేని, నలినాయతలోచన మాకు నిత్తఱిన్. 41

చ. అనుడు విదేహరాజసుత । యల్లన నవ్వ దొలంకుదృష్టులం
గనుఁగొనియెన్ సముల్లసితఘర్మజలాంకురజాలకంబు చె
న్నున విలసత్సుధాకణమనోహర మైనశశాంకబింబమో
యనఁ జెలువొందు రామవిభునానన, ముల్లము పల్లవింపఁగన్. 42

క. చెలులచతురోక్తిరచనకు, నలినాయతనేత్ర నెమ్మనము విలసిల్లం
గొలన విహారము సలుపం, దలఁచినఁ బతి కౌతుకంబు । దనమదిఁ గదురన్. 43

సీతారాములజలవిహారవర్ణనము.

క. అనుచరుల నడిగియడిగియుఁ, బనిగొండ్రే వలయు నెడలఁ । బ్రభువులుపాద లెం
డని కమలవనము తెరువునఁ, గొనిపోవఁగ జానకియు సఖులుఁ జని రెలమిన్. 44

చ. చెలు వగునాననాబ్జముల । చేరువఁ గుంతలభృంగమాలికల్
మెఱఁగ, వళీతరంగములమీఁద ఘనస్తనచక్రయుగ్మకం

బులు విలసిల్లఁ గూడుకొని పొల్తులు పద్మినిపొంత వింతసొం
పొలయఁగ వేడ్కమై నరిగి రొండొకపద్మినిఁ బోలి లీలతోన్ 46

తే. అందఱకుమున్న సలిలవిహారమునకుఁ,గడఁగియొక్కర్తుగ్రక్కునఁ గొడవులూడ్చి
నెలఁతుకలమొత్తమనుపచ్చవిలుతుననుఁగు,టంపపాదిలో నిబిరిగోఁ యట్టులుండె.

చ. పొలయుసమీరణంబు నిసువుందనుపుం దగ నింపునెమ్మనం
బుల నొకయింపుఁ బెంప రతిబోటులు విభ్రమ మొప్ప వీఁగుఁజ
న్నులపయిఁ గే లమర్చుచుఁ దనూలత లించుక గొంకఁ గుంతలం
బులు మెల పొందఁగాఁ జెవులపొందునఁ జేర్చుచుఁ గూడి వేడుకల్. 47

క. మగుడఁబడి కరళు లక్కడ, నిగుడఁగఁ దనుపారుకొలని నీరు పులకముల్
నెగయించుచుఁ దొలుసోఁకున, సొగయింపంగూడి యాడఁజొచ్చిరి సుదతుల్. 48

సీ. సునుఁగాంతి దొలఁకెడుఘనకుచయుగళంబు లదరంగఁ జిలుకుల నాడి యాడి
మెఱుఁగులు దూఁగెడు మృదుకరవల్లిక లల్లాడఁ జల్లుపోరాడి యాడి
జిగితొలం కెసఁగెడు మొగములునిక్కుచు నడఁగుచుండఁగ నీఁదులాడియాడి
మిం చెల్లదిక్కులు ముంచి చెల్లెడుమేను లలసి క్రాలఁగ నోలలాడియాడి

తే. యొలి నిలుచుచుఁగరళులఁ దేలి చనుచు,మునిఁగిపోవుచు నొర్తొర్తు ముంచిపట్టి
లోఁతునకునొయ్యఁ దిగుచుచు నీఁతలేని, యచట మిన్నక యీఁదు మనాడిరర్థి.

చ. ప్రియమునఁ దూఁగి యాడుభ్రమరీతతిసోఁకునఁ జక్రవాకికా
చయమున మందహంసికలసందడి ముం జెలువొందుకంటె న
న్నియు నెడగాఁ దొలంగినను నీరజషండము పొల్చె విన్నగా
క్రియ యువతు లాటమైఁ జెలఁగు క్రందున నొందిన క్రొత్తసొంపునన్. 50

చ. తరఁగలతూలుచందమునఁ దమ్ములకమ్మనితావి హంసికా
విరుతములన్, సమీరణము వీచునయంబున నీరియింపునం
జిరతరసౌఖ్యసంపదలు సేకుఱఁ గైకొని తారతార య
త్తరుణులయింద్రియంబులు ముదంబునఁ జొక్కుచు నుండె నత్తఱిన్. 51

ఉ. తుమ్మెదపిండు మెండుకొని త్రొక్కిన తేకులసందుసందులం
గ్రమ్మి చలత్తరంగశిఖరంబులఁ దూలెడుతమ్మిపుప్పొడు
ల్గ్రొమ్ముడు లూడి క్రమ్ముపొడిలోపల నొక్కొకచోటఁ గెంపుచం
దమ్మునఁ జెన్ను చేసె వనితల్ గమలాకరకేళి సల్పఁగన్. 52

సీ. కలయ నెల్లెడ నాడుక్రందునఁ బడి నీరి మీఁదదాఁటెడుగండుమీలతోడ
మక్కువఁ దేఁకువ దక్కిలోఁ దవిలి యాడెడుచక్రవాకులగెడలతోడఁ
దిరుగుడుపడి తూఁగుతరఁగలు దాఁకి యల్లాడెడునంభోరుహములతోడఁ
వనజంబు లొల్లక వచ్చి యూర్పులతావి యన్నునఁ జొక్కెడు నళులతోడఁ

తే. గ్రాలుకన్నులు, వలిదన్నుఁ గవలుఁ దెలివి
మొగములుఁ గురులు బంధురముగను బెరసి
చూడఁ దడఁబాటుగా జలక్రీడ సలిపె
నెలమి మనముల నెలకొనఁ జెలువపిందు. 53

క. చేయిచ్చి యబల నధిపతి, తోయజషండంబు సొరఁగఁ దోకొని చనఁ జే
దోయి పులకించెఁ, గనుఁగవ, దో యలరుచు బెరసెఁ గోర్కితో నెదగూడెన్.

క. పొలఁతుక లోఁతని చొరఁగా, నలుకుచుఁ బిఱిఁది కడుగు లిడ నప్పటిదృగ్దీ
ప్తుల క్రందు సెందుసందడి, పొలపంబును నధిపునుల్లమున కిం పొసఁగెన్. 55

క. కొలను సనఁ జొచ్చి యిది లోఁ, తల యిది యని క్రమ్మఱంగ నరిగి విభుం డు
త్పలదళలోచనఁ దోకొని, మెలపున మగుడఁ జని లీలమెయి నాడునెడన్. 56

సీ. కరయంత్రధారలఁ గప్పక పొరిఁ బొఱి విభుమీఁదఁ జూడ్కులు వెల్లిగొలుపు
లీల నంబుజముఁ గెంగేలఁ దెమల్పక ధరణీరమణు పాణితలము వట్టుఁ
దను పారునీటిపైఁ దను విడి నలిఁ గ్రీడ సలుపక రాగరసముఁ దేలు
గొలఁకున నాడునారులలజ్జఁ బోవక శృంగారచేష్టలఁ జెంది క్రాలు

తే. సలిలకేలికి నొలసియు నొలయ కిట్లు, ప్రాణవల్లభుమీఁదికిఁ బ్రాఁకి వేడ్క
నలమియలమిమైఁ బెనఁగొనతనియండ, నిలిచివిహరించుచుండె నన్నలినవదన 57

ఉ. కలయఁ జరించు తేఁటిప్రాదిఁ గైకొనఁ డాధవళాయతాక్షి వే
నలిపయిఁ జూడ్కి నిల్పు, నళినంబులఁ జేకొనఁ డాలతాంగి చూ
డ్కులు మది మెచ్చు హంసికలకోమలనాదము లాలకింపఁ డా
వెలఁది మృదూక్తినిస్వనము వీనుల నించు విభుండు వేడుకన్. 58

తే. చెలువచివురుఁ గెంగేలఁ గాశ్మీరజలము, నతివనగు మోమునను జందనాంబువులును
నెలఁత వేనలిఁ గస్తూరినీరు నయ్యె, నయ్యెడల కాంతిఁ బతికరయంత్రవారి. 59

క. తడిసి మెఱుఁగుఁ బొగ రెక్కిన, పడఁతుక లలితాంగయష్టి పదనికి రాఁ బుల్
గడిగినమరుఖడ్గలతిక, వడువున మోహనవిలాసవైభవ మొందెన్. 60

చ. వెలఁదికి మోవికెంపు, నెఱివేనలికప్పును, దంతపంక్తినుం
దెలుపును జేర్చి యొప్పెసఁగె నీళులపొందున నట్ల యెవ్వరిం
గలసిన వారివారిదెసఁ గల్గుగుణం బనుకూలవృత్తి ని
ర్మలమధురస్వభావులు సమగ్రవిలాసము వొందఁ జేయరే. 61

సీ. కెత్తమ్మిపుప్పొడి నెఱిసిర నిడుపుగాఁ బాపట సిందూరభంగిఁ బోయుఁ
జెందొవతేకు ముఱియ్యాందంబుగాఁ దీర్చి కమనీయముగఁ దిలకంబు వెట్టు
నిందీవరములబర్హిర్దళములు దుల్చి కర్ణావతంసముల్ గా నొనర్చుఁ
గుముదనాళము వుచ్చికొని పేరుగా గిల్లి హారంబువడువున నలవరించుఁ

తే. కమలదళము మృణాళకాండమునఁ జేర్చి, యాలవట్టంబుగావించి లీల మెఱయ
విసరు నల్లన రామభూవిభుఁడు జనక,రాజనందనమన మనురాగ మొంద. 62

చ. తమతమయంత నెచ్చెలులుఁ దారును నెప్పటియట్ల యాటఁ జి
త్తము దనివోక వారిఁ గెడఁ దామరసాక్షియు రామదేవుఁడున్
సముచితలీల మై వివిధచారువిహారము లర్థి సల్పి రం
గము లభిరామరేఖ నవకాంతివిలాసముఁ బొంది క్రాలఁగన్. 63

ఆ. ఇట్లు కమలషండ మిక్కడక్కడ వడ, నభిమత ప్రకారహారిలీలఁ
గేలిసలిపి వేడ్కఁ జాలించి వెడలిరి, విభుఁడు జానకియును వెలఁదిపిండు. 64

క. జలసిక్తము లగునంగక,ములచెలు వొండొరుల భావముల నత్యార్ద్రం
బులు సేయఁ,బతియు నాతియు, నిలిచి పొలిచి రపుడు కమలినీతటభూమిన్. 65

క. కలిరుగతిఁ గాంతి మేనుల, జలకణములు గోరకముల చందంబునఁ జె
న్నలవఱుపఁ గొలనివెలి నిం,తులు నిలిచిరి తీరలతలతోఁ దడఁబడుచున్. 66

సీతారాముల లీలావిహారవర్ణనము.

చ. వలయు తెఱంగునన్ విభుఁడు వస్త్రవిలేపనమాల్యభూషణం
బులు దగఁ దాల్చి వందిజనముల్ చతురంబుగ సంస్తుతింప వా
రల నభివాంఛితార్థముల రంజితచిత్తులఁ జేసె నెమ్మనం
బలర నలంకరించిరి వయస్యలు సీతయుం రేఖవింతగాన్. 67

క. లలితకమనీయమహిమల, నెలనాఁగయు సఖులఁ గలసి యేతేరఁగ ముం
గల నడచి కంచుకులునుం, దలతల మనఁ బతియుఁ జతురతరముగ నడచెన్. 68

క. ఇమ్మెయి నిష్టవినోదము, లమ్ముదితయుఁ దాను రఘుకులాధీశుఁడు చి
త్తమ్ములఁ జిగురొత్తఁగ ని,త్యమ్మును సలిపె ననురాగతత్పరవృత్తిన్. 69

సీ. కర్పూరధూపాదిగంధసంవాసితాభ్యంతరరమణీయహర్మ్యములను
వర్ణచిత్రితపటవర్గనిర్మితతిరస్కరిణీమనోహరాగారములను
కోకిలకలహంసకులమృదుమంజులారవరమ్యనవలతాభవనములను
కృతకమయూరలాజితనిజాంగణచిత్తరంజితలీలాద్రికుంజములను
ఆ. బహువిధాభిరామవిహరణస్థలములఁ, దత్తదంతరంగవృత్తితోడ
మనుజవిభుఁడు ప్రియకుమది ముద మెలరార,లోలుఁడై మనోజకేళి నోలయు.

చ. ప్రమదము మూర్తమైనట్లు,రాగము రూపు వహించినట్లు,వి
భ్రమ మొడలెత్తినట్లు,రతిరాజవిహారకుతూహలంబు దే
హముఁ దగఁ దాల్చినట్లు హృదయంగమ యై విలసిల్లుచున్నయా
రమణిఁ బ్రమోదరూఢమదరంజితఁ జేయు విభుండు ధీరుఁడై. 71

సీ. చూడ్కికి సందడి సోరనీక యెందేనిఁ జూచు చాడ్పున నొప్పు చూఱవిడిచి
తగవుమైసోపాన మగునునుఁబల్కుల నెక్కినరసముల నెలమి వడసి

తనదుమైదీవకుఁ ఽ దావలంబుగఁ జేసి పులకలచిత్తంబు ఽ నెల వెఱింగి
బెరసిన మేవడి ఽ సరులఁగాయువు గని కన్నుల చెన్నుసఽవన్నుఁగాంచి
తే. సొగిసి కౌఁగిట సోలెడు ఽ మగువయంత,రంగ మావిష్ట మైనటు ఽ లంద కలసి
తగులుదగిలించుటయును నిర్దఱకు సరియ,కాఁగ నధిపతి లలితాంగిఁగవసె నర్థి.

చ ఎడఁ బొలివోని వేడుకల ఽ యేడ్తెఱసొంపున నంతకంత కె
క్కుడగుమదంబుపేర్మి రతిఽకోర్కులు గొమ్మలు వోవ నప్పుడ
ప్పుడ నలిఁ జేరినట్టులు ఽ భుండును వారిజపత్రనేత్రయుం
గడపల లేనికేలితమఽకంబున నుల్లము లుల్లసిల్లఁగాన్. 73

సీ. ఎలమి నొండొరులకుఁ ఽ దలయంపులుగఁ జేయు బాహాలతలు జన్మఽఫలము లొంద
నలి నొండొరులమీఁదఁ ఽ బొలుపారుకనుదోయి సుఖములఁ జుబ్బనఽచూఱ లాడఁ
గాయ్యూన నొండొంటిఁ ఽ గదిసినతనువులు పులకాంకురంబులఁ ఽ బ్రోది గాఁగ
నిచ్చమై నొండొంటిఁ ఽ జొచ్చినమనములు నినుపారునింపుల ఽ నెలకొనంగఁ
ఆ. గడఁక లొండొరువులఁ ఽ గడవఁ గేలిచతు,రతలు వెలయఁ జూడ్కుఽలతిశయిల్ల
సుఖముసొంపు నొక్కఽసూటిన నడవంగ, సతియుఁ బతియుఁ గ్రీడఽసల్పి రర్థి. 74

ఉ. లేనినెపంబు వెట్టి,మదఽలీలకు నాఁక యొనర్చి మానముం
బూనినయట్లు సొ రెదకుఁ ఽ బుక్కిటిబంటిగఁ జేసి,యల్కవే
పొ నొక కారణంబుపయిఁ ఽ బూని వెసం బయిపాటు మున్నుగాఁ
దేనియ లుట్టఁ దేఱు జగఽతీపతి కుగ్మలి రాముఁ డింతికిన్. 75

సీ. అదరులు గదిరిన ఽ నతిముతి వర్తిల్లు చెయువులక్రందునఁ ఽ జిక్కువడుచు
నేర్పులు గడఁగిన ఽ నిరతంబు లై చెల్లు కామతంత్రంబులఁ ఽ గళుకు లగుచుఁ
గోర్కు లేచినఁ ద్రిప్పిఽగొనునింద్రియంబుల యక్కఱ దీర్పంగ ఽ నడరఁ బడుచు
మెచ్చులు వచ్చిన ఽ మిగుల నానందించు మనములతలపోఁత ఽ కనువుగొనుచుఁ
తే. దనివి వొందిన నల్లన ఽ తలఁపు మగుడ, వేడుకలయెడఁ గొసరుల ఽ వింతతమక
ములకు మొదలైనఁబొదలుచుఽనెలఁతుకయును, మనుజపతియునొనర్చిరి ఽ మదనకేలి.

క. ఒండొరువులమదనకళా, పాండిత్యము మెచ్చుమియు నెపం బిడ నెపమై
యొండొరులకు నానంద మ,ఖండము గావించురతము ఽ హైకొంద్రు తగన్. 77

సీ. తూలెడునునుగురుల్ ఽ వోతెంచుఘర్మాంబువులఁ దోఁగి నుదుటిపై ఽ మలఁగుచుండ
లలిసొంపుపెంపునఁ ఽ బొలయక కనుదోయి నానుచు నెడనెడ ఽ మ్రానుపడఁగఁ
గుచములనడుమఁ దూఁగుచు నున్నహారము లల్లన చనుమొనఽలందుఁ గ్రాల
బెడఁ గొంద నల్లాడు ఽ తొడవులమెఱుఁగులు వెడలకయచోట్లఁ ఽ గడలుకొనఁగఁ
తే. కేలిఁ గడఁక దోడ్తోనడఁగించి యువయు,వములుసడలంగఁ జేయుచుఽవచ్చుచొక్కు
లేఁతదమిఁ గ్రొత్తచెన్నొందఁ ఽ గేమచంద,మధిపుడెందమానంద ఽ మయంబు సేసె. 78

క. మఱుపు ముసుఁగువడ వేడ్కలు, దెఱపులుగొని నిగుడ రెండుదెఱఁగులచేతం
బొటివోవు నెమ్మనంబుల, నెఱి నిరువురు నలవరింప నేరరు రతులన్. 79

సీ. మానవనాథుఁ డుద్గ్మలిఁ గౌఁగిలించుచో సడలుకే ల్బిగియించు కడఁక లేమి
యతివ భూధవునధరామృతం బానుచో దొప్పవాతెఱ యంటుతో ట్రుపాటు
నృపతి లేమను గేలి నిపుణత నోరయుచో వెడఁగులై చెయ్వులఁబీడుపాటు
వామాక్షి మేదినీవల్లభుఁ గొసరుచోఁ గొదలు పల్కులక్రియఁగూడ కునికి

తే. యొండొరులచిత్తములనాఁటియొలయుచున్నఁ, జొక్కులెక్కుడు నేయంగసోలమదరి
యిరువురును సౌఖ్యరసములఁ గరువు గట్టి, పోసిచేసినరూపుల పోల్కులైరి.

క. భూపాలుఁ డిట్లు మోదం, బే పారఁగ మోహములకుఁ నెల్ల నివాసం
బై పాలించెను రాజ్య, శ్రీపెం పభిరామముగ నశేషధరిత్రిన్. 81

సీతాదేవి గర్భము దాల్చుట.

ఉ. అత్తల కెల్ల భూరివినయంబునఁ బంపు దగంగఁ జేయుచుం
జిత్త మెలర్ప నాథుపని సేయుచు బాంధవతుష్టి సేయుచున్
విత్తములన్ మహీసురుల వేనుఱుఁ దృప్తులఁ జేయుచున్ మహో
దాత్తగుణాలి నొప్పె వసుధాసుత నిత్యశుభంబు పెంపునన్. 82

క. సమ్మదమున భూచక్రము, తొమ్మిదివే లేఁడు లేలి తుది రాముఁడు దా
నెమ్మనమున నినకులము ధుర్యమ్ముగ సత్సుతులఁ బడయవలె నని తలఁచెన్.

ఆ. తొమ్మనూటిమీఁదఁ దొంబదితొమ్మిది, వర్షములకు నంత వసుధపట్టి
యతిథివిప్రదేవపితృతర్పణంబుల, గర్భమహిమఁ దాల్చెఁ గౌతుకమున. 84

క. అంత నొకనాఁడు లీలం, గాంతారత్నంబు నాథు కడ మెలఁగఁగ నే
కాంతంబునఁ గనుఁగొని యత్యంతమనోమోద మడర నతఁ డిట్లనియెన్. 85

సీ. చంద్రికపైఁ బర్వుచారువల్లికవోలె వెలఁది నీయంగంబు వెలుకఁ బాఱె
హేమకుంభములపై నింద్రనీలములట్లు కాంత నీచను మొనల్ గప్పు మిగిలె
వెడవాడులీలారవిందయుగ్మముమాడ్కి సుదతి నీకనుఁగవసోల మందెఁ
బెన్నిధిఁ గాంచినపేదచందంబునఁ బొలఁతుక నీకౌను పొదలుకొనియె

ఆ. లలన నీదుచెయ్వులలసంబు లయ్యె ల, తాంగి నీదుమందయానలీల
జడను దాల్చె గర్భ సంపదకలిమి నీ, యందుఁ దేటపడియె నిందువదన. 86

ఉ. మొగ్గల మైనకోర్కి దుదిముట్టఁగ నుత్సవలీలఁ జూడ నా
కగ్గము గాఁగ వంశము సుధాంశుఁడు గల్గిన రాత్రివోలె నీ
విగ్గురుగర్భసంపద వహించియుఁ జెప్ప వదేమి, నావుడున్
లేఁతనవ్వుఁ గదిసెం గమలాననముద్దుమోమునన్. 87

రాముఁడు కోరిక యడుగఁగా సీత గంగాతీరవనములకుఁ బోఁగోరుట.

ఉ. లజ్జ వాపి వసుధాపతి మేవడి యైనమాటపాం

దునఁ దగఁ జేరి కోరికలు దోఁచు తెఱం గెఱుఁగం దలంచి, య
ల్లన యడుగంగ సమ్మదవిలాసము నేర్పడ నెమ్మొగంబు నూ
తనరుచి నొప్పఁగా వికచతామరసానన వేడ్క నిట్లనున్. 83

శా. సింగంబుల్ మునిబాలకుల్ దిరుగుచోఁ జెయ్వేది మోమియ్య సా
రంగంబుల్ దిరుగం దపోధనసతుల్ రాజీవముల్ గోయుటల్
రంగద్వీచులఁ బద్మముల్ మెఱయ ధర్మప్రీతి మైఁ జూచుచున్
గంగాతీరముకానలోనఁ దిరుగంగాఁ గౌతుకం బయ్యెడిన్. 89

ఆ. అనిన రఘువరేణ్యుఁ డమ్మాటలకు నియ్య,కొని లతాంగి నీవు గోరినట్ల
చేయు టెంత పెద్దశీఘ్రంబ యచటికిఁ, బుచ్చువాఁడ ననుచు నిచ్చమెఱసి. 90

క. ఆసతికడ సరసంబుగఁ, బాసి నడిమికొలువునకు నృపాలుఁడు సనినన్
దాసి నిరంతరమును సే,వాసౌఖ్యముఁ బొందఁ బడయువారలు ప్రీతిన్. 91

రాముఁడు నర్మసచివులవలన లోకాపవాదము నెఱుంగుట.

క. పొడసూపి యుచితముగ నలు,గడ నల్లన చేరి కొలువఁగాఁ దగుమాటల్
వొడమినసమయంబునఁ బతి, పడుచుంబైదలను బోవఁ బనిచి నయమునన్. 92

తే. పుల్ల రాజీవదళములఁ బోల్ల సేయు, వెడఁదకన్నుల నునుఁగాంతి వెల్లిగొనఁగ
నర్మసచివుల మొగములు నగుచుఁ జూచి వారిలో భద్రుఁ డనియెడువానితోడ.

శా. పౌరశ్రేణియు భూజనంబు నను సంభావించి కీర్తించునో
నేరం బున్నదుఁ డంచు లాఘవముగా నిందించునో దీని నీ
వేరూపంబున వింటి,విన్న తెఱఁ గొక్కింతేనిఁ బోనీక వి
స్తారం బొప్పఁగఁ జెప్పు మన్న నతఁ డుద్యత్ప్రీతిమై నిట్లనున్. 94

మ. జనకుం డానతియీఁ దపంబునకు నిర్బంధం గానకుం జన్న పెం
పును దుఃఖం బొకయింత లేక, లవణాంభోధిం గళామాత్రఁ గ
ట్టినసామర్థ్యము దేవబృందమునకున్ డెందంబుపై రా యనం
జనునా పంక్తిముఖున్ వధించినమహోత్సాహంబుఁ గీర్తింపఁగన్. 95

క. కలయంగ నెల్లయెడలం, బలుమాఱును విందు ననినఁ బ్రమదం బెసఁగం
గల దున్నరూప యిది నీ,పలుకులు మాకెక్క నని నృపాలుఁడు మఱియున్. 96

తే. తొలుత రాజ్యంబు సేయంగఁ దొడఁగి మనము
వివిధవర్ణాశ్రమంబుల వృత్త మరసి
యలవరించుచోఁ గొందఱ కహిత మగుటఁ
గొన్ని మాటలు పుట్టక యున్నె యనిన.

ఉ. ఈయనుమాన మేటికి నరేశ్వర మీపరిపాలనక్రియో
పాయము ధర్మనిష్ఠయుఁ గృపాగుణమున్ వినయంబు పెంపునున్

న్యాయవిశోధనంబును నియంత్రితసత్యవచోవిలాసముం
బాయక విందు నెందు నరిభంజన సూరిజనానురంజనా. 98

చ. అనవుడు భద్రుఁ జూచి ముదమందుచు రామధరాధినాథుఁ డి
ట్లనియె మదీయసంస్తుతులు నన్నియుఁ జెప్పితి కీడుమాట సె
ప్ప నగునొ కాదొ నాక నను బాపము సుట్టక యుండ నేమి గ
ల్గినఁ గలయంతవట్టును నకిల్బిషమానస చెప్పు మేర్పడన్. 99

క. అనుటయు నతండు వెలవెల్ల నగుచు డెందంబు గొందలం బందఁగఁ జె
ప్పను జెప్పకుండ నేరక, యనుమానముతోడ నిక్క డక్కడవడిసన్. 100

ఆ. అధిపుఁ డింగితజ్ఞుఁ డై యితఁ డొప్పని పలుకు వినఁగఁ జెప్ప నలికియున్న
వాఁడు, గొంకుఁ బాపవలయుఁ బొమ్మని తన, యెదఁ దలంచి యతని కిట్టు లనియె.

క. లోకులమాటలు సెప్పిన, నా కెగ్గగునే ప్రియం బొనర్పు, హితుఁడ వై
నీకింత వెఱవ నేటికి, నేకాంతం బయినచోట నే నడుగంగన్. 102

ఆ. కీడు గాంచి మనల నాడెడువారల, నోళు లుడుపఁగా మనోముదంబు
నొందఁ గాన దీన నొండెగ్గు లే దని, తఱిమి యడుగుటయును వెఱపుఁ బాసి.

క. ఇతఁ డెటు సెప్పునొకో నా, మతి గలఁగెడు జనులపనులు మఱవక యుచిత
స్థితి నడపుదు నని తలఁకెడు, పతి కాతం డెలుఁగు రాలుపడ ని ట్లనియెన్ 104

సీ. ఎల్లలోకంబులు నెఱుఁగ నత్యంతదురాచారుఁ డై దశాననుండు
చెఱఁ బట్టికొనిపోయి యతిమూఢుఁ బెద్దకాలం బేనిఁ గేలివనంబులోన
నునిచిన నున్న యాజనకరాజాత్మజ నెడ నించు కేనియు నెగ్గు గొనక
ధైర్యంబు వాటించుతలఁపు వోవిడిచి మన్మథగోచరుం డయి మగుడఁ దెచ్చి
ఆ. యనుగలంబు సేసికొని యున్న వాఁ డని, యజ్ఞు లయినజనము లాడుచుండ
నెల్లచోట విందు నింతనిక్కువ మని, పల్కుటయును రఘునృపాలకుండు.

క. సుఱసుఱ డెందము సూఁడిన, తెఱఁగున నొక్కింత స్రుక్కి ధీరుం డగుటం
గొఱఁతవడ కుండ వినుటకుఁ, జెఱవారల కిట్టు లనియెఁ బ్రియవదనుం డై.

క. మీరలు నాసత్కీర్తియ, కోరుదు రే ప్రొద్దుఁ గాన గురుదురితపరి
హారము సేయం దగు నే, నీరూపమ యగుట నిశ్చయింపఁగ వలయున్. 107

చ. అనుడు విషాద మంది విజయాదులు దేవ భవచ్చరిత్ర మ
త్యనఘము దీనిఁ జూచి చెడనాడఁగ నాలుకయెట్టు లాడు దు
ర్జను లగువారు కొందఱు విచారవిహీనత నిట్లు వల్కఁగా
విని విని వారిమాటలకు వేసరి యుండుదు మెచ్చు నెల్లెడన్. 108

లోకాపవాదభీతుఁ డై రాముఁడు తమ్మునితో నాలోచించుట.

ఉ. నావుడు మూర్ఛవచ్చినమనంబునకున్ ధృతి యూఁత యిచ్చి సం
భావన వారిఁ బోఁ బనిచి పార్థివముఖ్యుఁడు దల్లడంబునం

దాపుకొనంగ లేక తనతమ్ముల నప్పుడ పిల్వఁ బంచి నా
నావిధచింత ముట్టికొనిరన్ వెగ డందుచు నార్తమూర్తి యై. 109

ఆ. అధికవినయ మెసఁగ నాభరతాదులు, నగరి కేగుదెంచి నరవరేణ్యుఁ
డేకతంబ వీకు వీకాడువగలచే, వందుచుండఁ జేర వచ్చి వచ్చి. 110

సీ. తారలు లేనిసుధారోచియునుబోలె నొంటి యేలొకో నృపుఁ డున్నవాఁడు
చిత్రరూపంబున చెలువున నేలొకో పతిమూర్తి నివ్వెఱ పాటు నొందె
సాపరాధులఁ జూచున ట్లేలకో రాజు మనమీఁదిచూడ్కులుమగుడఁ బెట్టెఁ
గౌముది పైఁ బర్వ కమలంబుచాడ్పున విభుముఖం బేలొకో విన్న నయ్యె

తే. ననుచునల్లనిమాటల నక్కుమారు, లుత్తరములేనియడుగుటలొండొరువుల
నడుగు చంతంత నిలుచుచునగ్రజన్ముపాలి కేతెంచి భక్తిమైఁ బ్రణతు లైరి.

చ. తగఁ బ్రణమిల్లినం దనదుతమ్ముల నందఱఁ జూచి వేఁడి పై
నెగయుకరంబులం గొని మహీపతి యల్లన యెత్తి బాష్పవా
రి గడలుకొన్న నాఁగుచు శరీరము నేలకు వ్రాల వచ్చినన్
మగుడఁగ నిల్పుచున్ వెగడుమాటలు గుత్తుకలోనఁ బట్టుచున్. 112

క. ఈరాజ్యసంపదున్నతి, మీ రిచ్చినయదియ నాకుమీర విపత్సం
తారకులును జుట్టంబులు, మీర చెలులు మీర ధనము మీర తలంపన్. 113

క. కావున నెయ్యది పుట్టిన, మీవలనన తెగువ యగుట మీ కెఱిఁగింపం
గావలయు లోకజననిం, దా వాదము తెఱఁగు వినుఁడు తాత్పర్యమునన్. 114

క. అనుతనమాటకు మున్నే, మనుజపతికి నింత యేమి మాడ్కినొకో నేఁ
డనువగ డోలాందోళిత, మనుస్కులై యున్నయక్కుమారులు వినఁగాన్.

ఉ. రావణునింట నుండఁగ ధరాసుత నే మరలంగఁ దెచ్చినం
భావన నేత కష్ట మనిపల్కిరి, చూచితె లక్ష్మణా మహా
దేవుఁడు బ్రహ్మయున్ మునులు దేవగణంబులు మెచ్చ నయ్యెడం
బావకుఁ డిచ్చె నాకు సతిఁ, బాపపుమాటలు పుట్టె నియ్యెడన్. 116

ఉ. వేవురు నేల నేను బృథివీసుతచిత్తము పెం పెఱుంగ నే
భూవలయంబు సంచలతఁ బొందిన, వారిధి మేర దప్పినన్,
దేవనగంబుపాఁ తగలి త్రెళ్లిన నం దొకకీడు గల్గునే
యేవనజాక్షి నిట్లు సెడ నాడిన నక్కట నోరు ప్రువ్వదే. 117

లోకాపవాదమునకై రాముఁడు సీతను విడనాడ నిశ్చయించుట.

ఉ. ఐనను మీకు నొక్క తెఱఁ గస్ఖలితంబుగ నేను జెప్పెదన్
దానికిఁ గాదు నాక, భువనంబులకున్ నను శుద్ధుఁ జేయుఁ డ
జ్జానకి నెల్లభంగుల నిజంబుగ నిప్డు పరిత్యజించినం
గాని యకీర్తి వాయ దటుగాదని నోళ్లులు మూయవచ్చునే. 118

క. జడమతు లయినజనంబుల, వెడమాటలు మాన్ప నిదియ వెర వెబ్భంగిన్
సడికంటెఁ జావు మే లని,యెడిపలుకు దలంప వలదె యిలఁ బురుషులకున్
ఆ. ప్రాణ జీవితంబు లైన మి మ్మైనను, వలయుచోట విడువ వచ్చుఁ గాని
వర్తనంబు గౌరవం బొకయించుక, యైన విడువ దుస్సహంబు నాకు. 120

క. ఒకభంగిఁ బాపికొన రా,దొకొ మిథ్యానింద యనుచు నొందుదెఱఁగు మీ
రకుటిలచిత్తుల రై చూ,డకుఁడీ నామదికి సంకటం బిది యెల్లన్. 121

క. ఏ నెఱిఁగి యయిన నెఱుఁగక, యైనను నిత్తెఱఁగ నిశ్చయము సేసితి నా
యాన సుఁడీ,నాకడ్డము, గా నొకపలు కైనఁ జెప్పఁ గడఁగితి రేనిన్. 122

చ. అనవుడు వార లొండొరులయాననముల్ గలయంగఁ జూచి య
జ్జనపతి తెంపు వా పెడువిచారము చిత్తములం దొకింత యై
నను మొలతేర కవ్విధము సం దమనిశ్చయ మైన లేక యే
మనియును బల్కరాక వెఱఁగందఁగ వెండియు నాతఁ డిట్లనున్. 123

ఉ. సూక్ష్మముగాఁ దలంచినవిశుద్ధచరిత్రము దుఃఖహేతువే
లక్ష్మియుఁ బ్రాణముల్ సరియె లజ్జకు, రిత్తవిచార మేటికిన్
లక్ష్మణ యెల్లి నీవు చటులస్థిరవాజులఁ దేరఁ బూన్చి యా
పక్ష్మలనేత్రఁ గోరిక నెపంబునఁ దోకొని పొమ్ము కానకున్. 124

క. ఇమ్ములఁ జని గంగాతీ,రమ్ముతపోవనములందు రమియింపఁగ నా
సమ్ముఖమునఁ గోరినయది, యమ్ముద్దియ నచటి కనుప నగు సుకరముగాన్. 125

క. కొని చని వాల్మీకితపో, వనపరిసరభూమిఁ ద్రోచి వచ్చెడి,దయ్యం
గనకును నాకును నిదె విధి, యనుమానింపకుఁడు నిశ్చయం బైనయెడన్. 126

క. అని పలికి తనదుతెగువకు, ననుజన్ములు తలలు వాంచు టనుమతిగాఁ గై
కొని,వారి నిండ్లకును బోఁ, బనిచి యచటు వాసి ధరణిపాలుం డరిగెన్. 127

క. ధాత్రీపతి కనుజులకును, నేత్రంబులబాష్పవారి నిద్ర నుడుప నా
రాత్రి యొకభంగిఁ జనిన,సు,మిత్రానందనుఁడు వంత మిగిలినమదితోన్. 128

రాముఁడు లక్ష్మణునివెంట సీత నడవులకుఁ బంపుట.

చ. దివసముఖోచితక్రియలు దిగ్గన సల్పి సుమంత్రుఁ జూచి దా
నవకులమర్దనుండు రఘునాయకుఁ డెక్కు రథంబుఁ బూన్పు గా
రవమున దేవి నిర్జరతరంగిణిపొంతఁ దపోవనంబులన్
వివిధవినోదముల్ సలుపు వేడుక నాథుననాజ్ఞ నేగెడున్. 129

ఆ. అనుడు నతఁడు గడఁక నరదంబు సక్కఁగాఁ, బెట్టి ఘోటకములఁ గట్టి తెచ్చి
సవినయంబు గాఁగ సౌమిత్రిముందట, నిలిపె నంత మేదినీవిభుండు. 130

క. అడ లడఁచి నెమ్మనంబున, వెడ తెలి వాడఁగూర్చి మాట వేర్పడ కుండం
జిడిముడిపడక నయంబున, నెడమడు వాక్కింత లేక యిట్లను సతితోన్. 131

చ. పాలఁతుక గంగ చేరువ త।పోవనభూములు సూడ నీమదిన్
మొలచినకౌతుకంబు దుది।ముట్టఁగ లక్ష్మణదేవు నిన్ను నం
దులకు మనోముదం బెసఁగఁ । దోకొని పో నియమించితిన్ సము
జ్జ్వలమణికాంత మైనరథ।సత్తమ మెక్కుదు రమ్ము నావుడున్. 132

ఉ. అక్కట నాదు వేడ్క కుచి।తానుచితంబులు సూడకే విభుం
డొక్కతలంపువాఁ డయి స।ముత్సుకతన్ నను దవ్వు పుచ్చఁగా
నిక్కము యియ్యకో లరయ । నెయ్యము తియ్యము గాదె యంచు నిం
పెక్కఁగ రాముడెంద ముడు । కెక్క రథంబు లతాంగి యెక్కినన్. 133

ఉ. అత్తఱి నున్న ధైర్యమున । కచ్చెరువందుచు జీవితేశుహృ
ద్వృత్త మెఱుంగమిన్ మదిని । దీనికి నమ్ముట కుమ్మలించుచుం
జిత్తము ఖేద మానసముఁ । జెందిన మాన్పఁగ లేక లక్ష్మణుం
డుత్తల మందు చున్న విభుఁ । డుగ్మలి కాతనిఁ జూపి యి ట్లనున్. 134

ఉ. దూరము నాక ఘోరవన।దుర్గతలంబులఁ గేలి సల్పఁగాఁ
గోరెడు భామలం బ్రియలఁ । గోరినయట్టుల పుచ్చురాజులన్
ధారుణి నెందుఁ గాన మని । తా మును దీనికి నడ్డపెట్ట నేఁ
బోరతమాడి యిట్లు నినుఁ । బుచ్చుట కల్గినవాఁడు సూచితే. 135

క. అని తన మొగ మొప్పమి క,మ్మనుజేంద్రుఁడు నెపము దప్పి । మా టాడినఁ దా
నును దదనురూపవచనము,లను సంభాషణ మొనర్చె । లక్ష్మణుఁడు దగన్. 136

ఆ శ్వా సాం త ము.

ఉ పుణ్యుఁడు భారతీవిభవ।పూతవికాసముఖారవిందలా
వణ్యుఁడు దీవ్రకోపదవ।వహ్ని నిరర్గళదగ్ధశాత్రవా
రణ్యుఁడు మానినీహృదయ।రంజననైపుణరూఢరూపతా
రుణ్యుఁడు భీతివిహ్వలవి।రోధిశరణ్యవరేణ్యుఁ డున్నతిన్. 137

క. దుర్జయవైరిధరాధిప, తర్జననిస్సాణగర్జి।తస్ఫురణుం డ
తూర్యార్జితబాహాసంపదు,పార్జితవిఖ్యాతకలియు।గార్జునుఁ డెలమిన్. 138

మాలిని. వితరణఖని యుద్య । ద్వీరశృంగారలక్ష్మీ
పతి రతివరలీలా । షంగకృత్సంగతాంగుం
డతులితమతివిస్తా।రోప్త దేవేజ్యుఁ డిజ్యా
ప్రతిదినపరితృప్తి । ప్రాప్తసప్తార్చి ర్ధాత్రిన్. 139

గద్యము. ఇది శ్రీమదుభయకవిమిత్ర కొమ్మనామాత్యపుత్ర బుధారాధనవిధేయ తిక్కననామధేయప్రణీతం బైనయుత్తరరామాయణం బనుమహాకావ్యంబునం దష్టమాశ్వాసము.

శ్రీరస్తు.

నిర్వచనోత్తరరామాయణము

నవమాశ్వాసము.

శ్రీవాణీకీర్తివ్రత
తీవేష్టితమూర్తి వసుమతీదైవతమౌ
దావహుఁడు కల్పకస్ప
ర్ధావిజితుఁడు మనుమసిద్ధిధరణీశుఁ డొగిన్. 1

క. జననాథుఁ డుడుగరలు భూ,తనయమనం బలరఁ గట్టి తగ నొప్పించెన్
మునివరులపత్నులకు ని,మ్మని మణిమయభూషణాంబరాదులు ప్రీతిన్. 2

తే. ఇవ్విధంబునఁ దనతలం పించుకంత, యైన జానకి యెఱుఁగనియట్లు గాఁగ
బాలతోడ విషం బిడుపగిది నరిచి, పుచ్చి రాఘవుఁ డుల్లంబు నొచ్చి మఱలె. 3

లక్ష్మణుఁడు గంగాతీరవనములకు సీతను దోడ్కొని పోవుట.

చ. లలితగతిన్ సతోయకమలస్ఫుటమార్గమునన్ శరీరర
క్షులు వినయంబుతో నడపి గౌరవ మొప్పఁగ భక్తిపెంపుమై
నలయక పంపు సేయుచు మహాశ్రమభూములు వీడుపట్టుగా
లలనఁ దగన్ సుమంత్రుఁడును లక్ష్మణుఁడుం గొని పోయి రిమ్ములన్. 4

క. చని చని జనకతనూభవ,తనతనువున దుర్నిమిత్తతతి గలయఁగఁ దోఁ
చిన నిట్లనియె సుమిత్రా,తనయునితో నెమ్మనంబు దలఁకుచు నుండన్. 5

ఉ. తప్పక మున్ను గన్గొనువిధంబ యమంగళసూచకంబు లే
నిప్పుడు నాశరీరమున నెన్నియొ కాంచితి నంతరంగముం
ద్రిప్పికొనం దొడంగెఁ బతిబిక్కన బంధులమొంట భృత్యులం
దొప్పమి యేమి వాటిలుట కో వెఱపయ్యెడు నాకు లక్ష్మణా. 6

క. అనవుడు నమ్మాటలు గీ,టునఁ బుచ్చుచు నతఁడు లలితడోలాయతవీ
చినిచయసుభగాకృతి యగు, ననిమిషనదిఁ జేర నరిగె నత్యంతధృతిన్. 7

ఉ. అయ్యెడ రేవుబోయలఁ బ్రియంబుమెయిం బిలిపించి దేవికిం
జయ్యన నోడ వెట్టు మని శాంతతఁ బిల్చి సుమంత్రుఁ జూచి నీ
వియ్యెడ నుండు తేరనుచు నింతిని డించినఁ బోతపాత్ర పై
కొయ్యన పోవఁ దాను కని యుత్తరణక్రియ నిర్వహించినన్. 8

ఉ. సంతస మందు చున్న రఘుసత్తముదేవికి లోకవాదవృ
త్తాంతము నన్న దక్ బిలిచి యన్న తెఱంగును దత్తపోవనో
పాంతము గావునం దెలియఁబల్కఁ దలంచుచు నల్లఁ జేరి య
త్యంతవిషాది యై రఘువరానుజుఁ డాత్మ చలించు చుండఁగన్. 9

శా. నా కింకన్ మరణంబ కార్య మిటు లన్యాయప్రవృత్తాత్ముఁ డై
కాకుత్స్థాన్వయదీపకుండు నను లోకత్యాజ్యుఁ గావించె నం
చాకాంతాతిలకంబుపాదముల పర్యంతంబుగాఁ బుణ్యగ
ణ్యాకారుం డిలఁ జాఁగి మ్రొక్కిన మనం బాకంపముం బొందఁగాన్. 10

ఉ. కారణ మేమి నన్ను దశకంఠకులాంతకుఁ డెగ్గు వల్కెనో
నేరమి గల్గెనో యకట నిక్కము నా కెఱిఁగింపు మిట్టిదు
ర్వారమనోవ్యథం బొరయువాఁడవు గావు వివేకవిశ్రుతా
చారుఁడ వైననీ వని విశాలవిలోచన గారవించినన్. 11

ఉ. ఇత్తెఱఁ గాచరించుటకు నే నిది యేటికి నియ్యకొంటి నీ
యుత్తమురాలి నోఁ బలుక నోపఁగ వచ్చునె యంచు వెండియుం
జిత్తము గూడఁ దెచ్చుకొని చెప్పక పో దని నిర్ణయించి డ
గ్గుత్తిక వెట్టి లక్ష్మణుఁడు కోమలిఁ జూచుచు నశ్రు లొల్కఁగాన్. 12

రాముఁడు లోకాపవాదభీతుఁ డై విడనాడినవృత్తాంతము సీతకు లక్ష్మణుఁ డెఱిఁగించుట.

శా. ఏ నిం కేమని చెప్పుదున్ రఘుకులాధీశున్ జగం బెల్ల నీ
కై నిందింపఁగఁ జాల నొచ్చి యది మిథ్యావాద మైనన్ సమా
ధానం బేర్పడఁ జేయ కున్న నిజవృత్తం బెంతయున్ దూషితం
బై నీచత్వము రాక తక్కదని యూహాపోహసంవేది యై. 13

క. పురజనులభూజనంబుల, పరివారం బొందుభంగి బాయమి జీవ
స్మరణం బగుచున్నభవ,ద్విరహంబున కియ్యకొనియె విభుఁ డధికధృతిన్. 14

ఉ. ఏకత ముండి నన్ బిలిచి యేర్పడ నింతయుఁ జెప్పి తేరిపై
వే కొనిపోయి నీవు పృథివీసుత కోరినయట్ల గాఁగ వా
ల్మీకులయాశ్రమంబునసమీపమునన్ మనకృత్యనిశ్చయం
బాకమలాక్షికిం దెలుపు మన్న నృపాలకునాజ్ఞ నేసితిన్. 15

క. ఆశ్రమ మల్లదె మునిచర, ణాశ్రయవు నిరస్తశోకవై యుండు జగ
ద్విశ్రుతి యగు నీపతియును, నాశ్రమవిరహితుఁడ యింక నని పల్కుటయున్.

సీత తన్ను భర్తవిడనాడినందులకై చింతించి లక్ష్మణునితో నయనిష్ఠురంబు లాడుట.

క. తాలిమికోలఁదులఁ బోవని, వాలాయపుదిగులు గుండె వ్రయ్యఁ గదిరినం
గీ లెడపినజంత్రముక్రియ, నేలపయిం బడియె మేదినీతనయ వెసన్. 17

క. పడి మూర్ఛిల్లి మగుడ నొక,వడికిం దెలివొంది బాష్పవారి గనుఁగవం
గడలుకొను చుండ వాతెఱఁ, దడుపుచు వెలవెల్ల నగుచుఁ దల్లడపడుచున్.

క. పలు కుడిగి పెద్దప్రొద్దా,కులదృష్టి మఱిందిఁ జూచుఁ గొండొక నవ్వుం
దలయూఁచు ముక్కుపై నం,గుళమిడు వెఱఁగందు వగలకుం గొలువిచ్చున్. 19

ఆ. సందియంబువడ విచారంబునకుఁ జొర,మాఱు వలుక నొండు మాడ్కి సేయ
వెరవు గాక పిడుగు వ్రేసినయ ట్లైన, మాట కియ్యకొనుచు బోటిపలుకు. 20

క. అగుఁ గాక యట్లు చేసెద, జగతీపతిపనుపు సేసి చను నీవును నీ
తెగువ రఘుపతికి నీకుం, దగ వఁట యే ననెడి దేమి తమ్ముఁడ చెపుమా. 21

సీ. అఖిలధర్మస్థితి నపచారి యందునే యావనంబునఁ దప మాచరించెఁ
గరుణాసముద్రుఁడుఁ గాఁడందునే యట్టి యపరాధిఁ గృతకవాయసముఁ గాచె
నాశ్రితరక్షమై నర్థి లేఁ డందునే పగతుతమ్ముని రాజ్యపదవి నిల్పెఁ
బాటించి నన్ను సంభావింపఁ డందునే నాకుఁ గా నెన్నియత్నములో చేసెఁ
తే. బతి జనించినకోలెను బరహితైక,లోలమతి యొడల్ సిదిమినఁ బాలు వచ్చు
నాతఁ డిదికార్య మని నిశ్చయంబుచేత, నాయభాగ్యంబ యొండొకవేయు నేల.

క. ఇడుమలు గుడువఁగ బుట్టిన,యొడ లిది యిటు లోపుఁ గాక యొడ్డులు నాచేఁ
బడిరి తొలుభవమునం ది,ప్పుడు తత్ఫల మంద కున్నఁ బోవునె నాకున్. 23

ఉ. ఉల్లము పొక్కనెవ్వగలకోటికి యే మరణంబు గోరినం
జెల్లదె జాహ్నవీసలిలసేచన మూర్ధ్వగతిప్రదంబు సం
ఫుల్లయశోభిరామ మగుభూపతివంశము నిల్చునంతలో
నొల్ల దురంతదుఃఖముల కోర్చుట మేలు దలంచి చూడఁగన్. 24

చ. అతులితపుణ్యమూర్తు లగునత్తల కెల్లను నేను భక్తి మ్రొ
క్కితి నెఱిఁగింపు సూర్యకులకేతువు నా విలసిల్లురాముసం
తతి భరియించి యున్న యది దానికి శోభన మందఁ గచ్ఛప
స్థితి నయినం దలంపురయ సేయుఁడు మీ రని యప్పగింపుమీ. 25

క. జనపతికి నింక నే నే, మని చెప్పిన నేమి యగును నది గడచనె నై
నను నూసువోక వెండియు, ననియొడ నొకమాట రఘువరానుజ నీతోన్. 26

చ. తనమది నొక్కయమ్మలిక దక్కిన మంచిది దానిఁ బాపఁగా
నని తలపోసి చేయుపని కక్కట యేచును లోను గానె నా
కు నెఱుఁగఁ జెప్పి పో మ్మనుటకుం దగనే మొగమాట లేక మ
న్ననయొడ నైన రాజుల మనంబులు ద్రిప్పఁగ బల్మి గల్గునే. 27

క. కానిమ్ము నాకుఁ జెప్పినఁ, గానియ కా దధిపుపనుపు గడ తేర్పఁగ నేఁ
బూనినపని యిది నీవును, బూని యొనర్పు టది యెల్లఁ బొచ్చెమె చెపుమా.

తే. పతియ చుట్టంబుఁ బక్కంబుఁ బతియ చెలియుఁ
బతియ తల్లియుఁ దండ్రియుఁ బతియ గురుఁడు
పతియ దైవంబుఁ గావున నతనిపం పొ
నర్చుటయ కాదె ధర్మంబు నాతి కరయ. 29

ఉ. మేనికి నంతవంతఁ బడ మిక్కిలి కాఁకయఁ బెట్టి నొంపఁగాఁ
బూనితి నోర్వకున్న నది వోవునె యట్లు జగంబువారలున్
మానము లేక యీ తులువమాటల నాడెస నాడ దుస్సహం
బైనది దీని మానుపు నుపాయము చొప్పడ దేమి సేయుదున్. 30

మ. అను చుండన్ మఱుమాట పల్కక సముద్యద్బాష్పుఁడై లక్ష్మణుం
డినవంశాగ్రణి దేవిపాదయుగళం బీక్షించి ధాత్రీతలం
బును ఫాలంబునఁ బొంద మ్రొక్కి వినయంబుం దీవ్రశోకంబు నె
మ్మనముం జుట్టుకొనం బ్రదక్షిణముగా మందప్రచారంబునన్. 31

క. వడి నంటఁ దాఁకుబలితపు టడలున రూపఱినమనమునం దొరిమి పాఁ
తెడలి వెసఁ బురికిఁ బోఁ దెగు, వడరిన వావిడిచి దిక్కు లద్రువ నఱచుచున్.

లక్ష్మణుఁడు సీతను గంగ దాఁటించి పురమునకు మరలుట.

చ. అరిగి మరుత్తరంగిణియుపాంతము డాయుచు రోదనంబుతో
బెరయఁ గిరాతు దీనమతిఁ బిల్చి తదాహితయానపాత్ర మా
తురగతి నెక్కి యద్దరికి ధూతకళంకుఁడు వోయి మేదినిం
బొరలుచు నోడదిక్కరయు భూతనయం బలుమాఱుఁ జూచుచున్. 33

క. చని యరద మెక్కి యల్లల్లన పోవుచు నిలిచి నిలిచి లక్ష్మణుఁ డయ్యం
గనఁ బోరిఁ బోరి మరలి కనుంగొనుచుండఁగఁ గోమలియును గొందలపడుచున్.

సీ. మున్నా తెఱంగున నున్నట్టియే నిప్పు డిమ్మెయి వనమున కెట్లు వోదు
నిది యేమి యొంటినై నే తెంచి తనిన నెప్పాట నే మఱుమాట వలుక నేర్తు
నెవ్వరితోడ నే నేమని యీదురవస్థ మాటికిఁ జెప్పి వనరుదానఁ
బతి యిల్లు వాపిన కతము నన్నడిగిన నేను దప్పేదిగా నేర్పరింతు

ఆ. మునిసతీజనంబు ముందటఁ గొంకక, యెవ్విధమున మెలఁగి యిచట నిలిచి
కాల మెట్టిభంగిఁ గడపుదు నేనని, యడలి యేడ్చుచున్న యవసరమున. 35

వాల్మీకి సీతవృత్తాంతము మునిపుత్త్రులవలన విని వచ్చి తనయాశ్రమమునకుఁ దోడ్కొనిపోవుట.

క. మునిపుత్త్రకు లేటికిఁ జని, చని యయ్యెలుఁగునకుఁ జేరి చంద్రాస్యఁ గనుం
గొని యటఁ బోవక యరిగిరి, మనములఁ గృప గదుర నాశ్రమమునకు మరలన్.

ఆ. సరభసముగ నేగి సంయమిచరణార,విందములకు నధికవినయ మెసఁగ
మ్రొక్కి మోడ్చుఁగేలు ముందట నిగిడించి, యిష్ట మెఱుఁగ నతని కిట్టులనిరి.

మ ఒకనారీతిలకంబు గాననములో । నుద్దామశోకార్తయై
వికలాలోకన మశ్రుధారలును బృ।థ్వీరేణులిప్తాంగముం
బ్రకటాక్రందనమున్ వికీర్ణకబరీ।భారంబు వక్త్రాబ్జశో
షకనిశ్వాసగమోష్మముం గల యవ।స్థం బొందఁగా నయ్యెడన్. 38

తే. అరిగి యరిగి కనుంగొని।యటఁ జనంగఁ, గాళ్లు లాడక మీ కెఱుఁ।గంగఁ జెప్పఁ
బాఱు తెంచితి మేమహా।భాగుసతియొ, నిరుపమోదాత్తమూర్తి య।నిన్నిరజాక్షి.

చ. అనవుడు నమ్మునిప్రవరుఁ । డారఘువంశవరేణ్యుదేవిఁ గాఁ
దనమహనీయబుద్ధిఁ గని । ధర్మవిధిన్ మహితార్ఘ్యపాత్రచే
కొని రభసంబునం జనియె । ఘోరదశాపరిపాకతప్తచే
తన యగుచున్ మహిం బొరలు । తాపసపావన యున్నచోటికిన్. 40

మ. చని సంతర్పణవాక్యపూర్వముగ నా।శ్వాసంబు గావించినన్
వనితారత్నము భక్తి నమ్మునిపద।ద్వంద్వంబునం దశ్రులం
గొని పాద్యం బొనరించె నాతఁడు మనః।క్షోభంబు సంధిల్ల ని
ట్లనియెన్ గద్గదికానిరుద్ధవచనుం । డై యాసరోజాక్షికిన్. 41

క. జనకుఁడు తండ్రియు దశరథ,జననాథుఁడు మామ యఁట వి।శాలయశశ్శ్రీ
ధనుఁ డగు రాముఁడు పతి యఁట, వనితలతో నిన్ను నెన్న।వచ్చునె సాధ్వీ 42

క. నీవచ్చిన తెఱఁ గెడఁదను, భావించి యెఱింగి నీమ।హాపావనచరితం
బీవెడమాటల నాఱడి, పోవుట కత్యంత చింతఁ । బొందితి నబలా. 43

తే. లోకముల నెద్ది యేనియు । నాకు నెఱుఁగ, రానియట్టిది లేదు ని।ర్మలత నొప్పు
నీదుచరితంబు తెల్లంబు।గాదె రాము, నేరమి యుచూవెయింతయు । నిక్కమరయ.

చ. ఇదె మనయాశ్రమం బిచట । నీవు వసింపు తపస్వినుల్ ప్రియం
బొదవఁగ నీకు నెల్లపని।యుం బరమాదరవృత్తి నాచరిం
చెద రిదె నీగృహంబునకుఁ । జేరితి గావున నీదుగర్భ మ
భ్యుదయముఁ బొందు దుర్యశము । వోవుఁ బదంపడి నమ్ము మెమ్మెయిన్. 45

క. కైకొను మర్చన మనవుడు, నాకోమలి దెలిసి యర్ఘ్య। మందుకొనియె సు
శ్లోకుఁ డగునమ్మునీశ్వరు, సాకతమున శోకవహ్ని।శాంతతఁ బొందన్. 46

తే ఇత్తెఱంగున నూరార్చి । యింతిఁ దఱిమి, యల్లనల్లన తోకొని।యాశ్రమమున
కరుగుదేరంగ నమ్మునీ।శ్వరున కర్థి,నెదురువోయి తపస్విను।లెఱఁగుటయును. 47

చ. జనకునికూఁతు రార్యగుణ।శాలిని రామునిదేవి సీత యా
తనికొఱగామి నియ్యెడకుఁ । దాపసవృత్తిఁ జరింప వచ్చె ని
వ్వనితకు నెల్లకృత్యము ది।వానిశముం బరికించి బాంధవం
బు నెఱయఁ జేయుఁడీ యని త।పోధనసత్తముఁ డప్పగించినన్. 48

ఆ. ఆతపస్వినులు ప్రి।యంబున జానకిఁ, బొదివి యాత్మవాస।భూమి కర్థి
తోడ గారవించి। తోడ్కొని పోయిరి, మునియు నిజనివాస।మునకుఁ జనియె. 49

క. మునినాథుఁ డింతిఁ దోడ్కొని, తనయాశ్రమమునకు నేఁగు। తడ వంతయుఁ దా
నును నిలిచి యాసుమిత్రా,తనయుఁడు గనుఁగొనియె నశ్రు।ధారలు గవియన్.

{ పట్టణమునకుఁ బోవుచు సుమంత్రుఁడు లక్ష్మణునకు దుఃఖోపశమంబుగాఁ దొల్లిటికథ యెఱింగించుట. }

ఆ. ఇవ్విధమున రాఘ।వేశ్వరుదేవి న,య్యడవిఁ ద్రోచి మరలి। యరిగి యరిగి
యడలు గదిరి యిట్టు।లనియె సుమంత్రుతో, నతఁడు మొగము దీన।మగుచునుండ.

క. మనయింటిచేటు సూచితె, మనుకులసత్తముఁడు తొఱఁగె। మైథిలినిఁ భూ
జనవాదంబు మహాత్ముల, యనఘచరిత్రమునకంటె। నధికం బగుటన్. 52

సీ. అభిషేకదినమున। నడవికిఁ దపమున కరుగుము నీ వన్న। నట్ల చనియె
నందును నతిశాంతుఁ।డై యుండఁగాఁ దన కోమలి నఱిముఱిఁ।గోలుపోయె
నమ్ముగ్ధ మగుడఁ దే।నని చన్నచోట న నేకవిధం బగు।నిడుమఁ బడియెఁ
దెచ్చియుఁ బ్రీతి లో।నొచ్చి యొడంబడి మనపుణ్య మేది యి।మ్మాడ్కిఁ జేసె
తే. నకట పుట్టినకోలెను। నంతకంత, కగ్గలించినదుఃఖంబు। ననుభవించు
చున్నవాఁ డన్న యే మని। యుగ్గడింతు, నీమనోగ్లాని తెగుదల।యొద్ది చెపుమ.

చ. అనిన సుమంత్రుఁ డిట్లనియె। నాతనిపుట్టిననాఁడ వచ్చి త
జ్జనకునితోడ భూమిసుర।సత్తము లెల్ల ననేకదుఃఖభా
జన మగు నల్పసౌఖ్యుఁ డగు।శౌర్యము ధైర్యము దానశక్తియుఁ
వినయముఁ గల్గువాఁ డగున।నింద్యుఁడు వీఁ డన వింటి నేర్పడన్. 54

ఆ. పితృవియోగజనిత।పీడయు ననుజవి,యోగజనితపీడ।యును సతీవి
యోగజనితపీడ।యును బొందు వీని న,నంగ వింటి నేను। నరవరేణ్య. 55

క. కావున విధికృత్యము లగు, నీవృత్తాంతముల కింత।యేటికి వగవం
జావును జేటును మనుజుల,కావిర్భావంబుతోన। గైనవి గావే. 56

క. మఱియు నొకమాట యెవ్వరు, నెఱుఁగనియది దశరథునకు। నేకాంతమునం
దఱమఱ లేక దృఢంబుగ, నెఱుకపడం జెప్ప వింటి। నే నొకరుండన్. 57

క. అది రాముఁడు భరతుండును, మొదలుగ నెవ్వరును వినరు। మున్నైనను నీ
హృదయంబుకలఁక యుడుపఁగ, మదిఁ గోరుటఁ జెప్ప వలసె। మనువంశనిధీ. 58

సీ. సర్వజ్ఞుఁ డనఁదగు। దుర్వాసుఁ డనుమునీశ్వరుఁడు వసిష్ఠునా।శ్రమమునందు
సాంవత్సరిక మైన।సత్త్రంబు నడపంగ ధర్మప్రియుం డగు।దశరథుండు
వేడుక జన్నంబుఁ।జూడఁ బోయి మునిప్రవరు లిద్దఱకు న।భివందనంబు
నేసి రహస్యగో।ష్ఠీవినోదంబునఁ దత్పరు లగువారుఁ। దాను నచట

తే. నున్న యెడభూవరుఁడు చనఁ గన్నప్రజల, యాయురైశ్వర్యములుఁ దదనంతరంబ
వారిసంతతి తెఱఁగు దుర్వాసు నడుగ, నమ్మహీపతితోడ ని ట్లనియె నతఁడు.

క. నీకొడుకు లధికబలభ, ద్రాకృతులఁ బ్రవృద్ధిఁ బొంది యాయుశ్శ్రీల
స్తోకంబులు గాఁ బుణ్య, శ్లోకత నేలుదురు మధ్యలోకం బెల్లన్. 60

ఆ. వెలయఁ బదునొకండు వేలవత్సరములు, రాజ్యమహిమఁ బొంది రామభద్రుఁ
డనుపమానకీర్తి యార్జించి పదపడి, బ్రహ్మలోకసుఖము బడయువాఁడు. 61

తే. అన్న రాజ్యంబు సేయంగ ననుజు లెల్ల, పనులు నడపుచు నీతియు బాహుబలము
మెఱయ వర్తిల్లి యతఁ డేగు తెఱఁయ తమకు, నవసరంబుగ సద్గతి కరుగువారు.

క. చతురమతి రామునకు భూ, సుతయందు దయంబు నొంది సుతు లిరువురు వి
శ్రుతు లగుదు రందుఁ బూర్వజుఁ, డతులితసామ్రాజ్యమునకు నభిషిక్తుఁ డగున్.

క. భరతాదు లయినమువ్వురు, నిరువుర నిరువురఁ ద్రిలోకహితపూజ్యులఁ ద
త్పరులం బడయుదు రయ్యా, ర్గురు నొక్కొకభూమిపతు లగుదు రుజ్జ్వలులై.

క. అనియెం గావున రాముఁడు, జనకతనూజయు న సౌఖ్యచరితులు మనకుఁ
వనటకు నించుక యేనియుఁ, బని గా దనవుడును హృదయపద్మం బలరన్. 65

క. అలఘురఘువంశమునకుం, దల మాటించుకయు లేమి తథ్యముగా నీ
వలన సమస్తంబును నేఁ, దెలిసితి నామనము కలఁక దీఱె మహాత్మా. 66

క. అని సౌమిత్రి సుమంత్రుని, ఘనపరిరంభణము నేసి గౌరవమున నా
తనితో సంభాషించుచుఁ, జన నొకపుణ్యాశ్రమంబు చక్కటి నైనన్. 67

ఆ. అచటి కరిగి మునికృతాధికపూజనం, బులఁ బథిశ్రమంబు వుచ్చి నాఁటి
రాత్రి యచటఁ గడపి రామానుజుఁడు జన, శ్లాఘ్యమూర్తి యగుచుఁ జనియెఁ బురికి.

లక్ష్మణుఁడు పట్టణమునకుఁ బోయి యన్నతో సీత నడవిని విడిచి వచ్చితి నని చెప్పుట.

చ. నగరిసమీప మైన నరనాథునిసన్నిధి కోహటించి నె
మ్మొగము వివర్ణతం బొరయ మోసల నల్లన తేరు డిగ్గి నె
వ్వగ దలకొన్న ప్రేఁ గడరి వ్రాలుగతిం దలవాంచి యేగె సౌ
మ్యగుణవిభాసి లక్ష్మణకుమారకుఁ డానృపుఁ డున్నచోటికిన్. 69

మ. చని దీనాననుఁ డైనయజ్జనపతిం జక్కంగఁ దాఁ జూడ నో
పనివాఁ డయ్యును ధైర్య మూఁది విగళద్బాష్పాంబు లంతంత లో
నన యింకించుచుఁ దొట్రుపాటు చరణన్యాసంబులం జేర నీ
నినడం జేరి వినమ్రుఁ డయ్యెఁ బతిక న్నీరుఁ గకుఁ మీఱఁగాన్. 70

క. నేత్రములు దుడిచికొంచు సు, మిత్రాసుతుఁ బెఱకరమున మెల్లన యెత్తెఁ
ధాత్రీవిభుఁడు విషాదా, మాత్రహృదయుఁ డయ్యుఁ దా సమాహితుఁ డగుచున్

చ. అతఁ డుపవిష్టుఁడై రఘుకులాగ్రణి కి ట్లను దేవ దేవి నం
చితిని భవన్నిరూపితవిశిష్టతపోవనభూమికిం దగ
న్నతి మునియాజ్ఞ నాశ్రమమునన్ వసియించె జరత్తపస్వినీ
యుతనవపర్ణశాల నఖిలోపనతార్ఘ్య సగౌరవంబుగన్. 72

క. అని తననిర్వర్తించిన, పని విజ్ఞాపనము సేసి పతితో నతఁ డి
ట్లను మఱియుఁ దన్మనోవే,దన మాన్పుతలంపునను హితము సత్యము గాన్.73

లక్ష్మణుఁడు రామునకు దుఃఖోపశమంబు సేయుట.

ఉ. ఇట్టివి దైవచేష్టితము లెవ్వరికిం గడవంగ రాదు మీ
యట్టిమహాత్ము లుమ్మలిక లందినచో ధృతి గట్టి చేసి లో
గిట్టక యుండ గీడ్పఱచి గెల్వక తక్కిన నిర్వహించు పెం
పెట్టొకొ బుద్ధిమంతులకు నెక్కుడుభంగిఁ దలంచి చూడఁగన్. 74

క. పెరుఁగుట స్రగ్గఁ జవులం, బొరయుట యవశంబు గాఁగఁ బుట్టుట చావన్
బెరయుట పాయఁ బదార్థో,త్కరముల నైజ మిది యెట్లు దప్పింప నగున్. 75

ఉ. కావున దారపుత్రసఖికామదముం బితృమాతృసోదరా
శావలనంబు గాఢముగ సల్పుదురే మిము బోఁటు లైనసం
భావితు లట్లు గాక నిరపాయము లై కడచన్నవానికిం
బోవునె పెద్దవారితలఁపుల్ మును వేడుక యెంత కల్గినన్. 76

మ. జనవాదంబునకుం బ్రియం దొఱఁగ నుత్సాహంబు సేయంగ వ
చ్చునె యి ట్లెవ్వరి కివ్విధంబు దలఁపం జోద్యంబు గాదే క్రమం
బున నిష్కల్మషవృత్తముల్ దెలియ నోపున్ లోక మెబ్భంగి నీ
మనువంశంబు భవద్గుణంబుల జగన్మాన్యత్వముం బొందెడున్. 77

శా. తాపంబుం బెడఁబాపి దుర్దమవిషాదంబుం దిగం ద్రావి ని
ర్వ్యాపారత్వముఁ బోవఁ ద్రోచి వగ లుద్వాసించి వెల్వెల్లఁబా
టేపాంతన్ మెలఁగంగ నీక మదిఁ గం దెల్లం దెగం బుచ్చఁగా
నీపెం పార్యజనంబు మెచ్చ ధృతి కున్మేషంబు గావింపవే. 78

క. అనవుడుఁ దమ్మునిమాటలు, విని సంభావించి యావివేకవచనముల్
సను నీకు నిట్లు సెప్పఁగ, నని విభుఁ డుల్లంబు కలఁక యంతయుఁ దీఱన్. 79

రాముఁడు దుఃఖము నడఁచుకొని ప్రజలం బాలించుట.

క. నీ పంచినట్ల చేసెద, భూపతులకు ననవధానమునఁ బుట్టు ననే
కాపదలు వినుము తొంటిమ,హాపురుషుల నని వినీతుఁ డగునాతనితోన్. 80

క. నృగుఁ డనఁగ నిమి యనం జను, జగతీపతు లనవధానజాడ్యంబున నిం
దగలిం బొందినతెఱఁ గా, సగరకులోద్వహుఁడు సెప్పెఁ జతురత మెఱయన్.

తే. ఇట్లు సల్లాప మొనరించి । యెల్లపనులు, ననుదినంబును దలఁపింపు । మఖిలజనులు
సంతసం బందునట్లుగాఁ । జక్కఁ బెట్టు, మని నియోగించి యతనిఁ బోఁ । బనిచి విభుఁడు.

ఉ. అచ్చటు వాసి యల్లఁ జని । యాహ్నికవర్తన మాచరించి రా
లచ్చి వికాస మందఁగ న । లంకృతుఁడై మునిమాపు దర్శనం
బిచ్చిన మంత్రిభృత్యసుక । వీశ్వరు లాదిగ నెల్లవారలున్
వచ్చి మహీశుఁ గొల్వ్వ రని । వారణఁ జిత్తము లంకురింపఁగన్. 83

ఆ. విభుఁడు నిఖిలజనుల । విన్నపంబులు విను, వివిధసైన్యములకు । సవరణముల
ననువుసేయు నభిమ । తార్థంబు లర్థుల, కిచ్చు వేఁట లాడు । నిచ్చవెలయు. 84

క. ఇవ్విధమున నిత్యంబును, నవ్వసుధాధిపుఁడు ప్రజల । కనురాగలతల్
నివ్వటిలఁ జేయుఁ దనమది, నొవ్వొఱుఁగక యుండ బహువి । నోదపరుండై. 85

రాముఁ డేకాంతంబున సీతం దలంచి చింతిల్లుట.

క. మనమునఁ బాయని ధరణీ,తనయావలనివగల నే । కతంబ పొగిలి య
మ్మనువంశదీపకుం డి,ట్లను ధైర్యము పల్లటిల్లి । యలుగులపడుచున్. 86

సీ. నీకకా యకట పి । నాకిబాణాసనం బద్భుతంబుగ సభ । నట్లు సేసి
జనకానుమతిఁ దపం । బునకు నక్కట నీవు ననుగమనంబు సే । యంగ నరిగి
పాసియు మగుడ నీ । బడయుదు ననునాస నక్కట ప్రాణంబు । చిక్కఁ బట్టి
యక్కడ సేతుబం । ధాద్యుపాయముల నానందనం బయిన నీ । పొందు గాంచి
తే. యిం పొసంగు నీయర్మిలి । యెల్ల నమ్ము,గాఁగఁ దుది పోయి నిన్నిట్లు । గాసపాలు
సేసి యాఱడిఁ బుచ్చితిఁ । జెప్పఁ జిట్టు, లయ్యొ నామను వే మన । నంబుజాక్షి 87

ఉ. అచ్చట లోకమంతయును । నక్కటికంబున నుమ్మలింప నీ
చిచ్చు చొరంగఁ బోక మది । చిక్కఁదనంబున నియ్యకొన్న నా
కిచ్చటఁ దెచ్చి నీ విడుచు । టెంతటిపెద్ద జఘన్యవృత్తి కే
నచ్చట రచ్చ కెక్కుటకు । నాఱడిపోకకు నోర్తు మైథిలీ. 88

ఆ. అని దురంతశోక । మునఁ బొంది సెజ్జపై, మేను వైచి కన్నుఁ । గొనలందు
నిపుడు నశ్రువారి । చెవులకొలంకుల, నిండ నిట్టు లను వి । భుండు మఱియు. 89

ఉ. వీట దురాత్ము లైనయవి । వేకులు గొంద ఱనింద్య మైనయ
జ్జోటిచరిత్ర మంగనల । చొప్పుగ సంశయ మంది యాడు పె
న్మాటల కేల యీదురభి । మానము పూనితి వాని నేల నే
గీటునఁ బుచ్చ నైతిఁ బరి । కింపక చేసితి నింతిఁ బాసితిన్. 90

ఉ. లోకమువారి మెచ్చునకు । లోలవిలోచనఁ బాఱవైచితిం
బో కొఱగామి యంతటన । పోయెనె దీనికి నింకఁ గొంద ఱో
హో కృప మాలి చేసె నిది । యొప్పదు పొమ్మని దుర్వినీతి గాఁ
గైకొని రేని వారిమది । కందున కెయ్యది గందు దైవమా. 91

క. అని వందుచు నంగనదెస, వనటకు సామ్రాజ్యవివిధవర్తనమునకుం
దనచిత్తము పోక్కఁగ నమ్మనుజేంద్రుఁ డుదాత్తవృత్తిమహి యేలునెడన్. 92

రాముఁడు మునుల మొఱ విని శత్రుఘ్నుని లవణుం జంపఁ బంపుట.

మ. వివిధాన్యాయపరాయణుండు రిపుదోర్వీర్యానివార్యుండు నా
హవసంక్రీడనలోలబుద్ధియు మహాహంకారుఁడుం గావునన్
లవణుం డడ్డము లేక దానవకులశ్లాఘ్యస్థితిన్ మేదినీ
దివిజవ్రాతము నెల్ల నాతురతఁ బొందించెన్ సమిద్ధాత్ముఁడై. 93

ఉ. దానికి రోసి సంయమికదంబక మారఘువంశసత్తముం
గానఁగ వచ్చి సంతతమఖప్రతిఘాతముఁ బ్రాణిహింసయున్
లో నగుచున్న వాని యతిలోకదురాచరణంబు లన్నియున్
దీనత దోఁపఁ జెప్పిన మదిం గృప కోపముతోఁ బెనంగఁగన్. 94

ఉ. తమ్ములదిక్కు గన్గొనుచు దైత్యులపీఁచ మడంగ దయ్యెడుం
గ్రమ్మఱఁ దోఁచె వీఁ డొకఁడు గాసిగ విప్రుల నేప కుండ శీ
ఘ్రమ్ముగ నేగి యద్దనుజుఁ గాలునిప్రోలికి నంపి రాకకుం
గ్రమ్మన నొక్కఁ డియ్యకొనఁగా వలయున్ మనలోన నావుడున్. 95

క. భరతుండు లక్ష్మణుండును, బరవసమునఁ బలుకు చుండఁ బతికట్టి దురం
గరములు మోడ్చి వినయసుం,దరుఁ డగుశత్రుఘ్నుఁ డత్యుదాత్తవచనుఁడై.

క. వీరల కెదురఁగఁ జాలెడి, వారచ్చో నెవ్వ రాలవణు మాత్రకు దు
ర్వారభవదాజ్ఞ నేఁ జని, వైరం బనుపేరు మాన్చి వచ్చెద ననుడున్. 97

క. అగుఁ గాక యితఁడు వోవుట, తగు నని పెఱవారి నుడిపి ధరణీవిభుఁ డొ
ప్పుగ లవణువీడు మధురకుఁ, దగఁ బట్టము గట్టెఁ బిన్నతమ్మునిఁ బ్రీతిన్. 98

ఉ. మంత్రసమేతమై భువనమాన్యత నొప్పునమోఘబాణ మా
మంత్రితుఁ జేసి యాతనికి మన్నన రెట్టిగ నిచ్చి వేడ్కమై
మంత్రుల భృత్యులన్ బుధసమాజము వైశ్యుల వారిజాక్షులం
దంత్రము రాజ్యచిహ్నముల ద్రవ్యసమూహము నిచ్చెఁ బెంపుతోన్. 99

శత్రుఘ్నుఁడు లవణుపై నెత్తిపోవుట.

ఆ. ఇట్టు లొసఁగి మునుల నెల్లను జూపి వీ, రెట్లు చెప్పి రట్ల యెల్లపనులుఁ
జేసి విజయలక్ష్మిఁ జేకొని రమ్మని, యధిపుఁ డనిచి పుచ్చ నతఁడు వోయి. 100

క. సురనదితీరంబునఁ గడుఁ, బర పగుతనదండు విడియఁ బనుచుచు భరతా
వరజుఁడు వాల్మీకిమునీశ్వరునాశ్రమమునకు నరిగి సద్భక్తిమెయిన్. 101

ఉ. అమ్మునిపాదపద్మముల కానతుఁడై యతఁ డిచ్చుపావనా
ర్ఘ్యమ్ము వినీతవృత్తిఁ దగఁ గైకొని మూలఫలాదివన్యభ

త్స్యమ్ములఁ దుష్టి వొంది సరసప్రియభాషలఁ బ్రొద్దు పుచ్చి యం
దిమ్ముల నాఁటిరే నిలిచి యిచ్చ నిజాగ్రజులం దలంచుచున్. 103

క. ఆరాత్రియు రఘుకులని,స్తారకు లగుసుతులఁ దరుణతరణిప్రతిమా
కారులఁ గాంచె ధరాసుత,వారిజలోచనులఁ గవలవారలఁ బ్రీతిన్. 104

క. మునిజనపత్నులు శీఘ్ర,మ్మున నపుడే యరిగి యత్తపోనిధి కెఱిఁగిం
చిన నతఁడు సత్వరుం డయి, చని బాలురఁ జూచి పరమసంతోషమునన్. 105

క. విశదపరిమార్జనమునకుఁ, గుశయును లవనంబు నిచ్చి కులపతి ప్రీతిం
గుశలవు లనునామము లస,దృశముగ నిడి వారలను బ్రదీప్తులఁ జేసెన్. 106

ఆ. అట్టియవసరమున నమ్మునిపల్లెలోఁ, బరఁగు నుత్సవంబు పలుకు లెల్ల
మనము పల్లవింప వినుచు శత్రుఘ్నుఁ డం,గములఁ బులకసమితి కరముదాల్చె.

ఆశ్వాసాంతము.

మ. రమణీయాంగుఁ డభంగుఁ డుజ్జ్వలకృపారాధ్యుం డసాధ్యుం డుదు
ర్దమసంరంభుఁ డదంభుఁ డార్యవినుతోదార్యుం డవార్యుం డుధ
ర్మమయస్వాంతుఁడు దాంతుఁ డూర్జితరమామాన్యుం డదైన్యుం డుహృ
ద్యమితాలాపుఁ డపాపుఁ డంచితకృపాయత్తుం డుదాత్తుం డిలన్. 108

క. ఉభయబలవీరుఁ డభిమత, విభవసురప్రభుఁడు దర్పవిశ్రుతరిపుభూ
పభయంకరసౌమ్యాకృతి, శుభచరితుండు సుభగతాభిశోభితుఁ డెలమిన్. 109

మాలిని. అనఘుఁ డమితసత్త్వుం డన్యభూభృత్కృతాంతుం
డనుపమధృతిసారుం డర్కతేజుం డజేయుం
డనితరసమపుణ్యుం డర్థిమిత్త్రుం డమేయుం
డనుకృతఫణిహారుం డన్వయోదారుఁ డుర్విన్. 110

గద్యము. ఇది శ్రీమదుభయకవిమిత్త్ర కొమ్మనామాత్యపుత్త్ర బుధారాధనవిధేయ తిక్కననామధేయప్రణీతం బైనయుత్తరరామాయణం బనుమహాకావ్యంబునందు నవమాశ్వాసము.

శ్రీ ర స్తు.

నిర్వచనోత్తర రామాయణము

దశమాశ్వాసము.

సంపాదికటాక్షవి
లాసుఁడు బాహావధానలంపటుఁడు గళా
వాసమతి దీనజనర
క్షాసక్తుఁడు మనుమసిద్ధిజగతీశుఁ డొగిన్. 1

క. రేపకడ నక్కుమారుఁడు, దాపసవరు వీడుకొని ముదంబున విప్ర
జ్ఞాపితపథమునఁ దత్సల్లాపరసాయత్తుఁడై బలంబును దానున్. 2

మునులు శత్రుఘ్నునకు లవణుని వధించునుపాయం బెఱింగించుట.

చ. చని చని విప్రులఁ లవణుజన్మము వానిభుజాబలంబు వాఁ
డనికిఁ గడంగుచందమును నద్దనుజాధముమస్త్రముం గ్రమం
బున నడుగంగ వారు మధుపుత్త్రుఁడు వాఁడు మహాబలాఢ్యుఁ డె
వ్వనికి రణంబునం జెనయ వచ్చునె యాతని నంచు వెండియున్. 3

ఆ. అద్దురాత్మజనకుఁ డగుమధు వెంతయు, నరిదితపము సేయ హరుఁడు మెచ్చి
యొక్కనిశితశూల మొసఁగి యద్దానవు, హృదయకమల మలర నిట్టు లనియె.

క. ఇది యొకవాటున నని నీ, కెదిరినవీరునిఁ గృతాంతు నేనియు నాఁడా
మదనునిఁ గోపించిననా, నుదుటియనలశిఖగతిం దరువుపొడ వడఁచున్. 5

క. క్రమ్మఱ నప్పుడ నీహ, స్తమ్మున కేతెంచు నల్పశత్రునిపైఁ గో
పమ్మున వైవకు మీ లోకమ్ముల భస్మమ్ము సేయుఁ గావున దీనిన్. 6

చ. అనుడుఁ బ్రమోద మంది యతఁ డాగిరిజాహృదయేశుతోడ ని
ట్లనియె భవద్వరంబునఁ గృతార్థుఁడ నైతి మదీయవంశసం
జనితుల కెల్ల నీపరమసాధన మట్టుల చెల్ల నిమ్ము భ
క్తనికరకైరవాకరసుధాకర భూరిదయా ప్రియాకరా. 7

క. అనవుడు నటులే లగు నీ, మనోరథం బగ్గలంబు మానుము దానిం
దనయుఁడు గల్గినవానికి, బని సేయుం గాక యనియె భవుఁ డాతనితోన్. 8

తే. అమ్మహాశూల మిప్పు డీ యసురయొద్ద, నునికి నెవ్వరు నెదురంగ నోప రతని
నయిన నీచేతఁ జచ్చు సన్న్యాయవర్తి, గాన దాని కుపాయంబు గలదు వినుము.

ఉ. ఎక్కడికేనియుం జని యనేకవిధంబుల జీవరాసులం
బెక్కటిఁ గానలోఁ గడుపు పెక్కటిలం దిని మాపు వీటికిం
జక్కఁగ నేగుచోఁ దెరువు సయ్యన నీ వరికట్టుకొన్న వాఁ
డుక్కఱు శూల మింటికడ నున్కి నిరాయుధవృత్తి నత్తఱిన్. 10

ఉ. నావుడు నక్కుమారుఁడు మనంబున నెంతయు రోసి యిట్లసం
భావితుఁ డైనవానితఱిఁపా టరయన్ నగుఁబాటు గాదె రా
మావనినాథుతమ్ములకు నట్టియపౌరుషవృత్తి మేలె మీ
రీవెర వాదరింపఁ దగునే యనినన్ మును లెల్ల నవ్వుచున్. 11

చ. తగినతెఱంగు నేసినను దాని నెఱుంగరు చెట్ట గాంచినం
దెగడుదు రెల్లభంగి జగతీజనముల్ విను మట్లు గాకయుం
బగతు ననాయతంపుటగపాటునఁ బైపడి గెల్వ నోపినన్
మగఁటిమి దూలుకే దొసఁగు మాలఁగ దానవుఁ జంపు మెమ్మెయిన్. 12

క. అనిన నతఁ డిడియె కర్జం, బని నిజసంరంభవృత్తియల్పంబు నెఱుం
గనియట్లుగ వీథికి దవ్వునఁ బ్రజ విడియించె దానవుఁడు వచ్చుతఱిన్. 13

చ. తెరువున కడ్డ మేగి దృఢదీప్తశరాసనబాణపాణి యై
పురములు నీఱు సేయుటకుఁ బూనినరుద్రుఁడుఁ బోలె లక్ష్మణా
వరజుఁడు నిల్చినన్ దనుజవర్గశిఖామణి గాంచి వీఁ డొకం
డెర యగుఁ బొమ్ము నా కనుచు నేర్పెఱ నాతనితోడ నిట్లనున్. 14

లవణశత్రుఘ్నులసంవాదము.

క. నీ వెవ్వఁడ వేకార్యము, గావింపఁగఁ జూచె దేమికారణ మిచ్చో
నావచ్చు టెఱిఁగి యెఱిఁగియుఁ, బోవక వేటొండు తెరువుఁబో నిల్చుటకున్. 15

మ. అనినన్ భూపకుమారుఁ డల్లన సముద్యత్కీర్తి యారామచం
ద్రున కే దమ్ముఁడ నాదునామమును శత్రుఘ్నుండు విప్రప్రియం
బొనరింపం జనుదెంచితిం దురభిమానోద్దాము నిన్నాజి మా
ర్కొని మర్దింపఁగ నున్నవాఁడ ననుడుం గోపోత్కటాకారుఁ డై. 16

శా. ఏమేమీ రఘురాముతమ్ముఁడవె మీ రేపారి పైనెత్తి మా
మామం బంక్తిముఖున్ వధించినను మీ మౌర్ఖ్యంబు సైరించి యే
నేమిం జేయక యున్నఁ గ్రొవ్వి యిట నీ వేతెంచితే మేలు మే
లీమై తోడన పోదు గాక యని దైత్యేశుండు దర్పంబునన్. 17

మ. నిలుమీ యాయుధపాణి నై రణములో నిన్నిప్పు నిర్జింపఁగా
వలయున్ వచ్చెద నంచు వీటిదెసఁ బోవం జూచినన్ వీఁడు దో
ర్బల మొప్పం దనశూల మెత్తికొని నా పై రాక కార్యంబె యా
కులతం బొందినచోన యీయసుర నాశుం జంపఁగాఁ బొప్పడున్. 18

క. కావున నీదనుజాధముఁ, బోవఁగ నీ కాఁగవలయుఁ బొమ్మని యడ్డం
బై వచ్చి మందహాసము, తో వానికి నిట్టు లనుఁ జతురవచనములన్. 19

క. అగు నగుఁ బో నిత్తునె నా, పగ చేకుఱ నిపుడ యెన్నిభంగుల నయినం
దెగఁ జూతుఁ గాక విడుతునె, మగుడఁగ దే పూఁట వెట్టి మా కిచ్చోటన్. 20

ఉ. ఎక్కడఁ బోవవచ్చు నిదె యేచి మదీయశరాంధకార మే
దిక్కును గానకుండ దివిఁబీటుకొనన్ నినుఁ జుట్టుముట్టుచున్
మిక్కుట మయ్యెడున్ రణము మేకొని చేయఁగఁ బూని యియ్యెడం
జక్కనిబంట వై నిలుము చచ్చుట తప్పునె యెందుఁ బాఱినన్. 21

తే. తొల్లి రాముబాణాహతిఁ ద్రెళ్లియున్న, దశముఖునిఁ జూచుసురలచందమున నాదు
నిశితశరములఁ గూలిన నిన్ను భూమి, సురలు గన్నార నిప్పుడు చూచువారు.

క. అప్పలుకులు విని కన్నుల, నిప్పులు రాలంగ నసుర నృపనందనుతోఁ
జెప్పఁ బలు కొండు గానక, యప్పటియని కియ్యకొని తదనురూపముగన్. 23

శత్రుఘ్నుఁడు ద్వంద్వయుద్ధమున లవణాసురుం జంపుట.

శా. ఆటోపంబున నెక్కటిక్కటియ శౌర్యావేశి యై నిల్చి య
చ్చోటం గల్గు తరువ్రజంబును శిలాస్తోమంబునుం బూన్చి యా
స్ఫోటక్ష్వేళనదృప్తమూర్తి యగుచున్ భూపాత్మజుండుం బటు
జ్యాటంకార మొనర్చె భూమివలయం బాకంపముం బొందఁగన్. 24

క. ఒకమ్రాను వెఱికికొని సు, భ్రుకుటితముఖుఁ డగుచు దనుజపుంగవుఁడు కుమా
రకు వైవఁ బూఁచుటయు నది, శకలములుగ నేసె నిశితశరసంఘములన్. 25

చ. నృపతనయుండు దైత్యవిభునిన్ రభసంబునఁ దీప్రబాణజా
లపరివృతాంగుఁ జేయఁగ శిలాతతి నమ్ముల నిల్వారించి గ
ర్వపుఁబలుకుల్ వెసం బలికి వారనికోపరసంబు పేర్మి వాఁ
డుపలమహోగ్రవర్షము సముద్ధతి మైఁ గురిసెం గుమారుపై. 26

చ. అతఁడు నిశాతసాయకము లద్దనుజుం గని తూఱ నేయఁ గో
పితుఁ డయి నింగితోఁ గదియఁ బేర్చినయొక్క మహామహీరుహం
బతులబలంబునం బెఱికి హస్తయుగంబున నొక్కలావ కా
నతిశయలీలఁ ద్రిప్పి కదియంబడి దైత్యుఁడు బిట్టు వ్రేసినన్. 27

ఆ. అమ్మహీరుహంబు నదరంటఁ దాఁకిన, నొచ్చి పంక్తిరథతనూభవుండు
మూర్ఛ వచ్చి యంగములు శిథిలంబులై, మిడుక లేక పుడమిమీఁదఁ బడియె.

క. పఱతెంచి కరి మదము నే, త్తెఱఁ దొండం బెత్తి వ్రేయ దెప్పలికమునం
గొఱసంది దాఁకి నేలకు, నొఱఁగినసింగంపుఁగొదమయొ ప్పమరంగన్. 29

క. ఉన్నవి చావుగాఁ గొని, యన్నరభోజనుఁడు దుర్మదాంధుం డయి శౌ
ర్యోన్నతి నార్చి భ్రమరి గాఁ, జన్న యెడం దెలిసి రోషసంరంభమునన్. 30

మ. అవనీనాయకనందనోత్తముఁ డమోఘాస్త్రంబు సంధించి క
ర్ణవతంసప్రభ లంగుళీయకముపైఁ బ్రాఁకంగ నాకర్షణం
బవగాఢంబుగఁ జేసి తైజసముతో నాలశీతోరస్కుఁ డై
లవణుం గూలఁగ నేసె రౌద్రరసలీలాస్ఫూర్తి శోభిల్లఁగాన్. 31

ఆ. అసురపాటు చూచి వసుమతీసురులు దీ,వనలు మున్ను గాఁగ వచ్చి యక్కు
మారుఁ బొదివి సంభ్రమంబును హర్షంబు, నెసక మెసఁగ నతని కిట్టు లనిరి.

శా. ఈతం డప్రతిమానబాహుబలుఁ డై యేపారి మీ తాత మాం
ధాతం దొల్లి వధించె నాపగ భవద్వంశంబునం దెవ్వరున్
వే తీర్పంగఁ దలంప రైరి త్రిజగద్విఖ్యాతిగా నిప్డు నీ
చేతం జచ్చెఁ గులంబుఁ దేజముఁ బ్రతిష్ఠింపంగఁ దా నల్పమే. 33

క. అను చుండ నాకసంబున, ననిమిషు లేతెంచి రఘువరానుజ నీ చే
సినలోకహితపరాక్రమ,మున కెద మెచ్చితిమి వేఁడుము వరం బనినన్. 34

తే. నన్ను మధురాపురం బేలనన్నవని చె,రాష్ట్రమునకు వృద్ధియుఁ బ్రజారంజనంబు
వినుతసద్వర్తనము మఱి,విప్రభక్తి,నాకు దయసేయుఁ డనియె నన్నరవరుండు.

క. వా రమ్మాటకు మెచ్చుచు, గారవ మెసఁగంగ నట్ల కావుత మని మం
దారప్రసూనవర్షము, బోరనఁ గురియించి దివికిఁ బోయిరి ప్రీతిన్. 36

లవణు వధించి మధుర నేలుచున్నశత్రుఘ్నుఁడు పండ్రెండేండ్లకు నన్నుం జూడవచ్చుట.

తే. ఇవ్విధంబున నద్దానవేంద్రుఁ జంపి, మునులచిత్తంబు దేవసమూహకృపయుఁ
బడసి మధురాపురం బేలెఁ బరమధర్మ, నిరతుఁ డై ప్రజ రాగిల్ల నృపవరుండు.

క. ఆదిమహీపతులక్రియఁ, వేదోచితనిఖిలమార్గవేదితముగ ని
త్యోదయమహనీయుం డై, ద్వాదశవర్షముల కన్నవలనితలఁపునన్. 38

క. కతిపయపరివారముతో, నతఁ డేగెడునెడఁ బ్రమోద మడర నరిగె నం
చితధర్మకర్మనిత్యో, ద్యత మగువాల్మీకిమునివరాశ్రమమునకున్. 39

క. అం దభ్యాగతపూజా,నందితుఁ డై యానరేంద్రనందనుఁ డమృత
స్యందముచందం బగుముని,బృందారకుమాడ్కి యెడఁదఁ బ్రీతి యొనర్పన్.

క. అతఁడు దను లవణయుద్ధ,స్థితి యడుగఁగ నల్ల నల్లఁ జెప్పుచు సంభా
వితుఁ డగుచు గాఢలజ్జా,నతిఁ బొందుచు నుండె మునిజనంబులలోనన్. 41

క. ఆశ్రమము నెల్లయెడలను, విశ్రుతమునిదారకులు ప్రవీణతమై మం
జుశ్రుతిమేళన మానం,దాశ్రులుఁ బులకలును దాల్చి నట్లుగఁ బాడన్. 42

తే. అభినవాకృతి యగుకృతియగుటఁ జేసి, యాత్మఁ గౌతుక మంతంత కగ్గలింప
నమ్మునీశ్వరుచెప్పిన యాదికావ్య,మయినరామాయణము చెవులార వినుచు.

క. సరసం బగురఘుకులపతి, చరితం బొక్కొక్కచో నిజస్వాంతంబుం
గరఁగింపఁ దన్మయత్వముఁ, బొరయుచు నద్దినము నృపతిపుత్త్రుఁడు గడపెన్. 44

మ. మఱునాఁ డమ్మునినాథు వీడ్కొని జగత్స్నాతృత్వవిఖ్యాతికిన్
గుఱి యై యుండెడిగంగ దాఁటి మదిఁ గోర్కుల్ ప్రోవుగా వీడు ద
గ్గఱఁ బోఁబోవఁగఁ జూడ్కి యారఘువరాగారంబుపై వేడుకం
బఱచెం గ్రమ్మెడుసమ్మదాశ్రువులతోఁ బల్మాఱుఁ ద్రోపాడుచున్. 45

ఆ. ఇట్టు లరిగి మేదినీశ్వరుఁ గని తత్ప,దాంబుజంబు లుత్తమాంగమునకు
భూషణముగ మేనుఁపులకలప్రోవుగాఁ, బ్రణతుఁ డయ్యె నాన్నృపాలసుతుఁడు.

చ. తిగిచి కవుంగిలించి నరదేవకులోత్తముఁ డక్కుమారు నె
మ్మొగము మొగంబునం గదియ మోపుఁ గరాంగుళులం గపోల మిం
పుగఁ బుడుకుం బొరిం బొరి నపూర్వవిలోకన మాచరించుఁ గ
ప్పుగుమృదుమాళి నుజ్జ్వలనఖాంకురచేష్ట యొనర్చు నర్మిలిన్. 47

చ. తనుఁ గొనియాడునాతనికిఁ దమ్ముఁడు గేలు మొగిడ్చి యల్ల ని
ట్లను భవదాజ్ఞ మోచి చని యద్దనుజాధము నంగరాంగణం
బున వధియించి విప్రుల కపూర్వమహోత్సవ మాచరించి వా
రనికృప వారు పంప మధురాపురి రాజ్యము సేయు చుండితిన్. 48

క. మిముఁ గొలుచు సుఖమునకు రా,జ్యము సౌఖ్యం బీడు గామి నం దునికికిఁ జి
త్తము గొలుపక నావచ్చుట, సముచిత మనుచితము నాకుఁ జన నిండు దయన్.

ఉ. నావుడు నల్ల నవ్వి నరనాథుల కిట్లనఁ జెల్లు నయ్య య
చ్చో వసియించినన్ సరిగఁ జుట్టముఁ బాసియు నిల్వఁ జాలి నా
నావిధదేహదుఃఖము మనంబున నోర్చినఁ గాక రాజ్యల
క్ష్మీవిభవంబు సొప్పడునె కేవలమే నృపతిత్వ మారయన్. 50

క. అని బోధించి మగుడ నే,డెనిమిదిదివసములలో నరేశ్వరుఁ డటఁ బోఁ
బనిచిన నాతఁడుఁ బ్రీతిం, జని మధురాపురమురాజ్యసంపదఁ బొందెన్. 51

క. భూనాథుఁ డిట్లు దమ్ములుఁ, దానును వివిధప్రకారధర్మనిరతు లై
నానావిధసజ్జనస,మ్మానసదాదాననిపుణమతి నున్న యెడన్. 52

ఒకానొకబ్రాహ్మణుఁడు చచ్చినకొడుకుం దెచ్చి రామునినగరివాకిటఁ బెట్టి దుఃఖించుట.

ఉ. చచ్చినపుత్త్రు నెత్తుకొని జానపదుం డొకవిప్రుఁ డార్తుఁ డై
వచ్చి నరేంద్రమందిరము వాకిట నాలును దాను నిల్చి వా
పుచ్చి మహోష్ణబాష్పములు బోరనఁ గ్రమ్మఁగ నేడ్చి యేడ్చి క
న్విచ్చుచు మోదుచుం గొడుకు వేఁడుచు నెవ్వరి నేనిఁ జూచుచున్. 53

మ. తనయుం డొక్కఁడ కాని నాకు మఱి సంతానంబు లే దేను భా
మినియుం బిమ్మటిసత్క్రియల్ పడయ లేమిం జూడఁ డయ్యోం గటా
చను నే వీనికి నిట్లు సేయ మరణోత్సాహంబు శోకాపనో
దన మంచుం బలుమాట లాడుచుఁ బరీతాపంబు దీపింపఁగన్. 54

క. కాలునకు నాతనూజు న, కాలంబునఁ దనవశంబు । గావింపంగాఁ
బోలునె దుష్పథవర్తులఁ, జాలఁడె శిక్షింప రామ । జనపతి యనుచున్. 55

ఉ. ఇట్టివి గల్గునే జనుల । కెవ్వరికిన్ నరనాథునెల్ల నే
పట్టున నైన నేల ననుఁ । బాపము చుట్టెనొ కాక దీని నే
నెట్టని నిర్ణయింతు నివి । యింతయు భూపతిచెట్ట గా మదిం
బుట్టెడు నొక్కశంక యిది । పోలుట పోలమి దోఁప దయ్యెడున్. 56

ఉ. ఎయ్యది యెట్టు వోయినను । నీతనికిం బ్రియ మెచ్చునట్లుగా
నియ్యెడ నగ్ని వెట్టుకొని । యెల్లజనంబులు సూచుచుండఁ గాఁ
జయ్యన మ్రంది పోయెద వి । చారము లిన్నియు నేల యంతతో
దయ్యమునెత్తికోలు తుదిఁ । దాఁకెడు నంచు బహుప్రలాపుఁ డై. 57

క. పొరలుచు లేచుచు నలుదెసఁ, దిరుగుచు భూపాలవర్యుఁ । దిట్టుచుఁ దనయుం
బోరిఁబోరిఁ జూచుచుఁ బిలుచుచుఁ, బరిరంభము సేయుచుండె । బలువేదనతోన్.

క. ఉన్నంత నంతయును విని, యన్నరనాయకుఁడు హృదయ । మాకులముగ నా
పన్నశరణ్యుఁడు గావున, విన్న నగుచుఁ జక్కఁ బెట్టు । వెర వారయుచున్. 59

వసిష్ఠాదిఋషులు విప్రకుమారునిమృతికారణము రాముని కెఱింగించుట.

ఉ. ఖేదముఁ బొంది మంత్రుల న । కల్బిషవృత్తులఁ దమ్ములన్ వసి
ష్ఠాదిమునీంద్రముఖ్యుల ర । యంబునఁ బిల్వఁగఁ బుచ్చి వారితో
నాదురవస్థ యున్న తెఱఁ । గంతయుఁ జెప్పిన నమ్మునుల్ సుక
ర్మాదరవృత్తి ని ట్లనిరి । యాదట నర్కకులాగ్రగణ్యుతోన్. 60

చ. కృతయుగవర్తనంబున న । ఖిన్నమతిం బృథివీసురుల్ దపం
బతులముగా నొనర్తురు ని । యంత్రితవృత్తిఁ దగంగఁ ద్రేతఁ బూ
జితగుణు లైనరాజులును । జేయుదు రాపరిపాటితో నన
ర్హత గను నాయుగద్వయము । నందును దక్కటిరెండుజాతులన్. 61

ఉ. ఇమ్మెయి దప్పి శూద్రుఁ డొకఁ । డిప్పుడు నీ దగుభూమిలోనఁ దీ
వ్రమ్ముగ నిష్ఠమైఁ దపము । వారక సేయుచు నున్నవాఁడుగాఁ
గొ మ్మిది తప్పనేర దన । ఘుం డగు నీతఁడు బాలుఁ డేల తు
ర్యమ్మునఁ బొందు నీదురిత । మయ్యపచారము లేక పుట్టునే. 62

ఉ. కావున నెందు నారసి య । కార్యము తెల్లముగాఁగఁ జూచి సం
భావిత మైనచిత్తమునఁ । బాయఁగఁ జేయఁగఁ గర్మసిద్ధి నా
శావలయంబునన్ యశము । సాంద్రముగాఁ గృపఁ గొంకు లేక నీ
వే వధియింప కున్న శిశు । వేదన క్రమ్మఱుఁ డేల చొప్పడున్. 63

క. అనవుడు మోమలరఁగ న, జ్జనపతి లక్ష్మణునిఁ జూచి । చయ్యన జని వి
ప్రుని నూఱడింపు తత్సుతు, తనువు తగన్ సంగ్రహింపు । తైలద్రోణిన్. 64

క. అని చెప్పి భరతుఁ డగ నా,తనిఁ బురమున నిలుపఁ బంచి । తనదుమనోవ
ర్తన ఘనపుష్పకమును న,మ్మనుజేంద్రుఁడు దలఁచె నదియు । మసలక వచ్చెన్.

రాముఁడు పుష్పకారూఢుఁ డై శూద్రతపస్విని వెదకి ఖండించుట.

శా. చాపంబుం బటుబాణతూణయుగముల్ । శాతాసియుం వర్మముల్
భూపాలుండు విమానరత్నముపయిం । బూజాసమేతంబు ని
క్షేపింపం దగువారిఁ బుచ్చి మును లాశీర్వాదముల్ సేయఁ ద
చ్ఛ్రీపాదంబులు శేఖరద్యుతుల నర్చించెన్ వినీతాత్ముఁ డై. 66

తే. వారి వీడ్కొని యిక్ష్వాకువంశవరుఁడు, పుష్పకం బెక్కి ఖేచరపూజ్యుఁ డగుచు
మున్ను పశ్చిమదిగ్భాగమునకు నేగి, యందుఁ గలయఁ దపస్వులనరసి యరసి.

క. చూచుచుఁ బలుకుచు వినుచు య,థోచితసంభాషణంబు । లొనరించుచు ని
ష్ఠాచారుల నెల్లను ధ,ర్మాచార్యుం డతివిదగ్ధుఁ । డయి శోధించెన్. 68

క. ఉత్తరమునందుఁ దూర్పున, నిత్తెఱఁగున మునులలోన । నెల్లను గలయం
జిత్తానురూప మగుస,ద్వృత్తంబునఁ జొచ్చి వారి । వెదకుచు వచ్చెన్. 69

క. అక్షయపుణ్యుం డిట్లు ప్ర,దక్షిణముగ భూమిలోనఁ । దడవుచు మునిసం
రక్షలు సేయుచు వచ్చెను, దక్షిణదిక్కునకు వగపు । దనమదిఁ గదురన్. 70

ఉ. అం దొకకొండచేరువ సితాబ్జవనంబులతీరభూమి మా
కందముకొమ్మునన్ బిగియఁ । గాళులు రెండుఁ దగిల్చి వ్రేలుచుం
గ్రింద హుతాశనార్చుల నశేషమునం గబళించి మ్రింగుచు
న్నెందము కాంతి నొంద మహనీయతపం బొకఁ డాచరింపఁగన్. 71

క. కని యల్లల్లన యచటికిఁ, జనుచు నిరూపించి యతని । చందము దననె
మ్మనమున కెర వయి తోఁచిన, మనుజేంద్రుఁడు చేర నరిగి । మధురోక్తి మెయిన్.

క. ఏమికులంబునఁ బుట్టితి, నామం బెయ్యది తపంబు । నకు ఫల మై నీ
కామించినతెఱఁ గెట్టిది, నీమది నున్నట్లు నాకు । నిక్కము సెపుమా. 73

చ. అనినఁ దపస్వి యిట్లను మహాత్మ జనించితి శూద్రయోనిఁ బే
రును విను శంబుకుండ గతరోషమదభ్రమచిత్తవృత్తి ని
ట్లనితరసాధ్య మైనతప । మర్థి నొనర్చెద మేనితో దివం
బునకు జగత్ప్రశస్తముగఁ । బోవుట కోర్కి నిజంబు సెప్పితిన్. 74

ఉ. నా విని భూవిభుండు మునినాయక సత్యహితోపదేశవా
ణీవిభవంబు చిత్తమున । నెక్కొన నచ్చెరు వంది గాఢసం
భావన చేసి శూద్రముని । పై సదయం బగుచూపు నిల్పి చిం
తావివశత్వ మొందె నృపధర్మము నీచము గాఁ దలంచుచున్. 75

చ. తనయశవంబు మోచికొని । తన్వియుఁ దానుసు వచ్చి యేడ్చువి
ప్రునియెడ లంతరంగమునఁ । బోక పెనంగిన ఖడ్గముం గనుం

గొనుచు మునీశ్వరానుమతిఁ । గ్రూరత కైనను నోర్చువాఁడఁ బొ
మ్మని తలపోయుచుండెఁ గృప । యం దెడ సేయుచుఁ జిన్నవోవుచున్. 76

క. కరుణాతిశయంబుఁ బ్రజా, పరిపాలనరతియుఁ బెనఁగు । వడి యుల్లములోఁ
బిరిగొన నిశ్చయమునకుం, జొరఁ జాలక తలఁకు పాలసుండును బోలెన్. 77

క. వెడఁగుపడి యచటఁ బెద్దయు, వడి నిలిచి తలంచుకొని య । పవర్గంబును ని
ష్పూడితనిఁ దెగఁజూడక చొ,ప్పడునే యావిప్రశిశువు । ప్రాణం బనుచున్. 78

క. తల కంటగించుచుండఁగ, బలిమిని నౌషధరసంబు । పానము సేయం
దలకొనురోగార్తుని క్రియ, నలమటతో బెరయు తెగువ । నలుగులపడుచున్. 79

మ. నరనాథుం డిటు లెట్టకేలకు విలీనం బైనచిత్తంబు సు
స్థిరభావంబునఁ బట్టుకొల్పికొని నిశ్చింతాత్ము నత్తాపసుఁ
శరణార్థిస్ఫుటరక్ష గోరి తునిమెఁ । సంరంభశూన్యాంగుఁ డై
కరవాలంబు మృదుక్రియం బెటికి రేఖాహీనదీనస్థితిన్. 80

ఆ. అపుడు కుసుమవర్ష । మాకసం బెల్లను, బొదివె దేవదుందు । భులు సెలంగె
హరిహరాదిదివిజు । లంతరిక్షంబున, నిలిచి సంస్తుతించి । రెలమి మిగుల. 81

శూద్రమునిని వధించినరాముని దేవతలు ప్రత్యక్షమై గారవించుట.

ఉ. వారలు రాముతోడ రఘు । వంశనృపోత్తమ యిత్తపోధనుం
డేరికిఁ బొందరానిగతి । కేగె సుకర్మము మెచ్చి యేము నీ
కోరినయట్ల యిచ్చెదము । కొమ్ము వరం బనినం బ్రమోద మే
పారఁగ విప్రబాలుబ్రదు । కాధరణీరమణుండు వేఁడినన్. 82

క. ఏప్రొద్దు శూద్రముని విగ,తప్రాణునిఁ జేసి తీవు । ధర్మనిరతి నా
విప్రశిశువుచైతన్యము, నాప్రొద్ద యనూనముగ స । మాహిత మయ్యెన్. 83

చ. అని విభునెమ్మనంబు ప్రమదాతిశయంబును బొందఁ జేసి య
య్యనిమిషసంఘ మిట్లనియె । నాతనితో మఱియుఁ మహీశ యే
మనఘుఁడు కుంభసంభవుని । యజ్ఞముతీఱుదలం దదీయద
ర్శనమున కర్థి నేగెదము । రమ్మట నీవుఁ దగం దదర్థమై. 84

దేవతలు చెప్పినచొప్పున నగస్త్యునియజ్ఞము చూడ రాముఁ డరుగుట.

చ. అనుచు విమానముల్ నడప । నన్నరనాథుఁడు పుష్పకంబుపై
ననుగమనంబు సేసె నమృ । తాశనులుం జని యమ్మునీంద్రుపూ
జనములఁ దృప్తిఁ బొంది రఘు । సత్తము ధర్మవిధిప్రయత్న మా
తని కెఱిఁగించి యేగి రుచి । రతంబుగ సంయమిఁ గాంచె రాముఁడున్. 85

క. అతఁ డభ్యాగతపూజా, ప్రతిపాదనకౌశలమున । రాఘవు సంతో
షితహృదయుఁ జేసి యిట్లనుఁ, గతిపయసల్లాపజనిత । కౌతూహలుఁ డై. 86

మ. అవనీదేవకుమారు చావునకు నీ వత్యంతఖేదంబుఁ బొం
ది వివేకంబున ధర్మనిర్ణయము సంధిల్లం బ్రతీకారక
ర్మవిధానంబున వానిమేన మగుడం బ్రాణంబు గల్పించుటల్
దివిజవ్రాతము సెప్పఁగా విని కృతార్థీభూతచిత్తుండనై. 87

క. నీ కెదురుసూచుచుంటిఁ, గాకుత్స్థాన్వయవరేణ్య కడు నద్భుత మీ
లోకమున నిట్టిచరితం, బేకందువనైనఁ గలదె యెవ్వరి కయినన్. 88

క. అని యమ్మునిపతి లజ్జా,వనతుం డగు రామధరణివల్లభునకు ని
చ్చె నతిప్రియపూర్వకముగ, ననర్ఘ్యమణిరుచుల వెలుఁగు నాభరణంబుల్. 89

ఆ. ఒసఁగి యిట్టు లనియె నుర్వీశ యొకదివ్య,పురుషుఁ డొక్కకొలని పొంత నన్నుఁ
గాంచి వినయ మొప్పఁగాఁ దనదురితంబు, నాకు నెఱుఁగఁ జెప్పె నాకతమున.

క. ఆదురితము వాసిన సమ్మోదమునన్ బ్రహ్మలోకమున కరుగునతం
డావరవృత్తి నొసంగం, గా దనకీభూషణములు గైకొంటిఁ దగన్. 91

తే. దేవ భరణీయ మిది నరదేవసేవ్య, నీక ధరియింపఁ దగు నని నెయ్య మొంద
దేవకార్యంబు మేదినీదేవహితముఁ,గేలిమైఁ జేయు మని విభుకేలఁ దొడిగె.

క. పలుకుల నాదశరథుఁగా,దిలి సుతుఁ దుష్టాత్ముఁ జేసి దీవనలఁ బొగ
డ్తల సముచితోపదేశం,బులఁ దాపసవరుఁడు ప్రొద్దు పుచ్చుచు నుండెన్. 93

రాముఁ డగస్త్యునిచే సమ్మానితుఁడై యయోధ్య కేతెంచుట

తే. అధిపుఁ డాదివసంబున నయ్యామినియును,గడపి మఱునాడు మునిపదకమలములకు
నెఱఁగి వీడ్కొని పుష్పకం బెక్కి సిద్ధ, సాధ్యపూజితుఁ డగుచు నయోధ్యకరిగె.

చ. తనుఁ గని భక్తి మ్రొక్కుటయుఁ దమ్ములఁ గౌఁగిటఁ జేర్చి యాత్మవ
ర్తన మెఱిఁగించి తల్లులకు దండనమస్కృతు లాచరించి భృ
త్యనికరపౌరభూజనముదావహుఁడై కొలు విచ్చి కొంత సే
పున కనుజాదిసేవకులఁ బొమ్మని భూపతి సమ్మదమ్మునన్. 95

క. సమయకరణీయకవిజన, సముదయగోష్ఠీవినోద సారస్యాసం
గమునఁ దగఁ బ్రొద్దు పుచ్చె, న్సముచితచతురాల్పపరిజనంబులతోడన్. 96

క. మనుజపతి తాను దమ్ములు, జనమానసరంజనార్య సమ్మదచరితం
బున నెల్లలోకములుఁ గీ,ర్తన సేయఁగ నిట్లు పూజ్యరాజ్యము నడపెన్. 97

ఆ. అంత నొక్కనాఁట ననుజుల రావించి, ధర్మసంగ్రహైకతత్పరాత్ముఁ
డగుటఁ బుణ్యకర్మ యత్నాదరమున వా,రలకు నిట్టు లనియె రామనృపతి. 98

చ. క్రతువులయందు మేటి యనఁగా నుతి కెక్కినరాజసూయ మ
ప్రతిహతవృత్తిఁ జేయునృపభావము గౌరవ మొందఁ జేత యీ
ప్సిత మిది మీకుఁ జూడ సవిశేషసముద్యమమేనిఁ దత్క్రియా
రతమతి నుత్సహింపుఁ డభిరామముగా విభవాస్పదంబుగన్. 99

చ. అనుడు వినీతిమై భరతుఁ డారఘునందనుతోడ నల్ల ని
ట్లనుఁ గరుణావిధేయమతి వై పొగడొందిననీకు విశ్వభూ
జనమను జేశ్వరప్రకరసంశయమూలము నాఁ బ్రసిద్ధి కె
క్కినక్రతు వేల యొండొకటికిం దొడఁగన్ మముఁ బంపు పెంపునన్. 100

ఆ. అనినపలుకు లియ్యకొనురాఘవునకు సౌ,మిత్రి యిట్టు లనియె సత్రసమితి
యందు ముఖ్య మగుట నశ్వమేధంబు పూ,జ్యంబు దానిఁ జేయు మధిపనీవు.

రాముఁ డశ్వమేధయాగము సేయుట.

మ. అనినం దమ్మునిమాటఁ గైకొని మహీశాగ్రేసరుం డాతనిం
బనిచెన్ రాజుల విప్రకోటి మునులన్ బంధువ్రజంబుం గరం
బనురాగంబునఁ బిల్వఁ బంప నతఁడున్ యజ్ఞోచితామంత్రణం
బొనరించెన్ సకలావనీశజనచిత్తోల్లాససంపాది యై. 102

క. జనపతి వసిష్ఠముఖస,న్మునులయనుజ్ఞ గొని లక్ష్మణుని బుత్త్విజులం
గనకాదివస్తుయుతముగ,వెనుకం బోఁ బనిచి హయము విడిచె నియతుఁ డై.

తే. పుణ్యతర మగునైమిశారణ్యభూమి, భాగమున యజ్ఞవాట మపారవిభవ
భాసితంబును శుచియుఁగాఁ జేసియున్న,నందులకుఁజనిమంత్రతంత్రాన్వితముగ.

క. క్రతు వొనరింపఁ దొడఁగి భూ,పతి పత్నీకృత్యములకుఁ బసిఁడిని సీతా
ప్రతిమ నొడఁ గూర్చుకొని హృ,ద్గతఖేదము లోన నడఁచి ధైర్యముపేర్మిన్.

క. నానాదేశసమాగతు,లైనవివిధజనములం బ్రయత్నంబున స
న్మానించి తత్తదుచితా, నూననిఖిలసంవిధాప్రయోజకుఁ డగుచున్. 106

క. అన్నంబు వస్త్రములు సం,పన్నహిరణ్యంబు రుచిరబహుమణులును శ
శ్వన్నిరతి నొసఁగుఁ బ్రియమున, నన్నరపతి విప్రకోటి కచ్చెరు వారన్. 107

క. సరసఫలకందమూలో,త్కరములు వేర్వేఱ బహుల కటములుఁ దెప్పిం
చి రఘువరేణ్యుఁడు సంయమి,వరులకు నొప్పించె శిష్యవర్గము లలరన్. 108

కుశలవులు యాగశాలకు వచ్చి రామాయణగానము సేయుట.

ఉ. ప్రీతి జగంబుచిత్తములఁ బెంపు వహింపఁగ నిట్లు చెల్లఁ బ్రా
చేతసుఁ డమ్మఖంబునకు శిష్యయుతంబుగ వచ్చి దారచిం
తాతురుఁ డైనరాముని యథార్థ్యవిధానము శాతకుంభసీ
తాతనుసంవిధానచరితం బగు టెల్ల నెఱింగి హృష్టుఁ డై. 109

క. సీతాతనయులఁ బ్రీతిస,మేతుం డై పిలిచి వారి కి ట్లనియె జఘ
న్యేతరుఁ డగురఘునందను, చేతోగతిఁ దెలియఁ గోరు చిత్తముతోడన్. 110

ఉ. గేయరసంబు నింపున నకిల్బిషవర్ణములందు మాగధ
శ్రీ యలవడ్డకోవిదుల చిత్తము లార్ద్రతఁ బొందునట్లుగా

నీయెడ నధ్వరాగతము।నింద్రనరేంద్రులపాలి కేగి రా
మాయణ మర్థిఁ బాడుఁడు సమాహితమానసవృత్తి నిత్యమున్. 111

తే. యాగశాలోపకంఠంబు।నందుఁబోయి, వెరవుమైమీరలొక్కొక్క।మరిక్రమమున
రాముచెవి సోఁకునట్లుగా।నేమిభంగి, నైనఁ బాడుఁడు తగుసమ।యంబులెఱిఁగి.

క. జను లెవ్వ రేని మిమ్మా, మనుజేంద్రుం డున్న యెడకు। మన్ననమైఁ దో
డ్కొని చనినను నాకర్ణన,మునఁ బతి పిల్పించె నేని। ముదమునఁ జనుఁడీ. 113

క. మనుజేశ్వరుసభ నే నున్నను లేకున్నను మనంబు।నం గొంకక పా
వన మగునానృపుచరితము, వినిపింపుఁడు చొచ్చి యతని। వేడుకకుఁ దగన్.

చ. అని ముని చెప్పి వేడ్క హృద।యంబులఁ బట్టుకొనంగ మైథిలీ
తనయులు దాని కియ్యకొని। దండనమస్కృతు లాచరించి వీ
డ్కొని పరిషత్ప్రదేశముల।కుం జని పాడుచు నల్లనల్ల నే
ర్పున మఘశాలచేరువకుఁ। బోయి నృపశ్రుతిగోచరంబుగాన్. 115

క. సరసధ్వనిఁ బాడఁగ న, న్నరపతి యాలించి నిజగుణ స్తవనకథా
విరచన యగు టెఱిఁగి తదీ,యరసానుగుణప్రకర్ష। మభినందింపన్. 116

చ. తలఁచి మహీశులెల్ల మునులుఁ। దమ్ముల బంధుల సత్కవీంద్రులం
గలల విదగ్ధులైననట।గాయకవైణికవాంశికాదులం
బిలువఁగఁ బంచి వైభవము।పెం పెసలారఁగ వార లెల్లఁ దన్
గొలువఁగ నాకుశీలవుల।కుం దగ దర్శన మిచ్చె నిచ్చినన్. 117

క. చొత్తెంచి రామువడు వ, చ్చొత్తినచందమునఁ దనువు। లొప్పఁగ రూపా
యత్తంబులైనజనముల, చిత్తములు వికాస మొంద। సీతాతనయుల్. 118

తే. రాముచరితంబు గేయాభి।రామమధుర,పదవిలాసమనోహర। భావభంగిఁ
జతురవాక్యార్థసువ్యక్త। సరసలీల, వివిధగతిఁ బాడుచున్న య।య్యవసరమున.

క. వీరలమునివేషంబుల, కారణమునఁ గాక యొడలి। కట్టడయు ముఖ
శ్రీరామణీయకంబు మ,హీరమణునియట్ల కాదె। యిరువుర కరయన్. 120

రాముఁడు కుశలవులగానము విని సమ్మానించుట.

క. అని యెల్లజనంబులు నెమ్మనములఁ దలపోయుచుండ। మనుజేశ్వరుఁ డ
మ్మునిబాలకులకు నొసఁగెను, గనకము నాభరణములును। గారవ మెసఁగన్.

చ. ఒసఁగిన నిక్కుమారు లవి। యొల్లక పల్కిరి మాకుఁ గాయలుం
గసురులు వేళ్లు వెల్లఁకులుఁ। గాక సముజ్జ్వలభూషణంబులుం
బసిఁడియు నేల యుక్తమె త।పస్విజనంబులకుం బరిగ్రహం
బసమభవద్గుణస్తుతికథైకపరత్వవిభూతి సాలదే 122

చ. అన విని గారవంబు హృద।యంబునఁ బుట్టఁగ వారిఁ జూచి య
య్యినకులముఖ్యుఁ డుత్సుకత। నెవ్వరివారల రీప్రబంధ మే

మునికృత మన్న నాదికవి । మోము గనుంగొని యక్కుమారు లం
దనుమతి గాంచి యిట్లనిరి । యానృపచంద్రునకుం బ్రియంబుగన్. 123

క. ఈసందర్భము వీరలు, సేసినయది మేము వీరి । శిష్యులము రసో
ల్లాసమధుర మగుదీని ను,పాసింతుము ప్రీతి నేత । దనుమతి నెంచున్. 124

చ. అనుడు వికాస మంది విభుఁ । డమ్మునినాథుముఖారవిందముం
గనుఁగొని మీకృపామహిమ । గావ్యమయోజ్జ్వలమూర్తిఁ దాల్చి పా
వనముగఁ జేసె నాదులఘు।వర్తనముం భువనంబు లాదరం
బునఁ గొనియాడు నింక ననుఁ । బుణ్యుఁడ నైతిఁ ద్రిలోకపూజితా. 125

క. ఈవాత్సల్య మధికసం,భావనమై మీర లెఱుక । పఱుప కునికి యే
మో వీర లెవ్వరో వినఁ,గావలయుం గూఢపథము । గాఁ దగునేనిన్. 126

వాల్మీకి రామునికి సీతావృత్తాంతము చెప్పి కుశలవుల నతని కొప్పించుట.

క. అనురఘునాయకుపలుకులు, విని మునిపతి జనకతనయ।వృత్తాంతం బీ
తని కెఱిఁగింపఁగ నిది తఱి, యని యతనికి నిట్లు లనియె । నందఱు వినఁగన్. 127

చ. వినయముఁ బెంపు నేర్పును వి।వేకమునుం గలనీవు మేదినీ
తనయఁ దొఱంగు టెట్టు లుచి।తంబుగఁ జూచితి విట్లు వోలునే
యనలవిశుద్ధ యైనసతి । నక్కట యెక్కడ నేనిఁ బొమ్ము నీ
వని వెడలంగఁ ద్రోచిన ద।యాగుణ కీర్తికి హాని వుట్టదే. 128

క. నాఁ డగ్నిలోనఁ ద్రోచిన,వాఁడ వకట యంతఁ బోక । వల్లభ నిమ్మై
నేఁ డడవిఁ ద్రోచి తెదఁ గడు, వాఁడి గదే నీకు రాఘు।వకులప్రవరా. 129

తే. అంతనుండియు సీతోడ । నలిగి యున్న,వార మే మది యట్లుండె । వారిజాక్షి
తెఱఁగు వినుమనియిట్లను।మఱియుముని వి,నీతజాతోత్సుకుండగు।నృపవరునకు.

ఉ. క్షత్త్రియపుత్త్రికాభరణ।గౌరవలీల వెలుంగు మేదినీ
పుత్త్రి మదాశ్రమస్థలము । పొంత వనంబునఁ ద్రోచి వచ్చె సౌ
మిత్త్రి తపస్విబాలకులు । మెల్లకఁ గన్గొని వచ్చి నాకుఁ ద
న్మాత్త్ర నెఱుంగఁ జెప్పుటయు । మానిని యున్నెడ కేను గ్రక్కునన్. 131

క. చని యనునయించి యాశ్రమ,మునకుం గొని పోయి యచటి । మునివరపత్నీ
జనములభంగి నుటజవ,ర్తినిఁ జేసినయంతఁ గొన్ని । దినములు సనినన్. 132

క. చకితాత్ము లగుమహీసురు,లకుఁ బ్రీతి యొనర్ప నాఁడు । లవణునివధ సేఁ
తకు నీ వనుపఁగ శత్రు,ఘ్నకుమారుం డందుఁ బోవు । కందువఁ బ్రీతిన్. 133

క. జనకసుత కవలవారిం, గనుడు ననుష్ఠితసమస్తకరణీయుఁడ నై
మనువంశముఖ్య కుశలవు, లనియెడునామంబు లిడితి । నయ్యిరువురకున్. 134

శా. కాలౌచిత్యము మీఱఁ బెక్కువలమైఁ । గల్యాణసౌమ్యాంగులై
కేలీలోలతపస్విదారకసహ।క్రీడం బ్రవర్తిల్లుచుం

బాలేందుద్వయిలీల నుజ్జ్వలకళాప్రౌఢత్వముం బొందుచున్
శీలం బాకృతు లొందిన ట్లగుచు సౌత్సేనం బ్రియం బందుచున్. 135

తే. సకలవిద్యలయందుఁ బ్రశస్తి కెక్కి, యక్కుమారులు రామాయణాఖ్యమైన
మత్ప్రణీతప్రబంధంబు మధురగేయ, సహితముగ నభ్యసించిరి సచ్చరిత్ర.

క. అని తెలియఁ బలుకుతనదువ,చనపద్ధతిమై నెఱిఁగియు సంశయమతిఁ ద
న్నును సుతులఁ జూడ నమ్ముని, మనుజేంద్రున కిట్టు లనియె మఱియుం బ్రీతిన్.

క. వారల నివ్విధమున సం,స్కారవిశేషాభిమతులఁ గావించితి నా
చారవిజితసంయము లగు, వీరలు వారప్రతర్క్యవిభవైకనిధీ. 138

తే. ఎంతకాలంబు వోయిన నెరవ కాదె,యొరులసొమ్మనితలఁచియాగోత్సవమున
కిదియ కానుకగా వీరి నిట్లు తెచ్చి, నిన్నుఁ జేర్చితి రఘుకులనృపవరేణ్య. 139

క. అనవుడు జనపతి నెమ్మన,మున నచ్చెరువాటు ముదము ముప్పిరిగొనఁగాఁ
గనుదోయి సమ్మదాశ్రుల, మునుఁగఁగఁ బులకములు మేనముసుఁగువడంగన్.

క. ఆనందము గదిరిన నభి,మాని యగుట నయ్యవస్థ మది నిడుకొని య
త్తైనిం గర్తవ్యము దగ, నానతి యిం డనిన మునిజనాగ్రణి ప్రీతిన్. 141

సీత నిజపాతివ్రత్యప్రభావంబున భూమిం గ్రుంగుట.

సీ. జనకతనూజఁ గైకొను మిది మామతం బనిస వినీతుఁడై యవ్విభుండు
మునినాథ యవిచారముఖ్యంబు గాస లోకంబు మెచ్చించుట కడిఁది గాదె
ముద్దియ మీచిత్తమునకుఁ బోలినభంగి నీయెడ శపథంబు సేయుఁ గాక
యనవుడు నిది వోలు నని ముని శాసింపఁ దాపసీజనసహితంబు గాఁగ

తే. సీత యచ్చటి కేతెంచి మాతయయిన, భూమి దెసఁ జూచియెమ్మెయి రామనృపతి
కేను దప్పనిదాననయేని నన్నుఁ, జేర్చుకొను మని తడవ సొచ్చెరువు గాఁగ. 142

మ. అవనీదేవత సింహపీఠగత యై యచ్చోటఁ దోతెంచి రా
ఘవుదేవిం దొడదోయిపై నునిచి లోకం బద్భుతం బంద నే
ల వెసం జొచ్చిన ధాత్రి కల్గునృపురోల్యంబు స్మునీంద్రుండు యో
గ్యవచోయుక్తులఁ బాపి పుత్త్రయుగ యోగానంద మగ్గించుచున్. 143

క. ఇహపరసౌఖ్యనిదానము, మహితాపత్యంబ యనుచు మనుజేంద్రమనో
విహారణముఁ బుత్రలాభ, ప్రహర్షవిషయంబుఁ జేసెఁ బరమప్రీతిన్. 144

తే. అక్కుమారులు రాముపాదాంబుజముల, కెఱఁగిభూదేవితప్పు సహింపవలయు
దేవ యని ముద్దుపుట్టఁ బ్రార్థించునట్లు, గాఁగ నత్తఱి వాల్మీకిగ అపుటయును.

రామచంద్రుండు పుత్త్రసహితుం డై నిజనగరంబుఁ జొచ్చుట.

క. వారలు నవ్విధమున నా, భూరమణునిమదికి నింపు పుట్టింపఁగ మం
దారకుసుమములు దొరఁగెను, బోరన దివి దేవదుందుభులు గర్జిల్లెన్. 146

చ. జయజయశబ్దముల్ సెలఁగ సర్వజనంబు నెలర్ప నర్మిలిం
బ్రియసుతయుగ్మముం దిగిచి పెద్దయుఁ బ్రొద్దొగిఁ గౌఁగిలించి మో
దయుతమనస్కుఁడై నృపతి దమ్ముల సమ్మద మొందఁ జేసి య
న్వయపరివృద్ధి తల్లులమనం బలరం బ్రకటించి వేడుకన్. 147

క. నగరం బుత్సవరమ్యం,బుగ నప్పు డలంకరింపఁ బుచ్చి సముచితం
బుగ సకలజనముఁ బొమ్మని, తగువారును మునివరుండు దమ్ములుఁ దానున్.

క. కొడుకులతపస్వివేషము, లుడిపి నరేశ్వరకుమారయోగ్యపరికరం
బొడఁగూర్చి వార లుచితపు, నడవడి వర్తిల్లఁ గ్రతుదినంబులు సనినన్. 149

క. ధరణీసురగణము మునీ,శ్వరులను భూపతుల నర్థి వర్గము నన్యో
వెరవున సంభావించుచుఁ, బరువడి వీడ్కొలిపె రఘునృపాలుం డెలమిన్. 150

తే. వినయ మొప్పంగ వాల్మీకిమునికి నర్చ, లిచ్చి మీకృపపెంపున నెల్లవగలుఁ
బాపె నాహ్లాద మొనఁగూడె శుభవదనుగ్ర,హంబ మాకెడుగడయును ననుచు నతని.

క అనుచుటకును బెద్దయుద,వ్వనుగమనము సేసి భక్తి నడుగులఁ బడి వీ
డ్కొని యమ్మునిసత్తముదీ,వనలం బ్రీతాత్ముఁ డగుచు వచ్చెం బురికిన్. 152

తే. ఇట్లు కృతకృత్యుఁ డగు రాఘువేంద్రు నెల్ల,వారు నన్యోన్యవిధంబుల వచ్చి కాంచి
మన్ననలు మున్నుగాఁ దమవిన్నపములు, సఫలములు సేయఁ దోషితస్వాంతులైరి.

క. తనకన్న ప్రజయ కాఁ గ్రై,కొని భూప్రజ నెల్ల నొక్క కొఱఁతయు లేకుం
డ నడపి పాలించుచు న,మ్మనుజేంద్రుఁడు పూజ్యరాజ్యమహిమాన్వితుఁడై.

కుశలవులకు రాముఁడు రాజవిద్యల నేర్పించుట.

క. మునులకడఁ దత్ప్రకారం,బున నునికిం జేసి మున్నపూర్వం బని నం
దనులకు నుచితపరిశ్రమ, మొనరించువిధంబునకు సముత్సుకుఁ డగుచున్. 155

సీ. భరతవాత్స్యాయన ప్రభృతినాగరికశాస్త్రంబులదెస నైపుణంబు వడయ
హయగజస్యందనాద్యారోహణక్రియాదక్షతవలన వైదగ్ధ్య మొందఁ
గోదండకరవాలకుంతముఖ్యాయుధశ్రమములయందుఁ బ్రశస్తి నొంద
వేణువీణాప్రౌఢ వివిధకళాభ్యాసములయెడఁ బ్రాశస్త్యములు వహింపఁ
తే. జేసి తజ్జ్ఞులమనము లచ్చెరువడంగ, నక్కుమారుల నొక్కొక్క యవసరమున
నేర్పుమెఱయించి ముదము దలిర్ప శిక్ష,కులకుఁ బసదన మొసఁగు నిట్టలముగాఁగ.

క. ఇత్తెఱఁగునఁ గుశలవుల సు,దాత్తపరిశ్రములఁ జేసి తద్విమలగుణా
యత్తమతిఁ జేసి శస్త్రా,ద్యుత్తమబాణములవిధము లుపదేశించెన్. 157

ఆ. సర్వకార్యములను శత్రుఘ్నలక్ష్మణ, భరతు లరసి తీర్ప ధరణియెల్లఁ
బొగడుతోడియాజ్ఞ నెగడి ప్రవర్తిల్ల, నతఁడు సర్వసోదరరతిఁ జరించు. 158

క. సుతులఁ గొనియాడు విద్వ,త్ప్రతతి నుపాసించు భూమి । ప్రజ నరయు మహా
క్రతువు లొనరించు గురుదై,వతపూజలు సేయు సాధు।వర్గముఁ బ్రోచున్. 159

తరలము. ధరణి నెందును గాలవర్షము । దైవయోగసమగ్రమై
కురియ మోదముఁ బొంద సస్యము । కోటికొండలు పండ ధ
ర్మరతి సర్వజనంబు నుత్తమ । మార్గవర్తనశీలతం
బొరయ ధారుణి యేలె రాఘవ।పుంగవుండు మహోన్నతిన్. 160

ఆశ్వాసాంతము.

శా. మురజిత్కల్పుఁడు కల్పవృక్షకుసుమా।మోదప్రతీకాశకీ
ర్తిరమాధాముఁడు ధామమాలితులనా।శ్రీపాత్రతేజోనిరం
తరదిక్చక్రుఁడు చక్రభృత్పదయుగ।ధ్యానక్రియాభ్యాసత
త్పరతానిత్యుఁడు భవ్యకృత్యుఁ డసమా।దార్యుండు సౌమ్యుం డిలన్. 161

క. మనుజాబ్జాకరసవితృఁడు, వినయస్తవనీయవిభవ । విశ్రుతనిజవ
ర్తనుఁడు పరివాహసన్నా,హనబిరుదాంకుండు శస్త్ర।దభివిజయుఁ డిలన్. 162

మాలిని. ధరణిభరణదృప్య।త్పార్థివార్థప్రకాండా
హరణపరిణతుం డు।ద్యద్గుణాఢ్యక్షితీంద్రా
భరణకరణగాథా।పండితోద్యత్సదావి
స్ఫురణవరణనిత్యా।స్తుత్యలక్ష్మీశుఁ డుర్విన్. 163

గద్యము. ఇది శ్రీమదుభయకవిమిత్త్ర కొమ్మనామాత్యపుత్త్ర బుధారాధనవిధేయ తిక్కననామధేయ ప్రణీతం బయినయుత్తరరామాయణం బనుమహాకావ్యంబు నందు సర్వంబును దశమాశ్వాసము.

నిర్వచనోత్తరరామాయణము

సంపూర్ణము.

చెన్నపురి : వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్‌వారి
'వావిళ్ల' ప్రెస్సున ముద్రితము.